# తెలుగు

# యువభారతి

## 12వ తరగతి



# భారత సంవిధానము

## పార్ట్ – IV A

## ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష, ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణాత్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టి కృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరం కృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ ఆరు నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్-2116/(ప్ర.క్ర.43/16) ఎస్‌డి-4 తేదీ 25.4.2016 ప్రకారం స్థాపించబడిన సమన్వయ సమితి యొక్క తేదీ 30.01.2020 రోజు సమావేశంలో ఈ పాఠ్య పుస్తకమును 2020-21 విద్యాసంవత్సరం నుంచి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

# తెలుగు

# యువభారతి

## 12వ తరగతి



మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411 004.

Q2A7Q8

మీ స్మార్ట్‌ఫోన్‌తో DIKSHA APP నుపయోగించి పాఠ్యపుస్తకం మొదటి పుటలోని QR CODE ను స్కాన్ చేసిన డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు ప్రతి పాఠంలోని QR cODE ను స్కాన్ చేసిన ఆ పాఠానికి సంబంధించిన అధ్యయన-అధ్యాపనలకు ఉపయుక్తమగు దృశ్య-శ్రవణ సాహిత్యం లభిస్తుంది.

First Edition : 2020 / ప్రథమ ప్రచురణ: 2020
Reprint : 2021 / పునర్ముద్రణ : 2021

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004


ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థవి. మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ సంచాలకుల లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమునందలి ఏభాగమును ఉటంకించుటగాని లేదా పునర్ముద్రించుటగాని చేయరాదు.

**Telugu Language Committee**
Smt. B. Sarada, Chair Person
Smt. T. Suseela, Member
Sri K. Y. Kondanna, Member
Smt. M. Vidya Benerji, Member
Smt. K. Anuradha, Member
Sri B. Vijaybhaskar Reddy, Member
Smt. Y. Sitamahalakshmi, Member
Sri Mallesham Krishnahari Bethi, Member

**తెలుగు భాషా సమితి**
శ్రీమతి భమిడిపాటి శారద, అధ్యక్షులు
శ్రీమతి టి. సుశీల, సభ్యులు
శ్రీ కె. వై. కొండన్న, సభ్యులు
శ్రీమతి ఎమ్. విద్యా బెనర్జీ, సభ్యులు
శ్రీమతి కె. అనురాధ, సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు
శ్రీమతి వై. సీతామహాలక్ష్మి, సభ్యులు
శ్రీ మల్లేశం కృష్ణహరి బేతి, సభ్యులు

**Co-ordination**
Dr. Smt. Thulasi Bharat Bhushan
Special Officer, Telugu

**ప్రధాన సమన్వయకులు**
డా॥ శ్రీమతి తులసీ భారత్ భూషణ్
విశేషాధికారిణి, తెలుగు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె



**Cover:**
Sri Vivekananda Patil

**ముఖచిత్రం:**
శ్రీ వివేకానంద పాటిల్

**Illustrations**
Sri Yogesh Patankar
Smt. Monica Y. Patankar
Sri Ganduri Srinivas

**చిత్రాలు**
శ్రీ యోగేష్ పాటన్‌కర్
శ్రీమతి మోనిక వై. పాటన్‌కర్
శ్రీ గండూరి శ్రీనివాస్

**Telugu Language Study Group**
Smt. V. Rajeswari
Smt. A. S. Yadav
Sri Rajkumar Mutyalvar
Smt. Laxmi Prasad Chalasani
Sri Sridhar Pembatla

**తెలుగు భాషా అధ్యయన మండలి**
శ్రీమతి వి. రాజేశ్వరి
శ్రీమతి ఎ. ఎస్. యాదవ్
శ్రీ రాజ్‌కుమార్ ముత్యాల్‌వార్
శ్రీమతి లక్ష్మీ ప్రసాద్ చలసాని
శ్రీ శ్రీధర్ పెంబట్ల

**Publisher**
Sri Vivek Uttam Gosavi
Controller

**ప్రకాశకులు**
శ్రీ వివేక్ ఉత్తం గోసావి
నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, ప్రభాదేవి, ముంబయి-25.

**Typesetting**
M/s.Vijay Art Printers, Pune

**అక్షరకూర్పు**
మె. విజయ్ ఆర్ట్ ప్రింటర్స్, పుణె

**Production**
Sri Sachchidanand Aphale
Chief Production Officer
Sri Rajendra Chindarkar
Production Officer
Sri Rajendra Pandloskar
Asst. Production Officer

**నిర్మితి**
శ్రీ సచ్చిదానంద అఫ్లే
ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర చిందర్‌కర్
నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర పాండ్లోస్కర్
సహాయ నిర్మితి అధికారి

Paper: 70 GSM Creamwove
కాగితము :

Print Order No :
ముద్రణాదేశము :

Printer:
ముద్రణ :

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య**
**సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ**
నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**
**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే

భారత – భాగ్యవిధాతా

పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,

ద్రావిడ, ఉత్కల, బంగ,

వింధ్య, హిమాచల, యమునా, గంగా,

ఉచ్ఛల జలధితరంగ,

తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,

గాహే తవ జయగాథా,

జనగణ మంగలదాయక జయ హే,

భారత – భాగ్యవిధాతా

జయ హే, జయ హే, జయ హే,

జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

**ప్రియమైన విద్యార్థి మిత్రులారా!**

మీ అందరికి పన్నెండవ తరగతిలోకి స్వాగతం. ఈ నూతన పన్నెండవ తరగతి తెలుగు యువభారతి పాఠ్యపుస్తక నేస్తం ఆకర్షణీయమైన హంగులతో నవ్యతను సంతరించుకొని మీకు ఆహ్వానం పలుకుచున్నది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి, భాషా సామర్థ్యాల, జీవన కౌశల్యాల వికాసం జరిగి, ప్రస్తుత పోటీ ప్రపంచంలో సునాయాసంగా ముందంజ వేయగల సమర్థత, క్రియాశీల ఆలోచనలు గల పౌరులుగా వారిని తీర్చిదిద్దడమే నూతన పాఠ్య ప్రణాళిక ముఖ్యోద్దేశ్యము.

భాషకు, మానవ మనుగడకు గల సంబంధం విడదీయరానిది. అందున మాతృభాషకు గల ప్రాముఖ్యత అత్యధికం. అట్టి మాతృభాషను నిత్యవ్యవహారములో ప్రభావవంతంగా ఉపయోగించడం నేర్చుకోవాలనే విధంగా దృష్టిని కేంద్రీకరించి **'తెలుగు భాషా విషయాన్ని'** అభ్యసించాలి. ఇందులకు గాను ఒక ప్రధాన సాధనంగా ఈ పాఠ్యపుస్తకం రూపొందించబడినది. ఈ పుస్తకాన్ని మీకు అందించుచున్నందుకు మిక్కిలి ఆనందించుచున్నాము. పాఠ్యాంశాలను కంఠస్థం చేసే భారం తొలగి విషయావగాహన, జ్ఞాన సముపార్జన చేసికొని మీ ఆలోచనలను, సృజనాత్మకతను స్వయంగా మీదైన భాషలో, మీ బాణీలో వ్యక్తపరచుటకు అవకాశము కల్పించబడినది. పాఠ్యపుస్తకంలోని అంశాలు కేవలం ఉద్యోగవకాశాలకే గాక జీవితానికి ఉపయోగపడే విధంగా ప్రణాళిక చేసి అందుకుగాను ఉపయుక్తమైన పద్యగద్యాలు, అభ్యాసాలు, ప్రాజెక్టులు, లేఖనకౌశల్యాలు, ప్రత్యక్ష అనుభవానికిగాను అంశాలు ఈ పుస్తకములో పొందుపరుచబడ్డాయి. వీనిని తప్పక సద్వినియోగ పరచుకోగలరు. అంతేగాక పాఠ్యపుస్తకంలోని క్యు.ఆర్.కోడ్ ద్వారా మీ అధ్యయనానికి ఉపయుక్తమగు సాహిత్యం లభిస్తుంది.

ఈ పాఠ్యపుస్తకాన్ని ఆనందంగా అభ్యసించండి. ఈ పుస్తకాన్ని గురించిన మీ భావనలు, అభిప్రాయాలను మాకు తప్పక తెలియజేయండి.

శుభం భూయాత్.

(వివేక్ గోసావి)
సంచాలకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్య పుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004.

పుణె
తేదీ: 21 ఫిబ్రవరి 2020
భారతీయ సౌరమాన తేది :
2 ఫాల్గుణం 1941

# విషయ సూచిక

## పద్యభాగం


1. జన్మభూమికి వెలుగునిద్దాం ........ డా॥ ఎస్. ఈశ్వర రెడ్డి ........ 01
2. భ్రాతృవాత్సల్యము ........ కీ.శే. కళాప్రపూర్ణ డా॥ విశ్వనాథ సత్యనారాయణ ........ 06
3. వర్షసుందరి ........ కీ.శే. సమతారావు ........ 11
4. సంవాదము ........ కీ.శే. చేమకూర వేంకటకవి ........ 17
5. పక్షి-పరిపాలం ........ కీ.శే. నాళం కృష్ణారావు ........ 23
6. ప్రపంచపదులు ........ కీ.శే. డా॥ సి. నారాయణరెడ్డి ........ 29


## గద్యభాగం


1. దీక్ష ........ శ్రీమతి దినవహి సత్యవతి ........ 35
2. కొత్తవెలుగు ........ శ్రీ షేక్ అబ్దుల్ హకీం జానీ ........ 42
3. మానసిక ఆరోగ్యం ........ డా॥ శ్రీమతి సి. శేషారత్నం ........ 48
4. శ్రీకారం ........ డా॥ అంబల్ల జనార్ధన్ ........ 55
5. వేగుచుక్క ........ శ్రీ దాసరి వెంకటరమణ ........ 61
- **సిరిసిల్ల రాజేశ్వరి (పఠనం)** ........ 67
6. పంచతంత్ర కథలు ........ కీ.శే. శ్రీ పడాల రామారావు ........ 68
7. తోలుబొమ్మలాట ........ కీ.శే. డా॥ బిరుదురాజు రామరాజు ........ 75
8. గెలుపు ........ శ్రీ నరెద్దుల రాజారెడ్డి ........ 82
9. చతురోక్తులు ........ 87
- **మహాత్మాగాంధీ 150వ జయంతోత్సవం (పఠనం)** ........ 92
10. అంతరిక్ష విజ్ఞానానికి వెలుగుబాట-శ్రీహరికోట ........ డా॥ వెన్నా వల్లభరావు ........ 94


## సాహితీ ప్రక్రియలు


1. మూషిక మహాసభ (ప్రహసనము) ........ కీ.శే. చిలకమర్తి లక్ష్మీనరసింహం ........ 98
2. హంపీ నడకలు (యాత్రావర్ణన) ........ శ్రీ దాసరి అమరేంద్ర ........ 104
3. గోపయ్య-స్వర్గయాత్ర (కాల్పనికం/ఫిక్షన్) ........ 109


## లేఖన కౌశల్యాలు


1. రేడియో జాకీ (ఆర్.జె.) ........ 114
2. ప్రశ్నలు తయారు చేయుట ........ 116
3. వ్రాతప్రతి ముద్రిత శోధన ........ 118
4. స్వీయపరిచయ పత్రం ........ 119
5. ఈ-మెయిల్ (E-mail) ........ 120
6. అంతరార్థ వివరణ (సామెతలు) ........ 122
- వ్యాకరణము ........ 126

# 12వ తరగతి - తెలుగు - భాషాధ్యయన సామర్థ్యాలు

- సంభాషణలు, ప్రసంగాలు, ఉపన్యాసాలు, వక్తృత్వాలు, ముఖాముఖి, చర్చలు, కళాశాలలోని ప్రకటనలు మొదలగునవి అవగాహనతో విని ప్రతిస్పందిస్తారు.
- వివిధ రకాల వ్యావహారిక, గ్రాంథికభాషల్లోని కథలను అవగాహనతో వింటారు.
- ప్రసార మాధ్యమాలలోని అంశాలపై తార్కికంగా ప్రతిస్పందిస్తారు.
- తమకు కావల్సిన సమాచారాన్ని 'అంతర్జాలంలో' అన్వేషించి విని అధ్యయనానికి ఉపయోగించుకుంటారు.
- వివిధ ప్రాచీన, ఆధునిక గద్య, పద్య పాఠ్యాంశాల్లోని భాషా విశిష్టతను గుర్తించుటకై జరిపిన చర్చలను అవగాహనతో వింటారు.
- వివిధ రకాల ప్రాచీన, ఆధునిక సాహిత్యాన్ని చదివి ఆకళింపు చేసుకుంటారు. రసాస్వాదన చేస్తారు. కావ్య సౌందర్యం గ్రహిస్తారు.
- ఈ-లెర్నింగ్ ద్వారా విని నేర్చుకున్న సమాచారాన్ని వినియోగించుకుంటారు.
- కవితలు, గేయాలు భావానుగుణంగా పాడుతారు.
- నాటకాలను పాత్రోచితంగా నాటకీకరణ చేస్తారు.
- పాఠ్య, పాఠ్యేతర అంశాలను చదివి వారి భావాలను సొంతమాటల్లో అభివ్యక్తీకరిస్తారు.
- చర్చలు, సంవాదాలలో పాల్గొంటారు. ఇచ్చిన అంశంపై అప్పటికప్పుడు ఆసక్తితో ఉపన్యసిస్తారు.
- మాతృదినోత్సవం, విహారయాత్ర మొదలగు వాటి గురించి చర్చించి, ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తారు.
- వివిధ రంగాలకు చెందిన వ్యక్తులతో ముఖాముఖి సంభాషించి, విషయ సేకరణ చేస్తారు.
- ఉపన్యాసం, వక్తృత్వపు పోటీలలో తొట్రుపడకుండా, సమర్థవంతంగా ఉపన్యసిస్తారు.
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహాధ్యాయులు మొదలగువారిని అడిగి తెలియని అంశాలను తెలుసుకుంటారు.
- దినపత్రికలు చదివి ఏరోజు సమాచారం ఆరోజు విద్యార్థులకు తెలియ జేస్తారు.
- వివిధ సాహిత్య ప్రక్రియలను అవగాహనతో చదువుతారు.
- స్థానిక వార్తలతో పాటు ప్రాచుర్యం పొందిన సంఘటనలకు చెందిన వార్తలను అవగాహనతో చదువుతారు.
- వివిధ పత్రికలు చదివి అందలి కథలు అర్థం చేసుకుంటారు.
- విహారయాత్రా స్థలాలలో, పరిసరాలలోని బోర్డులపై గల వివరాలను అర్థవంతంగా, అవగాహనతో చదువుతారు.
- వివిధ వ్యాసాలను చదివి అందలి విషయాలను గ్రహిస్తారు. వ్యావహారిక భాషకు, గ్రాంథిక భాషకు ఉన్న తేడాను గ్రహించగలుగుతారు.
- పాఠ్య, పాఠ్యేతర అదనపు సాహిత్యాన్ని చదివి, వాటి ద్వారా జీవన కౌశల్యాలను నైతిక విలువలు గ్రహిస్తారు.
- అంతర్జాలంలో ఈ-పుస్తకాలను, ఈ-వార్తలు మరియు ఈ-సాహిత్యాన్ని పఠనం చేస్తారు.
- దృశ్య శ్రవణ ప్రసార మాధ్యమాలకు చెందిన కార్యక్రమాలపై అభిప్రాయాలను సొంతమాటల్లో లిఖిత రూపంలో వ్యక్తపరుస్తారు.
- అతిథుల ప్రసంగాలు, కార్యక్రమాలు వింటూ ముఖ్యాంశాలను పుస్తకంలో నమోదు చేసుకుంటారు.
- విషయానుగుణంగా, అంశాల ఆధారంగా చక్కని వ్యాసాలు, కథలు రాస్తారు.
- అపరిచిత పరిచ్ఛేదంపై ప్రశ్నలను తయారు చేస్తారు.
- ఉపవాచక పరిచ్ఛేదాలపై అడిగిన ప్రశ్నలకు సొంతవాక్యాలలో సమాధానాలు రాస్తారు.
- స్వీయ అధ్యయనం ద్వారా సందర్భాన్ని బట్టి నిఘంటువులను చూచి పదాల అర్థాన్ని గ్రహిస్తారు.


- వివిధ భాషాక్రీడల ద్వారా పదజాలాన్ని పెంపొందించుకుంటారు.
- సంధి, సమాస పదాలను గుర్తించి సందర్భోచితంగా ప్రయోగిస్తారు. అకార, ఇకార, ఉకార, యడాగమ, సవర్ణదీర్ఘ, గుణసంధులను, ద్వంద్వ, ద్విగు, తత్పురుష, కర్మధారయ సమాసాలను గుర్తిస్తారు.
- భాషాభాగాలు, వాక్యరకాలు, వాక్యభేదాలు, విభక్తులు, వాక్యాంగాలు, వచనములు, వాచకములను గుర్తిస్తారు.
- శబ్దాలంకారాలను గుర్తించి వాక్యరచనలో ప్రయోగిస్తారు. ఉపమా, స్వభావోక్తి, అర్థాంతరన్యాసాలంకార లక్షణాలను తెలుసుకొంటారు.
- వివిధ రకాల లేఖన కౌశల్యాలను, సృజనాత్మక లేఖనాన్ని అలవరచుకుంటారు.
- విభిన్న సాహితీ ప్రక్రియలను చదివి రసాస్వాదన చేస్తారు.
- భిన్నత్వంలో ఏకత్వం ప్రతిబింబించే విధంగా విభిన్న సంస్కృతుల కార్యక్రమాల్లో పాల్గొని వాటిని అర్థం చేసుకొని ప్రశంసిస్తారు.
- దివ్యాంగులు, వృద్ధులు, ప్రాణుల యెడ సమానుభూతిని గలిగి తగిన సహాయ సహకారాలు అందిస్తారు.
- ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ-మెయిల్ ద్వారా జరపటం నేర్చుకుంటారు.
- చిన్న చిన్న సంభాషణలు, కథలు, గేయాలు రాస్తారు.
- అంతర్జాలాన్ని తగిన విధంగా ఉపయోగించుకుంటారు. తమదగ్గరున్న ప్రామాణికమైన అంశాలను వికీపీడియా బ్లాగులకు అందిస్తారు.
- సోషల్ మీడియాను తగిన రీతిలో బాధ్యతాయుతంగా ఉపయోగించాలనే జ్ఞానాన్ని గ్రహిస్తారు.

## ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు .....

- కంఠస్థము చేయు అలవాటును తొలగించి, అవగాహన చేసికొని కృత్యాలు చేయునట్లు విద్యార్థులకు శిక్షణనివ్వాలి. దానికి తగిన సంప్రదింపు సాహిత్యాన్ని గ్రంథాలయాలు, అంతర్జాలం, ప్రసారమాధ్యమాల ద్వారా పొందుటకు తగిన అవకాశం కల్పించాలి.
- పాఠ్యాంశాలలోని విషయ గ్రహణం, రసాస్వాదన, కవితా సౌందర్య గ్రహణంతోబాటు ఆయా అంశాల ఆధారంగా భాషా కౌశల్యాలను తద్వారా భాషావికాసాన్ని పెంపొందించుకొనుట ముఖ్యోద్దేశ్యముగా గ్రహించాలి.
- అటులనే పాఠ్యాంశాల మాధ్యమంద్వారా, వాటి ఆవల మీరు తెలియజేయు అధిక సమాచారం ద్వారా జీవన కౌశల్యాలను, నైతిక విలువలను పెంపొందించుకొని పాఠశాల విద్య జీవితాంతం ఉపయోగపడు విధంగా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలి.
- సాహితీ ప్రక్రియలు : విద్యార్థుల పఠనాసక్తిని, అవగాహనను పెంపొందిచుటయే ఈ విభాగపు ముఖ్యోద్దేశ్యము. కావున విద్యార్థులే స్ఫూర్తిని పొంది స్వయంగా వాటిని చదివేటట్లు ప్రోత్సహించగలరు.
- భాషావికాసానికి, భాషపై ప్రభుతకు వ్యాకరణం పట్టుకొమ్మ. కాని దానిని సాంప్రదాయ పద్ధతిలో కాక ప్రాయోగిక లేక అన్వయ పద్ధతిలో బోధించుట ఆశించబడినది. కావున ''భాషావగాహన'' శీర్షిక క్రింద ఇచ్చిన అంశాలను ఈ పద్ధతిలో నేర్పగలరు. సౌలభ్యార్థం పుస్తకం చివర అంశాలు చేర్చడం జరిగినది.
- నిత్యజీవితంలోఆయా సందర్భాలలో ఆత్మవిశ్వాసంతో, సరియైన ఉచ్చారణతో చక్కని భాష మాట్లాడుట ఎంతేని అవసరం. అందుకుగాను పాఠ్యపుస్తకంలోని 'స్వీయవ్యక్తీకరణ' 'స్వీయస్పందన' శీర్షికలకు ప్రాధాన్యమివ్వవలెను. విద్యార్థులందరూ వైయక్తికంగా ఇద్దరేసి మరియు జట్టులలో నిర్భయంగా, స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను, భావాలను, అనుభవాలను వెల్లడించుటకు అవకాశం, ప్రోత్సాహం ఇవ్వగలరు.

ఈ పాఠ్యపుస్తక ముఖచిత్రంలో భాషానైపుణ్య సముపార్జన ద్వారా లభ్యమగు అవకాశాలు, మలి చిత్రంలో ఆదికాలం నుండి, అర్వాచీన కాలం వరకు భాషా ప్రవాహం చూపబడినది. వీటిగురించి విద్యార్థులతో విపులంగా చర్చించగలరు.

# 1. జన్మభూమికి వెలుగునిద్దాం



**ఉన్ముఖం:**


నినాదాలను జతపరచండి:

| | |
|---|---|
| సత్యమేవ జయతే | బాలగంగాధర్ తిలక్ |
| ఇన్‌క్విలాబ్ జిందాబాద్ | పండిట్ మదన్‌మోహన్ మాలవ్యా |
| జై జవాన్ - జై కిసాన్ | భగత్‌సింగ్ |
| స్వరాజ్యం నాజన్మహక్కు | లాల్‌బహదూర్ శాస్త్రి |

జన్మభూమికి వెలుగునిచ్చే - జాతిజెండా ఎగురవేద్దాం
నేతలందరి స్మరణ కోసం - నాటిపండుగ చేసుకొందాం
కదలిరండి కలిసిపోదాం - కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా

భగత్‌సింగ్‌కు వారసుడవై భారతావనికండగా
అల్లూరి అడుగుజాడలే - ఆత్మశక్తికి సాక్షిగా
ఝాన్సిలక్ష్మి సాహసాలే - జనుల గుండెకు సానగా
కన్నతల్లిని కంటిలోన - దాచగలిగే బిడ్డగా
కదలిరండి కలిసిపోదాం - కన్నభూమికిరా మన పుణ్యభూమికిరా

శాంతి సహనం నీకు నేర్పిన - నెహ్రూజీ నీ వెలుగుగా
జాతిపితగా మనసు పంచిన - గాంధీజీ వారసుడిగా
అమరజీవుల త్యాగఫలితవు - ఆశాజ్యోతి నీవుగా
మంచితనమును పెంచగలిగే - మానవత్వపు మనిషిగా
కదలిరండి కలిసిపోదాం - కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా.



భరతమాతకు కవచమైన - సైనికుడవు నీవుగా
భరతభువిపై పసిడిపంటల - కాంతులద్దిన రైతుగా
కాశి నుండి కన్యవరకు - కలిపి నడిపే నేతగా
అందరిని ప్రేమించగలిగే - కరుణసింధువు నీవుగా
కదలిరండి కలిసిపోదాం - కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా

భరతకీర్తిని ఆకసానికి - ఎత్తగలిగే ధీరుగా
భరత సంస్కృతిలోని మేలిని - తోడి తేగల మేటిగా
భావిభారత వైభవానికి - పందిరులు మీరేయగా
విశ్వశిఖరము మీద తల్లిని - కొలువు దీర్చగ వేడ్కతో
యువకులారా, యువతులారా - నడుంకట్టి సాగిరండి.



**కవి పరిచయం : డా. ఎస్. ఈశ్వరరెడ్డి**గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మొండి వెంగనపల్లి గ్రామంలో 1-5-1971 తేదీన చెంగలరాయరెడ్డి, లక్ష్మమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. శ్రీ యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప నందు అసిస్టెంట్ ప్రొఫెసరుగా కొనసాగుతున్నారు. వీరి ఇతర రచనలు ''కన్నీటి సీమ, రైతన్న మేలుకో - ఆత్మహత్య మానుకో''. సామాజిక సమస్యలపై వివిధ సందర్భాలలో రాసిన గేయాలు వీరికి మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. గేయకవిగా, వచనకవిగా, విమర్శకుడుగా వీరి సాహిత్యప్రస్థానం సాగుతోంది. ప్రస్తుత పాఠ్యభాగం 'మనసు పాట' అను గేయకవితా సంపుటి నుండి గ్రహించబడింది.

## I చర్చించండి.

1) జై జవాన్ – జైకిసాన్ 2) వివిధ దేశభక్తి గేయాలు – వాటి విశిష్టత

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.

జన్మభూమి = పుట్టినదేశము, పుట్టిన స్థలము; స్మరణ = జ్ఞాపకము; వారసులు = వంశపారంపర్యముగా వచ్చు ఆస్తికి హక్కుదారులు; కవచము = ఇనుపతొడుగు; కరుణ సింధువు = దయాసముద్రము; మేలిమి = శ్రేష్ఠమైన

మాతృభూమి కీర్తిని చాటే జెండాను ఎగురవేద్దాము. మనం స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొని దేశనాయకులను స్మరించుకొందాం. అల్లూరి, భగత్‌సింగ్ అడుగుజాడలలో నడుద్దాం. దేశానికి అండగా ఉందాం. ఝాన్సిలక్ష్మి పరాక్రమ సాహసాలు జనులను ఉత్తేజ పరచగా ఐకమత్యంతో ముందుకు వెళదాం. కంటిరెప్పలా భరతమాతను కాపాడుకుందాం.

శాంతి సహనాలు నేర్పిన నెహ్రూ ఆదర్శంతో, జాతిపిత గాంధీ వారసులుగా ముందుకెళదాం. అమరజీవుల ఆశాజ్యోతిగా, మంచిని పెంచే మానవత్వంతో కలిసి నడుద్దాం. భరతమాతను రక్షించే సైనికులుగా, భారతదేశాన్ని పాడిపంటలతో అభివృద్ధి చేసే రైతుగా కాశినుంచి కన్యాకుమారి వరకు పరిపాలించే నేతగా అందరిని ప్రేమించే కరుణాసముద్రుడుగా ముందుకెళదాం. భారతదేశపు కీర్తిని ఆకాశానికి వ్యాపింపచేద్దాం. భారతీయసంస్కృతిలోని విశిష్టతను తెలియజేద్దాం. భావిభారత వైభవానికి పందిరి వేద్దాం. ప్రపంచంలోనే భరతమాతను ఉన్నత శిఖరాలపై నిలబెట్టే కుతూహలంతో యువతీ యువకులారా, నడుంకట్టి ముందుకు సాగండి.

**III అ) సమాధానాలు రాయండి.**

1) నెహ్రూ నేర్పించినవి

2) దీనికి పందిరులు వేద్దాం

3) జన్మభూమికి వెలుగునిచ్చే దీన్ని ఎగురవేద్దాం.

4) వీరి అడుగుజాడలు ఆత్మశక్తికి సాక్షి

**ఆ) మూడు/నాలుగు వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

1) భరతమాత కీర్తిని చాటిచెప్పే విధం.

2) ''జన్మభూమికి వెలుగునిద్దాం'' పాఠంలో చెప్పిన వివిధ దేశనాయకుల విశిష్టత.

**ఇ) కింది గేయపాదాలను తగిన రీతిలో జతపరచండి.**

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) కదలిరండి కలిసిపోదాం | అ) కాంతులద్దిన రైతుగా |
| 2) జాతిపితగా మనసుపంచిన | ఆ) జనుల గుండెకు సొనగా |
| 3) భరతభువిపై పసిడిపంటల | ఇ) కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా |
| 4) ఝాన్సిలక్ష్మి సాహసాలే | ఈ) గాంధీజీ వారసుడిగా |

**ఈ) కింది ఖాళీలను సరైన పదములతో పూరించండి.**

1) కన్నతల్లిని ___________ దాచగలిగే బిడ్డగా.

2) అమరజీవుల త్యాగఫలితపు ___________ నీవుగా.

3) విశ్వశిఖరము మీద తల్లిని ___________ వేడ్కతో.

**ఉ) కవితా సౌందర్యాన్ని వ్యక్తీకరించండి.**

శాంతి సహనం నీకు నేర్పిన – నెహ్రూజీ నీ వెలుగుగా ....

.... కదలిరండి కలిసి పోదాం – కన్నభూమికిరా, మనపుణ్యభూమికిరా.

**ఊ) కింది గేయమును చదివి మీరు పొందిన రసాస్వాదనను వ్యక్తీకరించండి.**

''భరతమాతకు కవచమైన – సైనికుడవు నీవుగా .....
కదలిరండి కలిసిపోదాం – కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా.''

## IV స్వీయ వ్యక్తీకరణ:

1) నీవు నీ దేశభక్తిని ఏ సందర్భంలో ఏ విధంగా ప్రదర్శించినది వ్యక్తీకరించుము.

2) ''దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్'' అనుటలో మీ అభిప్రాయం.

## V భాషావగాహన:

### అ) కింది పదాలను కలిపి రాయండి.

1) నేతలు + అందరి = ______

2) భారత + అవని = ______

3) కాంతులు + అద్దిన = ______

### ఆ) విగ్రహవాక్యం రాసి సమాసాన్ని గుర్తించండి.

i) ఝాన్సిలక్ష్మి సాహసాలు ______
- సప్తమీ తత్పురుషసమాసము
- షష్ఠీ తత్పురుష సమాసము
- నఞ్ తత్పురుషసమాసము

ii) శాంతి సహనాలు ______
- ద్విగు సమాసము
- ద్వంద్వ సమాసము
- షష్ఠీ తత్పురుషసమాసము

iii) జాతిపిత ______
- చతుర్థీ తత్పురుష సమాసము
- పంచమీ తత్పురుష సమాసము
- షష్ఠీ తత్పురుషసమాసము

### ఇ) గీతగీసిన ప్రత్యయాలు ఏ విభక్తులో గుర్తించండి.

1) కన్నతల్లిని కంటిలోన దాచగలిగే బిడ్డ.

______

2) భరతమాతకు కవచమైన సైనికుడవు.

______

### ఈ) కింది పదాలను సొంతవాక్యాల్లో రాయండి.

1) మానవత్వము    2) అడుగు జాడలు

### ఉ) కింది గేయ పాదములోని అలంకారమును గుర్తించండి.

కదలిరండి కలిసిపోదాం - కన్నభూమికిరా, మన పుణ్యభూమికిరా. ______

**VI సృజనాత్మకత :**

1) దేశభక్తి గేయాలను మరికొన్ని సేకరించండి.
   మీరు సొంతంగా దేశభక్తి గేయాన్ని రాయటానికి ప్రయత్నించండి.

2) నేడు మనదేశం ఎదుర్కొంటున్న సమస్యలను గూర్చి చర్చించి, వాటి నివారణకై కొన్ని అంశాలను తెలియజేయండి.

3) ''కలసివుంటే కలదు సుఖం'' – అన్న విషయంపై సొంతంగా కథను రాయండి.

**సంస్కృత సంధులు**

**సవర్ణదీర్ఘ సంధి :**

సూత్రము : అ, ఇ, ఉ, ఋ వర్ణములకు సవర్ణములు పరమైనచో దీర్ఘము ఏకాదేశమగును.

వర్ణము = అక్షరము, సవర్ణము = అదే అక్షరము, పరమైన = రెండవ పదంగా వచ్చిన, దీర్ఘము ఏకాదేశమగుట = రెండు అచ్చులకు మారుగా దీర్ఘము వచ్చును.

ఉదా: పుండరీక + అక్షుడు = పుండరీకాక్షుడు
(అ + అ = ఆ)

ముని + ఇంద్రుడు = మునీంద్రుడు
(ఇ + ఇ = ఈ)

గురు + ఉత్తముడు = గురూత్తముడు
(ఉ + ఉ = ఊ)

పితృ + ఋణము = పితౄణము
(ఋ + ఋ = ౠ)

**VII క్షేత్ర సందర్శనం (Field Visit) :**

- తరగతి మిత్రులతో కలిసి మీ ఊరిలోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు సందర్శించండి. వివరాలు సేకరించి కంప్యూటర్ ప్రెజంటేషన్ చేయండి.
- మీ ప్రాంతంలో స్వాతంత్ర్య సమర యోధుల జ్ఞాపకార్థం పెట్టిన వీధుల/కట్టడాల పేర్ల జాబితా తయారు చేయండి. వీధి నామ ఫలకాలు సరియైన స్థితిలో లేనిచో మున్సిపాలిటి వారికి తెలియ జేయండి.

**నేనివి నేర్చుకున్నా :**

1) దేశభక్తిని గురించి.

2) దేశనాయకుల త్యాగం గురించి.




# 2 భ్రాతృవాత్సల్యము



**ఉన్ముఖం:**

ఏకాలమునందైనను పదవులపై ప్రీతిలేనివారు మిక్కిలి అరుదు. రాజ్యకాంక్షతో ధరిత్రిని రక్తసిక్తము గావించిన రాజులు లెక్కకు మిక్కిలి గానవత్తురు చరిత్రపుటలు తెరచినచో. కాని ప్రాప్తించిన రాజ్యాధికారాన్ని చేబూనక ఇతిహాసములో వన్నెకెక్కిన భ్రాతృసేవా తత్పరుడు ఎవరు? ఏమాకథ? పాఠం చదివి తెలుసుకుందామా!



శా. అన్నా! మీదగుపద్ధతింగనిన నాయం దేదియో కార్యమై
యున్నట్లున్నది, యేదో చెప్పుటకునై యూహించినట్లుండె మీ
సన్నల్, నాదెస వీడికొొలుకొని మీసాకేత మేగంగ నై
న న్నిక్కంబుగ సంశయించెదరొ! యింతం జెప్పఁగా వచ్చునే! 1


క. ఏనును ని న్నిది యడుగం
గా నూహించితిని, జడలుకట్టెం దల, నీ
వైనను న్యగ్రోధక్షీ
రానన్ ముడిచితివె జుత్తు రఘుధాత్రీశా! 2

ఆ. తండ్రిమాటకై వ్రతంబు బూనినవాడు
కావి చీర లిట్లు కట్టవచ్చు
తండ్రిమాట కొఱకు ధాత్రి నేలెడివాఁడు
కావి నారచీర కట్టరాదు. 3

గీ. అనిన భరతుండు లేచి కృతాంజలి యయి
కరుణచూడుము! నీ కయి కదలివచ్చె
నీ యయోధ్య సర్వంబును, నిట్లె మఱల
రాజు లేకుండఁ దిరిగిపో రాదయోధ్య. 4

చ. భరతుఁడు, స్వామి! నే నెఱుఁగఁబాప, మయోధ్యకువచ్చు దాఁక నీ
జరిగిన దెల్లనుం జరుగుచాయయె నాకు నెఱుంగరా దహో!
గురువులు నన్ను రమ్మనిరి కూరిమిమీఱఁగ నిన్ను ధారణీ
వరునిఁ గనంగవచ్చితిని వచ్చినదాఁక నెఱుంగ నేమియున్. 5

క. నా తమ్ముని తన మదియును
చేతశ్శుద్ధముగ నీవు చెప్పితివేనిన్
నాతో రావె! యయోధ్యకు
నీతో ముడివెట్టుకొంటి నిక్కము రామా! 6



**కవి పరిచయం : కీ.శే. డా॥ విశ్వనాథ సత్యనారాయణ**గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా నందమూరు గ్రామంలో 10-9-1895న శోభనాద్రి, పార్వతమ్మ దంపతులకు జన్మించిరి. వీరు అనేక శతకాలు, గేయకావ్యాలు, నాటకాలు, నవలలు రచించారు.

విశ్వనాథవారు జ్ఞానపీఠం అవార్డు పొందిన తొలి తెలుగు రచయిత. వీరు రచించిన ''వేయిపడగలు'' గ్రంథానికి ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డు లభించింది. ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన 'శ్రీమద్రామాయణ కల్పవృక్షం' నందలి అయోధ్యకాండ నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1) రామాయణంలోని మానవీయ విలువలు.

2) సోదర ప్రేమను తెలియజేయు మరో గ్రంథము.

3) గుహుడు, శబరి, విభీషణుడు, వాలి మున్నగు పాత్రల ఔచిత్యము.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### 1. పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం :

భ్రాతృవాత్సల్యము = సోదరప్రేమ; కార్యము = పని; సన్నల్ = సంజ్ఞలు/సైగలు; సంశయము = సందేహము; అనుమానం

శ్రీరాముడు భరతుని చూచి ఈ విధముగా పలికెను. మీ పద్ధతి చూచినచో నాతో మీకేదియో కావలసిన పని ఉన్నట్లున్నది. మీ సైగలు చూచినచో ఏదియో చెప్పవలెనని అనుకొనుచున్నట్లు కనపడుచున్నది.

నన్ను వదలి సాకేతపురము వెళ్ళుటకు మీరు ఇంత సందేహించుటెందులకు? మీ మనస్సులోని విషయమును చెప్పవలసినది.

2. న్యగ్రోధక్షీరము = మర్రిపాలు; ముడిచితివె = ముడివేసి నావె; ధాత్రీశా = భూమికి ప్రభువా! / రాజా!

ఓ రఘువంశ ప్రభూ! నేనును నిన్ను ఇదె అడుగదలచితిని. నీ జుట్టు జడలు కట్టినది. నీవు కూడ మర్రిపాలతో జుట్టును ముడివేసితివా.

3. కావిచీర = కాషాయరంగు వస్త్రము; ధాత్రి = భూమి;

తండ్రిమాట పాలించు వ్రతము చేపట్టినవాడు ఈ విధముగా కాషాయవస్త్రములు కట్టవచ్చును. తండ్రి మాటకొఱకు రాజ్యమును పాలించవలసిన వాడు ఈ విధముగా కాషాయవస్త్రములు కట్టరాదు.

4. కృతాంజలి = నమస్కారము;

ఈ విధముగా రాముడు పలుకగా భరతుడు లేచి నమస్కరించి యిట్లు పలికెను. నీవు దయ చూడవలసినది. ఈ అయోధ్యా నగరమంతయును నీకోసము కదలి వచ్చినది. మరల రాజులేకుండ అయోధ్యకు తిరిగి వెళ్ళదు.

5. ఛాయ = జాడ; కూరిమి = ప్రేమ, స్నేహము; కనంగ = చూచుటకు; ధారణీవరుడు = రాజులలో శ్రేష్ఠుడు

ఇంకను భరతుడు యిట్లు పలికెను. ఓ ప్రభూ! నేను ఏ పాపము ఎఱుగను. నేను అయోధ్యకు వచ్చువరకు ఈ జరిగిన విషయము ఏ మాత్రము తెలియదు. నన్ను గురువులు ప్రేమతో రమ్మని పిలిచిరి. నేను రాజులలో శ్రేష్ఠుడవైన నిన్ను చూచుటకు వచ్చితిని. ఇక్కడకు వచ్చువరకు నా కేమియు తెలియదు.

6. చేతశ్శుద్ధము = పవిత్రమైన మనస్సు

ఓ రామా! నీ తమ్ముని మనసు పవిత్రమైనదని తలచినచో నాతో రావలసినది. నేను అయోధ్యకు వెళ్ళుటన్నది నీతో ముడిపెట్టుకొంటిని. ఇది నిజము.

## III వినండి - చర్చించండి - రాయండి.

### అ) ఒక్కవాక్యంలో జవాబులు రాయండి.

1. కాషాయవస్త్రములు ఎవరు కట్టరాదు?
2. రాముని కోసం కదిలి వచ్చినదేది?
3. భరతుడు ఎందుకు వచ్చాడు?

### ఆ) నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.

1. అరణ్యమునకు వచ్చిన భరతునితో రాముడేమనెను?
2. భరతుడు జరిగిన దానిలో తన తప్పేమియు లేదని చెప్పిన విధము.

### ఇ) ఎవరు ఎవరితో అనిరి

1. యేదో చెప్పుటకున్నై యూహించినట్లుండె. [ ] → [ ]
2. కావి నారచీర కట్టరాదు. [ ] → [ ]
3. వచ్చినదాఁక నెఱుంగ నేమియున్. [ ] → [ ]
4. అయోధ్యకు నీతో ముడివెట్టుకొంటి [ ] → [ ]

### ఈ) తప్పొప్పులను గుర్తించుము.

1. రాజు లేకుండ తిరిగి పోయెదమయోధ్య. (     )
2. కావిచీరలిట్లు కట్టవచ్చు. (     )
3. నీ కయి కదలి రాలేదు ఈ అయోధ్య సర్వంబును. (     )
4. నిన్ను ధారణీ వరునిఁ గనంగ వచ్చితిని. (     )

### ఉ) కింది పద్యానికి భావసౌందర్యము రాయండి.

"అన్నా! మీదగుపద్ధతింగనిన నాయం దేదియో

......................................................

......................................................

................ యింతం జెప్పఁగా వచ్చునే."

### ఊ) కింది పద్యాన్ని చదివి దాని ద్వారా మీరు పొందిన రసస్వాదన వివరించండి.

"అనిన భరతుండు లేచి కృతాంజలి యయి

......................................................

......................................................

............... రాజులేకుండఁదిరిగిపో రాదయోధ్య."

## IV స్వీయ వ్యక్తీకరణ :

1. రాముడు – భరతుడు – వీరి మధ్య జరిగిన సంభాషణను మీ స్వంతమాటలలో రాయండి.
2. 'భ్రాతృ వాత్సల్యము' – అన్న అంశముపై మీ అభిప్రాయం.

## V భాషావగాహన

**అ) కింది పట్టికను అడిగిన విధంగా పూరించండి.**

| పదము | | విడదీయుట | | సంధిపేరు |
|---|---|---|---|---|
| 1. నాయందు | —> | | = | |
| 2. | —> | నీవు + ఐనను | = | |
| 3. కృతాంజలి | —> | | = | |
| 4. జరిగినదెల్ల | —> | | = | |

**ఆ) కింది పదాలను ఆయా సమాసాల కింద రాయండి.**

(షష్ఠీ తత్పురుష సమాసము, తృతీయా తత్పురుష సమాసము, విశేషణ పూర్వపద కర్మధారయ సమాసము.)

1) న్యగ్రోధక్షీరము  2) కావిచీర  3) నాదెస

4) నారచీర  5) తండ్రిమాట  6) ధారుణీవరుడు

**ఇ) గీత గీసిన ప్రత్యయం ఏ విభక్తో రాయండి.**

1) నా యందు యేదియో కార్యమై.

2) ఏనును నిన్నిది యడుగంగా నూహించితిని.

3) తండ్రి మాట కొరకు ధాత్రి నేలెడువాడు.

4) నీతో ముడివెట్టుకొంటి.

**ఈ) వాక్యభేదములను గుర్తించి రాయండి.**

(నిశ్చయార్థకము, ఆశ్చర్యార్థకము, వ్యతిరేకార్థకము, ప్రశ్నార్థకము)

1) రాజు లేకుండ దిరిగి పోరాదు.

2) ఇంతం జెప్పగా వచ్చునే.

3) నీవైనను న్యగ్రోధక్షీరానన్ ముడిచితివె?

4) నిన్నిది యడుగంగా నూహించితిని.

## VI సృజనాత్మకత :

1) సోదరి ప్రేమను తెలియజేయు పండుగను గురించి పది వాక్యాలు రాయండి.

2) కావిరంగు బట్టలు ధరించుటలోని అంతరార్థము గ్రహించి సొంతమాటల్లో వివరించండి.

## VII అంతర్జాలం :

అంతర్జాలంలో తెలుగు ''ఈ-పుస్తకాల''లో రామాయణకథలను చదవండి. వాటిని ''కథాకథన శైలి''లో స్వాభినయంతో తరగతి/పాఠశాలలో ప్రభావవంతంగా చెప్పండి.

**గుణసంధి :** అకారమునకు 'ఇ' ఉ, ఋ, ౠ' లు పరమైన క్రమముగా 'ఏ, ఓ, అర్ అల్'లు ఆదేశముగును. ఏ, ఓ, అర్, అల్ అను వానిని గుణములందురు. గుణములు ఆదేశముగా వచ్చును కావున ఇది గుణసంధి.

ఆదేశము అనగా సంధి జరుగునపుడు ఉన్న అక్షరమును తొలగించి దాని స్థానమున వేరొక అక్షరము వచ్చి చేరుట.

ఉదా: దేవ + ఇంద్రుడు : ఇచట సంధి సూత్రము ప్రకారము పూర్వస్వరంబయిన అకారము తొలగిపోయి దేవ్ + ఇంద్రుడు = దేవింద్రుడు అని రావలెను. కాని గుణసంధి సూత్రము ప్రకారము రెండవ పదములోని మొదటి అచ్చు 'ఇ' స్థానములో ఏ వచ్చి చేరును. అప్పుడు దేవ్ + ఏంద్రుడు = దేవేంద్రుడు అను రూపము వచ్చును. ఇట్లే

ఉదా: 1. మహా + ఇంద్రుడు = మహేంద్రుడు.

2. మహా + ఉపకారము = మహోపకారము.

3. దేవ + ఋషి = దేవర్షి.

## భాషాక్రీడ

**రామాయణంలోని పాత్రల పేర్లు**

- 5 అక్షరాలతో పదిరథములు కలవాడు అనే అర్థం.

| | | | | |
|---|---|---|---|---|
| | | | | |

- 3 అక్షరాలతో జనకుని కుమార్తె.

| | | |
|---|---|---|
| | | |

- 4 అక్షరాలతో రాముని అనుగమించిన సోదరుడు.

| | | | |
|---|---|---|---|
| | | | |

- 4 అక్షరాలతో లంకకు అధిపతి.


| | | | |
|---|---|---|---|
| రా | వ | ణు | డు |

నేనివి గ్రహించా:

1. పితృవాక్య పాలనలో రాముని నిష్ఠ.
2. భరతునికి రాముని యందున్న భక్తి గౌరవాలు.



# 3. వర్షసుందరి




**ఉన్ముఖం:**

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. అందుకే ఇచట పిల్లలు.

"వానావానా వల్లప్ప
వాకిలి తిరుగు చెల్లప్ప
తిరుగు తిరుగు తిమ్మప్ప
నే తిరుగలేను నరసప్ప......"

येरे येरे पावसा
तुला देतो पैसा

అంటూ స్వాగత గీతాలు పాడి వానరాకడకై ఉవ్విళ్లూరుతూ ఎదురు చూడటం, పెద్దలు సైతం వాన కొరకు ఆశగా ఆకాశంవైపు చూడటం పరిపాటే.అట్టివానను ఈ గేయంలో కవి ఎలా వర్ణించాడో చూద్దామా!



వర్షసుందరి భువికి వచ్చిందీ!
హర్షాలు మోసుకుని తెచ్చిందీ! 1

మదపుటేన్గుల బోలు-మబ్బు సైన్యాలతో
కళ్ళుచీకటి కమ్ము-మెరుపు దివిటీలతో
దిశలు బ్రద్ధలుచేయు-ఉరుము భేరీలతో

కదనాని కన్నటుల కదలిందీ!
దివినుండి భువి కేగుదెంచిందీ! 2

వానరాకడ తెలిసి చీమ సంతతులన్ని
పుట్టలన్నియు వీడి పుట్టలుగ, పుట్టలుగ
మిట్టలకు గుట్టలకు బారులుగ సాగంగ

వానవాసనబట్టి తూనీగ గుంపులవె
రెక్కలను విప్పుకొని చక్కదనములు మీర
రకరకపు విన్యాసములు సలుప సాగంగ

కులుకుతూ పలుకుతూ వచ్చిందీ!
దివినుండి భువి కేగుదెంచిందీ! 3

నల్లమబ్బుల బారు తిలకించి పులకించి
వన మయూరములన్ని ఘన పింఛములు విప్పి
వయ్యారములు మీర నర్తించ సాగంగ;
సారించి తమ గొంతు స్వాగతము పలుకంగ

రకరకపు నడకలతో వచ్చిందీ!
దివినుండి భువి కేగుదెంచిందీ! 4

ఏటి పొడుగున భూమి పాటుపడి పండించి
కష్టనష్టాలకోర్చి పాడిపంటలు తావృద్ధినొందింప
తిండిగింజలకెట్టి లోటుండ రాదనుచు
హర్షముతో వర్షముకు ఎదురు తెన్నులు చూడ


ఉరుములతొ మెరుపులతొ వచ్చిందీ!
దీవెనలు కొల్లలుగ తెచ్చిందీ! 5

పాటుపడుదామన్న పనిలేక పస్తులతొ
గోడు గోడున ఏడ్చు పొలంపని వారలు
మేఘాల తిలకించి పని దొరకు ననియెంచి
చాతకంబుల వోలె పరితపించగ సాగ

ఆశలను మోసుకొని తెచ్చిందీ
ఆశీర్వదించగా వచ్చిందీ! 6

ఆమె కరుణలు లేక ఈ లోకమే సున్న;
ఆమె రాకడ లోక ప్రాణి కోటికి రక్ష!
క్షీరములు ధాన్యములు ఆమె పెట్టిన భిక్ష
మనసు మెత్తని దేవి మనసు చల్లని దేవి

మనసార స్వాగతం పలుకండీ!
మనసు కోరికలన్ని పొందండీ! 7





**కవి పరిచయం : కీ.శే. చావలి రామచంద్రరావు** (కలం పేరు సమతారావు)గారు తమ రచనల ద్వారా బాలలలో చదివే అలవాటును, ఆలోచనాశక్తిని, మంచిజ్ఞానాన్ని పెంపొందించారు. బాల సాహిత్యంలో వారు చేసిన కృషికి గుర్తింపుగా తెలుగు బాలల రచయితల సంఘ స్వర్ణోత్సవాలలో ఘనసన్మానాన్ని పొందారు. వారి ఇతర రచనలు వెలుగుపూలు, చిన్నారి పాపలు, తెలుగువెలుగులు, పసిడిపలుకులు, గేయకథలు, క్రాంతిపూలు మొదలగునవి. ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన ''బాలలగేయాలు, గేయకథలు'' నుండి గ్రహించబడినది.

**I చర్చించండి.**

1. వానాకాలం పిల్లలకు ఎంతో సంబరాన్ని తెస్తుంది.
2. భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం.

**II చదవండి - ఆలోచించండి - రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం, భావాన్ని తెలుసుకుందాం.**

హర్షాలు = ఆనందాలు, సంతోషాలు; మదపుటేనుగు = మదించిన ఏనుగు; దివిటి = నూనెలో ముంచిన గుడ్డ కర్రకు కట్టి వెలిగించినది, కాగడా; భేరి = తీవ్రమైన శబ్దం, దూరంలో ఉన్న వారిని సిద్ధంకమ్మని చెప్పడానికి ఉపయోగించే సాధనం; కదనానికి = యుద్ధానికి; సంతతులు = సంతతివారు, జాతులు; వీడి = వదిలి; బారులు = వరుసలు; విన్యాసములు = వివిధ భంగిమలు; సలుప = చేయగా; సాగంగా = కదిలింది; ఏగుదెంచింది = వచ్చింది; వనమయూరములు = అడవిలోని నెమళ్ళు; సారించి = సరిచేసుకొని; స్వాగతము = ఆహ్వానము; ఏటిపొడుగునా = ఏడాది అంతా; సమర్పించి = చెల్లించి; లోటు = తక్కువ; ఎదురు తెన్నులు = ఎదురు చూపులు; పాటు = శ్రమ; పస్తులు = ఉపవాసములు; తిలకించి = చూసి; యెంచి = భావించి; చాతకంబుల = చాతకపక్షుల; వోలె = వలె; పరితపించి = అనేక విధములుగా ఆలోచించి, బాధపడు; క్షీరము = పాలు; ధాన్యము = తినే గింజలు.

**భావములు :**

1. వర్షం భూమిపై పడటానికి వస్తూ, తనతోపాటుగా ఎన్నో సంతోషాల్ని, ఆనందాల్ని తెచ్చింది.
2. మదించిన ఏనుగులను పోలు మబ్బులు అనెడి సైన్యముతో వర్షసుందరి కదలి వచ్చింది. కళ్ళు చీకట్లు కమ్మే మెరుపు తీగలు అనే దివిటీల వెలుగుతో భువికి దిగి వచ్చింది. దిక్కులు బద్ధలయ్యే విధంగా ఉరుముల శబ్దాలతో యుద్ధానికి వస్తున్నట్లు వర్షసుందరి ఆకాశం నుండి భువికి అరుదెంచింది.
3. వాన వస్తుందని తెలుసుకున్న చీమ జాతులన్నీ వాటి వాటి పుట్టలను విడిచి గుంపులు గుంపులుగా బారులు తీరి కొండల మీదికి, గుట్టల మీదికి చేరుకున్నాయి. వాన వచ్చేముందు వాసనను పసిగట్టి తూనీగలు తమరెక్కలు విప్పుకొని అందంగా అనేక విధముల విన్యాసములు సలుపుచుండగా సంతోషముతో వర్షసుందరి తరలి వచ్చింది.
4. బారులుగా ఉన్న మబ్బులను చూసి అడవిలో ఉండే నెమళ్ళన్నీ తమ పింఛములను విప్పి సంతోషముతో అందంగా నాట్యము చేయుచున్నవి. గొంతులను సవరించుకొని వర్షానికి స్వాగతం పలుకుచుండగా రకరకాల నడకలతో పైనుండి భూమికి వచ్చింది.
5. ఏడాదంతా రైతు ఎంతో శ్రమపడి పాడిపంటలను వృద్ధి చేస్తాడు. కష్టనష్టాలను ఎదుర్కొని, రైతు తిండి గింజలకు లోటు రాకూడదనుచు వర్షమునకై ఎదురు తెన్నులు చూస్తాడు. రైతుల ఎదురుచూపు ఫలితాన్నిచ్చిందా అన్నట్లు ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చింది.
6. వానలు లేక పనులు చేద్దామన్నా, పని లేక పొలంపని వారందరూ దుఃఖిస్తున్న సమయంలో, ఆకాశములో కనిపించిన మబ్బులను చూసి ఇకపై పని దొరుకుతుందనే ఆశతో చాతకపక్షుల వలె ఎదురుచూచుచున్న వారిని ఆశీర్వదించుటకు వర్షసుందరి వచ్చింది.
7. ఆ వర్షసుందరి కరుణ లేకపోతే పంటలుపండక పోవడమేకాదు, తాగటానికి నీరు కూడ దొరకదు. ఆమె రావడం ప్రాణులందరికి రక్ష. పాడిపంటలు వర్షము యొక్క భిక్ష. మెత్తని సున్నితమైన మనసున్న ఆ దేవతకు మనసారా స్వాగతం పలికి, మనసులో ఉన్న కోరికలను సాధించుకొమ్మని కవి సమతారావుగారు అంటున్నారు.

**III అ) కింది వాటికి ఒక వాక్యములో జవాబులు రాయండి.**

1. చీమ సంతతులు కదిలి వెళ్ళినచోటు.
2. వాన వాసనకు తూనీగలు తమ ఆనందాన్ని తెలిపిన తీరు.
3. పొలంపనివారలు వాన కొరకు ఎదురు చూచుటకు కారణం.

ఆ) కింది వాటికి ఐదు-ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.

1. వర్షసుందరి దివినుండి భువికి చేరిన తీరు.
2. వర్షపురాకను గమనించి వివిధ జీవులు సంతోషాన్ని వ్యక్తపరచిన తీరు.
3. వర్షసుందరి తెచ్చిన సంతోషాలు.

ఇ) సరియైన పదాలు ఎన్నుకొని గడులను పూరించండి.

1. నల్లమబ్బుల [ ] తిలకించి పులకించి.
(బారు, మీరు, గోరు)

2. మదపుటేన్గుల బోలు [ ] సైన్యాలతో
(జబ్బు, మబ్బు, సుబ్బు)

3. వానవాసనబట్టి [ ] గుంపులవె
(ఈగ, తూనీగ, తేనెటీగ)

4. [ ] మోసుకొని తెచ్చింది.
(ఆశలను, దురాశను, పేరాశను)

ఈ) జతపరచండి :

| 'క' వర్గము | | 'చ' వర్గము | |
|---|---|---|---|
| 1) | చాతకంబుల వోలె | అ) | పుట్టలుగ, పుట్టలుగ |
| 2) | పుట్టలన్నియు వీడి | ఆ) | ఘన పింఛములు విప్పి |
| 3) | దిశలు బద్ధలుచేయు | ఇ) | పరితపించగ సాగ |
| 4) | వన మయూరములన్ని | ఈ) | ఉరుము భేరీలతో |

ఉ) కింది పద్యమునందలి కవితాసౌందర్యమును వ్యక్తీకరించండి.

''మదపుటేన్గుల బోలు మబ్బు సైన్యాలతో
............................................
............................................
............ దివినుండి భువి కేగుదెంచిందీ.''

ఊ) కింది పద్యాన్ని చదివి మీరు పొందిన రసాస్వాదన వ్యక్తీకరించండి.

''నల్లమబ్బుల బారు తిలకించి పులకించి
............................................
............................................
............ దివినుండి భువి కేగుదెంచిందీ.''

## IV స్వీయవ్యక్తీకరణ :

1. వర్షదేవత విశిష్టత
2. వర్షాకాలమందలి ప్రకృతి సౌందర్యము.

## V భాషావగాహన :

**అ) కింది పట్టికను అడిగిన విధంగా పూరించండి.**

| పదము | విడదీయుట | సంధిపేరు |
|---|---|---|
| 1. కదనానికన్నటుల = | | |
| 2. మయూరములన్ని = | | ఉకారసంధి |
| 3. | = నయ్యాటలు + ఆడుతూ | |
| 4. లోటుండరాదు = | | |

**ఆ) కింది పట్టికను అడిగిన విధంగా పూరించండి.**

| పదము | విగ్రహవాక్యము | సమాసము పేరు |
|---|---|---|
| 1. చీమ సంతతులు = | | |
| 2. నల్ల మబ్బులు = | | |
| 3. | = ఘనమైన పింఛములు | |
| 4. పాడిపంటలు = | | |
| 5. | = కష్టమును, నష్టమును | |

**ఇ) గీతగీసిన వాటియొక్క విభక్తులను గుర్తించండి.**

1. వర్షసుందరి భువికి వచ్చింది.
2. రెక్కలను విప్పుకొని
3. హర్షముతో వర్షముకు ఎదురు తెన్నులుచూడ.
4. దిశలు బ్రద్దలు చేయు

**ఈ) ఏ వాచకమో తెలుపండి.**

1. ఏనుగు ——>
2. కవి ——>
3. సుందరి ——>
4. తూనీగ ——>

**ఉ) కింది గేయపాదములందలి అలంకారాన్ని గుర్తించండి.**

1) వర్షసుందరి భువికి వచ్చిందీ.
హర్షాలు మోసుకొని తెచ్చిందీ.

2) మనసార స్వాగతం పలుకండీ.
మనసు కోరికలన్ని పొందండీ.

## VI సృజనాత్మకత :

1. ప్రకృతి సౌందర్యమును వర్ణించు కవితలను చదివి, వాటిపై మీ అభిప్రాయమును తెలియచేయుము.
2. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి జట్లుగా చర్చించండి.

## VII క్షేత్ర సందర్శనం (Field Visit) :

మీ వీధిలో ఎన్ని ఇండ్లు/భవనాలలో వర్షపు నీటి ఇంకుడు గుంతలు (rainwater harvesting) పద్ధతి అవలంబించబడుతుందో నమోదు చేయండి. జనజాగృతి కలిగించండి.

### శబ్దాలంకారాలు :

**యమకము :**

ఉపయోగించిన పదాలనే అర్థ భేదము కలుగునట్లు మరల మరల ప్రయోగించుట.

ఉదా : మన సుభద్ర సుకృతి మహిమ ఏమనవచ్చు
మనసు భద్రమయ్యె మనకు నెల్ల

ఈ పద్యపాదంలో ''మన సుభద్ర'' అనునపుడు మన యొక్క సుభద్ర అని అర్థము చెప్పుకొందుము.
రెండవ పాదమందు ''మనసు భద్రమయ్యె'' అనగా మనందరి మనసు కుదుటపడెను అని అర్థ భేదమును చెప్పుకొందుము.
''మనసుభద్ర'', ''మనసుభద్ర'' అని రెండు మార్లు అవే పదాలను ఉపయోగించినను ఆ పద విభజనలో మార్పువల్ల అర్థ భేదం కలుగుతున్నది. (మన సుభద్ర మనసు భద్ర)

అదే విధంగా

లేమా దనుజుల గెలువగ
లేమా నీవేల కడగి లేచితి విటురా
లేమాను మానవేనిన్
లేమా! విల్లందు కొనుము లీలంగేలన్

పై పద్యంలో 'లేమా' అనే అక్షరద్వయం ''లేమా! లేమా? లే-మాను, లే-మాను (ఆపు అనే అర్థంలోను-వాడబడి అర్థ భేదంగా ఉన్నందున 'యమకాలంకారం' అయింది.

**ముక్త పదగ్రస్తం :**

విడిచిన పదాన్నే అవ్యవధానంగా మరల మరల ప్రయోగించుట.

ఉదా : సుదతీ నూతన మదనా
మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా
సదనా మయ గజ రదనా
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!


ఈ పద్యము నందు మొదటిపాదము ''మదనా'' అను పదముతో ముగియుచుండగా రెండవ పాదములో మొదటి పదం 'మదనా'తో ప్రారంభింపబడింది. అట్లే రెండవ పాదం చివరి పదం 'సదనా' తో ముగియగా, మూడవ పాదము మొదటిపదం 'సదనా తో ప్రారంభించబడింది. ఈ విధంగా విడిచిన పదాన్ని తిరిగి స్వీకరించుటనే 'ముక్త పదగ్రస్తము' అందురు.

**నేనివి గ్రహించా :**

1) వర్షాకాలంలోని ప్రకృతి సౌందర్యము. 2) నీరు - జీవనాధారం.



# 4. సంవాదము



**ఉన్ముఖం:**


మీరు మీ పాఠశాలలో వివిధ ప్రాణులు వ్యక్తులవలె మారు వేషము వేసుకొని పోటీలలో పాల్గొనియుందురు. మనమెవరమో తెలియనీయక వేరొక ప్రాణి/వ్యక్తి వలె వేషభాషలను మార్చుకొని నటించుటను మారువేషం అందురు. పూర్వకాలమున రాజులు కూడా తమ పరిపాలనలో ప్రజలు ఎటులున్నారో తెలిసికొనుటకు మారు వేషములను వేసికొనిన కథలను కూడా మనము చదివాము. ప్రస్తుత పాఠ్యభాగంలో యతి వేషమున వచ్చినదెవరు? ఎందులకు? — పాఠ్యభాగము మరియు ఉపాధ్యాయుల సహాయముతో తెలుసుకోండి.

మ. ‘‘అవుఁ గా, మీరిటమున్న గన్గొనని చాయల్ లేవుగా: నాఁటినుం
డి విశేషంబులు కొన్ని మిమ్ము నడుగన్ వేడ్కయ్యెడున్ నాకు; నె
య్యవి గన్గొంటిరి పుణ్యభూము? లట రాజ్యంబు ల్మనోజ్ఞంబు లె
య్యవి? యేయే పురము ల్గనంబడియె మీ కందందు మార్గంబునన్ 1

కం. మీ రింద్రప్రస్థముఁ గని
నారా? పాండవులఁ జూచినారా? సుఖులై
వారందఱు నొకచో ను
న్నారా? వీరాగ్రగణ్యునరు నెఱుఁగుదురా? 2

సీ. ఎగు బుజంబుల వాఁడు మృగరాజ మధ్యంబుఁ
బుడికి పుచ్చుకొను నెన్నడుము వాఁడు.
నెఱి వెండ్రుకల వాఁడు, నీలంపు నికరంపు
మెఱుఁగుఁజామన చాయ మేని వాఁడు.
గొప్ప కన్నుల వాఁడు, కోదండ గుణ కిణాం
కములైన ముంజేతు లమరు వాఁడు,
బవిరి గడ్డము వాఁడు, పన్నిదం బిడి డాఁగ
వచ్చు నందపు వెన్ను మచ్చవాఁడు

తే. గరగరని వాఁడు, నవ్వు మొగంబు వాఁడు,
చూడఁగలవాఁడు, మేలైన సొబగు వాఁడు,
వావి మేనత్త కొడుకు కావలయు నాకు,
నర్జునుండు పరాక్రమోపార్జునుండు. 3



కం. తడవాయె భూప్రదక్షిణ
మడరింపఁగఁ బోయి యా మహామహుఁడు, పదం
పడి పుణ్యస్థలముల నె
న్నఁడు మీ రందందు నరుగ నరుఁ గానరు గా?'' 4

కం. అన విని ''సమస్త భూముల
గనినారము, తీర్థయాత్రఁ గావించు నెడఁ
గనుఁగొనినారము సంక్రం
దన నందను''; ననిన ముద మెదం జెన్నొందన్. 5

ఉ. ''ఎచ్చటఁ గంటిరో విజయు నిక్కువ? నిక్కువ మౌనె? రాఁడుగా
యిచ్చటి'' కంచుఁ గోరికల యారిక లీరిక లెత్తఁ బల్కఁగా,
నొచ్చెము లేని బీర మెద నూరఁగ, నూఱఁగఁ సాగె వెంటనే
పచ్చని వింటివాఁడపుడు పైదలి పైఁ దలిరాకుఁ గైదువుల్ 6

ఉ. కోమలి యాగతి న్మది తగుల్పడఁ బల్కిన, నవ్వి, 'నిర్జర
గ్రామణి సూను మీ రెచటఁ గంటిరొ యంటివి; కన్న మాత్రమే
యేమని చెప్పవచ్చు, నొక యించుక భేదములేక యాయనే
మే మయి యున్నవారము సుమీ వికచాంబుజ పత్త్రలోచనా. 7

**కవి పరిచయం : కీ.శే. శ్రీ చేమకూర వేంకటకవి** క్రీ.శ. 1630 కాలానికి చెందినవాడు. సాహితీప్రియుడైన తంజావూరు నాయకరాజులలో ప్రసిద్ధుడైన రఘునాథరాజు కొలువులో ప్రముఖ కవి. వీరు దక్షిణాంధ్ర సాహిత్యయుగంలో ముఖ్యస్థానం వహించారు. వీరు సారంగధర చరిత్ర, విజయ విలాసం అను గ్రంథములను రచించారు. దక్షిణాంధ్రయుగంలోని ప్రబంధకవులలో అత్యున్నత స్థాయిని అందుకున్న కవి చేమకూర వేంకటకవి. ప్రస్తుత పాఠ్యభాగం 'విజయవిలాసం' ద్వితీయాశ్వాసం నుండి గ్రహించబడింది.

## I చర్చించండి.

1. కురు, పాండవ గాథను తెలుపు కావ్యము.
2. పాండవ మధ్యముడని ఎవరిని అంటారు? ఎందుకు?
3. ప్రబంధమని పిలువబడునది ఏది? దానికి గల లక్షణం.

## II ఆలోచించండి - రాయండి.

**పదజాలం పెంపొందించుకుందాం-భావాన్ని తెలుసుకుందాం.**

1. మున్ను = పూర్వము; కన్గొనని చాయల్ = చూడని ప్రదేశాలు; మనోజ్ఞంబు = ఇంపయిన.

**భావము :** మీరు ఇంతకు పూర్వము చూడని ప్రదేశాలు లేవుకదా? మీ దర్శనమయిన నాటి నుండి కొన్ని విషయములు అడిగి తెలుసుకొనవలెనని కోరిక కలుగుచున్నది. మీరు ఏయే పుణ్య భూములు చూచినారు. మీకు నచ్చిన రాజ్యము లేవి? మీరు వచ్చు మార్గమున ఏయే పట్టణములు కనిపించినవి అని యతి వేషమున నున్న అర్జునుని సుభద్ర ప్రశ్నించెను.

2. కనినారా = చూచినారా? వీరాగ్రగణ్యు = వీరులలో మొదట లెక్కింపదగిన; నరుని = అర్జునుని.

**భావము:** మీరు పాండవుల రాజధాని అయిన ఇంద్రప్రస్థము చూచినారా? వారందరూ సుఖముగా ఒక చోట నున్నారా? వీరులలో శ్రేష్ఠుడయిన అర్జునుని మీరు ఎరుగుదురా?

3. పుడికి పుచ్చుకొను = పిడికిట పట్టుకొను, నెఱ = అందమయిన; నెఱి = వంకరలు తిరిగిన; నికరంపు = అచ్చమయిన; మేను = శరీరము; కోదండ = ధనుస్సు యొక్క; గుణ = అల్లెత్రాటి; కిణ అంకములైన = కాయలను గుర్తులుకల; బవిరి = గుండ్రమైన; పన్నిదంబిడి = పందెము వేసి; డాగవచ్చు=దాగుటకువచ్చు; వెన్ను=వీపు; గరగరని వాడు = నాగరికత కలవాడు; సొబగు = చక్కదనము; పరాక్రమోపార్జునుండు = పరాక్రమమందు కార్తవీర్యార్జునునితో సమానమైన వాడు.

**భావము:** ఎత్తైన భుజములు కలవాడు, సింహపు నడుము వంటి నడుము కలవాడు, ఉంగరాల జుత్తు కలవాడు; నీలమణుల కాంతిని బోలు శరీర ఛాయ కలవాడు; విశాలనేత్రుడు, వింటి అల్లెత్రాటి దెబ్బలవల్ల కాయలు కాచిన ముంజేతులు కలవాడు, విశాలమైన వీపు భాగమున మచ్చయున్నవాడు, నవ్వు మొగముకలవాడు, చూడచక్కనివాడు, పరాక్రమంలో కార్తవీర్యార్జునుని వంటి వాడయిన అర్జునుడు నాకు మేనత్తకొడుకు అని సుభద్ర యతితో పలికెను.

4. అడరింప = చేయుటకు; తడవు = చాలా కాలము; పదంపడి = ఆ వెనుక; ఎన్నటు = ఎప్పుడైనా; అందందు = ఆయాస్థలముల; అరుగన్ = పోయినపుడు; నరున్ = అర్జునుని; కానరుగా = చూడలేదా?

**భావము :** అర్జునుడు భూప్రదక్షిణ చేయుటకు వెళ్ళి చాలా కాలమయినది. మీరు తిరిగిన పుణ్యస్థలములలో ఎప్పుడునూ అర్జునుని చూచి యుండలేదా?

5. సమస్త భూములున్ = అన్ని ప్రదేశాలు; కావించునెడ = చేయుచున్న సమయమున; సంక్రందన = ఇంద్రుని యొక్క; నందనుని = కుమారుడైన (అర్జునుని) ముదము = సంతోషము; చెన్నొందన్ = అతిశయించగా.

**భావము :** భూమిపైగల ప్రదేశములన్నిటిని చూచితిమి. తీర్థయాత్ర చేయునపుడు ఇంద్రుని కుమారుడయిన అర్జునుని చూచినాము అని యతీశ్వరుడు చెప్పగా సంతోషము మనస్సంతా వ్యాపించుచుండగా సుభద్ర.

6. ఇక్కువ = ఉనికి; నిక్కువ మానె = నిజమౌనా; ఈరిక లీరిక లెత్త = కోరికల అంకురాలు మొలకెత్తగా; ఒచ్చెము లేని = లోపము లేని; బీరము = పరాక్రమము; పచ్చని వింటివాడు = మన్మథుడు; పైదలిపై = సుభద్రపై; తలిరాకు = చిగురాకు; కైదువు = కత్తి, ఆయుధము.

**భావము :** విజయుని నిజముగా చూచినారా? ఇక్కడికి రాడా అనుచు తన మనస్సున అతనిని చూడవలెనన్న కోరిక అతిశయింపగా యతిని ప్రశ్నించెను. అర్జునుని చూడవలెనని తహతహలాడుచున్న సుభద్రపై ప్రయోగించుటకు మన్మథుడు చిగురాకు కత్తులు నూరసాగెను.

7. కోమలి = సుభద్ర; మది తగుల్పడన్ = మనసు తెలియునట్లు; గ్రామణి సూనుడు = దేవతల ప్రభువగు ఇంద్రుని కుమారుడు; ఇంచుక = కొంచము.

**భావము :** అర్జునుని చూడవలెనన్న తన మనస్సులోని కోరిక తెలియునట్లుగా సుభద్ర పలికిన మాటలు విని యతి ఆమెతో ''మీరు అర్జునుని ఎచ్చట చూచితిరి అని అంటివి, చూచుటయేకాదు ఆయనే నేను, నేనే అర్జునుడు అన్నంత అభేదంగా ఉన్నాము అని నవ్వుతూ సుభద్రతో పలికెను.

## III వినండి - చర్చించండి - రాయండి.

### అ) ఒకటి - రెండు వాక్యములలో జవాబులు రాయండి.

1. సుభద్ర తెలిసికొనదలచిన విషయం.
2. అర్జునుని వర్ణిస్తూ సుభద్ర చెప్పిన ఏవేని రెండు లక్షణములు.
3. అర్జునుని మీరెచటనయినా చూశారా అని సుభద్ర యతిని ప్రశ్నించుటకు కారణం –
4. ''ఆయనే మేమయి వున్నవారము'' – అని యతి పలుకుటలోని ఆంతర్యము –

ఆ) ఐదు లేక ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.

1. అర్జునుని సుభద్ర వర్ణించిన తీరు.
2. సుభద్ర ఆత్మతను గ్రహించిన యతి అర్జునుని గురించి తెలిపిన విధం.
3. ''మన్మథుడు చిగురాకు కత్తులను నూరసాగెను'' – అనుటలోని అంతరార్థం.

ఇ) ఎవరు ఎవరితో అనిరి :

1. ''యేయే పురము లనంబడియె మీ కందందు మార్గంబునన్.'' [ ] → [ ]
2. ''వీరాగ్రగణ్యునరు నెఱుఁగుదురా'' [ ] → [ ]
3. ''కనుగొని నారము సంక్రందన నందను'' [ ] → [ ]
4. ''మీరందందు నరుగ నరుఁగానరు గా.'' [ ] → [ ]

ఈ) కింది వానిలోని తప్పొప్పులను గుర్తించుము.

1. మెఱుగు, జామన చాయ కనుల వాడు. (      )
2. వాని మేనత్త భర్త కావలయునాకు. (      )
3. అర్జునుండు పరాక్రమోపార్జునుండు. (      )
4. సమస్త భూములు వినినారము. (      )
5. మరెచట వినిరొయంటివి. (      )

IV స్వీయ వ్యక్తీకరణ :

1. యతి సుభద్రతో తానే అర్జునుడనని అన్యాపదేశంగా చెప్పిన సందర్భాన్ని మీ సొంతమాటల్లో తెలపండి.
2. సుభద్ర అర్జునుని గూర్చి ప్రశ్నించిన విధము.

V భాషావగాహన :

అ) సంధులను అడిగిన విధంగా రాయండి.

| | పదము | విడదీయుట | సంధిపేరు |
|---|---|---|---|
| 1. | వారందరు | | |
| 2. | వీరాగ్రగణ్యుడు | | |
| 3. | నిక్కువ మౌనె | | |
| 4. | ఇచ్చటికంచు | | |
| 5. | మేమయి | | |

**ఆ) సరియైన సమాస నామమును గుర్తించి రాయండి.**

1. మృగరాజు — సప్తమీ తత్పురుష / షష్ఠీ తత్పురుష
2. పుణ్యస్థలము — విశేషణ పూర్వపద కర్మధారయము / తృతీయా తత్పురుష
3. భూప్రదక్షిణ — చతుర్థీతత్పురుష / షష్ఠీ తత్పురుష
4. గొప్పకన్నులు — చతుర్థీ తత్పురుష / విశేషణ పూర్వపద కర్మధారయము

**ఇ) కింది పద్యపాదములందలి అలంకారములను గుర్తించండి.**

1) ''గరగరని వాడు, నవ్వు మొగంబు వాడు.
చూడగలవాడు, మేలైన సొబగువాడు. [ ]
2) మీరందరందు నరుగ నరుఁగానరుగా? [ ]
3) కనుగొనినారము సంక్రందన నందను. [ ]

**VI సృజనాత్మకత :**

1) అర్జునుడు 'భూప్రదక్షిణకై వెళ్ళిన కారణమును తెలిసికొనండి (అంతర్జాలము ద్వారా)
2) అర్జునుడు తానే యతిరూపంలో వచ్చినట్లు అన్యాపదేశంగా ఎందుకు తెలిపినది తెలిసికొనండి.
3) అర్జునుడు యతిరూపంలో వచ్చుటకు కారణం గ్రహించండి.
4) అర్జునుడు ఇంద్రనందను డెట్లయ్యెనో గురువులద్వారా గ్రహించండి.

**VII గ్రంథాలయ సమయం :**

గ్రంథాలయంలో మహాభారత కథలను చదవండి. మీకు నచ్చిన ఘట్టాలను నాటకరూపంలో రాయండి. వార్షికోత్సవంలో ప్రదర్శించండి.

## భాషాక్రీడ

### భారతంలోని పాత్రలు

- ధర్మానికి ప్రతిరూపమైనవాడు
  ___ ర్మ ___ ___
- పాండవ మధ్యముడు
  అ ___ ___ ___
- దేవకీ వసుదేవుల సుతుడు
  ___ ___ ష్ణ ___
- దానగుణంలో అనుపమానుడు
  ___ ర్ణ ___
- పద్మవ్యూహంలోకి ప్రవేశించిన వీరుడు
  ___ ___ మ ___ డు
- ద్రుపదుని కుమార్తె
  ___ ప ___

## కృత్యం

**కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలు చేయండి.**

1. కింది పద్యపాదములను జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) గరగరని వాఁడు | అ) మేలైన సొబగు వాడు. |
| 2) వాని మేనత్త కొడుకు | ఆ) పరాక్రమోపార్జునుండు |
| 3) చూడగలవాడు | ఇ) నవ్వు మొగంబు వాడు |
| 4) అర్జునుండు | ఈ) కావలయు నాకు. |

''ఎగు బుజంబులవాడు .....

..... పరాక్రమో పార్జునుండు'' అను సీసపద్యం.

2) అ) i) పైన ఇచ్చిన పద్యంలోని మొదటి నాలుగు పాదములలోని కవితాసౌందర్యమును వర్ణించండి.

ii) సీసం కింది గీత పద్యములోని కవితా సౌందర్యాన్ని వివరించండి.

ఆ) పై పద్యంలో అర్జునుని వర్ణిస్తూ కవి ప్రయోగించిన

i) అలంకార రచనద్వారా మీరు పొందిన రసాస్వాదనను వివరించండి.

ii) సుభద్ర అర్జునుని రూపాన్ని వర్ణించుటలోని ఔచిత్యము.

**అర్థాంతరన్యాసాలంకారం:**


సామాన్యాన్ని విశేషం చేతగాని, విశేషాన్ని సామాన్యం చేతగాని సమర్థించి చెబితే అర్థాంతరన్యాసాలంకారం అందురు.

ఉదా.: 1. ఆంజనేయుడు సముద్రమును లంఘించెను.
మహాత్ములకు సాధ్యంకాని కార్యం ఉంటుందా?

2. గొప్పవస్తువుతో కూడియుండుట వలన స్వల్ప వస్తువు కూడ గౌరవము పొందును.
పూలతో కూడియుండుట వలన దారముకూడ శిరస్సున ధరింపబడుచున్నది కదా!

**నేనివి గ్రహించా :**

1. అలంకార ప్రయోగం వల్ల పద్యరచన వర్ణనల్లో ఏర్పడిన సౌందర్యం.
2. పదాల విరుపుల్లో వచ్చే అర్థ భేదం, దానివల్ల పద్యరచనలో ఏర్పడే ఆలంకారికత.



# 5. పక్షి-వరిపొలము

**ఉన్ముఖం:**

ఇతరుల మీద పెట్టుకున్న నమ్మకం సడలిపోవచ్చు. మనల్ని మనం నమ్ముకుంటే ఆ పనికి తిరుగేలేదు. అందుకే ఆంగ్లంలో self help is the best help అనీ A helping hand is at the end of your own Arm అంటారు. ప్రయత్నిస్తే నీకు సహాయపడే చేతులు నీవద్దే ఉన్నాయి. దీనిని గురించి తరగతిలో చర్చించండి. ఈ విషయంలో మీ స్వీయ అనుభవాన్ని మీ కుటుంబ సభ్యుల/స్నేహితుల అనుభవాలని పంచుకోండి. ఈ విషయానికి ప్రస్తుత పాఠానికి గల సంబంధాన్ని గమనించండి.



తే. ఊరివెలుపల, నొక సెలయేఱుదరిని
పండఁబాఱిన పొలమందు, పక్షి యొకటి
గూటిలోఁ దాను పిల్లలు గూడిమాడి
కాపురము చేయుచుండె సౌఖ్యంబు మీఱ. 1

తే. చంచువుల గింజ లిరికించికొంచు పక్షి
ప్రేమతో కందువులఁ దినిపించుచుండె;
అపుడె మొలచిన ఱెక్క లల్లార్చికొనుచు
కొదమపులుఁగులు కిలకిల కూయుచుండె. 2

తే. అంత నచటికి పొలముకాఁ పరుగుదెంచి,
తనదుపుత్రునితో నిట్టులనియె; ''కుఱ్ఱ!
పండెపొల మెల్ల, నిఁక తడ వుండరాదు,
కాపు లందఱఁ బిలిపింతు రేపె కోయ.'' 3



తే. ''అమ్మ! వింటివె పొలముకా పన్నమాట?
నిలువవచ్చునె మన మిందు నిముసమైన?
ప్రొద్దుపుచ్చితి మిన్నాళ్లు ముదము మీఱ,
ఎందు బోవుదు మక్కటా! ఇప్పుడింక?'' 4

తే. అనుచు పిల్లలు వచియింప, అనియె తల్లి;
''ఇందె యుందము, అప్పుడే తొందరేల?
రేపె జరుగవు కోతలు, కాఁపువాఁడు
ఒరులసాయ మపేక్షించియుండెఁ గాన.''' 5

తే. కడచె కొన్నాళ్లు; మరల నాకాఁపువాఁడు
పొలమునకు వచ్చి వచియించె పుత్రుతోడ:
''ఒరులపైఁ బెట్టి మన మింక నుండఁదగునె?
నేఁడె కోతము స్వయముగ నీవు నేనె.'' 6

తే. అంత పిల్లలతో నిట్టులనియె తల్లి;
''గడియ యైనను మన మింక తడయరాదు;
పరులసాయంబు లేకయె స్వయముగానె
కార్య మొనరింప సమకట్టె కాఁపువాఁడు. 7

తే. ''రమ్య మగు నొక్కపద్మాకరంబుపొంత
గూడు కట్టితి నొక చెట్టుకొమ్మమీఁద;
హాయిగా నందు సకలసౌఖ్యములతోడ
నుంద మెప్పుడు నాముద్దుకందులార!'' 8





**కవి పరిచయం : కీ.శే. నాళం కృష్ణారావు** గారు 1881 జనవరి 18వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో లక్ష్మమ్మ, కామరాజు అను పుణ్యదంపతులకు జన్మించారు. వీరికి 'బాలసాహిత్యబ్రహ్మ, మధురకవి, తెలుగు వైతాళికుడు' మొదలగు బిరుదులు కలవు. గోరుముద్దలు, మీగడతరకలు, తేనెచినుకులు, పాలతరగలు మొదలగునవి వీరి ఇతర రచనలు. ప్రస్తుత పాఠ్యభాగం ''మీగడతరకలు'' నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1. పొలంలో చేసే పనులు.
2. పల్లెలు – పంట పొలాలు.
3. పక్షుల వలన పంటకు కలుగు నష్టము.

## II ఆలోచించండి - రాయండి.

### పదజాలం పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.

1. వెలుపల = బయట; సెలయేఱుదరికి = సెలయేఱు ఒడ్డున; గూడిమాడి = కలిసి; సౌఖ్యంబు = సుఖము.

   **భావము :** ఊరి బయట సెలయేఱు పక్కన పచ్చగా పండిన ఒక వరిపొలములో పక్షి బయట గూడు కట్టుకొని తన పిల్లలతో కలిసి సంతోషముగా, సుఖముగా జీవించుచుండెను.

2. చంచువు = ముక్కు; కందువులు = పిల్లలు; అపుడే మొలచిన = అప్పుడేవచ్చిన; కొదమవులుగులు = చిన్న పక్షులు.

   **భావము:** తల్లిపక్షి తన ముక్కున గింజలు నింపుకొని ప్రేమతో తన పిల్లలకు తినిపించుచుండెను. అప్పుడప్పుడే వస్తున్న తమ రెక్కలను సంతోషముతో ఊపుతూ ఆపక్షి పిల్లలు కిలకిలమని శబ్దం చేయుచుండెను.

3. కాపు+అరుదెంచి = కాపు వచ్చి; పుత్రునితో = కుమారునితో; కుఱ్ఱ=బిడ్డా, అబ్బాయి; పొలమెల్ల = పొలమంతా; తడవు = సమయం, ఆలస్యం; పిలిపింతు = పిలిపిస్తాను.

   **భావము:** ఆ పొలము యజమాని అక్కడికి వచ్చి తన కుమారునితో ''బాబూ మన పొలమంతా మంచిగా పండి, కోతకు సిద్ధంగా ఉంది. మనం ఇక ఆలస్యం చెయ్యకూడదు. కూలీలను పిలిపించి రేపే పంటను కోయిద్దాం''. అనెను.

4. ప్రొద్దు పుచ్చితిమి = కాలము గడిపితిమి; ముదముమీఱ = ఆనందము పొంగగా.

   **భావము :** పక్షిపిల్లలు తల్లిపక్షితో ''అమ్మా పొలము ఆసామి ఏమి అన్నాడో వింటివా? మనము ఇంకా ఇక్కడే ఉండవచ్చా? మనకే ప్రమాదం రాదా? ఇన్నాళ్ళు మనము ఇక్కడ ఆనందంతో కాలం గడిపేశాము. ఇప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? అని పలికినవి.

5. వచియింప = చెప్పగా/పలుకగా; తొందర= వేగిరపాటు; ఒరుల = ఇతరుల; అపేక్షించి = ఆశించి, కోరి; కాన = కావున.

   **భావము :** తన పిల్లలు భయంతో చెప్పిన మాటలు విని, ఇక్కడే ఉందాం. భయమేమి లేదు. తొందర పడవలసిన అవసరం లేదు. రేపే కోతలు జరుగవు. కాపువాడు ఇతరుల సహాయంను కోరుతున్నాడు (ఇతరులపై ఆధారపడినచో పనులు సకాలంలో జరుగవని భావం) కాబట్టి ఇక్కడే వుందాం అని తల్లిపక్షి సమాధానపరిచెను.

6. కొన్నాళ్ళు = కొన్ని దినములు; పుత్రుడు = కుమారుడు, కొడుకు; ఉండదగునే = ఉండవచ్చా? స్వయముగా = సొంతముగా.

   **భావము :** కొన్ని దినములు అయిన తర్వాత ఒకనాడు రైతు మళ్ళీ పొలము వచ్చాడు. తన కుమారునితో, ఇప్పటికే కోతలకు ఆలస్యం అయింది. ఇతరులపై (పరులపై) ఆధారపడక మనం ఈ పనిని, ఇప్పుడే నువ్వు, నేను కలిసి చేసుకుందామనెను.

7. ఇట్టుల = ఈవిధంగా; తడయరాదు = ఆలస్యం చేయరాదు; ఒనరింప = చేయు; సమకట్టే = సంకల్పించి, నిర్ణయం తీసుకొనెను.

   **భావము :** రైతు మాటలు విన్న తల్లి, తనపిల్లలతో మనమింక ఆలస్యం చేయరాదు. రైతు ఇతరులపై ఆధారపడకుండా తానే స్వయంగా చేద్దాం అన్నాడు. (ఆ మాటలు పక్షిలో భయాన్ని కల్పించాయి.)

8. రమ్యమైన = మనోహరమైన, అందమైన; పద్మాకరంబు = పద్మములున్న సెలయేరు, చెరువు; పొంత = దగ్గర; సకల = అన్నిరకముల; సౌఖ్యములు = సుఖములతో; కందులారా = బిడ్డలారా, శిశువులారా.

**భావము:** అందంగా, మనోహరంగా ఉన్న ఒక తామరపూవులున్న కొలను ప్రక్కనున్న చెట్టుకొమ్మపై గూడు కట్టాను. ఇక ఎప్పటికి, ఎల్లప్పటికి మనం సంతోషముగా అన్ని సుఖాలు అనుభవిస్తూ ఉందాం అని తల్లిపక్షి తన పిల్లలకు చెప్పి భయం పోగొట్టి సంతోష పరిచింది.

## III అ) కింది వాటికి ఒక వాక్యములో జవాబులు రాయండి.

1. పక్షి తన పిల్లలతో ఎచట జీవించుచున్నది?
2. కాపువాని మాటలు విన్న పక్షి పిల్లలు తల్లితో ఏమన్నాయి?
3. తల్లిపక్షి వేరే గూడు ఎందుకు కట్టవలసి వచ్చెను?

## ఆ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యములలో జవాబులు రాయండి.

1. పొలముకాపు తన పుత్రునితో పలికినది.
2. పక్షి తన బిడ్డల ఆందోళన తొలగించుటకు చెప్పిన మాటలు.
3. పక్షి కొత్తగూడు గురించి తన బిడ్డలతో పలికినది.
4. పక్షి వెంటనే వెళ్ళిపోవలెనని పిల్లలతో చెప్పుటకు కారణం.

## ఇ) ఎవరు, ఎవరితో పలికిరి.

1. ''కుఱ్ఱ! పండె పొలమెల్ల నిక తడవుండరాదు.'' ______ → ______
2. ''నిలువవచ్చునే మనమిందు నిముషమైన?'' ______ → ______
3. ''రేపే జరుగవు కోతలు'' ______ → ______
4. ''ఒరులపై పెట్టి మనమింక నుండ దగునే'' ______ → ______
5. ''కార్యమొనరింప సమకట్టె కాపువాడు.'' ______ → ______

## ఈ) కింది గేయ పాదాలను జతపరచండి.

| ''క'' వర్గము | ''చ'' వర్గము |
|---|---|
| 1. చంచువుల గింజలిరికించికొంచు పక్షి | అ) ఎందుబోవుదుమక్కటా! ఇప్పుడింక |
| 2. అపుడెమొలచిన ఱెక్కలల్లార్చుకొనుచు | ఆ) ప్రేమతో కందువుల దినిపించుచుండె |
| 3. ప్రొద్దు పుచ్చితిమిన్నాళ్ళు ముదము మీఱ | ఇ) కార్యమొనరింప సమకట్టె కాపువాడు. |
| 4. పరుల సాయంబు లేకయే స్వయముగానె | ఈ) కొదమ పులుగులు కిలకిల కూయుచుండె |

## ఉ) కవితా సౌందర్యాన్ని వ్యక్తీకరించండి.

''అమ్మ! వింటివె పొలముకా పన్నమాట ......

........ ఎందుబోవుదు మక్కటా! ఇప్పుడింక.''

ఊ) కింది పద్యమును చదివి మీరు పొందిన రసాస్వాదనను వ్యక్తీకరించండి.

"అంత పిల్లలతో నిట్టులనియె తల్లి ......

......... కార్యమొనరింప సమకట్టె కాపువాడు."

## IV స్వీయవ్యక్తీకరణ:

1. పక్షి తన పిల్లలను పోషించుటకు తీసుకున్న శ్రద్ధ మీ సొంతమాటల్లో రాయండి.
2. పొలం కోతల గురించి రైతు ఆలోచనలను మీ సొంతమాటల్లో రాయండి.

## V భాషావగాహన :

అ) కింది వాక్య భేదాలను గుర్తించి రాయండి.

(నిశ్చయార్థక వాక్యము, ప్రశ్నార్థక వాక్యము, ఆశ్చర్యార్థక వాక్యము, వ్యతిరేకార్థక వాక్యము)

1. ఎందుబోవుదు మక్కటా! ——> [ ]
2. గడియయైనను మనమింక తడయరాదు. ——> [ ]
3. ప్రొద్దు పుచ్చితిమిన్నాళ్ళు ముదము మీఱ. ——> [ ]
4. అప్పుడే తొందరేల? ——> [ ]

ఆ) కింది సంధి కార్యములు పూరించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | చేయుచుండె | = | చేయుచు + | –> | |
| 2. | | = | పక్షి + ఒకటి | –> | |
| 3. | సాయమపేక్షించి | = | | –> | ఉకార సంధి |
| 4. | | = | ప్రొద్దుపుచ్చితిమి + ఇన్నాళ్ళు | –> | |
| 5. | ఇట్టులనియె | = | | –> | అకార సంధి |
| 6. | ఇందెయుందము | = | ఇందె + ఉందము | –> | |

ఇ) కింది సమాసకార్యములు పూరించండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | | = | ఊరి యొక్క వెలుపల | –> | |
| 2. | కొదమ పులుగులు | = | | –> | విశేషణ పూర్వ పదకర్మధారయ సమాసం |
| 3. | పరులసాయంబు | = | | –> | |

ఈ) గీతగీసినవి ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1. ఊరివెలుపల నొక సెలయేఱు దరిని. [ ]
2. పండబారిన పొలమందు పక్షియొకటి [ ]

3. తనదు పుత్రునితో నిట్టులనియె. [ ]

4. పొలమునకు వచ్చి పనియించె పుత్రుతోడ [ ]

**ఉ) సొంత వాక్యములలో ఉపయోగించి రాయండి.**

1. కిలకిల, 2. సౌఖ్యం, 3. స్వయంగా, 4. హాయిగా

## VI సృజనాత్మకత :

1. ''పక్షి - వరిపొలము'' పాఠ్య సారాంశాన్ని సంభాషణ రూపంలో రాయండి.
2. కింది ఇచ్చిన అంశాల ఆధారంతో ''పర్యావరణ పరిరక్షణ'' గురించి పదివాక్యాలు రాయండి.

పర్యావరణం అనగా

↓

కాలుష్యం ఏర్పడుటకు కారణం

↓

ధ్వని కాలుష్యము, వాయుకాలుష్యము, నీటికాలుష్యము, భూకాలుష్యము

↓

నివారణోపాయాలు, దానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు

↓

జనజాగృతి - పౌరుల బాధ్యతలు

## VIII క్షేత్రసందర్శనం (Field visit)

ప్రకృతి రమ్యమైన స్థలం/పంటపొలాన్ని సందర్శించండి. అచ్చట కన్పించే పక్షులు/ప్రాణులను గమనించండి. వాటి ప్రత్యేకతలను (ఆహారం, నివాసం, ముక్కు, తల, తోక మొ. వాటి రంగు, ఆకారం) వివరాలను నోటు పుస్తకంలో నమోదు చేసుకోండి. అంతర్జాలం సహాయంతో వాటి పేర్లను తెలుసుకోండి.

**ప్రత్యక్ష అనుభవం - రైతునవుతా :**

*డిసెంబరు 23వ తేదీ 'జాతీయ రైతు దినోత్సవం' సందర్భంగా పంట పొలాలకు వెళ్ళండి. అచ్చటి వారి నుండి పొలం పనులు-పనిముట్లు మొదలగు వివరాలను తెలుసుకోండి. వారితో పాటు పనిచేసి ప్రత్యక్ష అనుభూతిని పొందండి. ఆనందించండి. మన దేశానికి వెన్నెముక అయిన రైతులను అభినందించండి. కృతజ్ఞతలు తెలపండి.*



# 6. ప్రపంచపదులు



**ఉన్ముఖం:**

కింది ప్రతిపాదనలను చదివి అర్థం చేసుకుందాం. అవి పాఠంలోని ఏ పంచపదికి సరిపోతాయో చూద్దాం.


చీమ పావురం కథలో చీమ చిన్నదైనా చేసినమేలు ఎంతో గొప్పది.

మనకేమికావాలో ఆలోచించి నిర్ణయించుకోవాలి. ఆపై ఎంపిక చేసుకోవాలి. తర్వాత ప్రశ్నించి లాభంలేదు.

తనకోపమే తనశత్రువు.

మనసామర్థ్యాలను సక్రమంగా వినియోగించుకున్నప్పుడే వాటికి సాఫల్యం.

మఱ్ఱిచెట్టు చూసి అనకు మామిడిపళ్ళేవి అని
ముళ్ళతీగ చూసి అనకు మల్లెపూలు లేవే అని
ఎంచుకున్ననాడె కాస్త ఇంగితముండాలిసుమా-
మంచుపొగలు చూసి అనకు మబ్బుకురవలేదే అని
కబురుకలలు చూసి అనకు కరువు తీరలేదే అని. 1




పక్షిరెక్కలకు మబ్బులు గొడుగులు పట్టినప్పుడే సార్థక్యం
పారేయేటికి పైరుగొంతులో పాడినప్పుడే సార్థక్యం
ఏ లక్ష్యానికి కట్టుబడక బతుకీడ్చుకుపోతే ఏంలాభం-
నేర్చిన చదువుకు జాతి జాతకం మార్చినప్పుడే సార్థక్యం
కట్టు బానిసకు సంకెళ్ళు మట్టిగరిచినప్పుడే సార్థక్యం. 2



చీకటికి చురకపెడుతుందిలే చిన్ని మిణుగురు పురుగు
మొండివానను ఆపుతుందిలే రెండు మూరల గొడుగు
మంచి ఏ కొంచెమైనా చాలు మార్పుతేవాలంటె-
దూరాన్ని చెరిపివేస్తుందిలే బారుచీమల పరుగు
పాపాన్ని కడిగివేస్తుందిలే పాలనవ్వుల నురుగు. 3





వెలిగే చూపులలో మసి పులుముతుంది ద్వేషం
కమ్మని తలపులలో కసి కలుపుతుంది ద్వేషం
ద్వేషం తలకెక్కితే వినాశం తప్పదులే-
మాటల పొదలో విషమై మసలుతుంది ద్వేషం
మనిషి గుండెలో మృగమై మరుగుతుంది ద్వేషం. 4

విజ్ఞానం వికసించదు విదేశాలు తిరిగొస్తేనే
పరిణతమతి ప్రసరించదు పురాణాలు తిరగేస్తేనే
పదునెక్కిన తపనలేక తుదిలక్ష్యం అందేదెట్లా-
పరమనీతి మొలకెత్తదు ప్రమాణాలు చెల్లిస్తేనే
అసలు లోతు చేజిక్కదు ప్రసంగాలు వల్లిస్తేనే. 5





**కవి పరిచయం : కీ.శే. డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి** గారు కరీంనగర్ జిల్లా, హనుమాజీపేట అను గ్రామంలో జులై 29, 1931లో సింగిరెడ్డి మల్లారెడ్డి, బుచ్చమ్మ అనుపుణ్యదంపతులకు జన్మించారు. ప్రముఖ ఆధునిక గేయకవి. • వక్త • వ్యాఖ్యాత • పరిశోధకులు • బహుభాషావేత్త • ప్రామాణికమైన వీరి పరిశోధన గ్రంథం ''ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు, ప్రయోగములు''.

వీరు చాలాకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యులుగా ఉన్నారు. తరువాత అధికార భాషా సంఘం అధ్యక్షులుగాను, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్స్‌లర్‌గా పని చేశారు.

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర మొదలైన కావ్యాలు నలభైకి పైగా వ్రాశారు. ''విశ్వంభర'' కావ్యానికి ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ బహుమతి అందుకున్నారు. పద్మభూషణ్ బిరుదు పొందారు. వీరు జూన్ 12, 2017న స్వర్గస్థులయ్యారు.

ఈ పాఠ్యాంశం వీరి 'ప్రపంచపదులు' కావ్యం నుంచి గ్రహించబడింది. ఈ ప్రపంచపదుల్లో మనిషిని - అతని సాధక బాధకాలను చిత్రించడమే కాకుండా మనిషి జీవితం సాఫీగా సాగటానికి తగిన పరిష్కారాలు, సూచనలు కూడా ఉన్నాయి.

## I చర్చించండి.

1. అవార్డులను ఎటువంటి సందర్భాలలో ప్రకటిస్తారు?
2. తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ అవార్డు పొందినకవులు.
3. నారాయణరెడ్డిగారి ఏ కావ్యానికి జ్ఞానపీఠ అవార్డు లభించింది.
4. ఆధునిక కవులలో పేరెన్నికగన్న కొందరు కవులను పేర్కొనండి.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### పదజాలాన్ని పెంపొందించుకుందాం - భావాన్ని తెలుసుకుందాం.

ఎంచుకొను = తలంచు, లెక్కించు; ఇంగితము = తెలివి, అభిప్రాయము; సార్థక్యము = ప్రయోజనము; మృగము = జంతువు; లక్ష్యము = కోరబడినది, గురి చేయబడిన వస్తువు.

1. మానవుడు తాను చేయదలచిన పనిని ముందుగా ఆలోచించి సరియైన నిర్ణయాన్ని తీసుకోవాలి. తీసుకున్న నిర్ణయాన్ని బట్టి ఫలితం ఆధారపడి వుంటుందని కవి సూచిస్తున్నారు. మ్రిచెట్టుకు మామిడి పళ్ళు, ముళ్ళతీగకు మల్లెపూలు ఆశించడం అవివేకం. మంచుపొగలు వర్షాన్ని కురిపించలేవు. కలలు కంటూ కూర్చుంటే కరువుతీరదు. తెలివి తేటలతో చేయవలసిన పనిని ఎంచుకుంటే ఆశించిన ఫలితం లభిస్తుంది.

2. ప్రతి మనిషి తన జీవితం సార్థకత చెందటానికి మార్గం ఏర్పరచుకోవాలి. ఆకాశమంత ఎత్తుకి ఎగరగలిగితేనే పక్షి రెక్కలకు సార్థకత. పంట పొలాలలో ప్రవహించినపుడే పారే యేరుకి సార్థకత కలుగుతుంది. మనం నేర్చిన చదువు సార్థకత పొందాలంటే అది జాతికి ఉపయోగపడాలి. తరతరాలుగా బానిసలుగా బతుకుతున్న వారికి విముక్తి లభించాలి. లక్ష్య సాధనకై ప్రయత్నిస్తూ జీవితంలో ముందడుగు వేయాలని, ఏ గమ్యము లేని వారి బ్రతుకు వ్యర్థమని కవి భావన.

3. జన జీవనంలోమార్పు రావాలంటే ప్రయత్నించి చిన్న మంచిపనైనా చేయమని కవి సూచిస్తున్నారు. మార్పురావాలని అందరూ కోరుకోవటం కంటే దానికై చిన్న ప్రయత్నాన్నైనా చేయమని చెపుతున్నారు కవి. చిన్న మిణుగురు పురుగు చీకటిని తొలగిస్తుంది. గొడుగు జడివానను ఆపటానికి ఉపకరిస్తుంది. చీమలు చిన్నవి అయినా తమ ప్రయత్నంతో దూరాన్ని చేరుకుంటాయి. మనసులోని కల్మషాన్ని మలినం లేని చిరునవ్వు తొలగిస్తుంది. అందుకే మంచి అన్నది కొంత అయినా సాధన ద్వారా మార్పును తప్పకుండా తీసుకు రాగలదని కవి భావన -

4. ద్వేషం అన్నది వినాశనానికి నాంది అవుతుంది అంటారు కవి. ద్వేషంతో నిండిన చూపు మంచిని చూడలేదు. మంచి ఆలోచనలు రాకుండా కసిని పెంచుతుంది. ద్వేషము. ద్వేషంతో రగులుతున్న మనిషి మాటలు విషతుల్యమైనవి. ద్వేషం అన్నది మానవుడిని మృగంగా మారుస్తుంది. అది వినాశానికి కారణం అవుతుంది. కనుక ద్వేషాన్ని తొలగించుకొని, మంచిని పెంచుకొమ్మని కవి ఉద్బోధిస్తున్నారు.

5. మానవుడు తన జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఏర్పరచుకోవాలి. ఆ లక్ష్య సాధనకై నిరంతరం శ్రమించాలి. లక్ష్యాన్ని సాధించాలన్న తపన అనుక్షణం అతని తలపుల్లో మెసలుతుండాలి. అప్పుడే లక్ష్యసాధన సాధ్యం అంటారు కవి. విదేశాలు తిరిగి వచ్చినంత మాత్రం చేత విజ్ఞానం లభించదు. పురాణాలు తిరగేసినంత మాత్రాన మనసుకు పరిపూర్ణత సిద్ధించదు. సూక్తులను వల్లించినంత మాత్రాన నీతిమంతుడు కాడు. ప్రసంగాలు చేసినంత మాత్రంచేత జీవితపు లోతులను చూడలేడు. దేనినైనా సాధించాలి అంటే పదునెక్కిన తపన అవసరం అని కవిభావన.

## III వినండి - చర్చించండి - రాయండి.

### అ) ఒక వాక్యంలో జవాబులు రాయండి.

1) పారేసెలయేటికి సార్థకత కలుగునదెన్నడు.

2) జడివానను ఆపుటకు ఉపయోగించుసాధనం.

3) ద్వేషం తలకెక్కితే జరుగు పరిణామం.

### ఆ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) ''ఎంచుకున్ననాడే ఇంగితముండాలి'' - వివరించండి.

2) ''మార్పు తేవాలంటే చిన్న ప్రయత్నమయినా చాలు'' అని కవి సమర్థించిన విధం.

3) లక్ష్యాన్ని సాధించటానికి కావలసింది.

## ఇ) సరియైన పదాలతో గడులను పూరించండి.

(వినాశం, ఇంగితం, బారుచీమల, జాతి, ప్రసంగాలు)

1) ఎంచుకున్ననాడె కాస్త ______ వుండాలి సుమా.

2) నేర్చిన చదువుకు ______ జాతకం మార్చినపుడే సార్థక్యం.

3) దూరాన్ని చెరిపివేస్తుందిలే ______ పరుగు.

4) ద్వేషం తలకెక్కితే ______ తప్పదులే.

5) అసలు లోతు చేజిక్కదు ______ వల్లిస్తేనే.

## ఈ) కింది గేయ పాదాలను జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) కట్టు బానిసకు సంకెళ్ళు | అ) తుదిలక్ష్యం అందేదెట్లా. |
| 2) పదునెక్కిన తపనలేక | ఆ) మబ్బు కురవలేదే అని |
| 3) కమ్మని తలపులలో | ఇ) కసి కలుపుతుంది ద్వేషం |
| 4) మంచుపోగలు చూసి అనకు | ఈ) మట్టికరచినపుడే సార్థక్యం |

## ఉ) కింది వాక్యాలలోని తప్పొప్పులను గుర్తించండి.

1. మర్రిచెట్టు చూసి అనకు రావిపళ్లేవీ అని ( )
2. ఏ లక్ష్యానికి కట్టుపడక బతుకీడ్చుకుపోతే ఏంలాభం ( )
3. మొండివానను ఆపుతుందిలే మూడు మూరల గొడుగు ( )
4. మనిషి మనసులో మృగమై మరుగుతుంది ద్వేషం. ( )

## ఊ) కింది పద్యాన్ని చదివి అందలి కవితాసౌందర్యమును వ్యక్తీకరించండి.

''మర్రిచెట్టు చూసి అనకు మామిడి పళ్ళేవి అని.....

...........................................

కబురుకలలు చూసి అనకు కరవు తీరలేదే అని.''

## ఋ) కింది పద్యాన్ని చదివి మీరు పొందిన రసాస్వాదనను వ్యక్తీకరించండి.

''వెలిగే చూపులలో మసిపులుముతుంది ద్వేషం.

...............................................

మనిషి గుండెలో మృగమై మరుగుతుంది ద్వేషం''.

## IV స్వీయవ్యక్తీకరణ :

1) ''జీవితానికి ఒక లక్ష్యం అవసరం అన్నవిషయాన్ని.'' మీ సొంతమాటల్లో వ్యక్తీకరించండి.

2) నీ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవటానికి నీవు తెచ్చిన కొన్ని మార్పులను వివరించుము.

## V భాషావగాహన :

### అ) సరియైన సంధిపేరును గుర్తించి గడిలో రాయండి.

1) పళ్ళేవి – (ఇకారసంధి, ఉకారసంధి, అకారసంధి) [ ]

2) పాడినప్పుడు – (ఉకారసంధి, అకారసంధి, ఇకారసంధి) [ ]

3) కొంచెమైన – (ఇకారసంధి, యడాగమసంధి, ఉకారసంధి) [ ]

4) అందేదెట్లా – (సరళాదేశము, యడాగమము, ఇకారసంధి) [ ]

### ఆ) పదము విడదీసి – సంధిపేరు రాయండి.

| పదము | | విడదీయుట | | సంధి పేరు |
|---|---|---|---|---|
| 1. పట్టినప్పుడు | = | | → | |
| 2. కలుపుతుంది | = | | → | |
| 3. తలకెక్కదు | = | | → | |
| 4. మొలకెత్తదు | = | | → | |

### ఇ) కింది పదాలకు పట్టికలో అడిగిన విధంగా రాయండి.

| | పదము | విగ్రహవాక్యము | సమాసనామం |
|---|---|---|---|
| 1. | మర్రిచెట్టు | | |
| 2. | | పక్షియొక్కరెక్క | |
| 3. | మొండివాన | | |
| 4. | రెండు మూరలు | | |
| 5. | | పరిణతమైనమతి | |

### ఈ) కింది పాదములలో గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులో రాయండి.

1) పారే యేటికి పైరుగొంతులో పాడినప్పుడే సార్థక్యం. [ ]

2) మొండివానను ఆపుతుందిలే. [ ]

3) మనిషి గుండెలో మృగమై మరుగుతుంది ద్వేషం. [ ]

4) కమ్మని తలపులలో కసి కలుపుతుంది. [ ]

### ఉ) కింది పాదాల్లోని అలంకారాన్ని గుర్తించి రాయండి.

1) చీకటికి చురక పెడుతుందిలే చిన్ని మిణుగురు పురుగు
మొండివానను ఆపుతుందిలే రెండు మూరల గొడుగు. [ ]

2) పరమనీతి మొలకెత్తదు ప్రమాణాలు చెల్లిస్తేనే
అసలు లోతు చేజిక్కదు ప్రసంగాలు వల్లిస్తేనే.

## VI సృజనాత్మకత :

1) గేయ రచనకు, పద్యరచనకు గల భేదము, గేయ, పద్య కవితలు చదివి గ్రహించండి.

2) సి.నా.రె గారి ప్రపంచపదులలోని సూక్తులను పోలిన వాటిని మీరు ఏయే కవుల పద్యాలలో గమనించారో తెలియజేయండి.

## నేనివి నేర్చుకున్నా :

1) జీవితానికి లక్ష్యమంటూ ఏర్పరచుకోవాలి.

2) సమాజంలో మంచి మార్పును తీసుకురావటానికి ఏ చిన్న ప్రయత్నమయినా చేయటానికి ముందడుగు వేయాలి.

3) ద్వేషం అన్నది మానవుని పతనం వైపు నడిపిస్తుంది.

## భాషాక్రీడలు

1) 1 – 2 – 3 – 4 – 5 – 6 – 7


ఆధారాలు : ఖగోళ, గణిత, జ్యోతిష్య శాస్త్రాలలో నిష్ణాతుడైన భారతీయ పండితుడు.

- 1, 6, 7 అక్షరాలు = పెళ్ళికొడుకు.
- 2, 6 అక్షరాలు = 'వస్తారు'కు వ్యతిరేకపదం
- 3, 6, 7 అక్షరాలు = శివుడు
- 2, 7 అక్షరాలు = 'వస్తాడు'కు వ్యతిరేకపదం

2) 1 – 2 – 3 – 4 – 5 – 6

ఆధారాలు : వీరి పుట్టినరోజును 'జాతీయ యువజనోత్సవంగా భారతదేశం జరుపుకుంటుంది.

- 1, 2 అక్షరాలు = దేవుణ్ణి ఇలా అంటాడు.
- 3, 6 అక్షరాలు = 'వింటాం' కు వ్యతిరేకపదం.
- 4, 5, 6 అక్షరాలు = శ్రీకృష్ణుడు ఇతని ఇంట పెరిగాడు.



# 1. దీక్ష



**ఉన్ముఖం:**

కృషితో నాస్తి దుర్భిక్షమ్. పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిది లేదు. దీనికి నిదర్శనంగా సాలీడు ద్వారా స్ఫూర్తిని పొందిన రాబర్ట్‌బ్రూస్ కథను చెప్పుకోవచ్చు.

స్కాట్‌లాండ్ రాజైన రాబర్ట్ బ్రూస్ తన రాజ్యానికి శత్రురాజుల నుండి స్వేచ్ఛ నొసగడానికి అనేక మార్లు దండెత్తి విఫలుడయ్యెను. చివరికి శత్రురాజులనుండి తప్పించుకొని పారిపోయి అడవిలోని ఒక గుహలో తలదాచుకొనెను. పట్టుదలను కోల్పోయి ఉదాసీనులైన అతడు నిర్లిప్తతతో ఉండెను. అప్పుడతడు కొంచెం కొంచెంగా జరుగుతూ తన గూటికి చేరుకోబోతూ కింద పడటం మరలా ప్రయత్నించడం, కింద పడటం ఒక్కోసారి దాదాపు చేరుకోబోతూ చటుక్కున కింద పడటం ఇలా పెక్కుమార్లు చేస్తూ చివరకి గమ్యాన్ని చేరిన సాలీడును చూసి ఇంత చిన్న కీటకం అపజయాలకు నిరాశ చెందక విజయం సాధించగా నేనెందుకు చేయగూడదని తలచి, మెల్లిగా సైన్యాన్ని కూడ గట్టుకుని ప్రయత్నించి శత్రురాజులను జయించాడు.

ఫణి పుట్టిన రోజు పార్టీ ఎంతో ఘనంగా జరుగుతోంది.

ఎన్నడూ నాకు ఇది కావాలి అని నోరు తెరిచి అడగని ఫణి వారం క్రితం తల్లిదండ్రుల దగ్గరికి వచ్చి ''ఈ స్కూలులో నాది ఆఖరి సంవత్సరం. అందుకని ఈ సారి నా స్నేహితులందరికి పార్టీ ఇద్దామనుకుంటున్నాను'' అని అడిగినప్పుడు కాదనలేకపోయారు.

మనోహర్, మృదుల దంపతుల సుపుత్రుడు ఫణి. విశాఖపట్నంలోని ఒక పేరుమోసిన స్కూలులో పదవతరగతి చదువుతున్నాడు. ఫణి 3వ తరగతిలో ఉండగా మనోహర్‌కి బదిలీ అవటంతో విశాఖపట్టణానికి మకాము మార్చడం జరిగింది.

ఫణి సహజంగా తెలివైనవాడు, ఏకసంథాగ్రాహి, చదువులో చురుకుతనంతో పాటు ప్రపంచ జ్ఞానం కూడా ఎక్కువే. స్వతహాగా మితభాషి.

మనోహర్ ఆఫీసు ప్రోజెక్ట్ పనిమీద ఒక సంవత్సరం పాటు విదేశాలకి వెళ్ళి వారం రోజులయ్యింది. తండ్రి దూరంగా వెళ్ళడంతో దిగులుగా ఉన్న ఫణిని చూసి, తనతో చెప్పకపోయినా, వాడు తండ్రి మీద బెంగ పెట్టుకున్నాడని అర్థంచేసుకుంది మృదుల. ఫణికి వాళ్ళ నాన్నగారి దగ్గర చాలా చనువు. ఇది వాడి చదువుపైన ఏం ప్రభావం చూపుతుందోనని ఆందోళన చెందసాగింది.

విదేశాలకి వెళ్ళేముందు ''మృదులా! ఫణిని జాగ్రత్తగా చూసుకో. ఈ యుక్త వయసు చాలా సున్నితమైనది. పిల్లలు ఏ మాటని ఎలా అర్థం చేసుకుంటారో, ఏ విషయం వాళ్ళని ఎలా ప్రభావితం చేస్తుందో చెప్పడం కొంచెం కష్టం. అందుకనే ఏదైనా చర్చించాల్సి వస్తే వెంటనే నాకు మెయిల్ ఇవ్వమని ఫణికి కూడా చెప్పాను.

ఎటువంటి సమస్య ఎదురైనా మనం కలిసి చర్చించుకుని పరిష్కారం ఆలోచిద్దాము. నేను నీకు అండగా ఉంటాను అన్ని సమయాలలో. అసలే ఈ సంవత్సరం వాడికి బోర్డు పరీక్షలు, ఈ సమయంలో నేను కూడా దూరంగా వెళ్ళడం నాకు కొంచెం బాధగానే ఉన్నా తప్పనిసరి. నువ్వే వాడిని అహర్నిశలు కనిపెట్టుకుని ఉండాలి, సరేనా?'' అంటూ మనోహర్ చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చాయి.

ఫణికి పదవ తరగతి ఫైనల్ పరీక్షలకు ముందు రెండు ప్రీ-ఫైనల్ పరీక్షలు ఉన్నాయి.

మొదటి విడత ప్రీ-ఫైనల్ పరీక్షలు ముగిశాయి. ఫణికి 75% మార్కులు వచ్చాయి.

స్కూలు చదువులలో ఉన్నంతకాలం పిల్లల తెలివితేటలకి కొలబద్ద పరీక్షలలో మార్కులే కనుక ఫణి మార్కులు చూసి కొంచెం దిగులు పడింది మృదుల.

**తెలివి తేటలకు కొలబద్ద పరీక్షలేనా! చర్చించండి.**

మనోహర్ దంపతులెప్పుడూ కూడా 'నీ స్నేహితులకి అంత మంచి మార్కులు వస్తున్నాయి మరి నీకెందుకు ఇంత తక్కువ వచ్చాయి?'' అంటూ కొడుకుని ఎవరితోను పోల్చలేదు.

ఒకవేళ తనకి తక్కువమార్కులు వచ్చాయని కొడుకే దిగులుపడినా ఎందుకు తక్కువ వస్తున్నాయో, ఎక్కడ తప్పు జరుగుతుందో అని నీకు నువ్వే ప్రశ్నించుకుని, తిరిగి ఆ తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకో అని మాత్రమే సలహా ఇస్తుండేవారు.

ఒక రోజు మృదుల టి.వి. పెట్టుకుని వార్తలు చూస్తుంటే తాను కూడా కూర్చున్నాడు ఫణి.

టి.వి.తో వాడి చదువుకి భంగం కలుగుతోందేమో, ఇది చెప్పటానికి మొహమాట పడుతున్నాడేమో అని సందేహించిన మృదుల ''నీకు గొడవగా ఉన్నట్లుంది కదా ఫణీ! కేబుల్ తీయించేస్తానులే'' అంది.


''వద్దమ్మా! నాకేమీ గొడవగాలేదు. నా కోసం నువ్వు ఈ ఒక్క కాలక్షేపాన్ని కూడా మానుకోవద్దు. నేను చూడను. పైగా నాకు కూడా ఎప్పుడైనా చదువులోంచి విరామం కావాలంటే వచ్చి కూర్చుని కాసేపు కాలక్షేపం కోసం చూడటానికి ఉంటుంది'' అన్నాడు తల్లితో.

అన్న మాటమీద నిలబడ్డాడు కూడా.

''అమ్మా! మా స్నేహితులందరూ లెక్కలు, హిందీ పాఠ్యాంశాలకు ట్యూషన్లకు వెళుతున్నారు'' అన్నాడు ఒకనాడు.

ఒకవేళ వాడికి కూడా ట్యూషన్లకు వెళితే బాగుంటందనిపిస్తోందా అని సందేహం కలిగి ''నువ్వు కూడా ట్యూషన్లకి వెళతానంటే చెప్పు ఏర్పాటు చేస్తాను'' జవాబుగా అంది కొడుకుతో మృదుల.

''వద్దమ్మా! ట్యూషన్లకి వెళ్ళిరావటంతోనే చాలా సమయం వృధా అవుతుంది. నేను ఇంట్లోనే చదువుకుంటాను. పాఠ్యాంశాలలో ఏమైనా సందేహాలు వస్తే



నీ సహాయం తీసుకుంటానులే'' అన్న కొడుకు మాటలలో నేను సొంతంగా చదువుకోగలను అని వాడిపైన వాడికున్న నమ్మకానికి, అవసరమైతే అమ్మ నాకు సహాయం చేయగలదు అని తన తల్లి పైన ఉన్న విశ్వాసానికి మృదుల అబ్బురపడింది.

పట్టుదలతో కష్టపడి చదివి రెండవ విడత ప్రీ-ఫైనల్ పరీక్షలలో 85% మార్కులు తెచ్చుకున్న ఫణిని చూసి మృదులకెంతో ముచ్చట వేసింది.

బోర్డు పరీక్షలు ఇంకో పదిహేను రోజుల్లోకి వచ్చాయి. ఒకరోజు ప్రొద్దున్నే లేచి చూసిన మృదులకి, ఫణి స్కేలు, పెన్సిలు ఉపయోగించి లైన్లు గీస్తూ ఒక తెల్ల కాగితంపై ఏకాగ్రతతో ఏదో వ్రాస్తుండటం కనిపించింది.

''ఏమిటో?'' అనుకుందిగానీ వాడిని అడగలేదు. తరువాత చూస్తే అది రాబోయే బోర్డు పరీక్షలకి ఏరోజు ఏ సమయానికి ఏ సబ్జెక్ట్ చదవాలి అనే విషయంపై తయారుచేసుకున్న టైమ్ - టేబుల్.

**నీ విద్యకు మరియు అభిరుచులకు సమయాన్ని ఎలాప్రణాళిక వేసుకుంటావు?**

అది తన గదిలో మంచం ఎదురుగా ఉన్న అల్మారాపై అతికించి, ఆ రోజునించి దాని ఎదురుగా మఠం వేసుకుని కూర్చుని అనుకున్న ప్రకారం చదువు మొదలు పెట్టాడు.

కొడుకు బోర్డు పరీక్షలకి చదువుతున్న పద్ధతిచూస్తే వాడు ఏదో మహత్కార్యానికి దీక్ష బూనినట్లుగా అనిపించింది మృదులకి. అలా ఆనాడు పట్టిన దీక్షని చివరి బోర్డు పరీక్షనాడు విరమించాడు ఫణి.

ఆ సంవత్సరం బోర్డు పరీక్షలలో 95% మార్కులు తెచ్చుకుని స్కూలులోనే మొదటి స్థానంలో నిలిచాడు.

స్కూలు వార్షికోత్సవం సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో ఒక ఆధ్యాత్మిక గురువు చేతులమీదుగా అవార్డు కూడా అందుకున్నాడు ఫణి.

తండ్రి మీద బెంగ ఫణి చదువుపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందో అని మృదుల కలవరపడుతున్న తరుణంలో ఆమె ఆలోచనలను తారుమారు చేస్తూ పట్టుదలగా దీక్షతో చదివి విజయం సాధించి, 'నిశ్చయించుకుంటే ఎటువంటి కష్టతరమైన పరిస్థితులను కూడా అధిగమించి విజయం సాధించగలను' అని నిరూపించిన కొడుకుని చూస్తే ఎంతో ఆనందంగా గర్వంగా అనిపించింది మృదులకి.



**రచయిత్రి పరిచయం : శ్రీమతి దినవహి సత్యవతి**గారు ఆంధ్రప్రదేశ్‌లోని గుడివాడలో 13/7/1963న పి.వి.యస్.కె. శర్మ, సీతామహాలక్ష్మి దంపతులకు జన్మించిరి. వివాహమైన తరువాత భర్తగారి ఉద్యోగరీత్యా చెన్నైలో స్థిరపడ్డారు.

వీరు అనేక కథలు, కవితలు, వ్యాసములు, పదప్రహేళికలు మొదలగునవి రచించారు. జనజాగృతి సాహితీసమాఖ్య - పలాస వారు నిర్వహించిన జాతీయస్థాయి 2016 కవితల-పోటీలలో ఉత్తమ, కవితా పురస్కారం అందుకొన్నారు. వీరు రచించిన 'చైతన్య దీపికలు' నుండి ప్రస్తుత పాఠ్యభాగం గ్రహించబడినది.

## I చర్చించండి..

1) ''చేపట్టిన పనులలో దీక్ష అవసరము''
2) ఎటువంటి సమస్య ఎదురైనా కలిసి చర్చించుకొని పరిష్కరించుకొనుట మంచిది - చర్చించండి.
3) ''నిశ్చయించుకుంటే ఎటువంటి కష్టతరమైన పరిస్థితులను కూడా అధిగమించి విజయం సాధించవచ్చును- చర్చించండి.

**II పదజాలాన్ని పెంపొందించుకుందాం.**

ఏకసంథాగ్రాహి = ఒక్కసారివిని గుర్తుంచుకునే వ్యక్తి; మితభాషి = తక్కువగా మాట్లాడేవాడు; అహర్నిశలు = పగలు, రాత్రులు; జ్ఞప్తి=జ్ఞాపకం; పునరావృతం=గతంలో జరిగిన సంఘటనలు మళ్ళీ జరగడం; మహత్కార్యం=గొప్పపని; అధిగమించు=దాటు.

**III చదవండి - ఆలోచించండి - రాయండి.**

**అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1) మృదుల ఆందోళన చెందుటకు కారణము.
2) విదేశాలకు వెళ్తూ మనోహర్ చెప్పిన మాటలు.
3) మృదుల అబ్బురపడుటకు కారణము.
4) ఫణి బోర్డుపరీక్షలకు దీక్ష బూనిన విధము.
5) మనోహర్ దంపతులు ఫణికి సలహా ఇచ్చిన విధము.

**ఆ) కింది గడులను కుండలీకరణంలో ఇచ్చిన సరియైన పదములతో పూరించండి.**

(ముచ్చట, అవార్డు, విశాఖపట్టణానికి, ప్రీ-ఫైనల్, విజయవాడ)

1) మనోహర్‌కు బదిలీ అవటంతో ☐ మకాము మార్చడం జరిగింది.
2) ఫైనల్ పరీక్షలకు ముందు రెండు ☐ పరీక్షలు ఉన్నాయి.
3) ఫణిని చూసి మృదులకెంతో ☐ వేసింది.
4) ఒక ఆధ్యాత్మిక గురువు చేతుల మీదుగా ☐ కూడా అందుకున్నాడు ఫణి.

**ఇ) ఎవరు ఎవరితో పలికిరి :**

1) ''ఈసారి నాస్నేహితులందరికి పార్టీ ఇద్దామనుకుంటున్నాను'' ☐ → ☐
2) ''నీకు గొడవగా ఉన్నట్లుంది కదా ఫణీ కేబుల్ తీయిస్తానులే'' ☐ → ☐
3) ''నాకోసం నువ్వు ఈ ఒక్క కాలక్షేపాన్ని కూడా మానుకోవద్దు'' ☐ → ☐
4) ''నువ్వుకూడా ట్యూషన్లకి వెళతానంటే చెప్పు ఏర్పాటు చేస్తాను'' ☐ → ☐

**III స్వీయవ్యక్తీకరణ :**

1) పిల్లలకు తక్కువ మార్కులు వచ్చినప్పుడు వారిని ఇతరపిల్లలతో పోల్చుట వలన కలుగు పరిణామం - సొంతమాటల్లో రాయుము.
2) 'పట్టుదలగా, దీక్షతో చదివితే విజయాన్ని సాధించవచ్చును' – వివరించండి.

**IV భాషావగాహన :**

**అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.**

1) ఫణి పుట్టినరోజు పార్టీ ఎంతో ఘనంగా జరుగుతోంది.
ఫణి → ☐ ఘనంగా → ☐

2) ఏమిటో? అనుకుందిగాని వాడిని అడగలేదు.
వాడిని → ☐ అడగలేదు → ☐

ఆ) కింది పదాలకు సంధికార్యాలు రాయండి.

| | పదము | | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|---|
| 1) | నీకెందుకు | = | + | → | |
| 2) | | = | పాఠ్య + అంశాలు | → | |
| 3) | వార్షికోత్సవం | = | + | → | |
| 4) | | = | కావాలి + అంటే | → | |

ఇ) కింది వాటికి సమాసకార్యాలను రాయండి.

| | పదము | | విగ్రహవాక్యము | | సమాసనామం |
|---|---|---|---|---|---|
| 1) | తల్లిదండ్రులు | = | | → | |
| 2) | | = | మంచివైన మార్కులు | → | |
| 3) | పాఠ్యాంశాలు | = | | → | |
| 4) | | = | పదిహేను సంఖ్యగల రోజులు | → | |

ఈ) గుర్తింపబడిన ప్రత్యయాలు ఏవిభక్తులకు చెందినవో రాయండి.

1) ఈ స్కూలులో నాది ఆఖరి సంవత్సరం.

2) ఫణి పట్టుదలతో కష్టపడి చదివాడు.

3) మా స్నేహితులు లెక్కలు హిందీ, ట్యూషన్లకు వెళుతున్నారు.

4) నువ్వే వాడిని అహర్నిశలు కనిపెట్టుకొని ఉండాలి.

ఉ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ వాచకములకు చెందినవో రాయండి.

1) మనోహర్ మృదుల దంపతుల సుపుత్రుడు ఫణి.

2) ఫణికి నాన్నగారి దగ్గర చాలా చనువు.

3) టీవీతో వాడి చదువుకు భంగం కలుగుతుందేమో.

ఊ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ వాక్యాంగాలో తెలపండి.

1) నేను నీకు అండగాఉంటాను.

2) మృదుల టీవీ పెట్టుకొని వార్తలు చూస్తున్నది.

3) ఫణి అనుకున్న ప్రకారం చదువు మొదలుపెట్టాడు.

ఋ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో రాయండి.

1) ఫణి బోర్డు పరీక్షలలో 95% మార్కులు తెచ్చుకొని, స్కూలులోనే మొదటి స్థానంలో నిలిచాడు.

2) మృదులకి ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించింది.

3) నేను ఇంట్లోనే చదువుకుంటాను.

## V సృజనాత్మకత :

మీ కళాశాల వార్షికోత్సవం ఎలాజరుపుకుంటారో సొంతవాక్యాలలో రాయండి.

## VI ప్రాజెక్టు పని:

మీరు వేసవి సెలవులలో యోగాభ్యాసం, వ్యాయామం, మీ అభిరుచులు, ఇంటిపనులు, బంధుమిత్రులకు ఉత్తరాలు/ఈ-మెయిల్ రాయుట, తోటపని, సంఘసేవ/జనజాగృతి మొదలగు పనులను ఏయే రోజులలో/సమయాలలో చేస్తారో ప్రణాళిక పట్టికను కంప్యూటర్‌లో తయారుచేయండి, ఆచరించండి.

## వ్యాకరణము

**సమాసములు :**

కర్మధారయము : విశేషణము, విశేష్యము కలిసి ఏర్పడునది కర్మధారయము.

1. విశేషణ పూర్వపద కర్మధారయము : సమాసమునందు విశేషణము పూర్వపదముగానున్నచో విశేషణ పూర్వపద కర్మధారయ మందురు.

   ఉదా. సరససల్లాపములు – సరసములైన సల్లాపములు.

2. విశేషణ ఉత్తరపద కర్మధారయము : సమాసమునందు విశేషణము రెండవ పదముగానున్నచో విశేషణ ఉత్తరపద కర్మధారయమనబడును.

   ఉదా: కపోతవృద్ధము – వృద్ధమైన కపోతము

3. విశేషణ ఉభయపద కర్మధారయము : సమాసము నందలి రెండు పదములు విశేషణములైనచో విశేషణ ఉభయపద కర్మధారయమనబడును.

   ఉదా: మృదుమధురము – మృదువును మధురమును అయినది.

4. ఉపమాన పూర్వపద కర్మధారయము : సమాసమునందు ఉపమానము మొదటి పదముగా కలది.

   ఉదా: చిగురుకేలు – చిగురు వంటి కేలు.

5. ఉపమాన ఉత్తరపద కర్మధారయము : సమాసమునందు ఉపమానము రెండవ పదముగా కలది.

   ఉదా: పాదపద్మములు – పద్మముల వంటి పాదములు.

6. సంభావనా పూర్వపద కర్మధారయము : సమాసమునందు పేరు మొదటి పదముగా నుండును.

   ఉదా: కృష్ణానది – కృష్ణ అను పేరుగల నది.

7. అవధారణ పూర్వపద కర్మధారయము (రూపక సమాసము): సమాసమునందు ఉపమాన ఉపమేయములకు అభేదము చెప్పుట.

   ఉదా: సంగీతస్రవంతి – సంగీతమనెడి స్రవంతి.

## కృత్యం

కింది గద్యమును చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.

**అ) కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరో రాయండి.**

1) ''ఫణిని జాగ్రత్తగా చూసుకో''. [ ] → [ ]

2) ''ఆ తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకో'' [ ] → [ ]

''ఫణి సహజంగా తెలివైన వాడు ...... నుండి ..... అని మాత్రమే సలహా ఇస్తుండేవారు'' .... వరకు.

**ఆ) కింది అల్లికను పూరించండి :**

ఫణి యొక్క సహజ గుణాలు


[ ] [ ]
[ ] [ ]

**ఇ) స్వీయస్పందన:**

నీ చదువు మరియు నీకు మనోల్లాసాన్ని కలిగించే మంచి అభిరుచులకు సమయాన్ని ఎలా కేటాయిస్తావో కంప్యూటర్‌లో పట్టిక తయారుచేయి.

**నేనిది గ్రహించా :**

మనము దీక్షతో పనిచేస్తే దేనియందైనను విజయం సాధించవచ్చును.



# 2 కొత్త వెలుగు

**ఉన్ముఖం:**

"Give a man a fish and feed him for a day; teach a man to fish and you feed him for a life time."


ఒక వ్యక్తికి కావలసినది ఇచ్చి సహాయపడితే అదితాత్కాలికం. కానీ అతనికి ఆవశ్యకమైనది పొందే కౌశల్యాన్ని నేర్పితే అది శాశ్వతం. అదియే ఈ ప్రసిద్ధ ఆంగ్ల సామెత అంతరార్థం. ఇదే ఇషయాన్ని కింది కథలోని మురహరి తనబావకు ఎందుకు, ఎలా చెప్పాడో చూద్దామా!

ప్రియరంజన్ నరసింహాపురానికి సర్పంచ్‌గా ఎన్నికై ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నాడు. అతని సేవలకు ప్రజలంతా ప్రశంసించేవారు. ఎవరు సహాయం అర్థించినా వెనుకాముందు ఆలోచించకుండా చేతికందిన ధనంతో ఆదుకుంటాడు. దీన్ని అలుసుగా తీసుకుని ఎవరికి ఏ అవసరం వచ్చినా ప్రియరంజన్ వద్దకు వచ్చి అయాచితంగా లాభపడి తమ పబ్బం గడుపుకునేవారు. ప్రియరంజన్ బావమరిది మురహరికి తన బావ వైఖరి నచ్చలేదు. ఒకరోజు తన బావ ప్రియరంజన్‌ను కలిసి తన అభిప్రాయం తెలియజేశాడు.

"పదిమందికి సేవచేస్తూ ఉపయోగపడాలనే నీ దృక్పథం చాలా మంచిది. అందరికీ సేవలు అందించే నీ సంకల్పం ఎంతో ఉన్నతమైనది. దీనివల్ల ప్రయోజనం శూన్యం బావా" అన్నాడు మురహరి.

"అదేంటి మురహరి. ఎవరు ఆపదలో ఉన్నా ఆదుకుంటున్నాను. దీనివల్ల వచ్చే నష్టం ఏమిటి?" ప్రశ్నించాడు ప్రియరంజన్.

'నువ్వు ఎంతకాలం ఇలా ఆర్థిక సహాయం చేయగలవు బావా! ఇలా అపాత్రదానాలు చేయడం వల్ల నీ ఆస్తిపాస్తులు కరిగిపోతే మునుముందు నువ్వు దానం చేయగలవా? నీ



ఆస్తులు కరిగిపోయి నువ్వు పేదవాడవైతే పరిస్థితేమిటి? నీవద్ద సహాయం పొందిన వారెవరూ వారికాళ్ళపై వారు నిలబడే ప్రయత్నం చేయడం లేదు. అవసరానికి నీవద్ద ఆర్థిక సహాయం పొంది పబ్బం గడుపుకుంటున్నారు. ఈ రోజు వారు పంచభక్ష్య పరమాన్నాలు భుజించడం కాదు రేపు పచ్చడి మెతుకులు తినడానికైనా వారికాళ్ళపై వారు ఆర్థికంగా ఎదగాలికదా?'' ప్రశ్నించాడు మురహరి.

**అవయవదానం, రక్తదానం, అన్నదానం, విద్యాదానం వీటి ఆవశ్యకత...**

''అయితే దీనికి పరిష్కార మార్గం ఏమిటి?'' అడిగాడు ప్రియరంజన్.

'గ్రామ ప్రజలు తమకాళ్ళపై తాము నిలబడేలా చేయాలి. దేహీ అంటూ మరొకరి ముందు చేయిచాచి సహాయం అడిగే దుస్థితి వారికి రాకూడదు. ఆడ, మగ అందరికీ బట్టలు కుట్టడం వంటివి నేర్పించి ఆర్థికంగా వారి కాళ్ళపై వారు నిలబడేలా చేయాలి. పలురకాల చేతి వృత్తుల్లో తర్ఫీదునిచ్చి ప్రతి ఒక్కరూ సంపాదనాపరులయ్యేలా చేయాలి. ఇలా చేయడం వల్ల ఎవరి జీవనభృతి వారు సంపాదించుకుని మరొకరికి భారం కారు. కాబట్టి వారికి కావలసిన పనిముట్లు ఇత్యాదివి కొనుగోలు చేయడానికి శాశ్వతమైన ప్రాతిపదికన మాత్రమే సహాయం అందించాలి. అయాచితంగా సహాయం చేస్తే అందరు సోమరిపోతులై నిత్యం సహాయం కోసం ఎదురుచూసే ప్రమాదం వుంది. ఇతరులకు సహాయం చేయడం కన్నా వారు కష్టపడి పనిచేయడానికి సహాయం చేయడం మంచిది'' అన్నాడు మురహరి.

''నేను ఇంత లోతుగా ఎప్పుడూ ఆలోచించలేదు మురహరి. నేను అందరికీ సహాయపడుతూ పుణ్యకార్యం చేస్తున్నాననుకునేవాడిని. ఈవిధంగా అపాత్రదానం చేయడం వల్ల సహాయం తీసుకునేవారికి తాత్కాలికంగా ఉపశమనం కలుగుతుంది తప్ప శాశ్వతంగా వారు జీవితంలో స్థిరపడరనేది నాకు బోధపడింది. ఇకపై అపాత్రదానాలు నిలిపివేసి మన గ్రామంలో ప్రజలంతా ఎవరి కాళ్ళపైవాళ్ళు ఆర్థికంగా ఎదిగి ఉన్నతస్థితికి చేరుకునేలా శాశ్వత పథకాలు పెట్టి, వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపుదాము. ఏఒక్కరూ మరొకరికి భారం కాకుండా ఉన్నత స్థితిలో జీవనం సాగించేలా కృషిచేసి







మన గ్రామాన్ని ఆదర్శగ్రామంగా దేశం గర్వపడే స్థాయికి తీర్చిదిద్దడానికి ఇకపై కృషిచేద్దాం'' అని చెప్పిన ప్రియరంజన్ శాశ్వత పథకాలద్వారా సేవలు అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు.

అందులో భాగంగా గ్రామ యువజన కేంద్రాన్ని స్థాపించాడు.

గ్రామములోని యువత ముందుకు వచ్చి తమ సాంకేతిక పరిజ్ఞానంతో సంపూర్ణ గ్రామీణ్ రోజ్‌గార్ యోజన, కుటీర పరిశ్రమల అభివృద్ధి పథకాలు, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మొదలగు వివిధ ప్రభుత్వ పథకాలను గురించిన సమాచారాన్ని సేకరించారు. అంతేకాకుండా ప్రత్యేకంగా స్త్రీల కొరకు మహిళా స్వయం ఉపాధి పథకాలు, ఆశా వర్కర్ల రూపంలో ఉద్యోగావకాశాలు, వెలుగు, అంగన్ వాడి మొదలగు అనేక పథకాల గురించి కూలంకషంగా తెలుసుకున్నారు. సర్పంచ్ అండతో ఈ పథకాలను ప్రవేశ పెట్టడంతో గ్రామములోని యువత మరియు స్త్రీ పురుషులకు సరిపడు వృత్తి ఉద్యోగావకాశాలు లభించాయి. గ్రామములోని ప్రజలందరు తమకాళ్ళపై తామునిలబడి తలయెత్తి సుఖంగా జీవించసాగారు. నరసింహాపురం త్వరలోనే 'ఆదర్శగ్రామం' పురస్కారాన్ని అందుకుంది.



**రచయిత పరిచయం :** తెలుగుభాషకు వెలుగు తెస్తున్న వారిలో ఒకరు బాలసాహితీరత్న **షేక్ అబ్దుల్ హకీం జానీ.** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలిలో షేక్ ఫరీద్ సాహెబ్, మహబూబ్‌బీ దంపతులకు 01-01-1963లో జన్మించారు. వీరు వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయులు, ప్రవృత్తిరీత్యా బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. బాలసాహిత్యంలో 30 పుస్తకాలు, 200 కథలు రచించారు. ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గా 1991 నుండి తెలుగు పత్రికలకు వ్యాసాలు రాయగా 1300 వ్యాసాలు ప్రచురితమై వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర, మన వీరవనితలు, సంపూర్ణ ఆంధ్రప్రదేశ్ యాత్రాదర్శిని, సుందర భారత యాత్రాదర్శిని మొదలగు గ్రంథాలు రచించారు. వీరు చేసిన కృషికిగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం వంటి ఉత్తమ పర్యాటక శాఖ జర్నలిస్ట్ పురస్కారం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పురస్కారం మొదలగు 21 పురస్కారాలు అందుకున్నారు. ప్రస్తుత పాఠ్యభాగము 'అమ్మఒడి' అను కథల సంపుటి నుండి గ్రహింపబడినది.

## I చర్చించండి.

1. ''పదిమందికి సేవచేస్తూ ఉపయోగపడాలి.
2. చేతివృత్తులు - ప్రయోజనములు.
3. ''ఎవరి కాళ్ళపై వారు నిలబడే ప్రయత్నంచేయుట మంచిది''

## II పదజాలం పెంపొందించుకుందాం:

అర్థించు = బతిమాలుకొను; అయాచితం = ఇతరులను అడగకుండా; దృక్పథం = అభిప్రాయం, ఆలోచనాసరళి; అపాత్రదానం = అనర్హుడికి ఇచ్చే దానం; జీవనభృతి = బతుకు తెరువుకు కావలసిన జీతం; పనిముట్లు = పనిచేయడానికి ఉపయోగించే సాధనాలు; ఉపశమనం = ఊరట, తగ్గడం.

## III చదవండి – ఆలోచించండి రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) ప్రియరంజన్ వైఖరి మురహరికి నచ్చకపోవుటకు కారణము.
2) మురహరి ప్రియరంజన్‌ను ప్రశ్నించిన విధము.
3) వారి కాళ్ళపై వారు ఆర్థికంగా నిలబడటానికి మురహరి సూచించిన మార్గాలు.
4) ప్రియరంజన్ తన గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి తీసుకున్న నిర్ణయం.

ఆ) కింది వాక్యాలను ఎవరు, ఎవరితో పలికిరో రాయండి.

1) ''దీనివల్ల ప్రయోజనం శూన్యం'' – [ ] → [ ]

2) ''ఎవరు ఆపదలో ఉన్నా ఆదుకుంటున్నాను''. [ ] → [ ]

3) ''గ్రామ ప్రజలు తమకాళ్ళపై తాము నిలబడేలా చేయాలి'' [ ] → [ ]

4) ''నేను ఇంతలోతుగా ఎప్పుడూ ఆలోచించలేదు'' [ ] → [ ]

ఇ) జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) ప్రియరంజన్ | అ) సంపాదన పరులయ్యేలా చేయాలి. |
| 2) మురహరి | ఆ) వారు సంపాదించుకోవాలి. |
| 3) ప్రతి ఒక్కరూ | ఇ) ప్రియరంజన్ బావమరది. |
| 4) ఎవరి జీవనభృతి | ఈ) నరసింహాపురానికి సర్పంచ్ |
| | ఉ) వారికాళ్ళపై వారు నిలబడేలాచేయాలి. |

ఈ) తప్పొప్పులను గుర్తించండి.

1) మురహరికి తనబావ వైఖరి నచ్చినది. (  )

2) మగవారికి పలురకాల చేతివృత్తుల్లో తర్ఫీదునివ్వాలి. (  )

3) నేను అందరికీ సహాయపడుతూ పుణ్యకార్యం చేస్తున్నాను. (  )

4) ప్రియరంజన్ తాత్కాలిక పథకాల ద్వారా సేవలు అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. (  )

## IV స్వీయవ్యక్తీకరణ

1) ఆపదలో నున్నవారిని మీరు ఏ విధంగా ఆదుకొంటారో మీ సొంతమాటల్లో రాయండి.

2) దానగుణంలో పేరొందిన వారిని గూర్చి మీసొంతమాటల్లో రాయండి.

3) ''ఇతరులకు సహాయం చేయడం కన్నా వారు కష్టపడి పనిచేయడానికి సహాయం చేయడం మంచిది'' – మీ అభిప్రాయం రాయండి.

## V భాషావగాహన :

అ) కింది పదాలను విడదీసి, సంధినామం రాయండి.

| | పదము | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|
| 1) | ప్రజలంతా | | → | |
| 2) | అదేంటి | | → | |
| 3) | పరిస్థితేంటి | | → | |
| 4) | పేదవాడివైతే | | → | |

## ఆ) కింది పదాలకు సమాసకార్యాలు రాయండి.

| పదము | విగ్రహవాక్యము | | సమాసనామం |
|---|---|---|---|
| 1) కష్టసుఖాలు | | → | |
| 2) | పుణ్యమైన కార్యము | → | |
| 3) పంచభక్ష్యాలు | | → | |
| 4) | కొత్తదైనవెలుగు | → | |
| 5) గ్రామప్రజలు | | → | |

## ఇ) గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) అతని సేవలకు ప్రజలంతా ప్రశంసించేవారు.

(అ) షష్ఠీవిభక్తి (ఆ) తృతీయా విభక్తి (ఇ) ప్రథమావిభక్తి

2) అతడు చేతికందిన ధనంతో ప్రజలను ఆదుకుంటాడు.

(అ) ద్వితీయా విభక్తి (ఆ) తృతీయా విభక్తి (ఇ) సప్తమీ విభక్తి

3) దీని వలన ప్రయోజనం శూన్యం.

(అ) పంచమీవిభక్తి (ఆ) చతుర్థీ విభక్తి (ఇ) తృతీయా విభక్తి

4) అపాత్రదానాలు చేయడంవల్ల ఆస్తిపాస్తులు కరిగిపోతాయి.

(అ) ద్వితీయా విభక్తి (ఆ) ప్రథమా విభక్తి (ఇ) షష్ఠీ విభక్తి

## ఈ) కింది పదాలను సొంతవాక్యాల్లో ఉపయోగించి రాయండి.

1) అయాచితంగా = ____________________

2) ప్రశంసించుట = ____________________

3) పరిష్కార మార్గం = ____________________

4) తర్ఫీదు = ____________________

## ఉ) కింది వాక్య భేదాలను గుర్తించి రాయండి.

(నిశ్చయార్థకము, ప్రశ్నార్థకము, ఆశ్చర్యార్థకము, వ్యతిరేకార్థకము)

1) దీనివల్ల వచ్చే నష్టం ఏమిటి? [ ]

2) మురహరికి తనబావ వైఖరి నచ్చలేదు. [ ]

3) అందరికీ సేవలు అందించే సంకల్పం ఎంతో ఉన్నతమైనది. [ ]

4) నువ్వు ఎంతకాలం ఇలా ఆర్థిక సహాయం చేయగలవు బావా! [ ]

## VI సృజనాత్మకత:

గ్రామోద్ధరణకు నీవు ఏవిధంగా పాటు పడ్తావో వ్యక్తం చేయుము.

### ప్రత్యక్ష అనుభవం - నైపుణ్యం గడిస్తా:

సెలవు రోజులలో మొబైల్/కంప్యూటర్/జెరాక్స్ రిపేర్ దుకాణం లేదా డి.టి.పి. దుకాణాలలో పని చేయండి. వినియోగదారులతో మాట్లాడటం, పనిచేయడం, లెక్కలు చూడటం మొదలగునవి నేర్చుకోండి.

**ద్విగు సమాసము :** సంఖ్యా వాచకము పూర్వ పదముగా గల కర్మధారయమే ద్విగువు.

ఉదా: రెండు ప్రాంతములు - రెండగు ప్రాంతములు.

మూడుబాణములు - మూడయిన బాణములు.

అష్టదిక్కులు - ఎనిమిది అయిన దిక్కులు.

సప్తఋషులు - ఏడుగురు అయిన ఋషులు.

### నేనివి గ్రహించా :

1) స్వయం ఉపాధి పథకాలను ప్రోత్సహించాలి.

2) శాశ్వత పథకాల ద్వారా సేవలు అందించడం.

3) దానం చేయడం కంటే వారి కాళ్ళపై వారు నిలబడేలా చేయుటం మంచిది.

### ఉ.సూ. :


కొన్ని రకాల చేతివృత్తులు పరిచయం చేయండి.

## భాషాక్రీడ


| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | | | |

ఆధారాలు : 'మహాప్రస్థానం' రచయిత.

- 1, 4 అక్షరాలు = మహాకవి పొట్టిపేరు.
- 6, 2 అక్షరాలు = ఏడురోజుల కాలాన్ని ఇలా అంటారు.
- 7, 3 అక్షరాలు = ½ (అర) అని అర్థం.
- 8, 9 అక్షరాలు = వస్తావుకు వ్యతిరేకం



# 3 మానసిక ఆరోగ్యం



**ఉన్ముఖం:**



**ఆరోగ్యకరమైన శరీరము + ఆరోగ్యకరమైన మనస్సు = ఆనందకరమైన జీవితం**

పై చిత్రాన్ని గమనించండి. చర్చించండి. ప్రస్తుతపాఠంతో గల సంబంధాన్ని గ్రహించండి. పాటించండి.

వ్యక్తి శారీరకంగా, దృఢంగా ఉండటమే గాక, మనస్సు కూడా దృఢంగా ఉండాలి. మనస్సు ఎప్పుడూ ప్రశాంతంగా ఉంటూ భావోద్వేగాలు అదుపులో ఉంటేనే మనిషి పూర్తి స్థాయిలో ఆరోగ్యంగా ఉన్నట్లు భావించాలి. శరీరాన్ని దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుకున్నట్లే మనస్సుని ఆరోగ్యంగా ఉంచుకోవాలి. భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవడం. సంయమనాన్ని పాటించడం గొప్ప నైపుణ్యం.

## భావోద్వేగాల నియంత్రణ వల్ల కలుగు ప్రయోజనాలు.

భావోద్వేగాలు మన నియంత్రణలో ఉన్నప్పుడు ఒత్తిడులను , అపజయాలను, సవాళ్ళను, సమస్యలను ఎదుర్కోవటంలో సహాయపడతాయి. బ్రతుకుదారిలో ఎదురయ్యే సవాళ్ళను, సమస్యలను కార్యసాధకంగా ఎదుర్కోగలం. మానసిక ఆరోగ్య పెంపుదలకు ఇటీవల ఒక తెలుగు వారపత్రికలో పాలపర్తి శ్రీకాంత్ 10 మార్గాలను సూచించాడు. ఆ మార్గాలు ఇవి.

1. ఆరోగ్యంపై దృష్టి పెట్టటం.
2. తాజా గాలిని పీల్చటం.
3. వ్యక్తిగత శ్రద్ధను పెంచుకోవటం.
4. నచ్చేలా సమయం గడపటం.
5. కొత్త పనులు తరచు ప్రారంభించటం.
6. ఒత్తిడిని అదుపు చేయటం.
7. కృతజ్ఞతతో వ్యవహరించటం.
8. అనుభూతులను, ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించటం.
9. ఒత్తిడి, ఆందోళన, అలజడి కలిగినపుడు మిత్రులను, సహచరులను సంప్రదించటం.
10. తమమీద తమకు నమ్మకం కల్గటం.

పదో లక్షణం చాలా ముఖ్యమైంది. ప్రతివ్యక్తికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. బలాలతో పాటు బలహీనతలు కూడా ప్రతివ్యక్తికీ ఉంటాయి. తమ బలాలను, బలహీనతలను మొహమాటం లేకుండా గుర్తుంచుకోవటం ముఖ్యం. బలహీనతలను గుర్తుంచుకోకపోతే జీవితంలో అపజయాలను ఎదుర్కోవలసి వస్తుంది. నేను పరిపూర్ణవ్యక్తిని అని అనుకోవటం అశాస్త్రీయం. అపజయాలను అధిగమించటానికి నిత్యం ప్రయత్నిస్తుండాలి. ఎప్పుడైతే మనం మనలో బలహీనతలు ఉంటాయని గుర్తించామో, మనం సంపూర్ణులం కాదని గుర్తించామో, అది మన మానసిక ఆరోగ్యానికి కీలకమైన ప్రాతిపదిక అవుతుంది. ఆచరణ సాధ్యమైన లక్ష్యాలను పెట్టుకోవాలి. పరిమితులు తెలుసుకోవాలి. విషయాలకు ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించుకోవాలి.

ఈ ప్రపంచంలో ఎవరూ పరిపూర్ణ జీవితాన్ని ఒత్తిడి, ఆందోళన, మనోవేదన లేకుండా గడపలేరు. దుఃఖం కలిగినపుడు, సవాళ్ళను ఎదుర్కొన్నపుడు, నిరాశ చుట్టుముట్టినపుడు, కలవరపాటు కలిగినపుడు, కోపం


చుట్టుముట్టినపుడు ఒకే ఆలోచనలో పూర్తిగా కేంద్రీకరించినపుడు, బయటికి రాలేని స్థితిలో నమ్మిన వారితో, ఆప్తులతో సంప్రదించాలి. వారు మిత్రులు కావచ్చు, తల్లితండ్రులు కావచ్చు, జీవిత భాగస్వాములు కావచ్చు, బంధువులు కావచ్చు. మరింత శాస్త్రీయమైన సహాయం కావాలంటే మానసిక వైద్యులను సంప్రదించాలి. సమయం కోరటం అశాస్త్రీయం కాదు, బలహీనత కాదు.

## ఒత్తిడిని జయించటం



ఒత్తిడిని జయించడం అసాధ్యమేమీ కాదు. జీవనశైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకుని ఒత్తిడిని అదుపులో ఉంచుకునే మార్గాలు అనేకం ఉన్నాయి. అవేంటంటే.....

## టైమ్ మేనేజ్‌మెంట్



ప్రాథమ్యాలను క్రమానుగుణంగా ఏర్పరచుకోవడంలో మనం పొరపాటు పడుతూ ఉంటాం. ఏ పని ముందు చేయాలి? ఏ పనిని వాయిదా వేయవచ్చు? ఏ పని ముఖ్యం? అనే విశ్లేషణ కొరవడి, కంగారు పడిపోతూ ఉంటాం. ఈ కంగారులో ప్రాముఖ్యంలేని పనుల కోసం సమయం వృథా చేస్తాం. ఫలితంగా ముఖ్యమైన పనులకు సమయం కేటాయించలేక ఒత్తిడికి లోనవుతాం. ఇలా అనవసర ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే పనులను ప్రాధాన్యక్రమంలో పూర్తిచేసే అలవాటు అలవరచుకోవాలి.


## ధ్యానం



మానసిక ప్రశాంతతతో ఒత్తిడిని జయించవచ్చు. ఇందుకోసం ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయాలి. ఒత్తిడి వల్ల మనం ఊపిరి తీసుకునే తీరు మారుతుంది. త్వరత్వరగా ఊపిరి పీల్చడం, వదలడం చేస్తాం. గాలిని కూడా శక్తి మేరకు లోపలికి పీల్చం. ఫలితంగా సరిపడా ఆక్సిజన్ రక్తంలో కలవదు. దాంతో పనితీరు తగ్గుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఊపిరి మీద దృష్టి పెట్టాలి. రోజులో వీలైనన్నిసార్లు గుండెనిండా ఊపిరి పీల్చుకుని వదులుతూ ఉండాలి. గాలి లోపలికి పీల్చుకున్నప్పుడు కొన్ని క్షణాలు ఆపి ఉంచి, వదలడం సాధన చేయాలి.

### ఒత్తిడిని ఎలా జయించవచ్చు.

## చిన్న చిన్న ఆనందాలు




అదేపనిగా గంటల తరబడి పనిలో మునిగి తేలడం సరికాదు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా మధ్యమధ్యలో కొన్ని నిమిషాలపాటు బ్రేక్ తీసుకోవాలి. ఆ బ్రేక్‌లో నచ్చిన వ్యక్తులతో కలిసి ఆహ్లాదంగా నవ్వుకోవాలి. నవ్వు తెప్పించే పుస్తకం తిరగేయాలి. అవేవి వీలు కాకపోతే కొన్ని నిమిషాలు నడవాలి.

## సంగీతం వినాలి



ఒత్తిడిని తొలగించే సాధనాల్లో సంగీతం ఒకటి. కాబట్టి నచ్చిన పాటలతో ప్లే లిస్ట్ తయారు చేసుకుని తీరిక వేళల్లో వినాలి. సమయం చిక్కినప్పుడల్లా ఆహ్లాదం కలిగించే పాటలు వినడం వల్ల మనసు తేలిక అవుతుంది. ఫలితంగా ఒత్తిడి వదులుతుంది.


## సామర్థ్యానికి తగ్గట్టు



ఒకేసారి రెండు పడవల మీద కాళ్లు మోపితే నిలువునా మునిగిపోతాం. అన్ని పనులూ ఒకేసారి తలకెత్తుకున్నా అదే జరుగుతుంది. మల్టీ టాస్కింగ్ చేసి హీరో అనిపించుకోవాలనే తాపత్రయంతో, ఒకేసారి ఎక్కువ పనులకు పూనుకుంటే ఒత్తిడి పెరుగుతుంది.

కాబట్టి ఏ సమయానికి ఎంతపని సమర్థవంతంగా పూర్తి చేయగలమో, ఆ స్పష్టతతో ముందుకు సాగాలి.


### వ్యాయామం



వ్యాయామంతో ఎండార్ఫిన్లు అనే ఒత్తిడిని తొలగించే హార్మోన్లు విడుదల అవుతాయి. కాబట్టి ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. వ్యాయామం వల్ల శక్తి పెరగడంతో పాటు సామర్థ్యమూ రెట్టింపవుతుంది. ఈత, పరుగు, సైక్లింగ్ లాంటి వ్యాయామాలతో గుండె కొట్టుకునే వేగం పెరగడం వల్ల చురుకుదనం కూడా పెరుగుతుంది. శారీరక దృఢత్వంతో పాటు మానసిక సాంత్వన కూడా దక్కుతుంది.

**ఆరోగ్యానికి యోగాభ్యాసం**

### నిద్ర అవసరం



సరిపడా నిద్ర పోకపోతే, మెదడు చురుకుదనం తగ్గుతుంది. దాంతో చిన్నపని కూడా కష్టంగా తోస్తుంది. ఫలితంగా ఒత్తిడి పెరుగుతుంది. ఇదే ఒత్తిడి కొనసాగితే రాత్రివేళ నిద్ర కరవవుతుంది. ఇలా ఈ స్థితి ఓ చక్రంలా కొనసాగుతుంది. కాబట్టి దీన్ని బ్రేక్ చేస్తూ రోజుకు 8 గంటల పాటు నిద్ర పోవడం అలవాటు చేసుకోవాలి.

### గ్యాడ్జెట్స్



మెసేజ్‌లు, మెయిల్స్, ఫోన్‌కాల్స్, టీవీ శబ్దాల... నుంచి కూడా అప్పుడప్పుడూ బ్రేక్ తీసుకోండి. ఎంతో కొంత సమయం టీవీ కట్టేయండి. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయండి. కంప్యూటర్ ఆపేయండి. ఆ నిశ్శబ్దంలో పరిసరాల శబ్దాలను ఆస్వాదించండి. ఒంటరితనాన్ని మనసులోకి తొంగి చూసుకోవడానికి కేటాయించండి. ఇలా అరుదుగానైనా చేస్తూ ఉండడం ఎంతో అవసరం.



**రచయిత్రి పరిచయం : డా॥ శ్రీమతి సి. శేషారత్నం**గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గొల్లపాలెం గ్రామంలో **6-10-1942**న వెంకట్రాయుడు, లక్ష్మీ బాయమ్మ అను పుణ్యదంపతులకు జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డునిచ్చి గౌరవించింది. ప్రస్తుతం పలు పత్రికలకు వ్యాస రచనలు చేస్తున్నారు.

ప్రస్తుత పాఠ్యభాగము 'తెలుగు విద్యార్థి' మాసపత్రిక నుంచి స్వీకరించబడినది.

## I చర్చించండి.

1) ''ఒత్తిడి కలిగి నప్పుడు మీరేం చేస్తారు''

2) ''ఆరోగ్యమే మహాభాగ్యము''

## II పదజాలం పెంపొందించుకుందాం.

నియంత్రణ = అదుపులో ఉంచుకొనుట; అడ్డగింత, నిరోధం; క్రియాశీలకం = నిర్దిష్టమైన కార్యక్రమాలు; సాంత్వన = ఓదార్పు; దృఢత్వం = గట్టిదనం;

## III చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) మానసిక ఆరోగ్య పెంపుదలకు పాలపర్తి శ్రీకాంత్ సూచించిన 10 మార్గాలు.

2) పరిపూర్ణ జీవితాన్ని గడపుటకు మనమెవరెవరిని సంప్రదించాలి?

3) ఒత్తిడిని జయించే మార్గాలను గూర్చి క్లుప్తంగా రాయండి.

### ఆ) కింది గడులను సరైన పదాలతో పూరించండి.

1) సమయం కోరటం [ ] కాదు, బలహీనత కాదు.

2) మానసిక [ ] తో ఒత్తిడిని జయించవచ్చు.

3) మధ్యమధ్యలో కొన్ని నిమిషాలపాటు [ ] తీసుకోవాలి.

### ఇ) కింది వాక్యాలను సరైన క్రమంలో అమర్చిరాయండి.

1) సరిపడా నిద్రలేకపోతే మెదడు చురుకుదనం తగ్గుతుంది.

2) వ్యాయామం వల్ల శక్తి పెరగడంతో పాటు సామర్థ్యమూ రెట్టింపవుతుంది.

3) ఒత్తిడి కొనసాగితే రాత్రివేళ నిద్ర కరువవుతుంది.

4) ఒంటరితనాన్ని మనసులోకి తొంగి చూసుకోవడానికి కేటాయించండి.

### ఈ) తప్పొప్పులను గుర్తించండి.

1) రోజుకు 6 గంటలపాటు నిద్రపోవటం అలవాటు చేసుకోవాలి. ( )

2) ఒకేసారి ఎక్కువ పనులకు పూనుకుంటే ఒత్తిడి పెరుగుతుంది. ( )

3) రోజుకు కొన్నిసార్లుమాత్రమే ఊపిరి పీల్చుకొని వదలుతూ ఉండాలి. ( )

4) ఆచరణ సాధ్యమైన లక్ష్యాలను పెట్టుకోవాలి. ( )

## IV స్వీయవ్యక్తీకరణ

1) మానసిక ఆరోగ్య పెంపుదలకు నీ జీవనశైలిని ఏ విధంగా మార్పు చేసికుంటావో నీ సొంతమాటల్లో రాయుము.

2) ఒత్తిడిని ఏ విధంగా అదుపు చేసుకుంటావో నీ సొంతమాటల్లో రాయుము.

3) ''ఎంతో కొంత సమయం టీ.వీ. కట్టేయండి. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయండి'' – సమర్థించండి.

## V భాషావగాహన :

**అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.**

1) అది మన మానసిక ఆరోగ్యానికి కీలకమైన ప్రాతిపదిక అవుతుంది.

2) ప్రతిరోజూ వ్యాయామం చేయాలి.

3) నవ్వు తెప్పించే పుస్తకం తిరగేయాలి.

**ఆ) కింది వాటికి సరియైన సంధికార్యాలను రాయండి.**

| | పదము | విడదీసిరాయుట | | సంధి పేరు |
|---|---|---|---|---|
| 1) | భావోద్వేగాలు | + | → | |
| 2) | | క్రమ + అనుగుణం | → | |
| 3) | ఎప్పుడైతే | + | → | |
| 4) | | చుట్టుముట్టిన + అపుడు | → | |
| 5) | అవేంటి | + | → | |

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యములు రాసి, ఏసమాసములకు చెందినవో రాయండి.**

| | పదము | విగ్రహ వాక్యము | | సమాసనామం |
|---|---|---|---|---|
| 1) | అశాస్త్రీయం | | → | |
| 2) | రెండుపడవలు | | → | |
| 3) | కొత్తపనులు | | → | |
| 4) | టీవి శబ్దము | | → | |

**ఈ) గుర్తింపబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

1) వ్యాయామం వలన శక్తి పెరగడంతోపాటు సామర్థ్యమూ రెట్టింపవుతుంది.

2) ఆ నిశ్శబ్దంలో పరిసరాల శబ్దాలను ఆస్వాదించండి.

3) ఎంతపని ఒత్తిడిలో ఉన్నా మధ్యమధ్యలో బ్రేక్ తీసుకోవాలి.

4) బయటికి రాలేని స్థితిలో ఆప్తులతో సంప్రదించాలి.

ఉ) కింది పదములను సొంతవాక్యాలలో ప్రయోగించండి.

1) కృతజ్ఞత, 2) అధిగమించుట, 3) రెట్టింపవుట, 4) దృఢత్వం, 5) ప్రాధాన్యత, 6) జీవనశైలి

ఊ) కింది వాక్యములు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్తములలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.


1) సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేయండి.

2) తమ బలాలను, బలహీనతలను మొహమాటం లేకుండా గుర్తుంచుకోవటం ముఖ్యం.


3) జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకొని, ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి.

**V** కింది అల్లికలను పూరించండి.


1)




2)




3)




**VI** సృజనాత్మకత :

ఉచిత యోగాభ్యాసం/ధ్యాన శిబిరాలలో మీ పేరు నమోదు చేసుకోండి. క్రమంతప్పకుండా హాజరుకండి.

**ఉపమాలంకారం** : ఉపమాన, ఉపమేయాలకు పోలికను చెప్పుటను ఉపమాలంకారము అందురు. ఇందు నాలుగు భాగాలుండును.

**ఉపమానం** : పోలికకై స్వీకరించిన వస్తువు

**ఉపమేయం** : పోల్చదగిన వస్తువు

**ఉపమావాచకం** : వలె

**సమానధర్మం** : ఉపమాన, ఉపమేయాల మధ్యనుండు పోలిక.

ఉదా: భూమి బంతి వలెనున్నది.

ఇందు వర్ణించ దలచిన వస్తువు ''భూమి'' కనుక ఇది ఉపమేయం. పోలికకై స్వీకరించిన వస్తువు 'బంతి', కనుక 'బంతి' ఉపమానం.

ఈ రెండింటి మధ్య ఉన్న సమానమైన ధర్మము 'గుండ్రంగా వుండుట, తిరుగుట' కావున భూమిని బంతితో పోల్చుట జరిగినది. దీనినే **ఉపమాలంకారం** అందురు.

ఇటువంటివే –

"అక్షరములు ముత్యముల వలె నున్నవి"

"కన్నులు కలువల వలె నున్నవి" మొదలగునవి.

**స్వభావోక్తి అలంకారం :**

జాతి, గుణ, ధర్మ, క్రియాదుల స్వభావమును ఉన్నది ఉన్నట్లుగా వర్ణించి చెబితే దానిని స్వభావోక్తి అలంకారం అందురు.

**ఉదా: ఆ వనము నందలి లేళ్ళు రిక్కించిన చెవులతో, బెదురు చూపులతో, చెంగు చెంగున నటునిటు గెంతులు వేయుచున్నవి.**


### ప్రత్యక్ష అనుభవం – షెఫ్/యోగాశిక్షణ

కుటుంబ సంక్షేమం దృష్ట్యా మీ వంతు బాధ్యతగా కొన్ని పనులు చేయండి.

- స్వయంగా బజారుకు వెళ్ళి వస్తువులు కొనండి.
- ఆరోగ్య కరమైన ఒక మంచి సలాడ్ లేదా ఆహార పదార్థాన్ని తయారు చేసి కుటుంబ సభ్యులకు వడ్డించండి.
- ప్రతిరోజు కుటుంబ సభ్యులందరిని ప్రోత్సహించి నడుచుట, యోగాభ్యాసం చేయించండి.

### నేనివి గ్రహించా :

1) ఒత్తిడిని అదుపుచేయడం.
2) ఆరోగ్యంపై దృష్టి పెట్టడం.
3) మానసిక ఆరోగ్య పెంపుదలకు అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవడం.



# 4. శ్రీకారం



**ఉన్ముఖం:**

- నీ మాతృభాష ఏమిటి?
- మీరు ఇంట్లో తెలుగులోనే మాట్లాడతారా?
- నువ్వు దూరదర్శినిలో చూసే తెలుగు కార్యక్రమాలేంటి!
- తెలుగు పద్యతోరణం 'కార్యక్రమం ఎప్పుడైనా చూశావా?
- మాతృభాషా ప్రాముఖ్యతను వికాస్ ఏ విధంగా గ్రహించాడో ఈ పాఠం ద్వారా తెలుసుకుందామా!

''సాబ్ రూపియే దేదో సాబ్''

''మీటరెంతయింది?''

''మీటరు యాభై రుపాల్, పది రూపాల్ లగేజ్''

''రైల్వే స్టేషన్నుంచి ఇరవై రూపాయలకంటే ఎక్వ కాకూడదు. యాభై రూపాయలెలా అయింది. అసలు మీటరు సరిగా పని చేస్తుందా?''

''మీటరు బరాబరున్నది. జల్ది పైసే నికాలోజీ, ఇస్కులు పోరగండ్లను ఇడువనీకి పోవాలె'' గొడవెందుకని అరవై రూపాయలు ఇచ్చేశాడు వికాస్.

''ఇక మీదట జాగ్రత్తగా ఉంటే సరి'' అనుకున్నాడు. ఆటోవాడి పంట పండింది. పొద్దున్నే మంచి బేరం దొరికింది.

వికాస్ అనబడే జగన్నాథ్, ముంబయ్ నుంచి హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చి నాంపల్లి స్టేషన్లో దిగాడు. హైదరాబాద్‌కు కొత్త అని తేలిగ్గానే గుర్తుబట్టిన ఆటో డ్రైవర్ వికాస్‌కి హైదరాబాద్ సందర్శనం చేయించి ''ఇమ్లీబన్'' బస్టాండ్‌లో దించాడు. ఆదిలోనే హైదరాబాద్ చురక తగిలింది వికాస్‌కి. ఎంక్వైరీ కౌంటర్‌వైపు నడిచాడు వికాస్.

''నిర్మల్ బస్ ఎన్ని గంటలకు ఉందండీ?''

''అక్కడ అంత పెద్ద బోర్డు పెయింట్ చేసి పెట్టాం చూసుకోరాదూ? చదువొచ్చినవాడూ, రానివాడూ అందరూ వచ్చి మా ప్రాణాలు తీస్తారు. ప్రతివాడికీ అన్నీ రెడిమేడ్‌గా కావాలి. తాము మాత్రం శ్రమ తీసుకోరు'' రుసరుసలాడుతూ అన్నాడు కౌంటర్లో కూర్చుని తీరిగ్గా టిఫిన్ చేస్తున్న క్లర్కు.

**రైలు, బస్సు, విమాన ప్రదేశాల్లోని యాత్రా సూచనల గూర్చి రాయండి. వానిలోని వ్యత్యాసాలను గమనించండి.**

టిఫిన్ చూడగానే ఆకలి తెలిసి వచ్చింది. క్రితం రాత్రి రైల్లో సరిగ్గా భోజనం చేయలేదు. క్యాంటీన్ వైపు నడిచాడు వికాస్.

టిఫిన్ చేస్తూ ఎదురుగా కూర్చున్నతనితో...

''ఏమండి నిర్మల్ బస్సులెప్పుడుంటాయా? అవి ఎక్కడి నుండి బయలుదేరుతాయి?

''ప్రతి అరగంటకో బస్సుంటుంది బాబూ. ప్లాట్‌ఫాం నెంబరు అక్కడ బోర్డు చూస్తే తెలుస్తుంది.''


''ఈయన కూడా బోర్డు గురించే మాట్లాడుతున్నాడు బాబోయ్' అనుకుంటూ నిట్టూర్చాడు వికాస్.

నిజానికి వికాస్ ఆ బోర్డును చూశాడు. తను బి.కాం. సెకండియర్ చదువుతున్నా, ఆ బోర్డును మాత్రం చదవలేకపోయాడు. అది తెలుగులో ఉంది!

బస్టాండ్ ప్లాట్‌ఫారాలపై చూస్తే? షరా మామూలే! అంతా అయోమయం! అన్ని బోర్డులూ తెలుగులోనే. బస్సులపై కూడా తెలుగులోనే బోర్డులు!

ఎవరినన్నా అడగాలంటే నామోషీ! కానీ తప్పదు అవసరం తనది!

మరో పది నిమిషాల తర్వాత వికాస్ ఉన్న ప్లాట్‌ఫాంపై ఓ బస్సు వచ్చి ఆగింది.




“ఇది ఏ ఊరు బస్సండీ?” దిగుతున్న కండక్టర్ని అడిగాడు.

“ఆదిలాబాద్”

వికాస్ ప్లాట్‌ఫాం పైకి తిరిగి వచ్చాడు. వికాస్‌కి అసహనంగా ఉంది. తనతోపాటు టిక్కెట్ బుక్ చేసి ఆఖరి నిమిషంలో క్యాన్సిల్ చేసిన డాడీపై కోపంగా ఉంది. ఒక్కడినే ఊరు వెళ్ళనని ఎంత మొత్తుకున్నా వినని మమ్మీపై కినుకగా ఉంది. ఎంతకూ రాని ‘నిర్మల్’ బస్సుపై మంటగా ఉంది.

“అరగంటకో బస్సు ఉందంటున్నారు. నేను వచ్చి నలభై నిమిషాలయింది. నిర్మల్ బస్సు రాలేదు. ఇంతలో వస్తుందంటారా?” అడిగాడు వికాస్, తన పక్కనున్నతన్ని.

“అదేంటి సార్, అరగంట క్రితం ఆ పక్కప్లాట్‌ఫాం నండి రెండు ‘నిర్మల్’ బస్సులు వెళ్లాయి. ఇంతకు ముందు ఇక్కడి నుండి వెళ్ళిన ‘ఆదిలాబాద్’ బస్సు కూడా ‘వయా నిర్మల్’ అని రాశారు. చూడలేదా?” అన్నాడతను.

ఏమంటాడు పాపం! కుక్కినపేనులా కిక్కురుమనలేదు వికాస్.

“అదిగోండి సార్, మీరెళ్ళాల్సిన ‘నిర్మల్’ బస్సు వచ్చింది.”

వడివడిగా బస్సు వైపు నడిచాడు వికాస్.

అదృష్టవశాత్తు కిటికీ పక్కసీటు దొరికింది. బస్సు అంత రద్దీగా లేదు. ‘ముప్కాల్’కు టిక్కెట్టు తీసుకుని, ఆ ఊరు రాగానే చెప్పమన్నాడు.

ఆర్మూర్‌వైపు సాగుతోంది బస్సు. దినపత్రిక తీశాడు వికాస్ పక్కనున్నతను. పేపర్ చూడగానే, క్రితం రోజు జరిగిన ఇండియా–శ్రీలంక వన్‌డే రిజల్ట్ తెలుసుకోవాలని కుతూహలం కలిగింది వికాస్‌కు.

**దినపత్రికల్లో ఏయే విషయాలు ప్రచురింపబడతాయి. ప్రజలకెంత వరకు ఉపయోగపడుతున్నాయి.**

అదే అడిగాడు పక్కాయన్ని, ఆయన స్పోర్ట్స్ పేజీ తీసిచ్చాడు. బొమ్మలు చూడసాగాడు వికాస్, సచిన్, అర్జున్ రణతుంగ, ఇద్దరి ఫోటోలూ ఇచ్చారు. ‘ఎవరు గెలిచారో’

చదివితే గానీ తెలీదు. కానీ చదివేదెలా? ఇప్పుడు తన తెలుగురాని తనంపై కోపం వచ్చింది. సిగ్గు విడిచి పక్కాయన్ని అడిగాడు. అతడు వింతగా చూశాడు.

'డ్రెస్సు చూస్తే టిప్‌టాప్‌గా ఉంది. కాని తెలుగు కూడా చదవడం రాదు. ఏం మనిషో?' అనుకున్న భావం కనబడింది వికాస్‌కు అతని కళ్ళల్లో. ఇండియా గెలిచిందని మాత్రం తెలిసింది.

''వేషం చూస్తే కాలేజీ కుర్రాడనుకోవాలి. జీన్సు, టీ షర్టు, కాళ్ళకు బూట్లు, కళ్ళకు గాగుల్స్, నాలుక్కోస్తే అక్షరం ముక్క రానట్టుంది. పులిని చూసి, నక్క వాతలు పెట్టుకోవడం అంటే ఇదే. విద్య లేనివాడు వింత పశువని ఊరికే అన్నారా?'' అని మెల్లిగా అన్న మాటలు వెనకనుండి వినిపించాయి.

అవి తనను ఉద్దేశించి అన్నవే అని ఖాయపర్చుకున్నాడు వికాస్. గిరుక్కున వెనక్కి తిరిగి...

తగిన జవాబిద్దామని నోటి దాకా వచ్చింది, కానీ అప్పటికే స్టాండ్‌లో ఆగింది బస్సు.

ఆ పెద్దాయన్ని కొరకొరా చూస్తూ బస్సు దిగాడు వికాస్. ఆటోస్టాండు వైపు అడుగులు వేశాడు. ఆ కోపంతో బేరం కూడా చేయకుండా ఓ ఆటోలో కూర్చుని 'నాగంపేట' పోనీయమన్నాడు.

నాగంపేటలో తమ ఇల్లును దూరం నుంచి చూడగానే మనసు ఉల్లాసభరితమైంది. పెళ్ళి కళ వచ్చింది ఇంటికి. పెయింట్ వేశారు. వాకిట్లో పెద్ద షామియానా, పచ్చని మామిడి ఆకుల పందిరి. ద్వారాలకు తోరణాలు. వచ్చిన బంధుమిత్రులతో కళకళలాడుతున్నాయి ఇల్లు, చుట్టూ పరిసరాలు.

**బంధుమిత్రులను ఏయే సందర్భాలలో కలుస్తాము. వారి పరిచయాలు శాశ్వతంగా ఎలానిలుపుకో గలుగుతాము.**

అమెరికా బాబాయి, వాళ్ళబ్బాయి క్రిస్-క్రిష్ణమోహన్ కూడా వచ్చారు పెళ్ళికి. వాళ్ళను దాదాపు పదేళ్ళ తర్వాత కలిశాడు. క్రిస్ వికాస్ ఈడువాడే. అమెరికాలో పుట్టి పెరిగాడు. తనకు మంచి కంపెనీ దొరికిందని ఆనందపడ్డాడు వికాస్.



పెళ్లి వైభవంగా, కోలాహలంగా ఏ అపశ్రుతులు లేకుండా జరిగింది. వరుని ఊరు కూడా వెళ్లి వచ్చారు వికాస్, క్రిస్‌లు. పెళ్లి సంబరంలో నాలుగు రోజులు నాలుగు నిమిషాల్లా గడిచాయి.

మరుసటిరోజే వికాస్ బొంబాయి ప్రయాణం. టీ. టిఫిన్లు చేసి వాకిట్లో మంచం మీద కూర్చున్నారు వికాస్, క్రిస్‌లు. పక్కింటి బామ్మ ఓ ఉత్తరం చదివి పెట్టమని వికాస్‌కిచ్చింది. వికాస్ తెల్లమొహం వేశాడు. క్రిస్ వికాస్ ఇబ్బందిని అర్థం చేసుకున్నాడు. అతని చేతినుండి ఉత్తరం తీసుకుని చదవసాగాడు. వికాస్ ఆశ్చర్యపోయాడు. ఎన్నో తెలుగు స్కూళ్ళున్న బొంబాయిలో తను తెలుగు నేర్చుకోలేదు. అమెరికాలో పుట్టి పెరిగిన క్రిస్ తెలుగెలా నేర్చుకున్నాడు? అదే అడిగాడు బామ్మగారు వెళ్లిపోగానే. క్రిస్ చెప్పిందాన్ని విని అబ్బురపడ్డాడు.

''అమెరికా తెలుగు సంఘం వారు ఉద్యోగం నుంచి రిటైరైన ఓ తెలుగు పండితున్ని ఇండియా నుంచి అమెరికా రప్పించుకున్నారు. ఆయనకు భోజనం, వసతీ కాక జీతం కూడా ఇచ్చి, తమ సభ్యుల పిల్లలకు మన భాష, సంస్కృతి, ఒంటబట్టిస్తున్నారు. శని, ఆదివారాలు వెకేషన్లలో తెలుగు క్లాసులు నడుపుతున్నారు.

''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' మాత, మాతృభూమి స్వర్గం కంటే మిన్నయైనవి. అలాగే మాతృభాష కూడా గొప్పది. దాని ద్వారానే మన మూలాలు తెలుసుకోవచ్చు. ఏ దేశం వెళ్లినా, ఎంత పెద్ద పదవిలో ఉన్నా మన భాషను, వారసత్వాన్ని మరువకూడదు'' అమెరికా బాబాయ్ పిల్లలకు బోధ చేశాడు.

వికాస్‌కు తన తల్లిదండ్రుల మాటలు జ్ఞప్తికి వచ్చాయి. వారూ ఇదే అన్నారు. కాని తను లక్ష్యపెట్టలేదు. వెకేషన్లో తెలుగు క్లాసులకు వెళ్ళమన్నారు. తను వింటేగా? ఉద్యోగానికి తెలుగు అవసరం లేకపోవచ్చు కాని సామాజికంగా ఆ అవసరం ఉంది. ఎంత ఇంగ్లీషు నేర్చినా, ఇతర భాషలు వచ్చినా, తెలుగు భాష ప్రభావం వేరు. తమ భాషలోనే తమ ఆత్మ ప్రస్ఫుటం అవుతుంది. దాంట్లో ఉన్న ఆత్మీయత ఇతర భాషల్లో లేదు. మన భాష, మన సంస్కృతి యొక్క విలువ ఈ ప్రయాణంలో కొట్టవచ్చినట్టు తెలిసివచ్చాయి. తను ఎలాగైనా తెలుగు రాయడం, చదవడం నేర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు వికాస్. తమ ఇంట్లోని పుస్తకాలు చదివి వాటిలోని అపార జ్ఞానాన్ని ఒంటబట్టించుకోవాలని తీర్మానించుకున్నాడు. ఆ రోజు సాయంత్రం మున్సిపల్ వెళ్లి పెద్ద బాలశిక్ష, ఇంగ్లీషు - తెలుగు స్వబోధిని, వేమన, సుమతి శతకాలు, మూడవ తరగతి వరకు తెలుగు వాచకాలు, తెలుగు కాపీ రైటింగ్ పుస్తకాలు కొని తెచ్చుకున్నాడు.

**''తెలుగు అభ్యసించడం వ్యక్తిగతంగానే కాక సామాజిక పరంగాకూడా అవసరం'' - చర్చించండి.**

పెద్ద బాబాయితో 'అ-ఆ' లు పెట్టించుకుని తెలుగు నుడికారం నేర్చుకోవడానికి శ్రీకారం చుట్టాడు బి.కామ్. చదువుతున్న వికాస్! జాగైనా జాగృతే.



**రచయిత పరిచయం : డా॥ అంబల్ల జనార్ధన్** గారు నిజామాబాద్ జిల్లాలోని ధర్మోరా గ్రామములో 1950 నవంబరు 9న జన్మించిరి. వీరి తల్లిదండ్రులు శ్రీ అంబల్ల చిన్ని నర్సయ్య, శ్రీమతి అంబల్ల నర్సవ్వ. వీరు బొంబాయిలోని ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటి పాఠశాలలో చదివారు. దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి పదవీ విరమణ పొందారు.

1993 నుండి కథలు రాస్తున్న అంబల్ల జనార్ధన్‌గారు ఆంగ్లంలోను, వివిధ విషయాల మీద వ్యాసాలు రాసి ప్రచురించారు. బొంబాయి కథలు, బొంబాయి నానీలు మొదలగునవి వీరి రచనలు. వీరి శైలి సహజ సుందరంగా, సరళంగా, పాఠకుల హృదయాలను హత్తుకొనేటట్లు వుంటుంది.

ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన 'అంబల్ల జనార్ధన్ కథలు' నుండి గ్రహించబడినది.

## I చర్చించండి :

1) తెలుగు భాష-సంస్కృతి.

2) మాతృభాష ప్రాముఖ్యత.

3) "ఏదేశం వెళ్ళినా, ఎంత పెద్ద పదవిలో ఉన్న మన భాషను, వారసత్వాన్ని మరువకూడదు."

## II పదజాలం పెంపొందించుకుందాం.

తేలిక = చులకన, అల్పమైన, సరళమైన; అయోమయం - గందరగోళం; అసహనం = ఓర్వలేని; కినుక = అలక, కోపం; వడివడిగా = త్వరత్వరగా; కుతూహలం = సంతోషం, కోరిక; కుర్రాడు = పిల్లవాడు, లేత వయసువాడు; కొరకొరా = కోపంతో; అపశ్రుతులు = ఆటంకం కలిగించే మాటలు; ప్రస్ఫుటం = విశదమైన, వికసించిన.

## III చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) వికాస్‌కు, ఆటోవానికి మధ్యజరిగిన సంభాషణ.

2) వికాస్‌కు అమ్మానాన్నలపై కోపం వచ్చుటకు కారణము.

3) ఆర్మూర్ బస్సులో వికాస్‌కు, పక్కనున్నతనికి మధ్య జరిగిన సంభాషణ.

4) నాగంపేటలో నున్న వికాస్ ఇంటిని వర్ణించండి.

5) క్రిస్ చెప్పిందాన్ని విని, వికాస్ ఆశ్చర్యపోవుటకు కారణము.

6) చివరకు వికాస్ ఏమని నిశ్చయించుకున్నాడు?

### ఆ) కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరో రాయండి.

1) "నిర్మల్ బస్ ఎన్ని గంటలకు ఉందండీ?". ____________ → ____________

2) మీరెళ్ళాల్సిన 'నిర్మల్' బస్సు వచ్చింది. ____________ → ____________

3) "ఉత్తరం చదివిపెట్టమని వికాస్ కిచ్చింది". ____________ → ____________

4) "మీటరు బరాబరున్నది". ____________ → ____________

### ఇ) కింది గడులను కుండలీకరణంలోని సరైన పదాలతో పూరించండి.

(బోర్డు, ఇమ్లీబన్, ఆదిలాబాద్, ఆర్మూర్, శ్రీకారం)

1) ఆటోడ్రైవర్ వికాస్‌ని ____________ బస్టాండ్‌లో దించాడు.

2) ఈయన కూడా ____________ గురించే మాట్లాడుతున్నాడు.

3) ____________ వైపు సాగుతోంది బస్సు

4) తెలుగు నుడికారం నేర్చుకోవడానికి ____________ చుట్టాడు వికాస్.

## III స్వీయవ్యక్తీకరణ :

1) "జనని, జన్మ భూమి స్వర్గం కంటె మిన్నయైనవి" వివరించండి.

2) నీవే రేడియో జాకీవైతే క్రికెట్ ఆటను గురించి ఎలా వ్యక్తీకరిస్తావు?

## IV భాషావగాహన :

**అ) కింది వాక్యాలలో గుర్తించబడిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.**

1) <u>వికాస్</u> ఆ బోర్డును <u>చూశాడు</u>.  2) <u>అతడు</u> <u>తెల్లమొహం</u> వేశాడు.

**ఆ) కింది పదాలను విడదీసి సంధికార్యాలను రాయండి.**

1) ఉందంటున్నారు, 2) ఏమంటాడు, 3) ఎలాగైనా, 4) కూర్చున్నతను

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యాలు, సమాసనామాలు రాయండి.**

1) యాభైరూపాయలు, 2) పెద్దషామియానా, 3) బంధుమిత్రులు, 4) పెళ్ళిసంబరం

**ఈ) కింద గుర్తించబడిన ప్రత్యయములు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

1) ఇస్కులు పోరగండ్ల<u>ను</u> ఇడువనికి పోవాలె.
2) వికాస్<u>కి</u> అసహనంగా ఉంది.
3) రైల్వేస్టేషన్నుంచి ఇరవై రూపాయల<u>కంటె</u> ఎక్వ కాకూడదు.
4) వచ్చిన బంధుమిత్రుల<u>తో</u> కళకళలాడుతున్నాయి, ఇల్లు, చుట్టూ పరిసరాలు.

## V కింది సామెతలను వివరించండి :

1) ''పులిని చూసి, నక్క వాతలు పెట్టుకొన్నట్లు''  2) ''విద్యలేనివాడు వింతపశువు.''

## VI సృజనాత్మకత :


1) వేసవి సెలవుల్లో మీ స్వగ్రామం వెళ్ళడానికి కావలసిన ప్రణాళికను తయారు చేయండి.
2) సోదరి వివాహానికి ఈ-మెయిల్ ద్వారా ఆహ్వాన పత్రికను స్నేహితునికి రాయండి.
3) నీకు నచ్చిన పండుగ – పండుగలు ఎందుకుచేసుకుంటాము – ఆ పండుగ వచ్చు మాసము – పండుగను జరుపు కొనుటకు కారణం – జరుపుకొను విధం – ఏయే ప్రాంతంలో ప్రజలు ఎలా జరుపుకుంటారో పదివాక్యాల్లో రాయండి.

**ప్రత్యక్ష అనుభవం – తెలుగు నేర్పుతా.**

మీ కుటుంబంలో మరియు చుట్టుపక్కల తెలుగు భాషను రాయడం, చదవడం రానివారికి తెలుగు రాయటం, చదవటం నేర్పండి.

**నేనివి గ్రహించా :**

1) మాతృభాషా ప్రాముఖ్యత.  2) మన భాషను, వారసత్వాన్ని మరువరాదని.



# 5 వేగుచుక్క



**ఉన్ముఖం:**

దారీ తెన్నూ తెలియని దుర్గమమైన అరణ్యంలో ప్రయాణం చాలా కష్టం. రాళ్ళూ, ముళ్ళూ ఏరుకుంటూ దారి చేసుకుంటూ నడవాలి. ఆ బాటలో విజయం చాలా కష్టసాధ్యం. కానీ వారు, ఆ తర్వాత ఆ దారిలో నడిచే వాళ్ళకు మార్గదర్శకులౌతారు. ప్రస్తుత పాఠ్యభాగంలో అటువంటి మార్గదర్శి అయిన మహిళా మాణిక్య మెవరు? ఆ స్ఫూర్తి దాత జీవిత చరిత్ర ఎటువంటిది? చదివి తెలుసుకుందామా?

కలలు అందరూ కంటారు కానీ.... కొందరే వాటిని సాకారం చేసుకుంటారు.

విదేశాలకు వెళ్లి వైద్య విద్య అభ్యసించి తిరిగొచ్చిన మొట్టమొదటి భారతీయ మహిళా వైద్యురాలిగా గుర్తింపబడుతూ, వైద్యవిద్యలో తన తదనంతర తరంలో ఎందరో మహిళా డాక్టర్లకు మార్గదర్శకురాలయిన డా॥ ఆనందీబాయి గోపాల్ జోషీ అటువంటి వారిలో ఒకరు.

## విదేశాలలో విద్యనభ్యసించుట లాభనష్టాలు.

ఆనందీబాయి అసలు పేరు యమున. నాటి బ్రిటిష్ ప్రెసిడెన్సీలో, నేటి మహారాష్ట్రలోని పూనాలో 1865 మార్చి 31వ తేదీన జన్మించింది. ఆమె తండ్రి గణపతిరావు, తల్లి అమృతేశ్వర్ గంగాబాయి. యమునకు తొమ్మిదేళ్ళ వయసులో 1874 మార్చి 31వ తేదీన గోపాల్ వినాయక్ జోషితో వివాహం జరిగింది.

గోపాల్ అభ్యుదయ భావాలు కలవాడు. ఆతని సాహచర్యంలో ఆనందీబాయి మరాఠీ, సంస్కృతం, ఆంగ్లంలో అపారమైన పాండిత్యం సంపాదించింది. వారి కుటుంబం కోల్హాపూర్‌లో ఉండగా 1878 ప్రాంతంలో, ఆమెకు పదునాలుగేళ్ళ వయసులో పండంటి మగబిడ్డ పుట్టాడు. కానీ సరియైన వైద్య సహాయం అందక ఆ బాలుడు పురిటిలోనే చనిపోయాడు. కొడుకు మరణం ఆనందీబాయిని బాగా కృంగదీసింది. కానీ అది తాత్కాలికం మాత్రమే. కొద్దిరోజుల్లో తను చదివిన చదువు వల్ల, భర్త సాహచర్యంలో లభించిన ఆలోచనా జ్ఞానం వల్ల, ఆ దుఃఖం నుండి కోలుకుంది. ప్రజలకు సరియైన వైద్యసేవలు అందుబాటులో లేవన్న విషయం ఆమెను బాగా కలచి వేసింది. తనకు జరిగిన కడుపుకోత మరే తల్లికి జరగ కూడదని అనుకుంది. వైద్య సహాయం అందక ఎవరూ చనిపోకూడదని భావించింది. ఆ రోజే తాను డాక్టరు చదవాలనే స్థిర నిశ్చయానికి వచ్చింది. వచ్చిందే తడవుగా భర్తకు తన ఆలోచన చెప్పింది.

గోపాల్ చాలా సంతోషించాడు. ఆ ఆలోచన కలిగినందుకే భార్యను అభినందించాడు. సమాజానికి మహిళా డాక్టర్ల ఆవశ్యకత చాలా ఉందని, ఆనందీబాయి సంకల్పం ఆమెలాంటి ఎంతోమంది మహిళలకు మార్గదర్శకం కాగలదని ప్రోత్సహించాడు. వెంటనే అందుకు తగిన ప్రయత్నాలు కూడా మొదలు పెట్టాడు. తన భార్య ఆనందీబాయి వైద్యవిద్య అభ్యసించడానికి, తనకు ఏదైనా ఉద్యోగం కల్పించడానికి సహాయం చేయమని కోరుతూ, అమెరికాలోని ఒక ప్రసిద్ధ మిషనరీకి గోపాల్ ఉత్తరం వ్రాశాడు. కానీ కొన్ని కారణాల వలన అతని అభ్యర్థన అంగీకరింపబడలేదు. దాంతో ఆనందీబాయి డాక్టర్ కోర్స్ చదువు అటకెక్కింది.

అయితే ఇక్కడ ఒక విచిత్రం జరిగింది. మన సంకల్పం గొప్పదై, మంచిదై, సమాజానికి ఉపయోగ కరమైనప్పుడు అది ఏదో ఒక విధంగా తప్పక నేరవేరుతుందని పెద్దలు చెబుతారు. దానికి ఈ సంఘటన ఒక మంచి ఉదాహరణ.

గోపాల్ మిషనరీకి పంపిన అభ్యర్థన ఉత్తరాన్ని, మిషనరీ సమాధానాన్ని ప్రిన్స్టన్ నుండి పబ్లిష్ అయ్యే వారి స్వంత పత్రిక 1879 జనవరి సంచికలో ప్రచురించారు. న్యూజెర్సీలోని రోజేల్లేకు చెందిన శ్రీమతి థియోడెసియా కార్పెంటర్ అనే ఆవిడ 1880 మార్చిలో తన డెంటల్ డాక్టర్ దగ్గరికి వెళ్ళినప్పుడు రష్‌గా ఉండి కాసేపు వెయిట్

చేయవలసి రావడంతో అక్కడ టీపాయ్ మీదున్న పుస్తకాలు తిరగేస్తుంటే ఆ పత్రిక చేతిలోకి వచ్చింది. అందులోని గోపాల్ ఉత్తరం, మిషనరీ వారి సమాధానం రెండూ చదవాలని ఆసక్తిగా చదివింది. ఎక్కడో ఇండియా లోని ఒక అమ్మాయి, అమెరికా వచ్చి డాక్టర్ చదవాలని ఆసక్తి చూపడం, దానికి ఆమె భర్త ప్రోత్సహించడం అన్న అంశాలు ఆవిడను బాగా కదిలించాయి. గోపాల్ మిషనరీకి రాసిన ఉత్తరంలో ఆ దంపతుల ఆవేదన, నిజాయితీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. మిషనరీ వారు వారి అభ్యర్థనను నిరాకరించిన విధానం కూడా ఆమెకు కాస్త కోపం తెప్పించింది. ఆ పత్రికలోని ఆనందీబాయి చిరునామా వ్రాసుకుని, మరునాడే ఆనందీబాయి అమెరికాలో డాక్టర్ చదివినంత కాలం మా ఇంట్లో ఆశ్రయం ఇస్తానని' వారికి ఉత్తరం వ్రాసింది. బహుశా శ్రీమతి కార్పెంటర్ కంట్లో పడటానికే ఆ పత్రిక ఎంత ఆలస్యమైనా, దాదాపు పదునాల్గు మాసాల పాటు వంటి డాక్టర్ టీపాయ్ మీద ఉన్నది. ఆనందీబాయి సంకల్ప బలం ఎంత గొప్పదో చూడండి.



### విద్యార్థులు - స్కాలర్‌షిప్‌లు - ప్రభుత్వం తోడ్పాటు.

ఆ కాలంలో సమాజ ఆచారం ప్రకారం స్త్రీలు బయట తిరగడం, చదువుకోవడం అనేది చాలా సాహసంతో కూడుకున్నది. అటువంటిది ఏకంగా అమెరికా వెళ్ళడమన్నది గగన కుసుమమే! ఆనందీబాయి అమెరికా ప్రయాణానికి, ఆమె బంధువులు, స్నేహితులే కాక మొత్తం సమాజం నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. వాటినన్నిటిని ఓపికగా అధిగమించి, సనాతన భారతీయ మహిళా ధైర్య సాహసాలను గుండెల నిండా నింపుకొని ఒంటరిగా 1883 ఏప్రిల్ 7వ తేదీన సిటి ఆఫ్ కలకత్తా అనే స్టీమర్‌లో కొంతమంది స్నేహితులతో కలిసి ప్రయాణించి 1883 జూన్ 4వ తేదీన ఆనందీబాయి న్యూయార్క్ చేరింది. హార్బర్‌లో శ్రీమతి కార్పెంటర్ దంపతులు ఆనందీబాయికి ఆహ్వానం పలికి తమ ఇంటికి తీసుకువెళ్ళారు. ఆనందీబాయి తన మంచితనంతో, మాటతీరుతో అందరినీ ఆకట్టుకొని ఆ కుటుంబంలో ఒక సభ్యురాలయింది.

1883 జూన్ 28వ తేదీన పెన్సిల్వేనియాలోని వుమెన్స్ మెడికల్ కాలేజ్‌లో ఆనందీబాయికి అడ్మిషన్ దొరికింది. ఆమెకు అనుక్షణం తన కర్తవ్యం, లక్ష్యం కళ్ళముందు కదలాడుతుండేవి. రోజుకు దాదాపు పదిహేను, పదహారు గంటలపాటు కష్టపడి చదివేది. సమయాన్ని ఏ మాత్రం వృధా చేసేది కాదు. ఖాళీ సమయాల్లో కాలేజీ సమీపంలో ఉండే పాఠశాలలకు, అనాధ శరణాలయాలకు వెళ్ళి వైద్యసేవలు అందించేది.

ఆశయ సాధనే లక్ష్యంగా చదువులో మునిగిపోయిన ఆనందీబాయి తన ఆరోగ్యం గురించి శ్రద్ధ పెట్టలేదు. అమెరికాలోని అతిశీతల వాతావరణం అసలు పడలేదు. దాంతో తరచుగా ఆమె అనారోగ్యం పాలయ్యేది. కాలేజి డీన్ డా. రేచల్ బాడ్లే వైద్య పర్యవేక్షణలో ఆమె త్వరగా కోలుకొని, తిరిగి తన చదువులో మునిగిపోయేది.

చిన్న వయసులో అసాధారణ మానసిక పరిణతి

కలిగి, అలౌకిక వ్యక్తిత్వంతో అలరారే ఆనందీబాయిని చాలా సంస్థలు పిలిచి ఏదైనా విషయం మీద ప్రసంగించమని అడిగేవారు. న్యూజెర్సీలోని బార్టిన్‌టౌన్ విద్యార్థులనుద్దేశించి మంచి ఉపన్యాసం ఇచ్చింది. అలాగే ఫిలడెల్ఫియా లేడీస్ మిషనరి సొసైటీవాళ్ళు పిలిచినప్పుడు ఆమె బాల్యవివాహాల మీద అద్భుతమైన లెక్చర్ ఇచ్చింది.

1885 వేసవిలో ఆనందీబాయి శ్రీమతి కార్పెంటర్ ఇంట్లో ఉన్నప్పుడు గోపాల్ అమెరికా వచ్చాడు. భార్యా భర్తలిద్దరూ అక్కడే వేసవికాలం గడిపారు.

ఆమె చదువు పూర్తికావొస్తోంది. ఆమె గ్రాడ్యుయేషన్ థీసిస్ హిందూ అబ్స్టెట్రిక్స్ థీసిస్ పూర్తిచేశాక హాస్పిటల్ సర్వీస్ న్యూ ఇంగ్లాండ్ హాస్పిటల్‌లో చేయాలనుకుంది. ఆనందీ ఆ హాస్పిటల్‌ను కాంటాక్ట్ చేసేసరికి అక్కడ సీట్లన్నీ నిండిపోయాయి. అయినా ఆనందీబాయిని స్పెషల్ కేసుకింద ట్రీట్‌చేసి ఎలాంటి ఫీజు లేకుండా తీసుకున్నారు.

**అబ్స్టెట్రిక్స్ (Obstrectrics)**

1886 మార్చ్ 6న పరీక్షా ఫలితాలు వచ్చాయి. ఆనందీబాయి పాసయింది. భారతీయ పత్రికలన్నీ ఆమెను ఆకాశానికి ఎత్తుతూ వార్తలు రాశాయి. బ్రిటిష్‌రాణి క్వీన్ విక్టోరియా ఆమెను అభినందిస్తూ సందేశం పంపడం గొప్ప విషయం. కొల్హాపూర్ స్టేట్ ఆనందీబాయిని, కొల్హాపూర్ లోని ఆల్బర్ట్ ఎడ్వర్డ్ హాస్పిటల్‌లో లేడి డాక్టర్‌గా, హాస్పిటల్ ఇంచార్జ్‌గా మంచి వేతనం, అలవెన్సులతో అపాయింట్ చేస్తూ, ఇంటర్న్‌షిప్ పూర్తయి, ఇండియాకు రాగానే జాయిన్ కమ్మని ఆర్డర్స్ పంపింది.

న్యూ ఇంగ్లాండ్ హాస్పిటల్‌లో ఆనందీబాయి ఇంటర్న్‌గా జాయిన్ అయింది. చాలా ఉత్సాహంగా పేషంట్లను చూస్తూ విరామం లేకుండా ఏకధాటిగా పనిచేసింది. ఒక్కనెలలోనే ఆమె ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. తీవ్రమైన జ్వరము, దగ్గు, వొళ్ళు నొప్పులు ఆమెను బాధించసాగాయి. ఆమెకు వచ్చింది మామూలు జబ్బుకాదు. క్షయవ్యాధి (టి.బి.). ఆవ్యాధికి ఇప్పుడంటే మంచి మందులు అందుబాటులో ఉన్నాయి కానీ, ఆకాలంలో అది ఒక భయంకరమైన జబ్బు. ఆనందీబాయి విశ్రాంతి కోసం తిరిగి న్యూజెర్సీ చేరింది. ఆమె భర్త గోపాల్, శ్రీమతి కార్పెంటర్, ఆమెకు మంచి చికిత్స అందించడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు. కానీ ఆమె ఆరోగ్యం రోజురోజుకు క్షీణించసాగింది.

1886 అక్టోబర్ 9న ప్రత్యక్షంగా డాక్టర్ల పర్యవేక్షణలో న్యూయార్క్ నుండి తిరుగు ప్రయాణం మొదలైంది. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ లండన్ ద్వారా బొంబాయి చేరారు. ఎవరెవరు ఆమె అమెరికా ప్రయాణం అడ్డుకున్నారో వాళ్ళందరూ వేదమంత్రాలతో ఆమెకు ఘన స్వాగతం పలికారు.

మనం ఒక పని మొదలుపెట్టి ముందుకు వెళ్తున్నపుడు వెనుకనుండి వేలగొంతులు నిరుత్సాహ పరుస్తూ అరుస్తాయి. మనం వెనుకచూపు లేకుండా ధైర్యంగా ముందుకు వెళ్ళేకొద్దీ, పనిలో ప్రగతి కనబడే కొద్దీ, విమర్శించే గొంతుల్లో ధ్వని సన్నబడుతూ ఉంటుంది. మనం విజయం సాధించి ఒక్కసారిగా వెనక్కుతిరిగి చూస్తే ఆనోళ్ళు మనల్ని కీర్తించడంలో మునిగి పోతాయి. పట్టుదలతో అమెరికాలో వైద్యవిద్య అభ్యసించి వచ్చిన మొట్టమొదటి భారతీయ మహిళగా దేశం యావత్తు ఆమెకు నీరాజనాలు పలుకుతోంది. రోజురోజుకు ఆనందీబాయి ఆరోగ్యం క్షీణించ సాగింది. దేశం మొత్తం ఆమె ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేసింది. కానీ ఆ ప్రార్థనలు ఏవీ ఫలించలేదు.

1887 ఫిబ్రవరి 26వ తేది తెల్లవారుజామున కిటికిలోంచి వేగుచుక్క కనబడుతోంది. ఆనందీబాయి అసాధారణ ధైర్యంతో, సాహసంతో ఉదాత్తమైన ఆశయం కోసం తపించి గెలిచి, ఆశయం పూర్తికాకుండానే ఇరవై రెండేళ్ళకే అతిచిన్న వయసులో కన్నుమూసింది.

**విశేషాంశాలు:**

**వేగుచుక్క ప్రాధాన్యత:** తెల్లవారుజామున తూర్పున కనిపించే శుక్రగ్రహం (Venus) వేగుచుక్కగా ప్రసిద్ధం. వేగుచుక్క ఉండేది కాసేపైన ప్రయాణం మొదలుపెట్టిన వారికి మార్గదర్శిలా దిశానిర్దేశం చేస్తుంది.

**అటకెక్కింది :** అటకెక్కింది అనేది తెలుగులో చక్కని పదబంధం, అప్పట్లో ప్రతి ఇంటిలోనూ అటకలు ఉండేవి. ప్రస్తుతానికి అక్కరకు లేని వస్తువులను అటక మీద దాచేవాళ్ళు. ఏదైనా విషయం నిరవధికంగా వాయిదా పడితే దానిని అటకెక్కింది అంటారు.



**రచయిత పరిచయం : శ్రీ దాసరి వెంకటరమణ** గారు దాసరి వెంకటరమణమ్మ, రంగయ్య అను పుణ్య దంపతులకు 1965 మార్చి 22న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడ గ్రామంలో జన్మించారు. వీరి రచనలు ఎన్నో తెలుగు పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఎం.ఎ (తెలుగు), పిజి డిప్లోమా ఇన్ 'ఫిల్మ్ డైరక్షన్' చేశారు. ఆకాశవాణిలోను, దూరదర్శన్‌లోను నాటికలకు, సీరియళ్ళకు రచనను అందించారు. కొన్ని షార్ట్ ఫిలిమ్స్ తీసి బహుమతులు కూడా పొందారు. వీరు రచించిన 'ఆనందం' కథల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి అవార్డు , 'అమ్మ మనసు' కథల సంపుటికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి 'ఉత్తమ బాలసాహిత్యం' పురస్కారం లభించాయి. బాలసాహిత్యంలోనే విశేషంగా కృషి చేస్తున్న వీరిని గుంటూరు డా. నన్నపనేని బాల సాహిత్య పురస్కారం, తెనాలి దగ్గర చిలుమూరులోని చక్రపాణి-కొలసాని వంటి అవార్డులు వరించాయి. ప్రస్తుతం ఈయన హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో పనిచేస్తున్నారు.

## I చర్చించండి :

1) నీకు జలుబు - దగ్గువస్తే ఇంట్లో వారు చేసే గృహవైద్యం.

2) మూలికలుగా వాడు ఏదేని నీకు తెలిసిన ఐదు ఆకుల పేర్లు రాయుము.

3) జ్వరం వస్తే తీసుకోవలసిన జాగ్రత్తలేమిటి?

## II పదజాలం పెంపొందించుకుందాం.

మార్గదర్శకులు = దారి చూపువారు, పర్యవేక్షణ = పనిక్రమాన్ని పరిశీలించడం; అలరారు = ప్రకాశించు, శోభిల్లు; ప్రగతి = పురోభివృద్ధి; నీరాజనాలు = హారతి పట్టడం.

## III జవాబులు రాయండి.

### అ) ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) ఆనందీబాయికి చదువు విషయంలో భర్త నుండి లభించిన ప్రోత్సాహం.

2) ఆనందీబాయి సంకల్పబలం ఎంత గొప్పదో వివరించండి.

3) ఆనందీబాయి ఆరోగ్యం క్షీణించడానికి కారణాలు.

4) ఆనందీబాయి వైద్యవిద్యను అభ్యసించిన విధం.

### ఆ) సరైన పదంతో ఖాళీలను పూరించండి.

1) ఆనందీబాయి జన్మించినది ____________

అ) ముంబయి ఆ) పూనా ఇ) నాగపూర్

2) ఆనందీబాయికి ఆహ్వానం పలికిన దంపతులు ____________

అ) రేచర్ దంపతులు ఆ) ఇంగ్లండు రాణి దంపతులు ఇ) శ్రీమతి కార్పెంటర్ దంపతులు.

3) ఆనందీబాయికి ____________ లోని వుమెన్స్ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ దొరికింది.

అ) పెన్సిల్వేనియా ఆ) న్యూయార్క్ ఇ) ఇంగ్లాండ్

4) బ్రిటిష్ రాణి ____________

అ) క్వీన్ విక్టోరియా ఆ) శ్రీమతి కార్పెంటర్ ఇ) డా॥ రేచల్ బాడ్లే

### ఇ) తప్పొప్పులు గుర్తించండి.

1) ఆనందీబాయీ అసలు పేరు యమున. (    )

2) ఆరోజే తాను లా చదవాలని స్థిరనిశ్చయానికి వచ్చింది. (    )

3) ఆనందీబాయి తన చదువు గురించి శ్రద్ధ పెట్టలేదు. (    )

4) తలుపులోంచి వేగుచుక్క కనబడుతుంది. (    )

## IV స్వీయ వ్యక్తీకరణ :

1) ఆనందీబాయి బాల్యం గురించి మీ సొంతమాటల్లో రాయండి.

2) ఆనందీబాయి ప్రసంగాల గురించి రాయండి.

3) ఆనందీబాయిని ''వేగుచుక్క'' తో పోల్చటాన్ని సమర్థిస్తూ మీ సొంతవాక్యాల్లో రాయండి.

## V భాషావగాహన :

### అ) గీతగీసిన పదాలు ఏ భాషాభాగానికి చెందినవో రాయండి.

1) గోపాల్ చాలా సంతోషించాడు. [ ]

2) నిరంతర వైద్యపర్యవేక్షణలో ఆమె త్వరగా కోలుకుంది. [ ] , [ ]

3) అది ఒక భయంకరమైన జబ్బు. [ ] , [ ]

4) హాస్పిటల్‌ను కాంటాక్ట్ చేసేసరికి అక్కడ సీట్లన్నీ నిండిపోయాయి. [ ]

### ఆ) పట్టిక పూరించండి.

| పదము | విడదీయుట | సంధిపేరు |
|---|---|---|
| 1. పత్రికలన్నీ | | |
| 2. తీవ్రమైన | | |
| 3. చేయాలనుకుంది | | |
| 4. అమృతేశ్వర్ | | గుణసంధి |

### ఇ) పట్టిక పూరించండి.

| పదము | విగ్రహవాక్యము | సమాసం |
|---|---|---|
| 1. తొమ్మిదేళ్ళు | | |
| 2. ధైర్యసాహసాలు | | |
| 3. | సంకల్పము యొక్క బలము | |
| 4. ఘనస్వాగతం | | |

ఈ) గీతగీసిన ప్రత్యయములు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) భర్త సాహచర్యంతో లభించిన ఆలోచనాజ్ఞానం వలన అందులోనుండి కోలుకుంది.

2) ఆనందీబాయి తన ఆరోగ్యం గురించి శ్రద్ధ పెట్టలేదు

3) భారతీయ పత్రికలన్నీ ఆమెను 'ఆకాశానికి ఎత్తుతూ వార్తలు రాశాయి.

ఉ) సొంతవాక్యాలు రాయండి.

1) సాకారం చేసుకొను
2) కలచివేయు
3) మార్గదర్శకం
4) సందేశం పంపు
5) శతవిధాల ప్రయత్నించు
6) దిశానిర్దేశం చేయు.

ఊ) వాక్యరకాలు రాయండి.

1) ఆనందీబాయి మరాఠీ, సంస్కృతం, ఆంగ్ల భాషలు నేర్చుకుంది.

2) ఆనందీబాయి సమయాన్ని ఏమాత్రం వృథా చేసేది కాదు.

3) తీవ్రమైన జ్వరం, దగ్గు, వొళ్ళు నొప్పులు ఆమెను బాధించసాగాయి.

4) ఆనందీబాయి డాక్టరు చదవాలనే స్థిర నిశ్చయానికి వచ్చి భర్తకు తన ఆలోచన చెప్పింది.

## VI సృజనాత్మకత :

మదర్ థెరీసా, బాబా ఆమ్టే, సావిత్రీబాయి ఫులే వంటి సంఘసేవకుల వివరాలను సేకరించి మీ సొంతమాటల్లో రాయండి.

### నేనివి నేర్చుకున్నా :

1) సంకల్పముంటే సాధించలేనిది లేదు.
2) మానవసేవే మాధవసేవ.

## VII ప్రాజెక్ట్‌పని-సంఘసేవ:

మీ పరిసరాలలో తరగతి మిత్రులలో కలిసి డెంగ్యూ మొదలగు జ్వరాల గురించి జనజాగృతి వీధినాటకానికి చక్కని స్క్రిప్ట్ రాసుకొని ప్రదర్శించండి.



# సిరిసిల్ల రాజేశ్వరి




**హైదరబాద్ :** కాళ్ళనే చేతులుగా మలచుకొని కవనాలు అల్లుతున్న దివ్యాంగ కవయిత్రి సిరిసిల్ల రాజేశ్వరి. ఈమె అసలు పేరు బూర రాజేశ్వరి. తెలంగాణా రాష్ట్రం సిరిసిల్లకు చెందిన ఒక నిరుపేద చేనేత కార్మిక కుటుంబంలో జన్మించింది. ఈమె పుట్టుకతోనే దివ్యాంగురాలు. చేతులు వంకర్లు పోయి పనిచేయవు. తల నిలబడదు. ఎప్పుడు వణుకుతూ ఉంటుంది. కానీ పట్టుదలతో కాళ్ళతోనే కలం పట్టి రాయడం నేర్చుకుని పాఠశాలకు వెళ్ళి చదువునేర్చుకుంది.

ఈమె గురించి తల్లి అనసూయ ''నా బిడ్డకు చానా ధైర్యం, కష్టపడి నడవడం నేర్చుకుంది. చదువుకుంటా అన్నది. బడికి పోయేటప్పుడు పడతావ్ అన్నాగానీ పడోలేచో వెళ్ళి చదువుకునే తీరుతానని బడికి పోయింది.'' అని కన్నీళ్ళు పెట్టుకుంది.

ఈమె తన కొరతలను లెక్క చేయక ఆత్మ విశ్వాసంతో అడ్డంకులను అధిగమిస్తూ అనేక కవితలు రాసి సాహిత్యలోకంలో తనకో స్థానాన్ని ఏర్పరచుకుంది.

'సంకల్పం దృఢమైతే శరీరంలో దృఢత్వంలేకున్నా సృజన ఆగదని నిరూపించింది' రాజేశ్వరి. ఈమెలోని సృజనను గుర్తించిన ప్రసిద్ధ కవి, సినీగేయ రచయిత శ్రీ సుద్దాల అశోక్‌తేజ గారు ఆమె కవితలను సుద్దాల ఫౌండేషన్ ద్వారా 'సిరిసిల్ల రాజేశ్వరి కవితలు' పేరుతో పుస్తకరూపంలోకి తెచ్చారు.

ఈ పుస్తకాన్ని రవీంద్రభారతిలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత కీ.శే. డాక్టర్ సి. నారాయణ రెడ్డిగారు ఆవిష్కరించారు.


నేత కార్మికులు, వరకట్న వేధింపులు, స్త్రీలపై జరుగు అత్యాచారాలు మొదలగు అనేక అంశాలపై వందల కొలది కవితలు, జీవిత చరిత్రలనుకూడా రాసింది.

''నీటిలోని చేప కన్నీరు ఎవరికి తెలుస్తుంది.
గూటిలోని చిలకమ్మ దిగులు ఎవరికి తెలుస్తుంది.
నా మనస్సులో ఎంత బాధవుందో ఎవరికి తెలుస్తుంది.''

అంటూ కవితా పంక్తుల్లో గుండెలోని బాధను నింపి వేసిందే గానీ కృంగిపోలేదు. ఈ ధీమతి అయిన ధీరమతి అనేక కఠోర సవాళ్ళను పట్టుదలతో ఎదుర్కొని అనేకుల మన్ననలకు పాత్రురాలైన రాజేశ్వరి అభినందనీయురాలు.

అంతర్జాలంలో వివిధ 'ఈ-వార్తల'ను చదవండి/చూడండి. చర్చించండి.

# 6 పంచతంత్ర కథలు



**ఉన్ముఖం:**

ఏదైనా ఒక విషయాన్ని మనసులో నాటుకొనే విధంగా చెప్పాలంటే ఒక ఉదాహరణ సహితంగా చెబుతాం. ఆ విషయాన్ని ఎదుటివారు ఇంకా ఆసక్తితో వినాలి. ఎప్పటికీ గుర్తుంచుకోవాలనుకుంటే కథారూపంలో చెబితే ఆశించిన ఫలితం లభిస్తుంది. అందుకే ఏ భాషా వాఙ్మయంలోనైనా కథా సాహిత్యం అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుంది.

ఆ కోవకు చెందినవే సంస్కృతంలో రచించిన పంచతంత్ర కథలు. అవి అనేక ప్రపంచ భాషలలోనికి అనువదించ బడ్డాయి. పంచతంత్రమంతా ఒక్క కథ కాదు. కథల్లో కథలు, ఉపకథలు, ఉపకథల్లో మరలా కథలు. అందులో అసంఖ్యాకంగా పాత్రలు వస్తుంటాయి. దాదాపుగా ప్రతి పాత్ర కథ చెబుతుంది ఆ పాత్రలన్నీ జంతువులు, పక్షులే. ఒక్కొక్క జంతువుకి ఒక్కొక్క స్వభావం ఆపాదించబడింది. ఈ కథల ద్వారా అనేక జీవన కౌశల్యాలను (Life Skills), వ్యవస్థాపన కౌశల్యాలను (Managment Skills) పెంపొందించుకోవచ్చు. కథలను తెలుగు భాషా మాధుర్యాన్ని చవిచూపే విధంగా అనువదించారు కీ.శే. పడాల రామారావుగారు. వాటిని ఇప్పుడు చదువుదామా!

## సముద్రుడు-తీతువు పిట్ట

సముద్ర తీరాన గల ఒక చెట్టుమీద తీతువు పిట్ట ఒకటి గూడు కట్టుకుని తన భార్యతో కాపురం వుంటున్నది.

ఒకనాడు ఆడతీతువు ''నాథా! సముద్రుడు అప్పుడప్పుడు మనమున్న చెట్టుకన్నా ఎత్తుగా పొంగి వస్తున్నాడు. మనం ఈ చెట్టుపైన వుంటే మనగుడ్లు సముద్రంలో కొట్టుపోతాయి. కనుక వేరే చోటికి పోయి నివసించడం మంచిది'' అంది.



''ఓసి పిచ్చిదానా! విష్ణువు వాహనమైన గరుత్మంతుడు మనవాడు. ఆయన మన పక్షి కులానికి రక్షకుడై వుండగా ఈ సముద్రుడు మనకేం అపకారం చేయగలడు'' అన్నది మగతీతువు.

''హితవు చెపితే వినని మూర్ఖుడు కర్రను వదలి క్రిందపడిన తాబేలు వలె చెడిపోతాడు. ఆ కథ విను'' అంటూ ఆడతీతువు చెప్పసాగింది.

## మాటకారి తాబేలు

ఒక గ్రామంలో ఒక కొలను వుంది. ఆ కొలను నిర్మలమైన నీటితో, కలువపూలతో కళకళలాడుతుండేది. అందులో కంబుగ్రీవుడనే తాబేలు, వికట, సంకటములనే



హంసలు ఎంతో స్నేహంగా నివసిస్తున్నాయి.

ఒకనాడు హంసలు, తాబేలు ఇలా మాట్లాడుకున్నాయి.

''తాబేలు మిత్రమా! ఈ కొలను క్రమక్రమంగా ఎండిపోతున్నది. కనుక మేము వేరే కొలనుకు వెళ్ళిపోవాలనుకుంటున్నాం'' అన్నాయి హంసలు.

''అయ్యో! మనం చిరకాలంగా స్నేహితులం, నన్ను ఒంటరిగా విడిచి వెళ్ళడం మీకు న్యాయంకాదు. నన్ను కూడా మీతోపాటు తీసుకువెళ్ళండి'' అంది తాబేలు.

ఆ మాటలు విని హంసలు ఆలోచించాయి.

''మిత్రమా! మేము చెప్పినట్లు చేస్తే నిన్నూ మావెంట తీసుకు వెళతాము. మేము ఒక కర్రను చెరొకవైపు ముక్కుతో పట్టుకుంటాం. నీవు ఆ కర్ర మధ్యభాగాన్ని నోటితో కరచి పట్టుకో. కానీ దారి మధ్యలో యెట్టి పరిస్థితులలోనూ నీవు నోరు విప్పరాదు. జాగ్రత్త!'' అన్నాయి హంసలు.

''మీరు చెప్పినట్లే చేస్తాను'' అంది తాబేలు.

చెప్పినట్టుగానే హంసలు ఒక కర్ర రెండు కొనలను ముక్కుతో కరచి పట్టుకున్నాయి. తాబేలు కర్ర మధ్యభాగాన్ని నోటితో కరచి పట్టుకుంది. తర్వాత హంసలు గాలిలోకి ఎగిరాయి.

తాబేలుతో సహా హంసలు గాలిలో ఎగురుతుండగా చూసిన గ్రామంలోని పిల్లలు ఆనందంగా అరుస్తూ హంసలు వెళుతున్న దారివెంటే పరుగుతీశారు.

వారి కేకలు విని బుద్ధిలేని ఆ తాబేలు ''ఆ సందడి ఏమిటి?'' అని అడగటానికి నోరు తెరిచిన మరుక్షణం నేలమీద పడి చనిపోయింది.


ఆడతీతువు ''హంసలు-తాబేలు'' కథ చెప్పి ''తాబేలు మాదిరిగానే చెప్పిన హితవు వినని ఎవరికైనా ఇదే గతి పడుతుంది. ఇదే విధంగా పూర్వం ఒక చేప-మిత్రుడు చెప్పిన మంచి వినక ప్రాణం పోగొట్టుకుంది. ఆ కథ చెబుతాను విను'' అంటూ చెప్పసాగింది.

## మూడు చేపలు

ఒక చెరువులో దూరదర్శి, కుశాగ్రబుద్ధి, మందబుద్ధి అనే మూడు చేపలు నివసించేవి. ఒకనాడు దూరదర్శి మిగిలిన రెండు చేపలను పిలిచాడు.

''మిత్రులారా! ఈ సంవత్సరం వర్షాలు సరిగ్గా పడలేదు. కనుక ఈ చెరువు యెండిపోతున్నది. ఆలస్యం చేస్తే మనం జాలరుల చేతికి చిక్కడం తప్పదు!'' కనుక ఈ లోపుగానే మనం బాగా నీరు వున్న చెరువులోకి మారడం మంచిది'' అంది దూరదర్శి.

''అంతవరకూ వస్తే ఏం చేయాలో అప్పుడే



చూసుకోవచ్చు'' అంది కుశాగ్రబుద్ధి.

దూరదర్శి చెప్పిన మాటలు వినీవిననట్లు ఊరుకుంది మందబుద్ధి.

దూరదర్శి ఆ రోజే మరో చెరువులోకి వెళ్ళిపోయింది.

దూరదర్శి చెప్పినట్లే ఆ మరునాడు ఆ చెరువు వద్దకు ఒక జాలరి వచ్చాడు. వల వేశాడు. మిగతా చేపలతో పాటు కుశాగ్రబుద్ధి, మందబుద్ధి కూడా వలలో చిక్కుకున్నారు.

జాలరి వలను విడదీసి, చచ్చిన చేపలను తరువాత తీసుకుపోవచ్చు అనుకుని వాటిని చెరువు గట్టున పడేస్తున్నాడు. ఈ విషయం గమనించిన కుశాగ్రబుద్ధి చచ్చిన దానివలె కదలకుండా వుండిపోయింది. అది చచ్చిన చేప అనుకుని జాలరి దాన్ని ఒడ్డున విసిరేశాడు. వెంటనే కుశాగ్రబుద్ధి జాలరి కంటపడకుండా నిదానంగా చెరువులోకి జారుకుని ప్రాణం కాపాడుకుంది.

కాని ఏ ఉపాయం లేని మందబుద్ధి గిలగిల కొట్టుకోవడం చూసిన జాలరి దాన్ని బుట్టలో వేసుకున్నాడు.

ఆడతీతువు మూడు చేపల కథ చెప్పి ''ఈ విధంగా హితులు చెప్పిన మంచి మాటలు విననివారు చెడిపోతారు'' అంది.

ఆపద వచ్చినపుడు శత్రువు, శత్రువు కలిసి మిత్రులౌతారు. పూర్వం ఒక ఎలుక ఈ విధంగానే చేసింది. కథ వినండి అంటూ రాజు హిరణ్యగర్భుడు. మంత్రి జక్కనతో ఈ విధంగా చెప్పడం మొదలుపెట్టాడు.

## పిల్లి-ఎలుక

పంచవటిలో ఒక మర్రిచెట్టు వుంది. ఆ చెట్టు తొర్రలో రోమశుడనే పిల్లి వుంది. ఆ చెట్టు కింద వున్న కన్నంలో పలితుడనే ఎలుక నివసిస్తున్నది.



ఒకనాటి రాత్రి వేటగాడొకడు చెట్టుచుట్టూ వల పన్నాడు. పిల్లి ఆహారం కోసం తొర్రలో నుండి దిగుతూ ఆ వలలో చిక్కుకుంది. కొంతసేపటికి కలుగులో నుండి బయటకు వచ్చిన ఎలుక, వలలో చిక్కిన పిల్లిని చూసింది.

ఇంత కాలానికి పీడ విరగడయింది. యిన్నాళ్ళూ దీని భయం వల్ల బయటకు రావాలంటేనే మహా కష్టమయింది అనుకుంటూ ఆనందించింది ఎలుక.

ఇంతలో గుడ్లగూబ ఒకటి వాలి ఎలుకను ఎత్తుకుపోయే అవకాశం కోసం చూడసాగింది. గుడ్లగూబను

గమనించి ఎలుక భయంతో వణికిపోయింది. దాని బారినుండి ఎలా బయటపడాలా అని తీవ్రంగా ఆలోచించి పిల్లిని పలకరించింది.

''పిల్లిబావా! మనం ఇద్దరం ఎంతోకాలం నుండి యీ చెట్టును ఆశ్రయించుకుని వుంటున్నాం. నీకు ఇంతవరకూ నేనే ఉపకారమూ చేయలేదు. ఆ సమయమిప్పుడు వచ్చింది కదా అని సంతోషపడుతుంటే ఆ గుడ్లగూబ నన్ను తినాలని చూస్తోంది'' అంది ఎలుక.

''ఎలుకా! నీకు ఆ భయమే అక్కరలేదు. నువ్వు వచ్చి సహాయం చేస్తావేమో అని యింతవరకూ ఆలోచిస్తున్నాను. ఇంతలో వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు నువ్వే నన్ను పలకరించావు. నీవు నా పక్కన వున్నంత వరకు ఆ గూడ్లగూబ నిన్ను తాకలేదు. ముందు యీ వల కొరికి నన్ను రక్షించు, నీ ప్రాణాన్ని నేను కాపాడతాను'' అంది పిల్లి.

వెంటనే ఎలుక వల దగ్గరకు వెళ్ళి కొరుకుతున్నట్లు నటించసాగింది. ఎంత సేపటికి ఎలుక పిల్లి దగ్గరనుండి కదలకపోవటంతో చూసిచూసి గుడ్లగూబకు విసుగు పుట్టి వెళ్ళిపోయింది.

గుడ్లగూబ వెళ్ళిపోవడం చూసి ఎలుక మనసు కుదుటపడింది. కాని వలతాళ్ళు కొరికితే పిల్లి తనమీదపడి చంపుతుందేమో అని ఎలుకకు భయం. ఈ ఎలుక నన్ను రక్షిస్తుందో లేదో అని పిల్లికి భయం.

అదే సమయంలో దూరాన రెండు వేటకుక్కలతో వస్తున్న వేటగాడిని పిల్లి చూసింది.

''మిత్రమా! అడుగో, వేటగాడు వస్తున్నాడు. ఇప్పుడు నా ప్రాణం నీ చేతిలో వుంది. తొందరగా వల బారినుండి విడిపించు'' అంటూ ప్రాధేయపడింది పిల్లి.

ఎలుక వెంటనే వలతాళ్ళను గబగబ కొరికి, పిల్లివల్ల ఏ అపకారం జరగకుండా చరచరా పోయి కలుగులో దూరింది. పిల్లి వలలో నుండి బయటపడి పరుగు పరుగున చెట్టెక్కింది. వేటగాడు యీ వింతను చూసి ఆశ్చర్యపోయి, చేసేదిలేక వల తీసుకొని వెళ్ళిపోయాడు.

తరువాత పిల్లి నిశ్చింతగా చెట్టుదిగి వచ్చి ఎలుక నివసించే కలుగు వద్దకు చేరింది.

''మిత్రమా! కన్నంలో నుండి బయటకురా! ఈ రోజు నా ఇంట్లో భోజనం పెట్టాలని వుంది.'' అంటూ పిల్లి సాదరంగా ఎలుకను ఆహ్వానించింది. ఎలుక కన్నంలో నుండి బయటకు రాకుండానే పిల్లికి జవాబు ఇచ్చింది.

''చాలు చాలు! ఇంతసేపు వలలో చిక్కి ఆహారం కూడా లేక కడుపు మాడ్చుకుని వున్నావు. నన్ను తినదలచి కపటప్రేమ చూపుతున్నావు. పో పో! నీ ఎత్తులు నా దగ్గర సాగవు'' అంది ఎలుక.

హిరణ్యగర్భుడు కథ చెప్పడం ముగించాడు.



**రచయిత పరిచయం: కీ.శే. శ్రీ పడాల రామారావు** సాహిత్య కృషి 'ఖైదు' నవలతో ప్రారంభమైంది. వీరు దాదాపు 90 సాంఘిక, చారిత్రక, పౌరాణిక రచనలు చేశారు. అందులో నవలలు, కథలు, నాటకం, నాటికలు, బుర్రకథలు మొదలగు సాహిత్య ప్రక్రియలున్నాయి. వీటిలో అల్లూరి సీతారామరాజు -నాటకం, నవల, మార్బ్-ట్రేడ్ యూనియన్లు, విప్లవ మహాయుగం, కళాపూర్ణోదయం, అశోక్ సామ్రాట్ ముఖ్యమైనవి.

వీరి బాలల బొమ్మల భాగవతం, పిల్లల బొమ్మల రామాయణం, బాలల బొమ్మల భారతం, సంపూర్ణ బాలల బొమ్మల పంచతంత్రం కథలు, వాల్మీకి రామాయణం, కవిత్రయ మహాభారతం, పోతన మహాభాగవతం, అల్లూరి సీతారామరాజు అత్యంత ప్రజాదరణ పొందినవి.

ప్రముఖ రచయితగా, జర్నలిస్టుగా, సామాజిక కార్యకర్తగా తెలుగు ప్రజలకు సుపరిచితులైన పడాల రామారావు 2006, ఏప్రిల్ 4న స్వర్గస్థులయ్యారు. ప్రస్తుత పాఠ్యభాగం వీరి ''సంపూర్ణ బాలల బొమ్మల పంచతంత్రం కథలు'' నుండి గ్రహించబడింది.

## I చర్చించండి.

1) కథలు మనసుకు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

2) నీతిని బోధించే నాలుగు సామెతలు.

## II పదజాలాన్ని పెంపొందించుకుందాం.

తీతువుపిట్ట = తిత్తిరి పిట్ట, ఒక రకం పిట్ట; హితవు = మంచి, మేలు; అపకారం = కీడు; చిరకాలం = చాలాకాలం; సందడి = గోల, రద్దు, జన సమ్మర్థం; జాలరి = చేపలు పట్టేవాడు; తొర్ర = చెట్టులోపల ఏర్పడే పెద్ద రంధ్రం; కన్నం = రంధ్రం.

## III చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) 'హంసలు - తాబేలు' కథ రాసి, నీతిని తెల్పండి.

2) 'హితులు చెప్పిన మంచి మాటలు విననివారు చెడిపోతారు' - అని చెప్పుటకు ఒక నీతి కథను రాయండి.

3) తీతువు పిట్టల సంభాషణను రాయండి.

4) కుశాగ్రబుద్ధి తన ప్రాణాన్ని కాపాడుకొన్న విధము.

5) వలలో చిక్కుకున్న పిల్లితో ఎలుక సంభాషణ.

### ఆ) ఎవరు ఎవరితో అనిరి.

1) ''ఈ సముద్రుడు మనకేం అపకారం చేయగలడు''. ☐ → ☐

2) ''ఈ కొలను క్రమక్రమంగా ఎండిపోతున్నది''. ☐ → ☐

3) ''మీరు చెప్పినట్లే చేస్తాను''. ☐ → ☐

4) ''ఆలస్యం చేస్తే మనం జాలరుల చేతికి చిక్కడం తప్పదు''. ☐ → ☐

5) ''పో పో! నీ ఎత్తులు నా దగ్గర సాగవు''. ☐ → ☐

### ఇ) జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) గూడు కట్టినది | అ) గరుత్మంతుడు |
| 2) విష్ణువు వాహనం | ఆ) కంబుగ్రీవుడు |
| 3) ప్రాణం కాపాడుకున్నది | ఇ) మంద బుద్ధి |
| 4) తాబేలు పేరు | ఈ) కుశాగ్రబుద్ధి |
| | ఉ) తీతువు పిట్ట |

ఈ) కింది వాక్యాలు తప్పొప్పులలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.

1) ఆ కొలను మలినమైన నీటితో కళకళలాడుతుండేది. ( )

2) దూరదర్శి చెప్పిన మాటలు వినీవిననట్లు ఊరుకుంది మందబుద్ధి. ( )

3) నీవు ఆ కర్ర మధ్యభాగాన్ని నోటితో కరచి పట్టుకో. ( )

4) కుశాగ్రబుద్ధి ఆరోజే మరో చెరువులోకి వెళ్ళిపోయింది. ( )

5) ఈ ఎలుక నన్ను రక్షిస్తుందో లేదో అని పిల్లికి భయం. ( )

## IV స్వీయ వ్యక్తీకరణ

''ఆపద వచ్చినప్పుడు శత్రువు, శత్రువు కలిసి మిత్రులౌతారు'' – అని చెప్పుటకు ఒక నీతి కథను మీ సొంతమాటల్లో రాయండి.

## V భాషావగాహన:

అ) కింది పదాలకు సంధి కార్యాలు రాయండి.

| పదము | | విడదీయుట | | సంధినామం |
|---|---|---|---|---|
| 1) పోవాలనుకుంటున్నాం | = | | → | |
| 2) | = | ఎవరికి + ఐనా | → | |
| 3) కుశాగ్రబుద్ధి | = | | → | |
| 4) | = | కోరుకుతు + ఉన్నట్లు | → | |

ఆ) కింది వాటికి సమాసకార్యాలను రాయండి.

| | పదము | విగ్రహవాక్యము | సమాసనామం |
|---|---|---|---|
| 1) | మూడు చేపలు | | |
| 2) | | సముద్రము యొక్క తీరము | |
| 3) | మర్రి చెట్టు | | |
| 4) | | చింతలేనిది | |
| 5) | కపటప్రేమ | | |

ఇ) గుర్తించబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1. ఆయన మన పక్షి కులానికి రక్షకుడు

( )

2. మేము ఒక కర్రను చెరొకవైపు ముక్కుతో పట్టుకుంటాం.

( )

3. దీని భయం వలన బయటకు రావాలంటేనే కష్టమయింది.

4. ఎలుక భయంతో వణికి పోయింది.

ఈ) వాక్యాంగాలు రాయండి.

1) దూరదర్శి ఆరోజే మరో చెరువులోకి వెళ్ళిపోయింది.

2) జాలరి వల వేశాడు.

3) పిల్లి వేటగాడిని చూసెను.

4) పిల్లి వలతాళ్ళను కొరికెను.

ఉ) వాక్యరకాలు రాయండి. (సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యములు)

1) తాబేలు మిత్రమా! ఈకొలను క్రమక్రమంగా ఎండిపోతున్నది.

2) పంచవటిలో ఒక మర్రి చెట్టు వుంది.

3) పిల్లి ఆహారం కోసం తొర్రలో నుండి దిగుతూ ఆ వలలో చిక్కుకుంది.

## VI కింది సామెతను వివరించి రాయండి.

''వెతుకుతున్న తీగ కాలికి తగిలినట్లు''

## VII సృజనాత్మకత :

మీరు కూడా మిత్రలాభం, మిత్రభేదం వంటి కథా రచనకు ప్రయత్నించండి.


### ప్రత్యక్ష అనుభవం - కథా కథనం:

కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల స్నేహితులు ఆరు బయట / డాబా మీద సమావేశమై పిన్నలు, పెద్దలు వంతులవారిగా కథాకథనం చేయండి.

### నేనివి నేర్చుకున్నా :

1) హితులు చెప్పిన మంచి మాటలు విననివారు చెడిపోతారు.

2) నీతిని బట్టి శత్రువులతో సమయస్ఫూర్తితో మెలగాలి.



# 7 తోలుబొమ్మలాట



**ఉన్ముఖం:**

అలసిన జీవితాలకు ఆహ్లాదం అవసరం. అందుకే మనోరంజనం అనేది జీవితంలో ప్రాముఖ్యతను సంతరించుకున్నది. కావుననే అతి ప్రాచీనకాలంనుండే మానవుడు మనోరంజనానికి కొన్ని ఆటపాటలను కనుగొన్నాడు. క్రమంగా అవి కొన్ని నియమాలకు కట్టుబడి, ఏకరూపకతను సంతరించుకున్నాయి. అట్టివే జానపదకళారూపాలు. మనదేశం అనేక జానపదకళలకు కాణాచి. ఈ కళలు తరతరాలుగా ప్రజల నుర్రూతలూగించాయి. ఎంతో సంచలనాన్ని కలిగించి ప్రజాజీవితంతో పెనవేసుకు పోయాయి. ఇట్టి కళలలో ప్రముఖంగా పేర్కొనదగినదే తోలుబొమ్మలాట. ఇది చిత్రకళ, సంగీత సాహిత్యాల మేళవింపయి ఆబాలగోపాలాన్ని మురిపించి మైమరపించిన కళ. దీనిని గూర్చి ఇప్పుడు వివరంగా తెలుసుకుందామా!

తెలుగు జానపద కళా రూపాల్లో అత్యంత ప్రాచీనమైంది తోలుబొమ్మలాట. ఇది మానవుడు తయారు చేసుకున్న మొట్టమొదటి రూపకం. మహారాష్ట్రలో పుట్టి ఇతర రాష్ట్రాలకు వ్యాపించిన ఈ కళారూపం క్రీస్తు పూర్వం మూడు, నాలుగు శతాబ్దాలకు ముందే విశేష ప్రచారాన్ని పొందింది. ఇక్కడి నుంచి జావా, మలేషియా, ఇండోనేషియా దేశాలకు ప్రసరించింది. బౌద్ధం ద్వారా చైనాకు వ్యాపించింది. వాళ్ళు బొమ్మలాటగా బౌద్ధ కథలను ప్రదర్శించే వారు.

### తెలుగు జానపద కళారూపాలు

శాతవాహనులు, పల్లవులు, కాకతీయులు, విజయనగర రాజుల కాలంలో బహుళ జనాదరణను పొందిన ఈ కళ తంజావూరు నాయక రాజుల కాలంలో పరాకాష్టకు చేరుకుంది.

సంస్కృతంలో 'ఛాయా నాటకాలు' అని ప్రాచీన సాహిత్యంలో 'తెరమరుగు నాటకాలు' అని వీటికి పేరు. పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో శ్రీ శైలంలో జరిగే శివరాత్రి ఉత్సవాలను పేర్కొంటూ 'భారతాది కథల జీరల మఱుగుల నారంగ బొమ్మల నాడించు వారు' అని అన్నాడు. చీర మరగుల బొమ్మల నాడించేది తోలు బొమ్మలాటలోనే. సంగీతం, సాహిత్యం, చిత్రకళ, ఆట, అభినయం, హాస్యం, లోకజ్ఞానం, ధర్మాధర్మ మీమాంస కలిగిన ఒక గొప్ప సమాహార కళ ఇది.

### తోలుబొమ్మలాట-కళాకారులు

ఆంధ్ర, కర్ణాటకాల్లో తోలుబొమ్మలను ఆడించేవాళ్ళు మహారాష్ట్రలోని సతారా ప్రాంతంనుంచి వలస వచ్చిన వాళ్ళే. కాబట్టి ఈ కళారూపం మహారాష్ట్రదే. ఒకప్పుడు తెలుగు వాళ్ళైన ఆటగొల్లలు, బలిజలు, సంచారజాతుల మూలంగా దేశవిదేశాలకు ప్రాకిన ఈ కళారూపం ఈనాడు మనదేశంలో బొందిలివాళ్ళు, ఆరెవాళ్ళు మాత్రమే ప్రదర్శిస్తున్నారు. వాళ్లుకూడా వేళ్లమీద లెక్కపెట్టతగినన్ని ఊర్లలో మాత్రమే ఉన్నారు.

తోలుబొమ్మలాటను ప్రదర్శించే కళాకారులు సాధారణంగా ఒకే కుటుంబం వాళ్లో, సన్నిహిత బంధువులో అయి ఉంటారు. ప్రతి బృందంలో కనీసం ఇద్దరు స్త్రీలు, ఇద్దరు పురుషులు బొమ్మలనాడిస్తూ పాడటానికి, ఒకరు మృదంగం వాయించడానికి, ఒకరు తాళం వేయడానికి ఇంకొకరు బొమ్మలను అందించడానికి ఇలా కనీసం ఎనిమిది మందైనా ఉంటారు. పన్నెండుమంది కళాకారులు ఉన్నట్లయితే ఆటకు అన్ని హంగులూ సమకూడి సులభంగా, సుకరంగా సాగుతుంది.

### తోలుబొమ్మల తయారీ

తోలుబొమ్మలను ఆడించే వాళ్ళే వాళ్లకు కావలసిన బొమ్మల్ని తయారు చేసుకుంటారు. ఇదొక సున్నితమైన చిత్రకళ. తోళ్లను బాగా శుభ్రంచేసి అర్ధ పారదర్శకమయ్యే దాకా గీకి, దానిపైన రేఖా చిత్రాలను గీసి ఆ తర్వాత వివిధ ఆభరణాలకు తగినట్లుగా చిల్లులుకుట్టి, అటు తర్వాత అవయవాలకు, దుస్తులకు, వాటి అంచులకు, మడతలకు తగినట్లుగా వెలుగునీడలు తోచే విధంగా వేరువేరు రంగులు వేస్తారు.

## తోలుబొమ్మలాట ప్రత్యేకత

ఒకప్పుడు బొమ్మలకు ప్రకృతి సిద్ధమైన నలుపు, ఆకుపచ్చ, ఎరుపు, తెలుపు, ముదురు రంగులు వాడేవారు. ఈనాడు రకరకాల రసాయనిక వర్ణాలు, ఇతర లేత రంగులు వాడుతున్నారు. చెన్నైలో నెలకొల్పిన కేంద్ర చర్మ పరిశోధక సంస్థ సహకారం వల్ల చర్మాలు ఈనాడు సంపూర్ణ పారదర్శకాలుగా లభిస్తున్నాయి. అందువల్ల రకరకాల తోలుబొమ్మల్ని ఎంతో ఆకర్షణీయంగా తయారు చేయగలుగుతున్నారు.

బొమ్మంతా ఒకే తోలు మీద ఉండదు. తలకు, మకుటానికి ఒక ముక్క, మొండానికి ఒక ముక్క, కాళ్లకు, చేతులకు వేరువేరు ముక్కలుగా కత్తిరించి సంధిబంధాల కదలికకు, కీళ్ళు తిప్పటానికి, చేతులూకాళ్లూ ఆడించటానికి అనువుగా వాటిని జోడిస్తారు. ఒక్కొక్క చేతికి, అరచేతికి వేరు, మణికట్టు నుంచి మోచేతి దాకా వేరు, మోచేతి నుంచి భుజందాకా వేరు ముక్కలుంటాయి. కాళ్లు దేవ, మానవ, రాక్షస జాతులను బట్టి, వివిధ పక్షి మృగాకారాల్ని బట్టి తయారుచేస్తారు. వయోభేదాలనుబట్టి బొమ్మల పరిమాణం ఒక అడుగు నుంచి ఆరడుగులదాకా ఉంటుంది. బొమ్మల జాతి భేదాల్ని బట్టి రంగులు వాడతారు.

రామాయణంలో బాలరాముడు, వనవాస రాముడు, రణరంగరాముడు, పట్టాభిరాముడు వేరువేరుగా ఉంటారు. ఇలా ఒకే పాత్రకు నాలుగైదు బొమ్మల్ని తయారు చేసుకుంటారు. ప్రదర్శకులు ఆడే ఆటల్ని బట్టి ఒక్కొక్క బృందం వాళ్ల దగ్గర నూరు, నూట పాతిక బొమ్మల గనియం (పెట్టె) ఉంటుంది.

భారతదేశంలోనే కాదు ప్రపంచంలోని మరే దేశంలోను ఆంధ్రదేశంలో చేసేటంత పెద్దసైజు బొమ్మలుండవు. బొమ్మల తలలకు కదలిక ఉండటం ఆంధ్రప్రదేశంలోని ప్రత్యేకత.

## తోలుబొమ్మలాట - ప్రదర్శన

తోలుబొమ్మలాట తెల్లని తెర వెనుక దీపకాంతిలో ప్రదర్శించబడుతుంది. ఈ ఆటను ప్రదర్శించడానికి కళాకారులే ఊరి బయటగాని, నాలుగు దారుల కూడలిలో గాని, విశాలమైన మందిరావరణంలో గాని రంగం నిర్మించుకుంటారు. తాత్కాలికమైన ఈ రంగస్థలం వెదురు వాసాలతో పందిరి రూపంలో ఉంటుంది. మూడు వైపుల మూయబడి ముందు భాగం తెల్ల చీరలతో ఏటవాలుగా నిర్మించబడుతుంది. లోపల ఉన్న ప్రదర్శకులు బయటికి కన్పించకుండా తెల్లచీర కింది భాగాన మోకాలిబంటిగా నల్లచీరగాని, ముతక గుడ్డకానీ కడతారు. బొమ్మలు తెర మీద జారిపోకుండా ఉండటానికి తెరను ఆనుకొని ఒక పెద్ద బల్ల ఉంచుతారు. దాని మీద వరుసగా ఆముదం దీపాలు



తెర అంతటా సమానంగా వెలుతురు పడేట్లు నిలుపుతారు. కాంతి తగ్గితే బొమ్మలు మసకబారినట్లు కనిపిస్తాయి. కాబట్టి దీపాల కాంతి తగ్గకుండా ఉండటానికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు. అలా తెరమీద బొమ్మలుంచి దాని వెనుక అఖండ దీపాలు వెలిగిస్తే చీకట్లో కూర్చున్న ప్రేక్షకులకు బొమ్మలు సజీవాలుగా కన్పిస్తాయి.

బొమ్మ నెత్తినుంచి వెన్నెముక చివరిదాకా ఒక బెత్తెడంత సన్నని వెదురుబద్ద బిగించి ఉంచుతారు. తెరమీద ప్రదర్శించేటప్పుడు ఈ బద్దను అట్టడుగున ఒక చేత పట్టుకొని మరొక చేతిలోని సన్నబెత్తంతో వివిధ అవయవాలను కదలిస్తూ ఆంగికాభినయం చేయిస్తారు.

## నాటకాల్లో సూత్రధారుని ప్రత్యేకత

ఈ బొమ్మల్ని ఆడించడానికి ఓర్పునేర్పు చాలా అవసరం. లేకపోతే మనిషి నీడ తెరమీద పడుతుంది. ఒక చేతిలో బొమ్మను పట్టుకొని మరో చేత్తో చిన్న కొంకి ఉన్న బద్దను పట్టుకొని బొమ్మ చేతులకు తగిలించి సంభాషణ ప్రకారం బొమ్మల్ని కదలించాల్సి ఉంటుంది. ఒక్కొక్కరు ఒక బొమ్మ లేదా రెండు చేతులలో రెండు బొమ్మల్ని ఆడిస్తుంటారు.

ఏటవాలుగా ఉన్న 'తెర-పటం' మీద కళాకారులు కథా సన్నివేశాలకు అనుకూలంగా ఆయా పాత్రల బొమ్మలు నిలిపి వాటిని 'తెర-పటం' మీద అటూ ఇటూ ముందు వెనుకలకు నడిపిస్తూ ఒక్కొక్కప్పుడు తెరకు కొద్ది దూరం వెనక్కి తీసుకుపోవడంలోను, ముందుకు అంటే తెర సమీపానికి తీసుకు రావడంతోను, చేతులు కాళ్లు కదలికలోను ఆంగికాభినయం ప్రదర్శింపజేస్తారు. యుద్ధాన్ని, పోట్లాటల్ని ప్రదర్శించడానికి ఒక బొమ్మపైన మరొక బొమ్మ పడ్డట్లు, కాళ్ళతో తన్నుకున్నట్లు, చేతులతో కొట్టుకున్నట్లు గిరికీలు (పల్టీలు) కొట్టిస్తూ బొమ్మలను తలకిందులుగా తిప్పుతూ కళాకారులు తమ కాళ్లకింద ఉన్న జమిలి చెక్కలతో వేరు వేరు ధ్వనులు సృష్టిస్తూ రక్తి కట్టిస్తారు.

ఈ ఆటలో ప్రధానమైన వాడు సూత్రధారుడు. ఈనాటి పరిభాషలో 'డైరెక్టర్'గా పిలవబడే సూత్రధారి సాహిత్యంలోను, సంగీతంలోను, అభినయంలోను దిట్టగా ఉంటాడు.

తోలు బొమ్మలాటలో స్త్రీ పాత్రలకు స్త్రీల వాచికమూ, పురుష పాత్రలకు పురుషుల వాచికమూ ఉంటాయి. బొమ్మల నాడించే వాళ్లే సంభాషణలు, పాటలు, పద్యాలు, దరువులూ పాడతారు. అందరూ కలిసి పల్లవిని అందుకొని తారాస్థాయిలో వంత పాడుతుంటే ఎంత దూరానికైన వినబడుతుంది. ఈ కళాకారుల కంఠాలు కంచులాగా మ్రోగుతాయి.



ఛాయాచిత్రాల సౌజన్యం : కలైమామణి శ్రీమతి ఎస్. సీతాలక్ష్మి

### తోలుబొమ్మలాట - ఇతివృత్తం

తోలుబొమ్మలాట వాళ్లు ఎక్కువగా రామాయణ, భాగవత, భారత సంబంధమైన కథల్ని ప్రదర్శిస్తుంటారు. రామాయణంలో సీతాస్వయంవరం, సుందరకాండ, లంకాదహనం, ఇంద్రజిత్తు వధ, లక్ష్మణ మూర్ఛ, మైరావణ, రావణ సంహారం, కుశలవుల కథలు, భాగవతంలో ప్రహ్లాద చరిత్ర, బాణాసురవధ; భారతంలో ద్రౌపదీ స్వయంవరం, శిశుపాలవధ, ద్రౌపదీ వస్త్రాపహరణం, ఉత్తర దక్షిణ గోగ్రహణాలు; చారిత్రకాల్లో పల్నాటి వీరుల కథలు, కుమార రాముని కథ, దేశీయరాజు కథ, వీటితో పాటు శివ జలంధర, దేవీ మహాత్మ్యం, త్రిపుర సంహారం మొదలైనవి ప్రదర్శిస్తారు.

### తోలుబొమ్మలాట - ప్రాధాన్యం

లలిత కళలన్నీ ఈ కళలో ఇమిడి ఉన్నాయి. రకరకాల కథలకు పనికి వచ్చే ద్విపదలు, పాటలు, దరువులు, పద్యాలు, శ్లోకాలు అన్నీ ఈ కళాకారులకు కంఠాపాఠంగా ఉంటాయి. సంభాషణల్ని అప్పటికప్పుడు ఆశువుగా చెప్పగల దిట్టలు ఈ కళాకారులు. వీళ్ళు గద్య పద్యాలలో పద్యానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు.

తోలుబొమ్మల వాళ్లందరూ సాధారణంగా రామభక్తులు. వీళ్లకు ఆంజనేయుడు ఇష్టదైవం. సంక్రాంతి, దసరా పండుగలప్పుడు, ఆయా ప్రసిద్ధి దేవాలయాల బ్రహ్మోత్సవాలప్పుడూ, తిరునాళ్లు, జాతరలు జరిగినప్పుడు వీరి ప్రదర్శనలుంటాయి.

తోలుబొమ్మలాట రాత్రి రెండవ జాము ప్రారంభమై తెల్లవారే వరకు కొనసాగుతుంది. ఆటంతా గంభీరంగా ఉంటే విసుగనిపిస్తుంది. ప్రేక్షకులు విసుగు చెందకుండా, నిద్రమత్తు పోగొట్టడానికి నాటకాల్లోని విదూషక పాత్రల్లాగా, సినిమాల్లోని హాస్య సన్నివేశాల్లాగా తోలుబొమ్మలాటలో కూడా కేతిగాడు, బంగారక్క, జుట్టు పోలిగాడు, అల్లాటప్పగాడు, లొట్ట గిత్తడు, రత్నాల పోలిగాడు, కొంటె కోణంగి వంటి హాస్య పాత్రలుంటాయి. ఈ పాత్రల ద్వారా చతురోక్తులతోను సంభాషణలు చెప్పించి కడుపుబ్బ నవ్వించడమే కాక సమాజంలోని కుళ్ళును పెకలింప చేస్తారు.

తోలుబొమ్మలాటను ప్రదర్శించడంలో కొన్ని విశ్వాసాలు కన్పిస్తాయి. ఉత్తరగోగ్రహణం కథ చెప్పిస్తే వర్షాలు కురుస్తాయని, వర్షాభావం ఉన్న ప్రాంతాల్లో ఈ ఆటల్ని ఆడించడం కన్పిస్తుంది. నేటికి తూర్పు గోదావరి మండలంలో శ్రీ దేనువుకొండ వేంకటయ్య రచించిన ఉత్తర గోగ్రహణాన్ని, విరాట పర్వాన్ని ప్రదర్శింప చేస్తారు. ఊరికి పట్టిన పీడలు విరగడయి పోతాయని కూడా జానపదులు నమ్మి ఈ ఆటల్ని ఆడింపచేస్తారు.

వేల సంవత్సరాలుగా తెలుగునాట విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతున్న ఈ కళారూపాన్ని ఆధునిక కాలానికి అనుగుణంగా మలచుకొని విద్యా విజ్ఞాన ప్రచారాలకు, ప్రసారాలకు బాగా ఉపయోగించుకోవచ్చు. దేశవిదేశాల్లో ప్రదర్శించబడి అన్నిచోట్లా అందరి ఆదరణకు, మన్ననకు పాత్రమైన ఈ కళారూపాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది.

బొమ్మలాట వాళ్ళ పేరుతో బళ్లారి జిల్లాలోను, అనంతపురం జిల్లాలోను బొమ్మలాటపల్లి అనే గ్రామం ఉండటం బొమ్మలాటల ప్రాచుర్యాన్ని చెప్పక చెప్తుంది. నేటి కాలంలో తోలుబొమ్మలాట ప్రదర్శకుల పరిస్థితులు అధ్వాన్నంగా కన్పిస్తున్నాయి. ఈ కళాకారులను తగిన విధంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



**రచయిత పరిచయం : కీ.శే. డా. బిరుదురాజు రామరాజు**గారు తెలంగాణా రాష్ట్రంలోని వరంగల్లు జిల్లా దేవునూరులో 1925 ఏప్రిల్ 16న లక్ష్మీదేవి, నారాయణరాజు దంపతులకు జన్మించిరి. తెలుగువీరుడు, వీరగాథలు, జానపద సాహిత్యం, అల్లూరి సీతారామరాజు, మరుగుబడిన మాణిక్యాలు, మొదలగు రచనలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 'ఆత్మగౌరవం' అవార్డు, 'రాజా-లక్ష్మి ఫౌండేషన్' అవార్డు అందుకున్నారు. ప్రస్తుత పాఠ్యభాగం ఆయన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక సదస్సులో సమర్పించిన పత్రం నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1) తోలుబొమ్మలాటకు, సినిమాలకు గల తేడాలు.
2) జానపద కళారూపాలు.
3) ''చలన చిత్రాలకు మూలం తోలుబొమ్మలాట''.
4) తోలుబొమ్మలాట ప్రాచుర్యము.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) తోలుబొమ్మలాట పుట్టు పూర్వోత్తరాలు.
2) తోలుబొమ్మలాటను ప్రదర్శించు విధానాన్ని వివరించండి.
3) తోలుబొమ్మలాటలో ప్రదర్శించే వివిధ కథలు.

### ఆ) గడులను కుండలీకరణంలో ఇచ్చిన సరియైన పదములతో పూరించండి.

(దీపకాంతి, అభినయంలోను, పరాకాష్ఠ, సతారా, సోలాపూర్)

1) తోలుబొమ్మలాట తంజావూరు నాయక రాజుల కాలంలో [ ] కు చేరుకుంది.
2) తోలుబొమ్మలను ఆడించే వాళ్ళు మహారాష్ట్రలోని [ ] ప్రాంతం నుంచి వలస వచ్చినవాళ్ళే.
3) తోలుబొమ్మలాట తెల్లని తెరవెనుక [ ] లో ప్రదర్శింప బడుతుంది.
4) సూత్రధారి సాహిత్యంలోను, సంగీతంలోను [ ] దిట్టగా ఉంటాడు.

### ఇ) జతపరచండి :

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) చెన్నైలో నెలకొల్పినది | అ) రంగులు వాడతారు. |
| 2) బొమ్మలజాతి భేదాల్నిబట్టి | ఆ) ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటారు. |
| 3) దీపాలకాంతి తగ్గకుండా | ఇ) ధనం చాలా అవసరం |
| 4) తోలుబొమ్మల్ని ఆడించడానికి | ఈ) కేంద్ర చర్మ పరిశోధక సంస్థ |
| | ఉ) ఓర్పు, నేర్పు చాలా అవసరం. |

### ఈ) తప్పొప్పులను గుర్తించండి.

1) తోలు బొమ్మలాట వాళ్ళు ఎక్కువగా రామాయణ, భాగవత, భారత సంబంధమైన కథల్ని ప్రదర్శిస్తుంటారు. [ ]
2) తోలుబొమ్మలాట తెలంగాణా రాష్ట్రంలో పుట్టి ఇతర రాష్ట్రాలకు వ్యాపించినది. [ ]
3) బొమ్మల తలలకు కదలిక ఉండటం ఆంధ్రప్రదేశంలోని ప్రత్యేకత. [ ]
4) తోలుబొమ్మల కళాకారులు గద్యపద్యాలలో గద్యానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. [ ]

## III స్వీయవ్యక్తీకరణ :

1) తోలుబొమ్మలాట పట్ల మీ అభిప్రాయం.
2) తోలుబొమ్మలాట కళాకారులను ప్రభుత్వం ఏ విధంగా ఆదుకోవాలో మీసొంతమాటల్లో రాయండి.
3) తోలుబొమ్మలాట తెలుగునాట జనప్రియమైందని ఎట్లు చెప్పవచ్చునో మీ సొంతమాటల్లో రాయండి.

## IV భాషావగాహన :

**అ) కింది వాక్యాల్లో గుర్తింపబడిన పదాలు ఏ భాషాభాగాలో రాయండి:**

1) ఒకే పాత్రకు నాలుగైదు బొమ్మల్ని తయారు చేసుకుంటారు. (క్రియ, నామవాచకం, సర్వనామం)

2) తోలుబొమ్మలాట ప్రదర్శకుల పరిస్థితులు అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. (అవ్యయము, విశేషణము, క్రియ)

3) ఇది మానవుడు తయారు చేసుకున్న మొట్టమొదటి రూపకం. (నామవాచకం, సర్వనామం, క్రియ)

4) ఈ కళారూపం బౌద్ధం ద్వారా చైనాకు వ్యాపించింది. (నామవాచకం, క్రియ, అవ్యయము)

**ఆ) కింది వాటికి సంధి కార్యాలు రాయండి.**

| పదము | విడదీసి రాయుట | సంధి నామం |
|---|---|---|
| 1. శతాబ్దము | | |
| 2. | తగిన + అట్లు | |
| 3. ఉన్నట్లయితే | | |
| 4. | అప్పటికి + అప్పుడు | |
| 5. ఆంగికాభినయం | | |

**ఇ) కింది వాటికి సమాసకార్యాలు రాయండి.**

| పదము | విగ్రహవాక్యము | సమాస నామం |
|---|---|---|
| 1. జనాదరణ | | |
| 2. | తెల్లనైన చీర | |
| 3. రెండు బొమ్మలు | | |
| 4. | ఓర్పును, నేర్పును | |
| 5. బళ్ళారి జిల్లా | | |

**ఈ) కింది వాక్యాలలో గీతగీసిన ప్రత్యయములు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

1) ఈ కళారూపం మహారాష్ట్రలో పుట్టి ఇతర రాష్ట్రాలకు వ్యాపించింది.

2) వయోభేదాలను బట్టి బొమ్మల పరిమాణం ఉంటుంది.

3) పద్యాలు, శ్లోకాలు అన్నీ ఈ కళాకారులకు కంఠాపాఠంగా ఉంటాయి.

4) తోలుబొమ్మలను జంతువుల చర్మాలతో తయారు చేసుకుంటారు.


ఉ) కింది పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.

1) ప్రాచీనము 2) మనకబారినట్లు 3) కంఠాపాఠంగా 4) ప్రసిద్ధి 5) ప్రదర్శించుట.


## V అల్లిక :

కింది అల్లికలను పూరించండి :

1) తోలుబొమ్మలాట వారికి కంఠాపాఠంగా వచ్చేవి.



2)




## VI అంశాల ఆధారంగా 'ఈ-మెయిల్' పద్ధతిలో అనధికార, అధికార లేఖలు రాయండి.

- కళాశాలల అంతర్గత వైజ్ఞానిక ప్రదర్శన గురించి తెలియచేస్తూ తాతయ్యకు ఈ-మెయిల్
- కళాశాలల అంతర్గత వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేయించవలసినదిగా కోరుతూ ప్రధానోపాధ్యాయునకు ఈ-మెయిల్.

## VII సృజనాత్మకత :

1) వివిధ రకాల జానపదకళలను గూర్చి అంతర్జాలం ద్వారా తెలుసుకోండి.

2) విభిన్న సంస్కృతుల జానపద కళలను, వాటి చిత్రాలను సేకరించి, వాటిని వివరిస్తూ ఒక ఆల్బమ్ తయారు చేయండి.

## VIII ప్రాజెక్ట్‌పని-ప్రదర్శన :

అట్టలు, రంగులు ఉపయోగించి బొమ్మలను తయారు చేయండి. పాఠశాలలో చక్కని సంభాషణలు, పాటలు జతకలిపి బొమ్మలాటను ప్రదర్శించండి.

## నేనివి గ్రహించా :

1) తోలుబొమ్మలు తయారు చేయువిధానం.
2) తోలుబొమ్మలాట ప్రాధాన్యత.
3) జానపదకళలను ప్రోత్సహించుట.

# 8 గెలుపు



**ఉన్ముఖం:**

**కష్టబెట్టబోకు కన్నతల్లి మనసు**
**నష్టబెట్టబోకు నాన్న పనులు**
**తల్లిదండ్రులన్న దైవ సన్నిభులురా**
**లలిత సుగుణజాల తెలుగుబాల!**

తల్లి, తండ్రి, గురువు దైవంతో సమానం అన్నారు పెద్దలు. అనగా మన జీవితంలో తల్లిదండ్రుల స్థానం ఎంతో ఉన్నతమైనది. అందుకే శ్రవణకుమారుడు, ధర్మవ్యాధుడు తల్లిదండ్రులకు ఎంతో శ్రద్ధా భక్తులతో సేవచేశారు. ఒక వేళ తెలిసో తెలియకో పొరపాట్లు చేసినా పశ్చాత్తాపపడి సరిదిద్దుకోవటం తక్షణ కర్తవ్యం. ఆ విధంగా పశ్చాత్తాపంతో తన పొరపాటును సరిదిద్దుకున్న 'రాజు'ను గురించి తెలుసుకుందామా!

విలాసవంతమైన జీవితాన్ని మెడలో వేసుకొని కులాసాగా తిరుగుతున్నాను. నాన్న కష్టపడి చదివిస్తుంటే నేను చదువుకోవడం మానేశాను. రోజుకో డ్రస్‌వేస్తూ పగటివేషగాడిలా షికార్లు కొడుతున్నాను. చిన్నప్పటినుంచి ఇప్పటివరకూ నాన్నచేసే హితబోధ ఒక్కటే.

**మాతృదేవోభవ - పితృదేవోభవ - వివరించండి.**

"ఒరేయ్ రాజు... జీవితంలో గెలుపోటములు సహజం, కాని ఎంత బాధవున్నా చివరికి గెలవాలి. మన వంశంలో దేనిలోను ఓడిపోయిన వాళ్ళు లేరు. బాగా గుర్తుపెట్టుకోరా...." అంటున్న నాన్నమాట అప్పుడప్పుడు నా మస్తిష్కగూడులో తళుక్కున మెరుస్తుండేది. ఐనా అలవాటుపడిన మనసు ఒకవైపే ఒరిగిపోతుంటే ఆపేశక్తిని కోల్పోయాను.

మాది చాలా ఉన్నతమైన కుటుంబం. డబ్బులోనే కాదు, పరపతిలోను, గౌరవంలోను పెట్టింది పేరు. మా ఊరిలో మాదే పెద్దఇల్లు. నేను ఒక్కగానొక్క కొడుకుని, గారాబంగా పెంచుతున్నారు, నాకు జలుబు చేస్తేనే చాలు, అమ్మ అన్నం తినడం మాని నా బాగోగులు గురించే మథన పడేది. బాగా చదివించాలనే నాన్న పట్టుదలకు అవధులుండేవి కావు. పదవతరగతి పబ్లిక్ పరీక్ష రాయడానికి బయలుదేరే ముందు నాన్న ఒకమాటన్నాడు.

"రాజు.... మీపెదనాన్న కొడుకు విజయ్ లేడూ.... పదవతరగతి ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడని ఊరాళ్ళందరు మెచ్చుకున్నార్రా.... అలాగే నువ్వుకూడా పరీక్షల్లో గెలవాల" అనిన నాన్న ఆశయాన్ని నెరవేర్చాను. కన్నవారి కళ్ళల్లో ఆనందాన్ని చూసిననాకు, నాజీవితం ధన్యమైందనుకున్నాను. చదువులోనే కాదు ఆటల్లోను మేటిగా గెలుపొందాను. అన్నింటిలోను గెలుపును సాధిస్తున్న నన్ను చూసి అమ్మానాన్నలో సంతోషం హద్దులు చెరిపేసుకుంది.

"ఏమయ్యా సుందరం.... మీవాడు చదువులోనే కాదయ్యా మునుముందుకు అన్ని రంగాల్లోను గెలుస్తాడు" ప్రిన్సిపాల్ భక్తవత్సలం నాన్నతో అంటుంటే చెట్టుచాటున వుండి ఎగిరి గంతేసాను.

ఇన్నాళ్ళు నాన్న తెచ్చింది తీసుకునే వాణ్ణి. ఇప్పుడు నేను కోరింది నాన్న తెచ్చి పెడుతున్నాడు. ఇంటర్ పూర్తికాగానే డిగ్రీ చేయడానికి పట్టణం వెళ్ళాను. అక్కడే వుండి కాలేజీకు వెళ్ళాల్సి వచ్చింది. సెలవుల్లో కూడా ఇంటికి వెళ్ళడానికి తీరిక వుండేది కాదు. కావలసినంత డబ్బు నాన్నే పంపేవాడు.

యుక్తవయసు మీదపడి లోకజ్ఞానం బాగా ఒంటబట్టించుకున్నాక విజ్ఞానంతో బాటు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాను. కొత్తకొత్త స్నేహాలు కలిసి వాళ్ళతో మెసలాక... కాలేజీ హాజరుపట్టీలో పర్సెంటేజీ తగ్గిపోయింది, అల్లరిగ్యాంగ్‌లో నాపేరు మొదటికి చేరింది. సెల్‌ఫోన్ కావాలని నాన్నకు తెలిపిన తక్షణం డబ్బు ఆగమేఘాలమీద దూసుకొచ్చింది. సెల్‌వాడకం మొదలయ్యాక అక్కడినుండి మలుపు తిరిగింది.

క్లాసులు ఎగ్గొట్టి క్రికెట్ ఆటలో ఎక్కువ శాతం నిమగ్నం అయ్యాను. చెడువ్యసనాలు నా చుట్టూచేరి పీడించడం మొదలుపెట్టాక విద్యార్థికున్న లక్షణాలన్నింటిని కోల్పోవాల్సి వచ్చింది.

**"పైపై మెరుగులకు యువత లోనుకాకూడదు"- వివరించు.**

ఒకరోజు నాన్న ఫోన్ చేసి ''బాబు.... మీ అమ్మకు ఒళ్ళు బాగోలేదు. నిన్ను చూడాలంటోంది. ఒకసారి వచ్చిపోరా అన్నాడు. విలాసాల్లో మునిగితేలిన నేను వెళ్ళలేదు. అంతే ఆ రోజు నుండి నాన్న ఫోన్ చేయడం మానేసాడు. ఇదివరకే నాన్న పంపిన డబ్బులు సంవత్సరం పాటు నా విలాసవంతమైన జీవితానికి పనికొచ్చాయి. చాలారోజులకు అమ్మానాన్నను చూడాలనిపించింది. సెల్‌ఫోన్ విక్రయించగా వచ్చిన డబ్బుతో ఊరికి బయలుదేరాను.

సొంత ఊర్లో బస్సుదిగి రెండడుగులు ముందుకు వేయగానే మాసిపోయిన చొక్కా.... చిందరవందరగావున్న జుత్తు, ముక్కులోకి దుమ్ము పడకుండా అరముఖాన్ని కప్పుతూ చుట్టుకున్న గుడ్డ... ఆటోలో రెడిగా కూర్చుని వున్నాడు వెళ్ళి...

''ఏమయ్యా.... టవర్‌క్లాక్ పక్కవీధికి వస్తావా'' అనడిగాను. ఎక్కండి బాబు అన్నాడతను. ఎక్కికూర్చున్నా.... ఆటో కదలింది. నేరుగా వెళ్ళి ఒకపూరి గుడిసెముందు ఆటో ఆపాడు. నాకేమీ అర్థం కాలేదు. అలాగే కూర్చుని వున్నాను.

**''తన కోపమె తన శత్రువు''... ఎందువలన**

''మీ ఇల్లు వచ్చింది దిగు బాబు'' అన్నాడాయిన.

''ఏమయ్యో.... మాఇల్లు చూసావా. పెద్దమేడ, గుడిసె చూపి ఫూల్‌ని చేయకు.'' వెంటనే ఇలా అన్నాను.

''కాదు బాబు పొరబడుతున్నావ్ ఇది మీ ఇల్లే దిగండి'' అతని మాటకు నాలో ఓపిక చచ్చిపోయింది.

''పెద్దవాడివి కదాని ఇందాకట్నుంచి మర్యాదిస్తుంటే వెటకారమాడుతావా..'' అంటూ ఆటోదిగి కోపంగా అతని వంక చూశాను. ఇంతలో అతని ముఖానికి చుట్టుకున్న కండువా జారిపోయింది. అంతే నాగుండె ఆగిపోయినంత పనైంది. అతను ఎవరోకాదు మానాన్నే.... ముఖానికి గుడ్డ చుట్టుకొని వుంటే ఎవరో అనుకున్నాను. స్వయానేనాన్నే నన్ను తీసుకొచ్చాడని తెలిసాక నాలో బాధకు అంతులేకుండా పోయింది. ఆ క్షణాన ఏమి అర్థం కాలేదు నాకు. చూస్తూ నిలబడిపోయాను. నోరు పెగల్లేదు.

**రాజు మార్పుకు కారణం.**

రోజు పట్టుచీర కట్టి దర్జాగా తిరిగే అమ్మ దర్బారు, నావల్లనే ఈ రోజు అణగారిపోయింది. పాతచీర కట్టుకుని పూరింటి పంచన దిగాలుగా నిలుచున్న అమ్మను చూసి నాగుండె తరుక్కుపోయింది. నాన్న వైపు తిరిగి తలదించుకున్నాను.



''తల దించుకోవాల్సింది నువ్వుకాదు బాబూ మేము. కొడుకు పైచదువులు చదివి... గొప్ప ఉద్యోగం సంపాదించి మూడుపూటలా కాస్త తిండి పెడతాడనుకున్నాము. ఇలా నోటికాడ ముద్దను లాగేస్తాడనుకోలేదు. తల్లిదండ్రులు అమాయకుల్లే అనుకొని మాయచేసావు. మాది అమాయకత్వం కాదు బాబూ నమ్మకం. ఈనమ్మకం వమ్ము అవుతుందని కలలో కూడా ఊహించుకోలేదు. 'నాన్నా డబ్బులు కావాలి' అంటే రెక్కలుముక్కలు చేసి పంపించాను. అందరూ సెల్‌ఫోన్ వాడుతున్నారంటే అదీ తీయించాను. నాకొడుకు అందరిలో మేటిగా వుండాలని కోరిన బట్టలు తీయించాను. ఉన్న ఆస్తులు అమ్మి లక్షలు లక్షలు కట్టానురా... ఇంజనీరు చదువుకు. ఉన్న ఇల్లు కూడా అమ్మేసానురా... చివరకి మిగిలింది ఈ ఆటో, ఆగుడిసెకూడా మనది కాదు అంటూ నాన్న కళ్ళల్లో నీళ్ళు తుడుచుకుంటూ ఆటోవద్దకు వెళుతుంటే.... నాగుండెల్లో బాధ కన్నీళ్ల రూపంలో బయటికి తన్నుకొచ్చింది. వెళ్ళినాన్న పాదాలమీద పడ్డాను.

''నన్ను క్షమించు నాన్న. నావలన ఉన్న ఆస్తులన్నీ కరిగిపోయాయి. కన్నుమిన్ను కానకుండా తిరిగినందుకు అయింది తగిన శాస్తి.'' అంటూనే అమ్మ దగ్గరకు వెళ్ళాను. పుష్టితో ఆరోగ్యంగా వుండే అమ్మ ఒట్టికట్టెలా తయారైంది.

కన్నవారి పరిస్థితి చూసి కన్నుల్లో నీరు ఆగలేదు. ''అమ్మా.... మిమ్మల్ని నేను బాగా చూసుకుంటాను. చిన్నప్పుడు నాన్న చెప్పిన మాట గుర్తుందమ్మా.... ఇకనుండి దాన్ని అక్షరాలా పాటిస్తాను. ఇంటిపట్టునే వుండి చదువును గెలుస్తాను. ఆటో నడుపుకొంటూ జీవితాన్ని గెలుస్తాను. మీకు కావల్సింది గెలుపు. అది నేను సాధిస్తాను, ధైర్యంగా వుండండి'' అంటుండగానే నాన్న నా భుజం తట్టి పైకి లేపి, ముఖంలో ఆనందాన్ని వ్యక్తం చేయగానే నాలో ధైర్యం పుంజుకుంది.

**వృత్తివిద్య ప్రాధాన్యత వివరించండి.**

కానీ నేను కోరుకునేది ఒక్కటే. ప్రతి విద్యార్థి వ్యసనపరులు కాకుండా.. చదువుపై ఆసక్తిని చూపి గెలుపును ఆస్వాదించాలి... సాధించాలి.



**రచయిత పరిచయం : శ్రీ నరెద్దుల రాజారెడ్డి** గారు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గోరంట్ల మండలము తాటిమాకులపల్లి గ్రామంలో 18-03-1986న జన్మించారు. కుళ్ళాయరెడ్డి, నలమ్మ వీరి తల్లిదండ్రులు. చిన్నచిన్న టెలీఫిల్మ్‌లకు కథ, మాటలు, పాటలు అందించారు. చిత్రావతి సాహిత్య కళాపీఠము ఆధ్వర్యంలో సన్మానాలు, పురస్కారాలు అందుకొన్నారు. వీరు అనేక కథలు, కవితలు రచించారు.

## I చర్చించండి..

1) సెల్‌ఫోన్ వలన కలుగు లాభనష్టాలు
2) వసతిగృహం (హాస్టల్)లో విద్యార్థుల జీవితం.
3) గ్రామ - నగర జీవితాల మధ్య వ్యత్యాసం.

## II చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) నగర జీవితం రాజుపై చూపిన ప్రభావం.
2) రాజు స్వగ్రామానికి బయలు దేరడానికి గల కారణాలు.
3) రాజు తల్లిదండ్రులను ఓదార్చిన విధము.

### ఆ) ఎవరు - ఎవరితో అనిరి.

1) జీవితములో గెలుపోటములు సహజం. [ ] → [ ]
2) మును ముందుకు అన్ని రంగాల్లోను గెలుస్తాడు. [ ] → [ ]

3) మిమ్మల్ని నేను బాగా చూసుకుంటాను. [ ] → [ ]

4) ఇంటిపట్టునే వుండి చదువును గెలుస్తాను. [ ] → [ ]

ఇ) తప్పొప్పులు గుర్తించుము.

1) బాగా చదివించాలనే అమ్మ పట్టుదలకు అవధులుండేవి కావు. ( )

2) చదువులోనే కాదు పాటల్లోను మేటిగా గెలుపొందాను. ( )

3) సెలవుల్లో కూడా ఇంటికి వెళ్ళడానికి తీరిక ఉండేది కాదు. ( )

4) చాలా రోజులకు అమ్మానాన్నను చూడాలనిపించింది. ( )

## III స్వీయస్పందన :

1) రాజు పట్టణానికి వెళ్ళడానికి గల కారణాలు. 2) రాజుతండ్రి రాజుకి వివరించిన వాస్తవ పరిస్థితులు.

## IV భాషావగాహన :

అ) సంధులు : సరైన సమాధానాన్ని ఎంచి రాయండి.

1) బాగోగులు = బాగు + ఓగులు [ ]

అ) ఇకారసంధి ఆ) ఉకారసంధి ఇ) అకారసంధి

2) చూడాలంటోంది = చూడాలి + అంటోంది. [ ]

అ) ఉకారసంధి ఆ) ఇకారసంధి ఇ) అకారసంధి

3) మర్యాదిస్తోంటే = మర్యాద + ఇస్తోంటే [ ]

అ) అకార సంధి ఆ) ఉకారసంధి ఇ) ఇకారసంధి

ఆ) సమాస కార్యములు రాయండి.

| పదము | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| 1) గెలుపోటములు | | |
| 2) చెట్టుచాటు | | |
| 3) లోకజ్ఞానం | | |
| 4) చెడు వ్యసనాలు | | |
| 5) రెండడుగులు | | |
| 6) తల్లిదండ్రులు | | |

ఇ) గుర్తింపబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.

1) జీవితంలో గెలుపోటములు సమంజసం.

[ ]

2) విజ్ఞానంతో పాటు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాను.

[ ]

3) చాలా రోజులకు అమ్మా నాన్నను చూడాలనిపించిందింది.

4) నన్ను క్షమించునాన్నా నా వలన ఉన్న ఆస్తులన్ని కరిగి పోయాయి.

ఈ) వాక్యాంగాలు రాయండి.

| | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| 1) నేను చదువును గెలుస్తాను. | | | |
| 2) విజయ్ అమ్మను బాగా చూసుకొనెను. | | | |
| 3) నాన్న సెల్‌ఫోన్‌ను కొన్నాడు. | | | |

ఉ) వాక్యరకాలు రాయండి.

1) మాది చాలా ఉన్నత కుటుంబం.
2) అన్నం తినడం మాని, నా బాగోగుల గురించి ఆలోచించేది.
3) చదువుల్లోను, ఆటల్లోను మేటిగా గెలుపొందాను.
4) అమ్మానాన్నల్లో సంతోషం హద్దులు చెరిపేసుకుంది.
5) ఇంటర్ పూర్తికాగానే డిగ్రీ పూర్తిచేయడానికి పట్నం వెళ్ళాను.
6) ఊర్లో బస్సుదిగి రెండడగులు ముందుకు వేశాను.

V సృజనాత్మకత :

అంతర్జాలం ద్వారా వృత్తి విద్యలను శోధించి, మీకు నచ్చిన వాటిని ఎన్నుకోండి. వాటిని అమలు పరచడానికి సరైన ప్రణాళిక వేసుకోండి.

VI చర్చావేదిక :

''వివిధ సాంకేతిక పరికరాలు-సాధనాలు ఉపయోగకరమా? - హానికరమా?'' - రెండు జట్లుగా ఏర్పడి చర్చావేదిక నిర్వహించండి.

నేనివి గ్రహించా :

1) తల్లిదండ్రుల పట్లగల బాధ్యతలు విస్మరించరాదు.
2) జీవితంలో విలాసవంతమైన తళుకు బెళుకులకు లోనుకారాదు.



# 9 చతురోక్తులు



**ఉన్ముఖం:**

జనుల వాడుకలోని ఈ కింది కథను చదవండి.

పోతన భాగవతంలో శ్రీమహావిష్ణువు గజేంద్రుని ఆర్తనాదం విని, శంఖచక్రాదులు గ్రహింపక హుటాహుటిన బయలుదేరెనని వ్రాసెను.

శ్రీనాథుడు: చక్రాయుధం తీసుకొనక, గరుడుని అధిరోహింపక బయలుదేరి ప్రయోజనమేమి? ఎలాకాపాడగలడు?

పోతన : (నవ్వి ఊరుకొనెను)

[శ్రీనాథుడు తన ఇంటి అరుగుపై కూర్చుని ఉండగా... పోతన పెరటిలోనికి వెళ్లి బావిలో ఒక పెద్ద బండను వేసి అయ్యో! మీ బిడ్డ బావిలో పడెనెను. వెంటనే శ్రీనాథుడు పరుగు పరుగున అచ్చటికి వచ్చి నా బిడ్డకేమైనది, ఎక్కడ వాడు అని కంగారుపడసాగెను.]

పోతన: అయ్యా! భయపడవద్దు. అడుగో మీ బిడ్డడు ఆడుకొనుచున్నాడు. సరేగానీ హుటాహుటిన ఇచ్చటికెందులకు వచ్చితిరి?

శ్రీనాథుడు: బిడ్డ బావిలో పడెనని కేకవేసితిరే రక్షించుకొనుటకు వచ్చితిని.

పోతన: మరి తాడుగాని, నిచ్చెనగాని తెచ్చితిరా!

శ్రీనాథుడు: బిడ్డ ప్రాణములకు హానియని తెలియగానే ఏమియు తోచలేదు. వెనువెంటనే ఇచటికి రావలెనని మాత్రమే తట్టినది.

పోతన: ఇప్పుడు అర్థమైనదా ఆ శ్రీహరి గజేంద్రుని ఆర్తనాదం విని, శంఖచక్రాదులు గ్రహింపక హుటాహుటిన ఎట్లు బయలుదేరినాడని?

-------- ఇలా ఎప్పుడైనా ఎవరైనా మాటలతో సున్నితంగా దెబ్బకుదెబ్బ వేయటం చూశారా. ఇప్పుడు కొందరు ప్రసిద్ధ రచయితలు మాటలతో ఎలా ఆడుకున్నారో చూడండి.

నవరసాల్లో హాస్యం ఒకటి. హాస్యం లేని జీవితం ఊహించలేము. హాస్యభరితమైన మాటలు వింటే అన్నీ మరచిపోయి కడుపుబ్బ నవ్వుకుంటాం. అందుకే కీ.శే. జంధ్యాల గారు నవ్వడం ఒక భోగం, నవ్వించడం ఒక యోగం, నవ్వలేక పోవడం ఒక రోగం అన్నారు.

ఢిల్లీ ఆంధ్ర సంఘం వారు విశ్వనాథ సత్యనారాయణ గారిని ఒకసారి ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంగా ఆయన ఢిల్లీ వెళ్ళారు. అప్పుడు పార్లమెంటు సభ్యులుగావున్న తెన్నేటి విశ్వనాథంగారు కూడా సన్మానసభకు వచ్చి పాల్గొన్నారు. సభ ముగిశాక తెన్నేటితో విశ్వనాథా 'మనిద్దర్నీ కలిపితే ముచ్చటైన ముక్తపదగ్రస్త అలంకారం అవుతుంది'' అన్నారట చలోక్తిగా తెన్నేటి విశ్వనాథంతో విశ్వనాథ సత్యనారాయణ.

**జీవితంలో హాస్యం ప్రాధాన్యత వివరించు.**

మొక్కపాటి నరసింహశాస్త్రి పొరుగూరు వెళ్ళినపుడల్లా పూటకూళ్ళ ఇంట్లో భోజనం చేస్తుంటారు. ఆ పూటకూళ్ళ ఆమె ఒక కుక్కను ఎంతో ప్రేమగా పెంచుతున్నది. మొక్కపాటి వారికి ఆ కుక్క అలా ఇంట్లో అటు ఇటూ తిరగడం నచ్చలేదు. ఆమె కుక్క పట్ల చూపే ప్రేమను కాస్త హేళన చేద్దామనే ఉద్దేశ్యంతో ''ఏమమ్మా! కుక్కను నువ్వు చాలా ప్రేమగా చూసుకుంటున్నావల్లె ఉంది అన్నారంట. అందుకు ఆమె ఏదోబాబూ ఇంతవరకు అలాగే జరిగింది. కాని నువ్వు వచ్చిన దగ్గరనుండి దాని ఆలనాపాలనా చూడడానికే నాకు సమయం చిక్కడం లేదు అన్నది. విసురు వెనక్కివచ్చి నరసింహశాస్త్రి గారికే తగిలింది.

ఒకసారి భారీ యెత్తున మద్రాసులో కవిసమ్మేళనం జరుగుతోంది. ఆహ్వానితులైన కవులంతా వేదిక నలంకరించారు. వారిలో కవిసామ్రాట్ విశ్వనాథ, దేవులపల్లి, కవికోకిల జాషువా, కవికోకిల దువ్వూరి రామిరెడ్డి యింకా కొందరు ప్రముఖులు వున్నారు. మొదటినుంచి రామిరెడ్డి గారితో జాషువాగారికి సాన్నిహిత్యం హెచ్చు. వారిద్దరూ పక్కపక్కనే చేరి మాట్లాడుకుంటున్నారు.

వారిద్దరినీ చూచిన విశ్వనాథ 'పక్షులు రెండూ ఒక చోటికి చేరాయే'' (ఇద్దరూ కవికోకిలలు) అని చమత్కరిస్తే వెంటనే జాషువాగారు–

"కిరాతుడి కన్నుఇంకా పక్షుల మీదనే వున్నదే" అని తిరుగుదెబ్బ తీశాడు. (కిరాతుడు క్రౌంచపక్షిని కొట్టడం రామాయణ రచనకు దారితీసింది.)

**ఉక్తి, సూక్తి, చతురోక్తి వీటికి గల భేదం ఏమిటి?**

హాస్యం అనే పదానికి పర్యాయంగా చమత్కారం. చెణుకు, ఛలోక్తి, విసురు మొదలగు అనేక పదాలు వాడుకలో ఉన్నాయి. అయితే అందరూ చమత్కారంగా మాట్లాడలేరు. కొంతమంది చమత్కారంగా మాట్లాడుతున్నట్లుగా మనల్ని ఏదోమాట విసురుగా అనిబాధిస్తారు. మన బాధ వాళ్ళకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ విధంగా కాకుండా ఎవరైనా ఒక జోక్ వేసినా, వేసినవారు ఎదుటి వారు కూడా ఆనందంగా నవ్వుకుంటే అది అసలైన చమత్కారం. ఆరోగ్యవంతమైన హాస్యం.

మన సాహిత్యంలో హాస్యానికి పెద్దపీట వేసిన మహనీయులు ఎందరో ఉన్నారు. విశ్వనాథ సత్యనారాయణ, మొక్కపాటి నరసింహశాస్త్రి, గుర్రం జాషువా, స్థానం నరసింహారావు మొదలగువారు సుప్రసిద్ధులు. ఆంగ్ల సాహిత్యంలో బర్నాడ్‌షా, మార్కుట్వెయిన్, జోయి బిషప్ వంటి మహనీయులు ఎందరో హాస్యాన్ని పండించారు.

ఒకసారి వేదులవారు, విశ్వనాథ సత్యనారాయణ వారి ఇంటికెళ్లారు. మేడ మీద పిల్లలు ఎగిరి గంతులు, కేకలు వేస్తూ ఆడుకుంటున్నారు. వేదుల వారికి పిల్లలు అల్లరి చేయడం నచ్చలేదు. అందుకని తనే స్వయంగా పిల్లలను కేక వేద్దామని మేడపైకి వెళ్ళబోయారు. విశ్వనాథ వారికి బహుశ అది ఇష్టం లేక "నీవు ఎందుకు వెళతావయ్యా వద్దు వెళ్ళకు" అన్నారు. ఆయన అలా "నిర్మొహమాటంగా తనను వద్దనడానికి వేదులవారు కష్టపడ్డారు. ఆ విషయం ఆయనకు తెలియ చెప్పాలి. ఎదురుగా ఉన్నది మహాకవి కాబట్టి కాస్త చమత్కారంగా చెప్పాలి. అందుకని ఒక్క క్షణం ఆలోచించి 'పైన ఏమన్నా పిచ్చి ఆసుపత్రి ఉన్నదా?" అందుకని నన్ను వెళ్ళవద్దు అంటున్నారా! అని కొంటెగా అడిగారు.

మహాకవి ఏమైనా తక్కువ తిన్నారా. ఎంత పొరపాటు పడ్డావయ్యా వేదులా! పైన పిచ్చి ఆసుపత్రి ఉంటే నిన్ను ఎందుకు వెళ్ళొద్దు అంటానయ్యా బాబూ! అన్నారట. ఇద్దరికీ తమ ప్రసంగం నచ్చి విరగబడి నవ్వుకొన్నారు.

**'నవ్వు-ఇతరులను నవ్వించు' దీని ఆంతర్యమేమి?**

స్థానం వారి సమయస్ఫూర్తికి సంబంధించిన ఒక సంఘటన. అనకాపల్లిలో శ్రీకృష్ణ తులాభారం ప్రదర్శన జరుగుతోంది. స్థానం నరసింహారావుగారు సత్యభామగా, గోవిందరావు రుక్మిణిగా నటిస్తున్నారు. రుక్మిణి కృష్ణుణ్ణి తులసిదళంతో తూచే దృశ్యం వచ్చింది. రుక్మిణి తులసిదళం పుచ్చుకొని భక్తి భావంతో

ఫలమో, ఘనరసంబో పత్రమో

గొనుచు భక్తి నిన్ను గొలుచు వారికీవు

వశుడగుటయే సత్యమేని

ఈ తులసిదళము నిన్ను తూచుగాక!

అని తక్కెడలో పెట్టింది. కాని సాంకేతిక లోపం వలన కృష్ణుడి సిబ్బి పైకి లేవలేదు. వెంటనే జనం గొల్లు మన్నారు. నటులు తెల్లబోయారు. అపుడు స్థానం వారు ''అక్కా! భర్తకు పట్టిన దుస్థితి తలచుకొని నీధ్యానం నిలకడ తప్పినట్లుంది. మనసు లగ్నం చేసుకొని మళ్ళీ తులసిదళం వెయ్యి'' అన్నారు. రుక్మిణి పద్యం పాడుతూ తులసిదళం త్రాసులో ఉంచకముందే ఈసారి కృష్ణుడుపైకి లేచాడు.

**లాఫింగ్ క్లబ్బులు అని వేటిని అంటారు? వాటి ప్రయోజనాలు ఏమిటి?**

జనం మళ్ళీ గొల్లుమన్నారు. నటుల పరిస్థితి చూసి స్థానం వారు వెంటనే అందుకు అక్కా నీభక్తి మధ్యలోనే పరాకాష్టనందుకొన్నది చూశావా అని సమర్థించారు.

హాస్యానికి, చతురతకు అమెరికన్ రచయిత మార్కు ట్వెయిన్ పేరొందాడు. ఆయనకు ఒకసారి ఒక పుస్తకం కావలసివచ్చింది. పొరుగింటి ఆసామికి ఆ పుస్తకం పేరు చెప్పి అది మీవద్ద ఉన్నదా? అని అడిగాడు. వెంటనే అతడు ఉన్నది కావాలంటే మీరు దాన్ని నా లైబ్రరీలో కూర్చుని మాత్రమే చదువుకోవలసి ఉంటుంది అన్నాడు. మార్క్‌ట్వెయిన్ అప్పటికి ఏమీ మాట్లాడలేదు. కొన్నాళ్ళకు ఆ పొరిగింటి ఆసామికి లాన్ మోవర్ కావలసి వచ్చింది. (అంటే ఆరుబయట ఉన్న గడ్డిని కత్తిరించి చదును చేసే పనిముట్టు) వెంటనే మార్క్‌ట్వెయిన్ అది కావాలంటే మీరు మా లాన్ మీద దానిని సంతోషంగా ఉపయోగించు కోవచ్చు అని జవాబిచ్చాడు.

ఇలాంటిదే మరో సంఘటన చూడండి. అమెరికన్ హాస్యనటుడు జోయి బిషప్ టెలివిజన్‌లో 'టునైట్‌షో' అనే కార్యక్రమం నిర్వహించేవాడు. ఈయనకు అభిమానుల బెడద ఎక్కువగా ఉండేది. జోయి బిషప్ నడుస్తుండగా ఒకావిడ అతన్ని మీరు జోయి బిషప్ కదూ అని అడిగింది. బిషప్ ఆవిడని వదిలించుకుందామని 'లేదు అలా కనిపిస్తానంతే' అన్నాడు చాలా వినయంగా. కాని ఆటోగ్రాఫ్‌లకి అలవాటు పడ్డ ప్రాణం కాబట్టి వెళ్ళబోతూ ఆగి మీరు జోయి బిషప్ అభిమానా అని ప్రశ్నించాడు. ''లేదు అలా కనిపిస్తానంతే'' అని ఠపీమని జవాబు వచ్చింది. చమత్కారంగా మాట్లాడడం అందరికీ చేతకాకపోవచ్చు. అయితే మన నిత్యజీవితంలో చమత్కారంగా మాట్లాడేవారు కూడా ఎదురవుతుంటారు. మన మనస్సు నొప్పించని వారి సంభాషణా చాతుర్యం కోసం వారి స్నేహాన్ని మనం కోరుకోవచ్చు.

---

**I చర్చించండి.**

1) ''అసలైన చమత్కారం''.

2) తెలుగులో హాస్యరచయితలు.

**II చదవండి - ఆలోచించండి - రాయండి.**

**పదజాలాన్ని పెంపొందించుకుందాం :**

హేళన = ఎగతాళి; సమయస్ఫూర్తి = సమయానికి తగినట్లు; పరాకాష్ట = పతాకస్థాయి, ఉన్నత స్థాయి.

**III అ) ఐదు - ఆరు వాక్యాలలో జవాబులు రాయండి.**

1) ఆరోగ్యవంతమైన హాస్యం.

2) విశ్వనాథ - జాషువా మధ్య జరిగిన సంభాషణ రాయండి.

3) జోయి బిషప్ జీవితంలోని సంఘటన రాయండి.

## ఆ) ఖాళీలను పూరించండి :

1) పైన ఏమన్నా ________________ వున్నదా?

2) తెన్నేటి విశ్వనాథం గారుకూడా ________________కి వచ్చి పాల్గొన్నారు.

3) జోయాబిషప్ టెలివిజన్‌లో ________________ అనే కార్యక్రమం నిర్వహించేవారు.

4) నిత్యజీవితంలో ________________ గా మాట్లాడేవారు కూడా ఎదురవుతుంటారు.

## ఇ) ఎవరు, ఎవరితో పలికిరి.

| | | |
|---|---|---|
| 1) నీవు ఎందుకు వెళతావయ్యా! వద్దు. | | → |
| 2) కుక్కను నీవు చాలాప్రేమగా చూసుకుంటున్నావల్లె వుంది. | | → |
| 3) "పక్షులు రెండూ ఒక చోటికి చేరాయే" | | → |
| 4) మనసు లగ్నం చేసి మళ్ళీ తులసీదళం వెయ్యి. | | → |

## IV స్వీయవ్యక్తీకరణ :

1) "విశ్వనాథవారు పిచ్చాసుపత్రి ఉంటే నిన్నెందుకు వెళ్ళొద్దంటాను" అనటంలోని చమత్కారాన్ని నీ సొంతమాటల్లో తెలియజేయి.

2) దూరదర్శన్‌లో ప్రసారమయ్యే నీకునచ్చిన తెలుగు హాస్య కార్యక్రమాన్ని గురించి రాయండి.

## V భాషావగాహన :

### అ) గీత గీసిన పదాల భాషాభాగాలను గుర్తించండి.

1) మన భాష వాళ్ళకు ఆనందాన్ని కలిగిస్తుంది. [ ]

2) వేదుల వారికి పిల్లలు అల్లరి చేయడం నచ్చలేదు. [ ]

3) ఢిల్లీ ఆంధ్రసంఘం వారు విశ్వనాథవారిని ఘనంగా సన్మానించారు. [ ]

4) రుక్మిణి తులసిదళం తక్కెడలో పెట్టింది. [ ]

5) వేదులవారు విశ్వనాథ సత్యనారాయణ వారి ఇంటికి వెళ్ళారు. [ ]

### ఆ) కింది పట్టికను అడిగిన విధంగా పూరించండి.

| | పదము | విడదీసి రాయుట | | సంధినామం |
|---|---|---|---|---|
| 1) | చతురోక్తి | + | → | |
| 2) | | భారీ + ఎత్తున | → | యడాగమ సంధి |
| 3) | ఆరోగ్యవంతమైన | + | → | |

ఇ) కింది పట్టికను అడిగిన విధంగా పూరించండి.

| పదము | విగ్రహవాక్యము | | సమాసనామము |
|---|---|---|---|
| 1) కవి సమ్మేళనం | | → | |
| 2) పెద్దపీట | | → | |
| 3) ఆలనపాలన | | → | |

ఈ) గీతగీసిన వాటికి విభక్తులను గుర్తించండి.

1) మొదటినుండి రామిరెడ్డిగారితో జాషువాగారికి సాన్నిహిత్యం హెచ్చు.
2) కేకలు వేస్తూ ఆడుకుంటున్నారు.
3) తెన్నేటి విశ్వనాథంగారు కూడ సన్మానసభకు వచ్చి పాల్గొన్నారు.
4) స్థానం వారి సమయస్ఫూర్తికి సంబంధించిన ఒక సంఘటన.
5) సాంకేతిక లోపం వలన సిబ్బి పైకి లేవలేదు.

ఉ) కింది వాక్యాలలో గీతగీసిన పదాల వాక్యాంగాలను గుర్తించండి.

1) పూటకూళ్ళ ఆమె కుక్కను ప్రేమగా పెంచుతున్నది.
2) స్థానం వారు శ్రీకృష్ణతులాభారం నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.
3) ఢిల్లీ ఆంధ్రసంఘంవారు విశ్వనాథ వారిని సన్మానించారు.

V. సృజనాత్మకత :


1) దిన, వార, పక్ష, మాస పత్రికల్లో వచ్చే ఛలోక్తులను సేకరించి, ఆల్బమ్ తయారుచేయండి.
2) మీరు స్వంతంగా కొన్ని ఛలోక్తులు రాసి తరగతిలో ప్రదర్శించండి.
3) హాస్యం నిత్య జీవితంలో ఎంతవరకు అవసరమో నీ అభిప్రాయం.


ప్రత్యక్ష అనుభవం - నవ్వు నవ్వించు.

- ఇంట్లో/పాఠశాలలో / మిత్రుల నడుమ జరిగిన చమత్కార సత్య సంఘటనలను ఒకరితోనొకరు చెప్పుకోండి-మనసార నవ్వుకోండి.
- పరిసరాలలో లాఫింగ్ క్లబ్ ఏర్పాటు చేసి అన్ని వయస్సుల వారు పాల్గొనేలా చేయండి.

నేనివి గ్రహించా:

1) నిత్య జీవితంలో హాస్య ప్రాధాన్యత. 2) ప్రసిద్ధ హాస్యకవుల రచనలలోని సారస్యము.







# మహాత్మాగాంధీ జయంతోత్సవం

**పఠనం**

**ఉన్ముఖం:**

నిస్వార్థంగా ఇతరులకు సేవ చేయువారిని మహానుభావులు, మహాత్ములు అని అంటారు. స్వదేశం-పరదేశం అనే భేదభావం లేకుండా అందరి న్యాయం కోసం ఎల్లవేళలా పోరాడిన వారే మన గాంధీగారు. అందుకే వారు 'మహాత్ముడు' 'జాతిపిత' అని పిలువబడుతున్నారు.




పూర్తి పేరు : మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ

జననం : 02.10.1869 – మరణం : 30.01.1948

జన్మస్థలం: పోర్బందర్, గుజరాత్ రాష్ట్రం

తల్లి: పుతలీబాయి, తండ్రి: కరమ్‌చంద్ గాంధీ





గాంధీజీ బాల్యంలో 'హరిశ్చంద్ర' నాటకాన్ని చూడటం జరిగింది. ఆ నాటకం ఆజీవనం వీరిపై ప్రభావం చూపింది.

వీరు ఎల్లప్పుడు సత్యమునే పలికెడివారు.

గాంధీజీ ఉద్యోగరీత్యా దక్షిణాఫ్రికాకు వెళ్ళారు. అచ్చటి వర్ణ వివక్ష, జాతి వివక్ష, సమాజంలోని అన్యాయాలు వారిని కలవర పెట్టాయి. వాటిని ఎదుర్కోవలసిన బాధ్యతను గ్రహించి వాటికి వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారు. వారిలోని నాయకత్వ లక్షణాలు, రాజకీయరీతులు, ఆలోచనలకు ఇక్కడే పునాది పడిందని చెప్పవచ్చు.



బ్రిటిష్‌వారు బీహార్‌లోని చంపారణ్‌లో ఆహారపంటలను వదలిపెట్టి నీలిమందువంటి వాణిజ్య పంటలను పండించమని నిర్బంధించారు. పంటలకు అన్యాయరీతిలో అతి తక్కువ ధరలను నిర్ణయించేవారు. దానితో అచట పేదరికం, మురికివాడలు ప్రబలాయి. అంతేగాక కరువు కూడా సంభవించింది. దీనికి తోడు ప్రభుత్వం పన్నులు కూడా పెంచింది. ఈ అన్యాయాలను ఎదుర్కొనుటకై గాంధీజీ ప్రజలను మేలుకొలిపి సత్యాగ్రహాన్ని నిర్వహించారు.

భారతీయులను బానిసలుగా చేసి పీడిస్తున్న బ్రిటిష్ నిరంకుశ పాలనను అంతమొందించాలి. బ్రిటిష్ ప్రభుత్వానికి సహకరించనిచో బ్రిటిష్‌వారు మనదేశాన్ని ఒక్కరోజు కూడా పరిపాలించలేరు అని గాంధీజీ ప్రజలనుద్దేశించి పలికారు. వారి పిలుపు మేరకు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేయుటకు తిరస్కరించారు. న్యాయస్థానాలను, విదేశీ వస్తువులను బహిష్కరించారు. వారిచ్చిన బిరుదులను త్యజించారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగా దేశమంతా రాట్నాలు గిరగిరా తిరిగాయి. గాంధీజీతోబాటు నూలు వడికారు. పెద్దయెత్తున ప్రజలు ఖద్దరు కట్టినారు.



జాతీయోద్యమాన్ని గొప్ప మలుపుతిప్పిన కీలకమైన ఉద్యమమే ఉప్పుసత్యాగ్రహం. భారతదేశం మూడువైపుల సముద్రంతో ఆవరింపబడియున్నది. అయినప్పటికి మనము ఉప్పును తయారుచేయరాదని, విదేశాల నుండి దిగుమతియగు ఉప్పును మాత్రమే ఉపయోగించవలెనని నిర్బంధించారు. ఆ నిర్బంధం అమలగుటకు వీలుగా మన దేశపు ఉప్పుపై పన్ను విధించారు. దీనిని వ్యతిరేకిస్తూ గాంధీజీ ఉప్పుసత్యాగ్రహం ప్రారంభించారు. గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుండి 'దండి' వరకు దాదాపు 384 కి.మీ. దూరం జరిగిన ఈ పాదయాత్ర దండియాత్రగా ప్రసిద్ధి. ఈ సత్యాగ్రహం యావత్ ప్రపంచదృష్టిని ఆకర్షించింది.





చంపారణ్ ఉద్యమంతో మొదలై అంచెలంచెలుగా పరిస్థితుల అనుసారం సహాయనిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమంవంటి అనేక జాతీయ ఉద్యమాలు, నిరాహారదీక్షలను రాజకీయ అస్త్రంగా ప్రయోగించి అనేకానేక నాయకులను, కోట్లాది భారతీయులను ఒకే త్రాటిపై నడిపించారు గాంధీజీ. తద్వారా భారతీయులను బ్రిటిష్ శృంఖలాలనుండి విముక్తులు గావించారు. 1947 ఆగష్టు 15న దేశానికి స్వాతంత్ర్యం ప్రాప్తించేలా చేశారు.

మనదేశ ప్రజలనుద్దేశించి గాంధీగారు...

- శక్తి శారీరకమైన సామర్థ్యం నుంచి రాదు, మనసులోని కోరికనుంచి వస్తుంది.
- నీ అంగీకరం లేకుండా నీ ఆత్మగౌరవాన్ని ఎవ్వరూ తగ్గించలేరు.
- బలహీనుడిలో క్షమాగుణం ఎన్నటికి కనిపించదు. అది బలవంతుడి లక్షణం.
- ప్రపంచంలో నేను ఒకే ఒక నియంతను అంగీకరిస్తాను... అంతర్వాణి

వంటి ఎన్నో అమూల్యమైన సందేశాలనొసగారు. గాంధీగారి ఆలోచనా సరళిలో ప్రయణించేవారు మనదేశంలోని ప్రజలతో బాటు విదేశాలలోనూ లెక్కకు మిక్కిలి ఉన్నారు.




మన దేశంలో తపాలాబిళ్ళలు, కరెన్సీ నోట్లు మరియు నాణేలమీద మహాత్మా గాంధీ చిత్రం ఉండటం మనకు తెలిసిన విషయమే. కానీ ప్రపంచంలో దాదాపు 150 దేశాలు మహాత్ముని బొమ్మతో తపాలాబిళ్ళను ముద్రించడం, ఇతర దేశాలలో గాంధీగారి విగ్రహాలు, స్మారక చిహ్నాలను నెలకొల్పడం, ప్రపంచదేశాలు మహాత్ముని జయంతి అక్టోబరు 2వ తేదీని "అంతర్జాతీయ అహింసాదినం" (International Day of Non-violence day)గా పాటించడం మనదేశం గర్వించదగ్గ గొప్ప విషయాలు.

[వార్తాపత్రికలు, గ్రంథాలయంలోని పుస్తకాలు, అంతర్జాలం, సహాయంతో పై 'కొలాజ్' (చిత్రాలు, ఛాయాచిత్రాలు,వివరాల దృశ్యరూప కల్పన) లో సంక్షిప్తంగా ఇచ్చిన వివరాలను గురించి విపులంగా చదవండి. గాంధీ జయంతి/ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఛాయాచిత్రాలు, రేఖాచిత్రాలతోగూడిన ఆకర్షణీయమైన కంప్యూటర్ ప్రజెంటేషన్ చేయండి.]


# 10. అంతరిక్ష విజ్ఞానానికి వెలుగుబాట-శ్రీహరికోట



**ఉన్ముఖం:** కింది చిత్రాలలోని అంతరిక్ష శాస్త్రజ్ఞులెవరు? వీరిని గురించి సంభాషించండి.









వైజ్ఞానిక పరిశోధనలు, వాటిలో సాధించిన విజయాల కారణంగానే ఏ దేశానికైనా ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు, గౌరవం చేకూరతాయి. అంతరిక్ష పరిశోధనల కోసం భారత ప్రభుత్వం 1969లో 'అంతరిక్ష పరిశోధనల ద్వారా దేశాభివృద్ధి' అనే నినాదంతో బెంగళూరులో 'భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ' (ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్-ISRO)ను నెలకొల్పింది. భారత్‌కు తనదైన అంతరిక్ష విధానం అవసరమని తొలిసారిగా స్పష్టం చేసిన శాస్త్రవేత్త విక్రమ్ సారాభాయ్. ఈయన భారత అంతరిక్షరంగ పితామహునిగా ప్రసిద్ధి పొందారు.

ఇస్రో భారత ప్రధాని ఆధీనంలో ఉన్న అంతరిక్ష శాఖకు అనుబంధంగా ఉంటుంది. ఇస్రోకి అనుబంధంగా ఉన్న కేంద్రాలు, విభాగాలు దేశవ్యాప్తంగా ఉన్నాయి. వాటిలో విక్రమ్ సారాభాయ్ అంతరిక్ష కేంద్రం', తిరువనంతపురం, 'సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం, శ్రీహరికోట, 'ఇస్రో శాటిలైట్ సెంటర్', బెంగళూరు, 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ' తిరువనంతపురం, 'ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్', డెహ్రాడూన్ చాలా ప్రధానమైనవి.

భారతదేశంలో ఉపగ్రహాల ప్రయోగానికి అత్యంత అనువైన ప్రదేశం శ్రీహరికోట. ఇది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో సూళ్లూరు పేట దగ్గర ఉంది. ఈ అంతరిక్ష కేంద్రాన్ని సతీశ్ ధావన్ పేరుమీదుగా ''సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)'' అని పిలుస్తారు. ఈ కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో పులికాట్ సరస్సు-బంగాళాఖాతం నడుమ 175 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇది భూమధ్యరేఖకు చేరువగా ఉండటం వలన ఇక్కడనుండి ప్రయోగించిన రాకెట్ తక్కువ ఇంధనంతో భూమ్యాకర్షణ శక్తిని అధిగమించగలుగుతుంది.

అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతరిక్ష పరిశోధనా కేంద్రంగా రూపొందిన ఇస్రోకు విక్రమ సారాభాయి, ఎం.జి.కె. మీనన్, సతీశ్ ధావన్, యు.ఆర్.రావు, కె. కస్తూరి రంగన్, జి. మాధవన్ నాయర్, కె. రాధాకృష్ణన్, శైలేశ్ నాయక్ ప్రభృతులు నేతృత్వం వహించగా ప్రస్తుతం ఏ.ఎస్. కిరణ్ కుమార్ సారథ్యం వహిస్తున్నారు.

శ్రీహరికోట, రాకెట్ కేంద్రంగా రూపొందిన తరువాత మొదటగా అక్కడ నుండి సౌండింగ్ రాకెట్ల ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. 1971, అక్టోబరు 9న రోహిణి-

125 రాకెట్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. అది మొదలు ఇటీవలి చంద్రయాన్-2 దాకా శ్రీహరికోట ఎన్నోకీలక ప్రయోగాలకు వేదికగా నిలిచింది.

జవహర్‌లాల్ నెహ్రూ, హోమీ బాబా, విక్రమ్ సారాభాయి త్రయం ప్రారంభించిన కృషి ఫలితంగా దేశం ఈ రంగంలో పురోగతి సాధించింది. ఆర్యభట్టతో మొదలైన ఇస్రో జైత్రయాత్ర చంద్రయాన్-2 వరకు సాగటానికి ఎందరో స్త్రీ పురుష శాస్త్రజ్ఞులు కృషి చేశారు.

ఈ రంగంలో 'మిస్సైల్ మ్యాన్'గా పేరుగాంచిన మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి కీ.శే. డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారు చేసిన సేవలు అవిస్మరణీయం.

ఉపగ్రహాల ప్రయోగం కోసం ఇస్రో, వాహక నౌక వ్యవస్థను అభివృద్ధి పరుచుకుంది. 1979లో శాటిలైట్ లాంచ్ వెహికల్ (SLV), 1980లో ఆగ్‌మెంట్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (ASLV), 1993లో పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (PSLV), 2001లో జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికిల్ (GSLV)లను అభివృద్ధి చేసింది.

రీ యూజబుల్ లాంచ్ వెహికల్ (RLV-TD) ప్రయోగాన్ని ఇస్రో మే 23, 2016న విజయవంతగా నిర్వహించింది. దీనివల్ల ఒకసారి ఉపయోగించిన వాహక నౌకను మరల ఉపయోగించేందుకు, దానివల్ల ఎంతో ఖర్చు ఆదా చేసే అవకాశం ఏర్పడింది. దీని తుది వెర్షన్ తయారీకి పదేళ్ళు పడుతుందని ఇస్రో పేర్కొంది.

ఫిబ్రవరి 15, 2017న ఇస్రో PSLV-C37 అనే ఒకే వాహక నౌక ద్వారా 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టి రికార్డు సృష్టించింది.

చంద్రునిపై పరిశోధనలలో భాగంగా ఇస్రో చేపట్టిన తొలి ప్రాజక్ట్ 'చంద్రయాన్-1' సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట నుంచి అక్టోబర్ 22, 2008న PSLV-C11 వాహక నౌకసహాయంతో ప్రయోగింపబడింది. ఇది చంద్రునిపై నీటి జాడలు కనుగొన్నది. ఈ ప్రయోగం 95 శాతం విజయవంతమైంది. మార్స్ ఆర్బిటార్ మిషన్(మామ్) ప్రయోగం కూడా PSLV-C25 ద్వారా అక్కడనుంచే నిర్వహించబడింది.

జులై 22, 2019న ఇస్రో శ్రీహరికోట నుంచి GSLV-MK 3M1 వాహక నౌక ద్వారా 'చంద్రయాన్-2'ని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ల్యాండరు చంద్రుని ఉపరితలం నుండి 2.1 కి.మీ. ఎత్తున ఉండగా దానికి భూమితో సంపర్కం తెగిపోయింది. ఈ ప్రయోగం 90 నుండి 95 శాతం విజయవంతమైందని ఇస్రో తెలిపింది.

అంతరిక్ష పరిజ్ఞానం ద్వారా ఇస్రో దేశప్రజలకు విజ్ఞాన ఫలాలను అందుబాటులోకి తెచ్చింది. రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా పంట ప్రాంతాల విస్తీర్ణం, కరువు ప్రదేశాల పర్యవేక్షణ, విపత్తు నష్టాల అంచనా, అడవులు-జీవి ప్రదేశాల గుర్తింపు, ఖనిజాలు-భూగర్భ జలాల గుర్తింపు, తుఫాను సూచనలు మొదలైన వాటితోపాటు వ్యూహాత్మక కార్యక్రమాలు, టెలీమెడిసన్, కమ్యూనికేషన్లు, గ్లోబల్ పొజిషనింగ్ వ్యవస్థ వంటి ఎన్నో ప్రయోజనాలు సమకూరుతున్నాయి.







**రచయిత పరిచయం : డా॥ వెన్నా వల్లభరావు**గారు 09-05-1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణాజిల్లా, గుడివాడ తాలూకా బేతవోలు గ్రామములో జన్మించారు. వీరి తల్లిదండ్రులు లక్ష్మీనాగేశ్వరమ్మ, హనుమంతరావు గార్లు. వీరు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి హిందీలో ఎం.ఏ., పిహెచ్.డి. చేశారు. ఆంధ్ర లయోల కళాశాల, విజయవాడలో హిందీ శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ పొందారు.

డా. వల్లభరావుగారు హిందీలోను, తెలుగులోను అనేక రచనలు చేశారు. వాటిలో పేర్కొనదగినవి **సాహిత్యవారథి, కవితాభారతి, జాతీయపతాక రూపశిల్పి పింగళి వెంకయ్య**, 35 రేడియో నాటకాల అనువాదం మొదలగునవి. వీరికి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడెమీచే **'ఉత్తమ అనువాద పురస్కారం' 'బోయపాటి నాగేశ్వరరావు పురస్కారం'** మొదలగు పురస్కారాలు, **'అనువాద సాహిత్యరత్న'** బిరుదు లభించాయి. అంతేగాక ఇటీవల వీరి అనువాద రచనలకు గాను **'కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారం'** కూడా అందుకున్నారు.

## I చర్చించండి :

1) రాత్రిపూట మీకు ఆకాశంలో ప్రకాశిస్తూ ఏం కనిపిస్తాయి?
2) అంతరిక్షంలో ఉన్నవాటిని చూడడానికి ఏవి ఉపయోగిస్తాము?
3) మహారాష్ట్రలో తారాంగణాలు (ప్లానెటేరియాలు) ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయి?

## II పదజాలం పెంపొందించుకుందాం.


పితామహుడు = తండ్రికి తండ్రి (తాత); ఇంధనం = శక్తిని ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే పదార్థం; అధిగమించు = దాటు; నేతృత్వం = నాయకత్వం; సారథ్యం = నాయకత్వం; అవిస్మరణీయం = మరువలేనిది; కీలకం = చాలా ప్రాధాన్యం కలది; జైత్రయాత్ర = విజయోత్సాహంతో చేసే పర్యటన.

## III చదవండి - ఆలోచించండి - రాయండి.

### అ) కింది వాటికి ఐదు, ఆరు వాక్యాల్లో జవాబులు రాయండి.

1) ఇస్రోకి అనుబంధంగా ఉన్న కేంద్రాలు.
2) ఇస్రో వాహక నౌక వ్యవస్థ.
3) అంతరిక్ష పరిజ్ఞానము వలన ప్రయోజనాలు.

### ఆ) అల్లిక




### ఇ) జవాబులు రాయండి.

1) అంతరిక్ష పరిశోధనల కోసం భారత ప్రభుత్వ నినాదం.
2) ఆంధ్రప్రదేశ్‌లో గల అంతరిక్ష కేంద్రం పేరు.
3) మిస్సైల్ మ్యాన్‌గా పేరుగాంచినదెవరు?
4) విక్రమ్ సారాబాయి ఈ పేరుతో ప్రసిద్ధి పొందారు.

**ఈ) జతపరచండి.**

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) చంద్రయాన్-2 | అ) 2008 |
| 2) రోహిణి-125 | ఆ) 2017 |
| 3) చంద్రయాన్-1 | ఇ) 2016 |
| 4) PSLV-C37 | ఈ) 2019 |
| | ఉ) 1971 |

## III స్వీయవ్యక్తీకరణ :

1) వైజ్ఞానిక పరిశోధనలు మానవ మనుగడకు ఎంత వరకు ఉపయోగకరం.
2) అంతరిక్షంలోనికి అడుగుపెట్టి విజయకేతనం ఎగురవేసిన వారి గురించి మీ సొంతమాటల్లో తెలియచేయండి.

## IV భాషావగాహన :

**అ) భాషా భాగాలు**

గీత గీసిన పదాలు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.

1) ఇది చంద్రునిపై నీటి జాడలు కనుగొన్నది.
2) శ్రీహరికోట ఎన్నో కీలక ప్రయోగాలకు వేదికగా నిలిచినది.
3) అక్కడ నుండి సౌండింగ్ రాకెట్ల ప్రయోగాలు ప్రారంభమయ్యాయి.

**ఆ) సంధులు : కింది వాటిని కలిపి, సంధిపేరు రాయండి.**

| | కలిపిరాయుట | సంధిపేరు |
|---|---|---|
| 1. దేశానికి + అయినా | | |
| 2. ప్రతిష్ఠ + ఆత్మకము | | |
| 3. తనది + అయిన | | |
| 4. దేశ + అభివృద్ధి | | |

**ఇ) సమాసాలు : కింది పదాలకు సమాసకార్యాలు రాయండి.**

| పదము | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| 1) కీలక ప్రయోజనాలు | | |
| 2) పరిశోధనా కేంద్రం | | |
| 3) పదేళ్ళు | | |
| 4) నీటి జాడలు | | |
| 5) దేశప్రజలు | | |

## VI సృజనాత్మకత :

ఇస్రోలో పేరెన్నికగన్న భారతీయ అంతరిక్ష శాస్త్రజ్ఞుల గురించి వివరాలు అంతర్జాలం ద్వారా సేకరించి ఆల్బమ్ తయారు చేయండి.

**నేనివి నేర్చుకున్నా :**

1) అంతరిక్ష పరిశోధనా సంస్థలు.
2) అంతరిక్ష పరిశోధనల వలన ఉపయోగం.

**క్షేత్రసందర్శనం (Field Visit) :**

ముంబయిలోని 'నెహ్రూ ప్లానెటేరియం'ను సందర్శించండి. అచ్చట జరిగే ఛాయా చిత్రప్రదర్శన/ఉపన్యాసాలకు హాజరుకండి.


# 1 మూషిక మహాసభ



ఖరనామ సంవత్సర పూర్వాషాఢమాస బహుళ అమావాస్య క్రొత్త మంగళవారము నాటి రాత్రి, మూలానక్షత్రయుక్త వృశ్చికలగ్నమందు, గోదావరి యొడ్డున ప్రస్తుతము రమారమి సంవత్సరమునుండి పాడుపడిన నిర్జనమైన వాడవీధిలో నున్న యొక పాడుకొంపలో దక్షిణపుటింటిలో, ఉత్తరపు గోడప్రక్కను కుడిచేతిమూలగా ఉన్న పెద్దకన్నములోని లోపలి భాగములో, దిగువప్రక్కను మూషికమహాసభ జరిగెను. 'ఆ సభకు పందికొక్కులు, ఎలుకలు, చుంచులు, చిట్టెలుకలు, చూరెలుకలు మొదలగునవన్నియు వచ్చెను' అందొక పెద్ద పందికొక్కు అగ్రాసనాధిపత్యము వహించెను. అగ్రాసనాధిపతిగారికి కుర్చీలు, బల్లలు లేకపోయినను తవ్విపోసిన మట్టిమీద అగ్రాసనాధిపతిగా ఎత్తు స్థలమున కూర్చుండిరి. కార్యదర్శియయిన పారసండ్ల బక్కయెలుక యొకటి ముందుకు వచ్చి యీ క్రింది విధముగా నుపన్యసించెను.

**ప్రహసనం అంటే ఏమిటి?**

పూజ్యులయిన యో సభాసదులారా! కొక్కుకుల శ్రేష్ఠుడయిన యో సభాపతీ! నే నిదివర కెన్నడు సభలలోనికి వచ్చి ఉపన్యాసము చేసినవాడను గాను. అందుచేత నా యొక్క ప్రసంగములలో చాలా తప్పులు రావచ్చును. పిల్లలయొక్క వచ్చీరాని మాటలు తల్లిదండ్రులు విని యే ప్రకారముగా సంతోషింతురో, నాయొక్క తప్పు మాటలను గూడా ఆ ప్రకారముగానే విని మన్నించ కోరుచున్నాను. కన్నములు త్రవ్వుటలోను, ఊతి గోడలనయిన క్షణములో పిండి పిండి చేయుటలోను, టేకుపెట్టెల నయిన కొరికి వేయుటలోను, మూతలు పడతోసి యెటువంటి వస్తువులయిన గ్రహించుటలోను అసమాన ప్రజ్ఞకలిగి మహావిద్వాంసులైన మీవంటి వారి యెదట నావంటి



కించిజ్ఞుడొకడులేచి ఉపన్యాసము చేయబోవుట అతి సాహసము, అయినను తమవంటి పెద్దలందరు నన్నొక పెద్దగా జేసి, కార్యదర్శిగా నియమించి, ఉపన్యాసము చేయుమని గౌరవించుటచేత, నేను నిర్భయముగా ముందుకు వచ్చియున్నాను. ఈ సభ యొక్క ముఖ్యోద్దేశ్యములన్నియు గౌరవనీయులగు మన అగ్రాసనాధిపతిగారే విన్నవింతురు. గాన ఇంతటితో విరమించుచున్నాను.

అప్పుడు అగ్రాసనాధిపతిగారు లేచి ఉపన్యాసము చేయబోగా చప్పట్లు చఱచుటకు చేతులు లేనందున మూషికము లన్నియు పండ్లు పటపట కొఱికియు, తోకలు ఝాడించియు, చప్పుడు చేసియు తమ సంతోషమును వెల్లడించినవి. అంతట సభాపతి యిట్లని విన్నవించెను.

ఆర్యులారా! మిత్రులారా! ఈ దినమున జరగబోవుచున్న యీ మహాసభకు నన్నగ్రాసనాధిపతిగా మీ రందరొకే కంఠ్యముగా గోరి అత్యంత గౌరవము నాకు అందజేసినందులకు మీ కందఱకు నేను అనేక శిరస్సాష్టాంగ దండ ప్రణామము లాచరించుచున్నాను. ఇంత గౌరవము నాకు జన్మలో ముందెన్నడును జరుగలేదు. కనుక ఈ గొప్ప గౌరవము నేను బ్రతికియున్నంత కాలము మఱచి పోజాలను. ఈ గౌరవము శూల నొప్పివలె నా కుడిడొక్కలో ఎల్లకాలము మెలగుచుండును. ఈ యగ్రాసనాధి పత్యమునకు నేనెంతమాత్రము తగనివాడనని యెరుగుదును. నాకంటె వయసులోను, జ్ఞానములోను, తెలివిలోను, తేటలోను మిక్కిలి సమర్థులయిన మహాత్ములీ సభలో ఉండగా, ఈ యగ్రాసనాధిపత్యము నావంటి కించిజ్ఞున కేల యొసగిరో తెలియకున్నది. ఈ మహాపదవికి నేను నిశ్చయముగా తగియుండకపోయినను, తగుదునని మీరందరు సెలవిచ్చి యిందు గూర్చుండ బెట్టినందుకు నా యథాశక్తిగా ఈ మహాభారమును నేను పైన వేసికొని, ఈ కార్యనిర్వాహమును దైవసహాయముచేత చక్కగా నిర్వహించుటకు కోరుచున్నాను. ఈ నిర్వాహమునకు కావలసిన ధైర్యము, సామర్థ్యము, బలము, ఉత్సాహము, చాకచక్యము, వాగాడంబరము, కార్యశూరత్వము, నీతి సంపద మొదలగునవన్నియు నాకును సభా సదులకును ప్రసాదింపవలెనని భగవంతుని అహోరాత్రములు ప్రతినిమిషము ప్రార్థించుచున్నాను. ఈ సభయొక్క ముఖ్యోద్దేశ్యములు మీకందఱకు నాకంటె బాగుగా తెలిసినప్పటికిని, నా వంటి తెలియనివాళ్ళు కొందరుందురేమో యని మరల చెప్పుచున్నాను. ఈ సభలో పందికొక్కులు, యెలుకలు, చూరెలుకలు, చిట్టెలుకలు, చుంచులు సభ్యులుగా చేరవచ్చును. ఇది మొదలు మనము తఱచుగా నెల కొకసారియో రెండు నెలల కొకసారియో కలుసుకొని సభలుచేసి మనకు గల సాధక బాధకములు హానివృద్ధులు, కష్టసుఖములు చెప్పుకొని తీర్మానములు చేసి ఆ ప్రకారము మన మందరము నడుచుకొనుటకయి తీర్మానము చేయవలెను. ఈ సభయొక్క ముఖ్యోదేశములు మనకుండు కష్టములు తొలగించుకొనుటయే. ఆపై అభివృద్ధి పొందుట, మనలో మనము ఐకమత్యము కలిగియుండుట. ఒకరు కొరికిన చుట్ట మరొకరు కొరకగూడదు. ఒకరు దొంగిలించుకొని వచ్చిన రొట్టెముక్క మరియొకరు తీసుకొనగూడదు. ఒకరు త్రవ్వుకొన్న కన్నములో వారి సెలవులేక మరొకరు దూరగూడదు. స్థాలీపులాకన్యాయముగా చెప్పినాను గాని యింకను ననేక ధర్మములున్నవి. మనలో మనమైకమత్యముగా నున్న పక్షమున ఫాలాక్షుడయినను మనల దెరి చూడలేడు. ప్రపంచములో మన జాతివంటి గొప్ప జాతి లేదు. మన ఔన్నత్యము మన కీర్తి వేదములలో, పురాణములలో వాల్మీకి, వ్యాసుడు మొదలయిన మహర్షులందరు కొనియాడినారు. కపాలము చేతబుచ్చుకొని పాములు నగలుగా ధరించి తోలు కట్టుకొని బూడిద పూసుకొని వల్ల కాటిలో కాపురమున్న సాక్షాత్ పరమేశ్వరుడయిన పరమ శివుని యొక్క జ్యేష్ఠ కుమారుడైన మహారాజ శ్రీమత్ విఘ్నేశ్వరునకు మన కుల పెద్ద వాహనము. ఇటువంటి గౌరవము ప్రపంచములో మనకు తక్క ఏ జాతికి గలదు? మన ఔన్నత్యము మనము తెలిసికొనజాలక పాడగుచున్నాము. మనము పృథివి పుట్టినప్పటి నుంచి యున్నాము. మనలను మనము పొగడుకొనగూడదు. కాని మన పూర్వనాగరికత తెలివి తేటలు వాచామగోచరము. కాబట్టి మన మన్నివిధముల వృద్ధిబొంది, మన పూర్వులయొక్క సంతతివారమని మన గొప్ప తనముచేత తెలియచేయవలయును. ఈ సభయొక్క



మొదటి తీర్మానము నా మిత్రులయిన బుంగమొగము బొండెలుకగారు కదుపుదురు.

**నూతన సంవత్సరంలో నీవు తీసుకొను తీర్మానాలు.**

అప్పుడు బుంగమొగము బొండెలుకగారు లేచి యిట్లనిరి. ''ఆర్యులారా! నేను మీ యెదుట బెట్టవలసిన తీర్మానమిది: దుష్ట జంతువులకు పిల్లులవలన మన జాతి కంతకు మహాప్రళయము జరుగుచున్నది గనుక అట్టి పిల్లుల బాధను సర్వవిధముల చేత మూషిక జాతి తొలగించుకోవలసినదని యీ సభవారు తీర్మానించు కున్నారు. మూషిక కులరత్నములారా! ఈ పై తీర్మానమును కదుపవలసిన మహాభాగ్యము నాకు పట్టినది. ఇటువంటి అదృష్టము నాకు పట్టినందుకు నేనెంతో ధన్యుడను. ఈ తీర్మానమును గురించి బుద్ధిమంతులగు మీతో నేను విశేషముగా జెప్పనక్కరలేదు. ఇది మిక్కిలి ముఖ్యమైన తీర్మానము. మిక్కిలి ప్రసిద్ధమైన మన జాతి నశించుట, నిలుచుట ఈ తీరుమానములోనే యున్నది. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్' అను నార్యోక్తిని బట్టి మన దేహసంరక్షణము ముందు చేసుకోవలెను. శ్రీమహాగణపతికి వాహనములయిన మనమెక్కడ! దొంగచూపులు చూచు తుంటరి పిల్లి యెక్కడ? ఛీ! దానిచేతనా మనము పట్టుబడ వలసినది? చచ్చుపిల్లి, పాడుపిల్లి! దొంగపిల్లి, మాయపిల్లి! దాని మొగముచూచినంతనే మహా పాతకములు వచ్చును. దాని నడకే నా కసహ్యము. దాని చూపే నాకు డోకు. దాని కూతలే నాకు కర్ణకఠోరములు. అటువంటి క్షుద్రజంతువు చేతబడి మృతినొందుటకంటె హీనమయిన పనిలేదు. పృథివిలో మనజాతి ఉండవలయునని కోరికయున్న పక్షమున, శరీరము మీద మీకభిమానమున్న పక్షమున మీరందరీ తీరుమానము ఐకకంఠ్యముగా నంగీకరింపవలెనని కోరుచున్నాడను.''

తరువాత చికిలికండ్ల చిట్టెలుక గారు వచ్చి ఈ తీరుమానమును బలపరచుచు నిట్లనిరి. ''అయ్యా! ఈ తీరుమానమును నేను బలపరచుటకు వచ్చినాను. రాతి గోడలనైన పటపట కొరికి పిండి చేయగల మనము మార్జాలమునకు జడియుట సిగ్గుచేటు. ఇంతకాలము మనము పిల్లులకు లోబడియున్నందులకే ఈ తలవంపులు భరింప లేకున్నాము. ఒక క్షణమయినను యికముందు మనము వాటికి లోబడి యుండగూడదు. ఇంతకంటె నేను ఉపన్యసింప వలసినదేదియు లేదు. కనుక ఇంతటితో విరమించుచున్నాను.

**తీర్మానాలు ఏ సందర్భాలలో చేస్తారు.**

అప్పుడు అగ్రాసనాధిపతిగారు లేచి ''మహనీయులారా! ఈ తీరుమానమును గురించి మహావిద్వాంసులైన వారిద్దరు కడు గంభీరముగా, శ్రావ్యముగా, యుక్తియుక్తముగా చెప్పవలసిన దంతయు చెప్పినారు. ఇది మీ కందర కిష్టమేనా? ఇష్టమయినవా

రందరు యంగీకారమును సూచించుటకై తోకలెత్తి పెట్టవలసినదని కోరుచున్నాను.''

**అందరు:** ఇష్టమె, ఇష్టమె (అని తోకలెత్తుచున్నారు) ఏకగ్రీవముగా యీ తీర్మానము జరిగినదని అగ్రాసనాధిపతిగారు నిర్ణయించి, రెండవ తీరుమానమును సభవారి యెదట ప్రవేశ పెట్టవలసినదని పొడుగు యెలుకగారిని పిలిచెను. అప్పుడు పొడుగెలకగారు లేచి రెండవ తీర్మానము నీ క్రింది విధముగా జదివిరి. 'మార్జాలము మనమీదికి వచ్చునపుడు ఆనవాలు తెలియుటకై దాని మెడలో కంచుగంట నొకటి కట్టవలయు' నని యీ తీరుమానము.



'ఆర్యులారా! ఈ తీరుమానము మిక్కిలి యుపయోగకరమైనది. పిల్లుల మెడలలో గంటలు కట్టిన పక్షమున ఆ గంటలు చప్పుడు కాగానే మన మందరము పారిపోవచ్చును. లేదా నాలుగు మూలలు కాచి మనము దానిపైబడి దానిని చంపవచ్చును. అందుచేత దీనివంటి తీర్మానమింకొకటి లేదు. దీనిని మీరంద రంగీకరింపవలయును.' ఆయన యుపన్యాసము ముగిసిన తరువాత సన్నయెలుక యొకటి లేచి దానిని బలపరచెను. అగ్రాసనాధిపతిగారు లేచి యా తీర్మానమందరి కిష్టమో లేదో తెలుసుకొనిరి. అందరు తమకిష్టమని యైక్య కంఠ్యముగా జెప్పిరి. అప్పుడగ్రాసనాధిపతి గారు లేచి పిల్లుల మెడలలో గంటలు కట్టుటకై యొక సబుకమిటీ యుండవలెనని నిశ్చయించి, యా కమిటీలో బొందెలుకను, సన్నయెలుకను, పొడుగెలుకను, పొట్టెలుకను, ఒక పందికొక్కును సభికులుగా వేసిరి.

**బొందు:** (తనలో) పిల్లి మూతి యెదుటకు వెళ్ళి గంట కట్టితినా నన్నప్పుడు యది మ్రింగివేయును. (ప్రకాశముగా) అయ్యా! నే నీ కమీటిలో నుండుటకు వీలు లేదు. నాకు వ్యవహారములు చాల నున్నవి.

**సన్నయెలుక:** (తనలో) బ్రతికియుంటె బలుసాకయిన తినవచ్చును. (ప్రకాశముగా) కమిటీ నాకెందుకు? నే నూరికి వెళ్ళవలసిన పని యున్నది. ఇందులో నుండుటకు వీలులేదు.

**పొడుగెలుక:** నా శరీరములో జబ్బుగా నున్నది. నే నిందులో నుండజాలను.

**పొట్టి:** మా ముసలమ్మ సెలవు లేనిదే నే నేపని చేయజాలను. ఆమె నడిగి వచ్చిన తర్వాత యేసంగతి జెప్పెదను.

**కార్యక్రమం విజయవంతం కావటానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.**

**అగ్రాస:** అందరికి తలకొక పని యుండునప్పుడిందులో సభికులుగా నుండు వారెవరు?

**బొందెలుక :** మీ రుండండి.

**అగ్రా :** మీరే యుండరాదా?

**సన్న:** మీరే యుండరాదా?

**అగ్రా :** నోరు మూయండి.

**పొట్టి :** మీరు నోరు మూయండి.

**అగ్రా :** అవతలకి గెంటించెదను.

**బొందు :** నీ వెవరవు గెంటించుటకు?

**పొట్టి :** వెనుకకు వెళ్లి అగ్రాసనాధిపతిగారి తోక కఱచును.

**అగ్రా:** (పొట్టి యెలుకను పీకును)

**బొందు:** (పందికొక్కు చెవి కొరుకను)

**అన్నియు:** కరచుకొని పీకుకొని సభ ముగించును.

అప్పుడొక చుంచు లేచి ''సభాసదులారా! సభ అల్లకల్లోల మయిపోయినప్పటికిని మనవిధి మనము చేయక తప్పదు. ఎంతో శ్రమపడి ఈ పూట గోడలు కొరుకుట మాని ఇక్కడికి విజయం చేసిన

అగ్రాసనాధిపతిగారికి మీ పక్షమున అనేక వందనములు చేయుచున్నాను. మరియు గోదావరి యొడ్డున నున్న యీ వాడవీధి బాగుచేయక మన నివాసము నిమిత్తమును మనము సభలు చేసుకొనుటకును దయదలంచి చిరకాలము నుండి యీ లాగుననే యుంచిన మునిసిపల్ కమీషనరులకును వందనములు చేయుచున్నాను. కొత్త కమీషనరులు వచ్చిన పక్షమున ఈ స్థలము స్వాధీనము చేసుకొని బాగుచేసి మనలను లేవకొట్టుదురేమో యని భయమగుచున్నది. కనుక లోకోపకార బుద్ధిగల ఈ యధికారులే శాశ్వతముగా నుండునట్లు భగవంతుడనుగ్రహించుగాక యని కోరుచున్నాను.



**రచయిత పరిచయం : కీ.శే. శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం** ఆధునిక తెలుగు రచయితల్లో ఒకరు. రాజమండ్రి ఆయన స్వస్థలం. ఆయన 1867 సెప్టెంబర్ 26న జన్మించారు. 1946 జూన్ 17న మరణించారు. తల్లిదండ్రులు వెంకటరత్నమ్మ, వెంకన్నలు. ఆయన అసలు పేరు పున్నయ్య. తర్వాత లక్ష్మీనరసింహం అని పెద్దలు పేరు పెట్టారు.

చిలకమర్తి గొప్ప రచయిత, ఉపన్యాసకుడు, సంఘ సంస్కర్త, అవధానకుడు, కళాప్రపూర్ణ బిరుదాంకితుడు. ఆయన గయోపాఖ్యానం, కర్పూర విజయం కాళిదాస చరిత్రం మొదలగు అనేక గ్రంథాలు రచించారు. పాఠశాల విద్యార్థులకు కొన్ని వచనాలు రచించారు. అనేక ప్రహసనాలు రచించారు. ప్రస్తుత పాఠ్యభాగం 'నవ్వులగని' అను ప్రహసనం నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

- ప్రహసనము అనగానేమి?
- హాస్యం యొక్క ప్రాధాన్యత

## II పదజాలాన్ని పెంపొందించుకుందాం.

చాకచక్యము = నేర్పరి తనము; వాగాడంబరము = మాటలదర్పము; స్థాలీపులాకన్యాయము = ఒక మెతుకు పట్టి చూసి అన్నం ఉడికిందా లేనిదో చెప్పునట్లు (గుణబాహుల్యము ఉన్నచోట ఒక్క గుణాన్ని బట్టి మంచిచెడ్డలు తెలుసుకోవచ్చు); వాచామ గోచరము = మాటలలో వర్ణించనలనికానిది.

## III అ) జతపరచండి :

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) బ్రతికియుంటే బలుసాకు తినవచ్చు. | అ) చుంచు ఎలుక |
| 2) నాశరీరములో జబ్బుగా నున్నది. | ఆ) బొందెలుక |
| 3) నన్నప్పుడు అది మ్రింగి వేయును. | ఇ) పాడుగెలుక |
| 4) మన విధి మనము చేయక తప్పదు. | ఈ) సన్న ఎలుక |

### ఆ) స్పష్టీకరించండి.

1) మూషికసభ జరిగిన ప్రదేశపు వర్ణన.
2) అగ్రాసనాధిపతి ఉపన్యాసము చేయబోగ ఎలుకలు తమ సంతోషమును తెలిపినవిధము.
3) మూషికసభ ముఖ్య ఉద్దేశ్యములు.

### ఇ) సరియైన సమాధానాలు గుర్తించి రాయండి.

1) మూషికసభ ఈనది ఒడ్డున ఉన్న పాడుబడిన భవనములో జరిగినది. [ ]
(గోదావరి, కృష్ణా)

2) ఎలుకల బద్ధశత్రువు. [ ]
(పులి, పిల్లి)

3) మూషిక వాహనుడని ఈయనని పిలుస్తారు.
(శివుడు, వినాయకుడు)

4) మూషికముల ఔన్నత్యమును పురాణాలలో కీర్తించిన కవి.
(వాల్మీకి, జాషువా)

## ఈ) ఎవరు ఎవరితో పలికిరో రాయండి.

1) నేనెంత మాత్రము తగని వాడనని ఎరుగుదును. → 
2) దాని నడకే నాకసహ్యము. → 
3) నేనెంతో ధన్యుడను. → 
4) మున్సిపల్ కమీషనర్‌లకును వందనము చేయుచున్నాను. → 

## ఉ) తప్పొప్పులను గుర్తించండి.

1) మూషికసభకు పందికొక్కు అగ్రాసనాధిపత్యము వహించెను. ( )
2) బుంగమొగము బొండెలుక సభకు కార్యదర్శిగా పనిచేసెను. ( )
3) పిల్లిమెడలో కంచుగంట కట్టవలెనని తీర్మానము జరిగెను. ( )
4) పొట్టి ఎలుక అగ్రాసనాధిపతి తోకను కటిచెను. ( )

## IV అ) లఘుటీకలు రాయండి.


1) అగ్రాసనాధిపతి ఉపన్యాస సారాంశము.
2) మూషికజాతి ఔన్నత్యము.
3) పిల్లిని తమ శత్రువుగా బొండెలుక పేర్కొన్న విధము.
4) మూషికసభలో చివరికి జరిగిన రసాభాసము.

## ఆ) కింది పాత్రల వ్యక్తిత్వాన్ని గురించి రాయండి.

1) అగ్రాసనాధిపత్యము వహించిన పెద్దపందికొక్కు.
2) కార్యదర్శి పదవిని అలంకరించిన పాలపండ్ల ఎలుక.


## ఇ) కింది వాక్యాలను సరియైన క్రమంలో అమర్చి రాయండి.

1) బొండెలుక మొదటి తీర్మానమును ప్రవేశపెట్టెను.
2) అగ్రాసనాధిపతి సభను ఉద్దేశించి ఉపన్యసించెను.
3) పిల్లిమెడలో కంచుగంట కట్టవలెనని పొడుగెలుక రెండవ తీర్మానం చేసెను.
4) మూషికాలన్నీ కరుచుకొని, పీకుకొని సభ ముగించును.
5) కార్యదర్శియైన పాలపండ్ల ఎలుక సభలో ఉపన్యసించెను.




# 2. హంపీ నడకలు











'హంపీ వెళ్ళాలి... రాయలు నడయాడిన సీమను చూడాలి' అన్నకోరిక ఏనాటిదీ? నలభై ఏళ్ళనాటిది.

నాలుగేళ్ళ క్రితం ఉద్యోగరీత్యా బెంగుళూరు బదిలీ అయి వచ్చినప్పుడు కాళ్ళూ మనసూ పదపదలెమ్మన్నాయి. హంపీ గురించి వివరాలు సేకరించాను.


ఓ ఏప్రిల్ నెల శుక్రవారం రాత్రి బెంగుళూరులో హంపీ ఎక్స్‌ప్రెస్ ఎక్కాను. ఉదయం ఏడింటికల్లా హోస్పేటలో దిగాను.

హోస్పేట నుంచి హంపీ పన్నెండు కిలోమీటర్లు. 1336లో హరిహర బుక్కరాయళ్ళు విద్యారణ్యస్వామి ప్రోత్సాహంతో స్థాపించిన విజయనగర సామ్రాజ్య రాజధాని హంపీ. పదహారో శతాబ్దం పూర్వ పాదంలో ఆంధ్రభోజుడు తిరుగాడిన స్థలం హంపీ. అప్పటి ఆ నగరపు శిల్పాలూ, శిథిలాలూ ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా పరిశోధకులనూ, పర్యాటకులనీ ఆకర్షిస్తున్నాయి.

మొదటిరోజు శనివారం – ఆ అనేకానేక మైళ్ళూ ఆ ప్రదేశమంతా కాలినడకన తిరుగాడాలనీ, తనివిదీరా ఆయాప్రదేశాలతో స్నేహం పండించుకోవాలనీ, రెండోరోజు తుంగభద్రను దాటి ఆవలివైపున ఉన్న పొలాలూ, కొండలూ, చక్రతీర్థమూ, పంపాసరోవరమూ, అంజనాద్రి పర్వతమూ కలయదిరగాలనీ.. రాత్రికి రైలు పట్టుకుని మళ్ళీ సోమవారం ఉదయాన్ని కల్లా బెంగళూరు చేరుకోవాలనీ నా ప్లాను.

హోటల్ నుంచి ఎనిమిదింటికల్లా బయటపడి హంపీ బస్సు పట్టుకున్నాను. తొమ్మిది గంటల ప్రాంతంలో హంపీ శిథిలాల నడిబొడ్డున దిగాను. ఎదురుగా పడమర దిక్కున విరూపాక్ష మందిరం. దానిముందు తూర్పు పడమరలుగా ఏడువందల గజాల మేర సాగిపోయి ఉన్న అలనాటి రత్నాల రాసుల సుప్రసిద్ధ హంపీ బజారు. దానికి అవతలి కొసన అచ్యుతరామ మందిరపు శిథిలాలు. ఆపైన మాతుంగ పర్వతం, ఆపర్వతం మీద ఒక శిథిలాలయం.

ఎండముదురుతోన్నా నడవాలనే కోరికే జయించి ముందుగా విరూపాక్షాలయంలో అడుగుపెట్టాను. విశాలమైన ఆలయప్రాంగణం. ముందుగా నూటయాభై అడుగులు ఎత్తున్న గోపురం. విపుల శిల్ప సంపద నిండిన గోపురం.



గర్భగుడికి ఆవల ఉన్న ఓవిశాల మంటపస్తంభాల మీద సూక్ష్మ వివరాల సుందరశిల్పాలు. పైకప్పు మీద శివపురాణాలకు చెందిన వర్ణచిత్రాలు.

విరూపాక్ష మందిరపు గర్భగృహం వెనుక బయటకు వెళ్ళడానికి మెట్లు ఉన్నాయి. పదిమెట్లు ఎక్కగానే ఒక పక్క చిరుచీకటి నిండిన చిన్నపాటి గది. ఆగదిలో తూర్పుదిశన ఉన్నగోడ మీద సన్నపాటి రంధ్రం. అందులోంచి వస్తోన్న వెలుతురు ఎదురుగా ఉన్న గోడమీద అక్కడికి మూడువందల అడుగుల దూరాన ఉన్న రాజగోపురపు తలక్రిందుల నీడను సృష్టిస్తోంది! ఇలా చిన్నపాటి రంధ్రంలోంచి వచ్చే వెలుతురు తలక్రిందుల నీడను సృష్టించడం అన్న సూత్రం మీద ఆధునిక కాలపు మొదటితరం పిన్‌హోల్‌కెమెరాలు ఆవిష్కరించబడ్డాయి. ఈ సూత్రాన్ని ఎన్నో వందల సంవత్సరాల క్రితమే అందిపుచ్చుకొని ఆ అద్భుతాన్ని దేవాలయ వాస్తుశాస్త్రంలో పొందు పరచగలగడం అప్పటి వాస్తుశిల్పుల కళానైపుణ్యతకు నిదర్శనం. సహజంగానే ఈ వింత ఇప్పుడు విరూపాక్షాలయాన్ని చూడడానికి వచ్చే దేశవిదేశాల సందర్శకులను ఆకర్షిస్తోంది. హంపీలోని దేవాలయాలనూ ఇతర శిల్ప కళావిశేషాలనూ యునెస్కో సంస్థ 'ప్రపంచ వారసత్వ సంపద'గ గుర్తించి ప్రకటించింది.





ఓ అరగంటగుడిలో గడిపి గుడి వెనక్కి నడిచాను. పక్కనే తుంగభద్ర. అది ఒక నదిలా గాకుండా కొండలూ బండలూ మధ్య తుళ్ళిపడే పెనుసెలయేరులా అనిపించింది. గుడిలోంచి బయటపడి బస్సు ఎక్కి విరూపాక్షాలయం దగ్గర ఉన్న హేమకూట పర్వతం వద్ద దిగాను. ఆ ప్రాంతంలో రెండు అతి చక్కని వినాయక విగ్రహాలు, కొంచెం అవతలగా ఓ శిథిల కృష్ణాలయం. పక్కనే ఓ శివలింగాలయం. ఆపక్కనే ఉగ్ర నరసింహుని విగ్రహం. ఏడుపడగల ఆదిశేషుడు నీడపట్టగా ఏకశిలలో చెక్కిన ఇరవై అడుగుల భీకర సుందర శిల్పమది.



మరల బస్సు ఎక్కి ఓ కిలోమీటరు వెళ్ళగా ఉత్తరాన కోదండ రామాలయం, ఆంజనేయస్వామి మందిరం ఉన్నాయి. అక్కడి నుండి విఠల మందిర ప్రాంతం చేరాను. అద్భుతమైన కళ్యాణ మండపం. ఇప్పటికీ చక్రాలు తిరిగే ఏకశిలారథం సప్తస్వరాలు పలికే శిలాస్తంభాలు.

ఆ ఊరికి దక్షిణభాగానే ఉన్న హజార రామాలయం దాని పరిసరాలు నా తదుపరి మజిలీ. అవన్నీ అప్పటి రాజప్రసాదపు ప్రాంగణంలో ఉన్నాయి.



రాజకుటుంబీకులకే పరిమితమైన హజార రామాలయపు గోడలమీద రామాయణ గాథలు, గుర్రాలు, ఏనుగుల బారులు, నృత్య సైనిక దళాలతో పాటు అరుదైన బుద్ధావతారపు శిల్పాలు ఉన్నాయి. ఆలయానికి కాస్త దూరాన అలనాటి టంకశాల. అది దాటుకుని వెళితే రాజప్రసాదం... మరికాస్తదూరాన మహర్నవమిదిబ్బ. అక్కడ్నించే కృష్ణదేవరాయలు దసరా ఉత్సవాలను తిలకించేవారట. దానికి ఎదురుగా ఎత్తుగా ఉన్న విశాలమైన సమతల ప్రదేశం. అష్ట దిగ్గజాలతో రాయలవారు సాహితీగోష్టులు జరిపిన ప్రదేశమన్నారు. ఆ ప్రాంతంలో ఈ మధ్య తవ్వకాలలో బయలుపడిన ఒక అతిచక్కని కొలను కనిపించింది.

ఈ కట్టడాలకు కిలోమీటరు ఉత్తరాన రాణివాసాలు. అందులో ముఖ్యమైనది లోటస్ మహల్. దానికి దగ్గర్లోనే బృహత్తరమైన గజశాలలు ఓ పదకొండు ఉన్నాయి.

ఆ రోజు పర్యటన ఈ విధంగా ముగిసింది.

* * * * *

రెండో రోజు, ఆదివారం. పొద్దున్నే బయల్దేరి ఎనిమిదింటికల్లా విరూపాక్ష మందిర ప్రదేశం చేరాను. హంపి బజారుకు ఆవలి కొసన ఉన్న మాతంగ పర్వతం ఎక్కాలని ఆలోచన. కాని బజారులో నడక ముగించాక పడవలో నది దాటి, అరటి తోటలు దాటి, అంజనాద్రి పర్వతం దిగువకు చేరాను.

అరగంట పట్టింది శిఖరాగ్రం చేరడానికి. కొండ దిగువన కనిపించిన భూదేవి బొమ్మ కళ్ళు చెదిరేలా చేసింది. అంతా పచ్చదనం. అక్కడక్కడ చిన్న చిన్న గుట్టలు... ఎదురుగా మెలికలుమెలికల తుంగభద్ర.... ఆవెనుక హంపీ శిథిలాలు... విరూపాక్షాలయం... ప్రకృతి సౌందర్యం అమోఘం అనుకుంటూ కొండదిగాను.

నా మరుసటి గమ్యం పంపాసరోవరం. ఆదగ్గర్లోనే ఉందని తెలుసు. రామాయణంలో చెప్పిన సరోవరమంటారు. గ్రామం.... చిన్నవాగు... అడవిలా పెరిగిన అరటితోటలు... పక్కనే కొండ గుట్టలు.... మేకల్ని మేపుతూ ఓ ముసలావిడ. పలకరిద్దా మనిపించింది. ఏభాషా? తెలుగులో ప్రయత్నించాను. ఫలించింది! కుశల ప్రశ్నలు. పిచ్చా పాటీ ఏకాంతం... ప్రకృతి... పచ్చదనం! పరవశం! ఏ(ట్రెక్కర్ కయినా ఈ నేపథ్యం స్వర్గలోక సమానం.

గంటన్నర నడవగా పంపాసరోవరం చేరాను. పెద్దదేంగాదు. వందా నూటేభై అడుగుల పొడవూ వెడల్పూ. సరోవరం నిండా తామరపూలు. నీళ్ళు కనిపించకుండా తామరాకులు. బావుంది.

తిరుగు ప్రయాణం ఆరంభించాను. అనెగొందిదాకా వెళదామనుకున్నాను. చక్రతీర్థం చూద్దామనుకొన్నాను. వాటికి సమయం చాలదని బోధపడింది. నదిదాటి పల్లెబాటల్లో దక్షిణ దిక్కున నడచి విఠల మందిరం పరిసరాలకు చేరాను. అక్కడ్నించి నది ఒడ్డునే సాగాను. నది ఒడ్డున ఇంకొంచెం ముందుకు సాగగా 'కన్నడ–త్యాగరాజు' పురందరదాసు మంటపం... సంగీతపు భావన... నదీ తీరాన సరైన దారి లేకపోయినా దారి చేసుకుంటూసాగాను.

మాతంగ పర్వతారోహణ ఇంకా మిగిలే ఉంది. అనుకొన్న పనిపూర్తి చేయాలన్న పట్టుదలతో అరగంటలో కొండపైకి ఎక్కి.... అక్కడ ఉన్న పురాతన మందిరంతోపాటు దిగువనఉన్న హంపీనగరాన్ని మరోసారి తనివి తీరా అన్ని దిశలలోనూ చూసి, అంజనాద్రికీ, విరూపాక్ష మందిర గోపురాలకూ ఓ నమస్కారం పెట్టి కొండ దిగాను.


కాలంతో పోటీపడి అరటితోటలగుండా దారి వెతుక్కుని ఆరింటికల్లా ఉగ్రనరసింహ విగ్రహం మీదుగా విరూపాక్షాలయం దగ్గరి బస్టాండు చేరాను.

బస్సెక్కి హోస్పేట చేరేసరికి ఏడు దాటింది. గబగబా ఎర్లీ డిన్నరు ముగించి స్టేషన్ చేరేసరికి నేనూ రైలూ ఒకేసారి ప్లాట్‌ఫాం మీదకు అడుగుపెట్టాం!

సోమవారం తొమ్మిందింటికల్లా ఆఫీసు సీట్లో ఉన్నానన్న మాటేగానీ మనసింకా మాతంగ పర్వతం మీదే చిక్కడి పోయి ఉందనిపించింది.

మళ్ళీ హంపీ వెళతానా?

తప్పకుండా!



**రచయిత పరిచయం :** దాసరి అమరేంద్రగారు 1953 మార్చి 14న దాసరి నాగభూషణరావు, పరిపూర్ణ దంపతులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా ధర్మాజి గూడెంలో పుట్టారు.

సాహిత్యమంటే బాగా చిన్నప్పట్నుంచీ ఎనలేనిగురి. జీవితాలను మలచడంలో సాహిత్యం గణనీయమైన పాత్ర వహించగలదు అన్నది వీరి స్వీయానుభవం. గత ముప్ఫై ఏళ్ళుగా వివిధ సాహితీ ప్రక్రియల్లో విరివిగా రాసారు. ఇప్పటిదాకా పన్నెండు పుస్తకాలు వెలువడ్డాయి. అన్ని ప్రక్రియల్లోనూ తనకు యాత్రా సాహిత్యం అంటే ఎక్కువ మక్కువ అంటారు. గత ఐదేళ్ళుగా వీరు అనువదించిన 'చిత్రగ్రీవం' అన్న పుస్తకపు భాగం ఉభయ తెలుగు రాష్ట్రాలలో పదోతరగతి తెలుగులో పాఠ్యాంశంగా వుంది. ప్రస్తుత పాఠ్యభాగం 'మణి మహేష్ మరి తొమ్మిది యాత్రా కథనాలు' అను పుస్తకం నుండి గ్రహించబడినది.

## I చర్చించండి.

1) విహారయాత్రల వలన ప్రయోజనాలు.
2) మీరు చేసిన విహారయాత్ర – అనుభవాలు.

## II అ) పదజాలాన్ని పెంపొందించుకుందాం:

శిథిలములు = పురాతన కట్టడ అవశేషాలు; భీకర = భయంకరమైన; మజిలీ = ప్రయాణంలో తాత్కాలిక నివాసం; టంకసాల = నాణెముల ముద్రించే చోటు; గోష్ఠి = సభ; అమోఘము = గొప్ప; సరోవరము = సరస్సు; తనివి = తృప్తి.

### ఆ) స్పష్టీకరించండి.

1) హంపీ స్థాపన వివరాలు.
2) ఉగ్రనరసింహుని విగ్రహం వర్ణన.
3) పంపాసరోవరం గూర్చిన సౌందర్య దృశ్యాలు.

## III అవగాహన కృత్యములు.

### అ) సరియైన సమాధానాలు ఎన్నుకొని గడులను పూరించండి.

1) శ్రీకృష్ణదేవరాయలు ఈ పేరుతో ప్రఖ్యాతిగాంచెను. [ ]
(i) ఆంధ్రభోజుడు (ii) ఆంధ్రరాజు (iii) ఆంధ్రపాలకుడు.

2) హంపీ ఈ నది ఒడ్డున వెలసినది. [ ]
(i) గోదావరి (ii) తుంగభద్ర (iii) కావేరి.

3) హంపీ బజారు వీటికి ప్రసిద్ధి [ ]
(i) కూరగాయలు (ii) వస్త్రాలు (iii) రత్నాలరాసులు

4) హంపీ రాణివాసాలలో ముఖ్యమైనది. [ ]
(i) రాణిమహల్ (ii) లోటస్ మహల్ (iii) రాణి అంతఃపురం

### ఆ) కింది వాక్యాల తప్పొప్పులను గుర్తించి రాయండి.

1) విజయనగర సామ్రాజ్యానికి రాజధాని హంపీ. (    )
2) హంపీ హోస్పేట నుండి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. (    )
3) విఠలమందిర ప్రాంతంలోని కల్యాణమండపంలో ఇప్పటికి తిరిగే చక్రాలు గల ఏకశిలా రథం గలదు. (    )
4) త్యాగరాజు ఒకగొప్ప చిత్రకారుడు. (    )

ఇ) జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) సప్తస్వరాలు పలికే స్తంభాలు | అ) కృష్ణ దేవరాయలు దసరా ఉత్సవాలను ఇక్కడి నుండే తిలకించేవారు. |
| 2) మాతుంగ పర్వతం. | ఆ) రాజ కుటుంబీకుల దర్శనానికి మాత్రమే పరిమితం |
| 3) హజార రామాలయం | ఇ) విఠల మందిర ప్రాంతంలోని కల్యాణ మండపం. |
| 4) మహర్నవమి దిబ్బ | ఈ) దీనిపై నుండి హంపీనగరం అన్ని దిశలు కనిపించును. |

ఈ) కింది 'హంపీ' పర్యటనాంశాలను వరస క్రమంలో అమర్చి రాయండి.

1) విఠల మందిర ప్రాంత సందర్శన చేసెను.
2) మాతుంగ పర్వతారోహణ చేసెను.
3) హజార రామాలయ పరిసరాలను దర్శించెను.
4) బెంగళూరు నుండి హోస్పేటకు 'హంపీ ఎక్స్‌ప్రెస్‌రైలు' ఎక్కెను.
5) విరూపాక్షాలయాన్ని దర్శించెను.

## IV. లఘుటీకలు రాయండి.

1) పదహారవ శతాబ్దం నాటి 'హంపీ' ప్రత్యేకతలు.
2) హేమకూట పర్వతప్రాంతం వర్ణన.
3) హజార రామాలయ పరిసర ప్రాంతాలు.

## V. సృజనాత్మకత :

మీరు చూసిన ప్రదేశాల్లో, ఆయాస్థలాల గురించి సూచనాఫలకాలపై రాసిన స్థలవిశేషాలను నీ నోటు పుస్తకములో నమోదు చేసుకొని కళాశాల తరగతిలో ప్రదర్శించండి.

## VI. క్షేత్రసందర్శనం (Field Visit) :

మీ ప్రాంతంలోని చారిత్రక కట్టడాల గురించి విపులంగా తెలుసుకోండి. ఆ వివరాలను 'గైడ్‌లాగా ఇతరులకు చెబుతూ చూపండి/చెప్పండి.

ప్రత్యక్ష అనుభవం – గైడ్ నవుతా:

మీ ఊరికి వచ్చిన బంధువులు, మిత్రులకు ప్రేక్షణీయ స్థలాలను వాటి చరిత్ర/వివరాలను తెలియజేస్తు చూపండి.



# 3 గోపయ్య స్వర్గయాత్ర



భువనగిరిలో భూపతిరాజు పేరుమోసిన జమీందారు. అతనికి ఎన్నో ఎకరాల పంటపొలాలు, తోటలు ఉండేవి. ఆ పొలం పనులన్నింటిని గోపయ్య చాలా నమ్మకంగా చూసుకునేవాడు. జమీందారు గోపయ్యకు దగ్గరుండి చూసుకోవడానికి చెఱకుతోటలో ఒక ఇల్లు కూడా కట్టించాడు.

ఒకరోజు గోపయ్య చెఱకు తోటలోని కొంతభాగం ఏదో జంతువు మేసినట్లు గమనించాడు. ఆరోజు రాత్రి ఆ జంతువేదో పసిగట్టాలని నిర్ణయించుకున్నాడు. అర్ధరాత్రి అవుతుండగా.... ఆశ్చర్యం. గోపయ్య తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. కళ్ళను నులుముకొని మళ్ళీ చూశాడు. నిగనిగలాడుతు మెరుస్తున్న ఒక తెల్లటి ఏనుగు చెఱకుగడలు తింటున్నది.

ఇదేమి ఆశ్చర్యం! ఈ ఏనుగు ఎక్కడనుంచి వచ్చింది! గోపయ్య తెల్లని ఏనుగును ఇంతవరకు చూడలేదు. కానీ చిన్నప్పుడు వాళ్ళమ్మ చెప్పిన దేవతల కథలలో దేవతలకు రాజు ఇంద్రుడు. ఆయన స్వర్గంలో ఉంటాడు. తెల్లగా ఉండే ఐరావతం అనే ఏనుగు ఇంద్రుడి వాహనం అని విన్నాడు.

''ఆ! బహుశా ఇది ఆ ఐరావతమే అయిఉండాలి.'' ''స్వర్గంలో విసుగెత్తిపోయి భూమ్మీదకు వచ్చి ఉంటుంది. నేను గనుక వెళ్ళి దాని తోకను పట్టుకుని వేలాడితే ఈ ఐరావతం నన్ను తిన్నగా స్వర్గానికి తీసుకొని వెళ్తుంది. ఆహా! అప్పుడు స్వర్గాన్ని కళ్ళారా, తనివి తీరా చూడవచ్చు'' అని సంబర పడిపోయాడు గోపయ్య.

వెంటనే నెమ్మదిగా అడుగులు వేసుకొంటూ తోటలోకి వెళ్ళాడు. ఒక చెట్టు చాటున నిల్చుని ఏనుగును చూడసాగాడు. ఏనుగు చెఱకుగడలను తినసాగింది. కానీ దానిని కోప్పడి తరిమివేస్తే స్వర్గం చూడటమెలా? అందుకని అతడు దానిని అదిలించలేదు.

తెలతెలవారుతుండగా ఏనుగు తినడం చాలించింది. ఏనుగు ఇంక బయలుదేరడానికి సిద్ధంగా వుందని గోపయ్య తెలుసుకున్నాడు. చెట్టు చాటునుండి వచ్చి, గబుక్కున ఎగిరి ఏనుగు తోకను పట్టుకున్నాడు. కాస్త ఆలస్యం చేసివుంటే ఏనుగు తోక అందకపోయేది అనుకున్నాడు. అంతలో ఏనుగు పైకి లేచింది.

మరి కాస్సేపట్లో గోపయ్య మేఘాలను దాటి పైకి వెళ్ళి పోయాడు. కిందికి చూచి 'అయ్య బాబోయ్! గట్టిగా గనక పట్టుకోకపోతే ప్రాణాలుండవు' అనుకున్నాడు. భయంతో ఒళ్ళంతా చెమటలు పోసింది.

**నీవు చదివిన/విన్న కాల్పనిక కథలు**


పట్టువదలకుండ తోకను గట్టిగా పట్టుకొని ఎటువంటి ప్రమాదమూ లేకుండా క్షేమంగా స్వర్గాన్ని చేరాడు. ఐరావతం స్వర్గంలో దిగగానే దాని తోకను వదిలిపెట్టి నిల్చున్నాడు. కాస్త తూలబోయి నిలదొక్కుకున్నాడు. చుట్టూ ఆశ్చర్యంతో అందమైన తోట చూశాడు. ''స్వర్గలోకపు నందనవనం అంటే ఇదే కాబోలు'' అనుకున్నాడు.

''ఆహా ఎంతెంత పెద్ద పూలచెట్లు ఇంద్రుడిగారి తోటమాలి ఈ చెట్లకు ఏమి ఎరువులు వేస్తాడో ఏమో!''

అవి భూమిమీద ఉన్నవాటికి పదింతలున్నాయి. వాటిని చూచిన గోపయ్య ఆశ్చర్యానికి అంతులేదు. రోజంతా ఆ తోటలో తిరుగుతూ తియ్యని పండ్లను తిన్నాడు.

చీకటి పడుతుండగా. ''అయ్యో పాపం! నా భార్య తాయారు భూమి మీద నాకోసం వెతుకుతూ వుంటుంది.

తన కోసం ఈ స్వర్గంనుంచి ఏదన్నా కానుక తీసుకుపోవాలి.'' అని బారెడంతా బాదాం పప్పును తీసుకున్నాడు. ఈలోగా రాత్రి అయింది. ఏనుగు-ఘీంకరించింది. అది భూమి మీదకు వెళ్ళడానికి సిద్ధంగా వుందని తెలుసుకున్నాడు. పరుగు పరుగున వెళ్ళి దాని తోకను పట్టుకున్నాడు.



ఏనుగుతోపాటు భూమి మీద తన రాజుగారి తోటలో దిగాడు. వెంటనే ఇంట్లోకి పరుగెత్తుకు పోయాడు.

భార్య ''పొద్దుటి నుంచి చెప్పాపెట్టకుండా ఎక్కడికి వెళ్ళారు'' అని కోపంగా అడిగింది.

''కోప్పడకు తాయారు, నీకోసం ఏమి తెచ్చానో చూడు'' అంటూ స్వర్గంనుండి తెచ్చిన బారెడంత పొడుగు బాదం పప్పును ఇచ్చాడు.

''అయ్య బాబోయ్! ఇంత పొడుగు బాదం పప్పు ఎపుడూ చూడలేదే! ఎక్కడ నుంచి తెచ్చారండీ?'' అని ఆశ్చర్యంతో అడిగింది తాయారు.

''స్వర్గంనుంచి తెచ్చాను.'' అని ఆమెకు జరిగినదంతా చెప్పాడు గోపయ్య. మొదట ఆమె నమ్మలేదుకాని ఆ బాదం పప్పును చూచాక ఆమెకు నమ్మక తప్పిందికాదు. మరి అంత పెద్ద బాదం పప్పు ఈ ప్రపంచంలో దొరకదు కదా.... కథంతా చెప్పాక గోపయ్య భార్యతో – ''ఇదిగో.... ఈ విషయం ఎవ్వరికి చెప్పకూడదు. పరమ రహస్యంగా ఉంచాలి సుమా'' అన్నాడు.

''అట్లాగే! ఎవ్వరికి చెప్పనులెండి'' అంది తాయారు.

ఎవ్వరికి చెప్పను అని అనడమయితే అంది కాని ఆమెకు అంత గొప్ప రహస్యాన్ని ఎవ్వరితోను చెప్పకుండా దాచుకోవడం బలే కష్టమనిపించింది. మళ్ళీ ఒకసారి స్వర్గానికి వెళ్ళి అతి తియ్యటి, పెద్ద పండును తెచ్చాడు గోపయ్య. ఆ తర్వాత ఆ రహస్యాన్ని దాచుకోవడం ఆమెకు మరీ కష్టమయి పోయింది. అయినా సరే ఎలాగో తమాయించుకుంది. గోపయ్య మూడవసారి స్వర్గానికి వెళ్ళినపుడు, ఒక అందమైన పెద్దపువ్వును తీసుకొచ్చాడు. ఆ పువ్వు సువాసన ఘుమఘుమలు చాల దూరం వరకు వ్యాపించాయి. ఆ వాసన పసిగట్టిన తాయారు స్నేహితురాలు కొందరికి ఆశ్చర్యం వేసింది. ఇదేమి సువాసనో తెలుసుకుందామని తాయారు దగ్గరకొచ్చి – ''నువ్వు ఏదో మంచి అత్తరును వాడుతున్నట్లుంది. దాన్ని ఎక్కడ కొన్నావో చెప్పు-'' అని అడిగింది. అందుకు ఆమె ''నేనేమీ అత్తరు వాడలేదు. మా ఇంట్లో ఒక పెద్ద పుష్పం వుంది. దాని సువాసనే అది!'' అన్నది. దాంతో అసలు విషయం కాస్తా బయట పడిపోయింది. అది విని ఆ స్నేహితురాలు ఒకటి తర్వాత ఒకటిగా ప్రశ్నలు వేసింది. గోపయ్య భార్య అన్నిటికి జవాబులు చెప్పింది. ఈ విధంగా కథనంతా తన స్నేహితురాలికి వివరించింది తాయారు. ''ఈ విషయం ఇంకెవ్వరి తోను చెప్పవద్దని'' – కోరింది.

కానీ ఆ స్నేహితురాలు తనకు అత్యంత ఆప్తురాలయిన మరొకావిడకు ఈ గమ్మత్తయిన విషయం అంతా చెప్పి ఇంకెవ్వరికి చెప్పవద్దని కోరింది. మరొకావిడ ఇంకొకావిడకు చెప్పి ''రహస్యంగా వుంచమని'' అంది. ఇంకొకావిడ ప్రక్కింటావిడకు మాత్రం చెప్పింది. ఇలా క్రమక్రమంగా ఊళ్ళో వాళ్ళందరికి ఈ విషయం తెలిసింది.

**మంచి స్నేహితులు తన స్నేహితుల రహస్యాలను ఎవరికీ చెప్పరు... చర్చించండి.**

ఒక రోజు పొద్దున్నే ఊళ్ళోని ఆడమగా అంతా కలిసి గోపయ్య ఇంటికి వచ్చారు. వాళ్ళు అతనితో – ''నువ్వు స్వర్గం వెళ్ళి వచ్చినట్లు మాకు తెలిసింది. ఈ సారి స్వర్గానికి వెళ్ళేటప్పుడు మమ్మల్ని నీతోపాటు తీసుకు వెళ్ళు –'' అన్నారు.

గోపయ్యకు తాయారు మీద చాలా కోపం వచ్చింది. కాని ఇప్పుడింకేమి చేయగలడు? అంచేత వాళ్ళందరితో ''సరే మీరందరూ ఇవాళ చెఱకు తోటలోకి రండి – అయితే ఏ మాత్రం చప్పుడు చేయకుండా నిశ్శబ్దంగా వుండాలి. సుమా'' అన్నాడు.

గోపయ్య చెప్పినట్లు ఆ రాత్రి అందరూ తోటలోకి చేరారు. ఐరావతం వచ్చి తోటలోకి దిగనే దిగింది. వాళ్ళందరికి బలే ఆశ్చర్యం వేసింది. కాని వాళ్ళు నోరు విప్పలేదు. అంతా నిశ్శబ్దంగా వున్నారు.

తెల్లవారు ఝామున గోపయ్య వాళ్ళకు సైగ చేసి, తాను వెళ్ళి ఐరావతం తోకను పట్టుకున్నాడు; తాయారు గోపయ్య కాళ్ళు పట్టుకుంది; ఆమె కాళ్ళను ఒక స్త్రీ పట్టుకుంది; ఆమె కాళ్ళను ఆమె భర్త పట్టుకున్నాడు; అతడి కాళ్ళను ఇంకొకడు పట్టుకున్నాడు; అతడి కాళ్ళను అతడి భార్య పట్టుకుంది. ఈ విధంగా ఆ ఊరివారందరూ ఒకరి కాళ్ళు ఒకరు వరుసగా గొలుసులాగ పట్టుకున్నారు. ఐరావతం పైకి లేచింది. పట్టు వదలితే క్రింద పడి ప్రాణం గాలిలో కలిసిపోతుందని గట్టిగా పట్టుకున్నారు అందరూ.

ఈ విధంగా ఆ జనాభా అంతా స్వర్గంవైపు ప్రయాణం చేస్తూ చేస్తూ వుండగా, అందరికన్న దిగువనున్న ఒకావిడకు ఒక సందేహం కలిగింది. ఆమె తనకు పైన వున్న తన భర్తతో – ''స్వర్గంలో పండ్లూ, పువ్వులూ, చాల పెద్దవిగా ఉంటాయని తాయారు చెప్పింది. కాని ఎంతెంత పెద్దగా వుంటాయో చెప్పలేదు. కాస్త మీ పైన వున్న మీ మిత్రుడిని అడిగి కనుక్కోండి!'' అంది.

అతడు తనకు పైనున్న మిత్రుడినడిగాడు; ఆ మిత్రుడు తన భార్య నడిగాడు. ఆమె తనకు పైనున్న తన స్నేహితురాలి నడిగింది. ఆ స్నేహితురాలు తన భర్తని అడిగింది. అతగాడు పైనున్న ఇంకొకడిని అడిగాడు. ఇట్లా ఆ ప్రశ్న మొత్తం మీద తాయారుకు చేరింది. ఆమె గోపయ్యను అడిగింది. ''స్వర్గంలో పండ్లూ పువ్వులూ ఎంతెంత పెద్దవిగా వుంటాయీ అని అడుగుతున్నారు అందరూ– ''ఎంత పెద్దగా ఉంటాయో చెప్పండి'' అంది.

''కాస్సేపట్లో స్వర్గం చేరాక వాళ్ళే చూస్తారుగా!'' అన్నాడు గోపయ్య. ఆ మాట క్రిందిదాక వెళ్ళింది. కాని ఆ కొసని ఉన్న ఆవిడ అంత తేలిగ్గా నోరుమూసుకునే ఘటం కాదు. ఉబలాటం కొద్దీ మళ్ళీ అదే ప్రశ్న వేసింది. ఆ ప్రశ్న పైకి వెళ్ళి వెళ్లి తాయారుకు చేరింది. ''ఏమండీ! నా స్నేహితురాలు స్వర్గం చేరేదాక ఉండలేదట. అక్కడ పువ్వులూ పండ్లు ఎంతెంత వుంటాయో–'' తక్షణం చెప్పండి అని తాయారు గోపయ్యను విసిగించింది.

గోపయ్యకు కోపం వచ్చింది. ఆ కోపంతో ''అక్కడి పండ్లు పువ్వులు, పప్పులు భూమ్మీది వాటికన్నా పదిరెట్లు పెద్దవి. నేనారోజు తెచ్చిన బాదం పప్పు ఇంత పొడవుగా లేదూ–'' అంటూ గోపయ్య ఆ బాదం పప్పు పరిమాణాన్ని చేతులతో చూపించడానికని ఏనుగు తోక వదిలిపెట్టాడు.

ఇంకేముంది! అందరూ వరసగా అంత ఎత్తునుండి క్రిందకు కూలారు. ఇక ఒక్కరయినా బతికి బయట పడితేకదా ప్రశ్నలడగడానికి!

అమ్మో పడిపోతున్నానంటూ ఒక్క ఉదుటున లేచాడు గోపయ్య. అప్పుడు గ్రహించాడు తాను కన్నదంతా కల అని. హమ్మయ్య! అనుకొని స్థిమిత పడ్డాడు.

## I చర్చించండి.

1) వాహనాల ప్రయోజనాలు.

2) తోటల పెంపకము.

## II పదజాలం - పెంపొందించుకుందాం.

ఘీంకారం = ఏనుగు అరుపు; అత్తరు = పరిమళతైలము; గమ్మత్తు = తమాషా; ఉబలాటము = ఉత్సాహము, కుతూహలము.

## III అ) స్పష్టీకరించండి.

1) గోపయ్య చేసే పనులు.

2) గోపయ్య చెఱకు తోటలో చూసిన అద్భుత దృశ్యం.

3) గోపయ్యకి, భార్యకి మధ్య జరిగిన సంభాషణ.

4) గోపయ్య ఊరి వాళ్ళను స్వర్గానికి చేర్చలేక పోవటానికి కారణం.

### ఆ) కింది పాత్రల వ్యక్తిత్వాన్ని గురించి రాయండి.

1) గోపయ్య.

2) తాయారు

### ఇ) జతపరచండి.

| 'క' వర్గము | 'చ' వర్గము |
|---|---|
| 1) నందనవనం | అ) బాదంపప్పు |
| 2) బారెడంత | ఆ) కళ్ళుకాయలు కాచాయి |
| 3) ఏనుగు | ఇ) స్వర్గంలో వున్న తోట. |
| 4) ఎదురు చూసి చూసి | ఈ) పైకి లేచింది. |

### ఇ) కింది గడులను కుండలీకరణంలోని సరైన పదాలను ఎన్నుకొని పూరించండి.

(స్వర్గలోకం, ఐరావతం, యముడు, ఇంద్రుడు, తాయారు)

1) గోపయ్య భార్యపేరు ______

2) దేవతల యొక్క రాజు ______

3) ఇంద్రుని వాహనం ______

4) ఇంద్రుడు నివసించే లోకం ______

### ఈ) తప్పొప్పులను గుర్తించండి.

1) ఐరావతం యొక్క రంగు నల్లగా ఉండును. (   )

2) గోపయ్య ఏనుగు తొండమును పట్టుకొని స్వర్గానికి ఎగిరెను. (   )

3) పండు సువాసన కారణంగా స్వర్గం విషయం బయటపడింది. (   )

4) ఊరి వాళ్ళంతా క్షేమంగా స్వర్గం నుండి భూమ్మీదకు వచ్చారు. (   )

**ఉ) ఎవరు, ఎవరితో పలికిరి.**

1) ''ప్రొద్దుటి నుంచి చెప్పాపెట్టకుండా ఎక్కడికి వెళ్ళారు?'' ______ → ______

2) ''ఇదిగో... ఈ విషయం ఎవ్వరికి చెప్పకూడదు.'' ______ → ______

3) ''నువ్వు ఏదో మంచి అత్తరును వాడుతున్నట్లుంది.'' ______ → ______

4) ''ఈసారి స్వర్గానికి వెళ్ళేటప్పుడు మమ్మల్ని నీతోపాటు తీసుకువెళ్ళు.'' ______ → ______

**IV అ) లఘుటీకలు రాయండి.**

1) గోపయ్య మొదటిసారి స్వర్గానికి చేరిన విధం.

2) ఐరావతాన్ని చూసి గోపయ్యలో కలిగిన ఆలోచనలు.

3) ఐరావతం వార్త ఊరంతా పాకిన విధం.

**ఆ) కింది వాక్యాలను వరుసక్రమంలో అమర్చి రాయండి.**

1) అంతలో ఏనుగు పైకిలేచింది.

2) దాంతో అసలు విషయం కాస్తా బయట పడింది.


3) ఒక తెల్లటి ఏనుగు చెఱకుగడలను తింటున్నది.

4) ఒకరోజు పొద్దున్నే ఊళ్ళోని ఆడా మగా అంతా కలిసి గోపయ్య ఇంటికి వచ్చారు.

***ప్రత్యక్ష అనుభవం – కథకుణ్ణవుతా!***

*గణపతి ఉత్సవాలు వంటి సందర్భాలలో కథవేదిక నేర్పరచండి.*

*పిన్నాపెద్దలకు కాశీ మజిలీ, భట్టి విక్రమార్కాది కల్పిత కథలను చెప్పి ఆనందపరచండి.*



# 1. రేడియో జాకీ (ఆర్.జె.)



ఆధునిక జీవితంలో సమాచార వినిమయానికి మానవుడు వివిధ ప్రసార మాధ్యమాలను ఉపయోగించుచున్నాడు. వీటిలో ముద్రణ, శ్రవ్య, దృక్-శ్రవ్య మాధ్యమాలు ప్రముఖమైనవి మరియు ప్రభావవంతమైనవి. ఈ సామూహిక ప్రసారమాధ్యమాలలోని శ్రవ్యమాధ్యమమైన ఆకాశవాణికి సంబంధించిన 'రేడియోజాకీ' గురించి తెలుసుకొందాము.

భారతదేశంలో 'ఇండియా బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ' అప్పటి ప్రభుత్వంతో కలిసి 1927వ సంవత్సరంలో ముంబయి మరియు కలకత్తా పట్టణాలలో రేడియో ప్రసార కేంద్రాలను స్థాపించింది. 1935లో మైసూరు సంస్థానము స్థాపించిన రేడియో కేంద్రానికి 'ఆకాశవాణి' అని నామకరణం చేసింది. తదుపరి భారత ప్రభుత్వం ఈ ప్రసార మాధ్యమానికి ఈ పేరునే కొనసాగించింది. ఈ ఆకాశవాణిలో వార్తలు, ప్రసంగాలు, ముఖాముఖి, పరిచయాలు, చర్చలు, సంభాషణలు, సంగీత కార్యక్రమాలు, రూపకాలు, నాటకాలు, కథానికలు, సమాలోచనలవంటి వివిధ రకాలైన కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. ఇవి అన్ని వయస్సుల వారికి సంబంధించినవిగా ఉంటాయి. ఈ కార్యక్రమాలను అనుసంధానం చేసే పద్ధతిలోని నూతన ఒరవడియే ''రేడియో జాకీ'' (ఆర్.జె.) అనవచ్చు.

### రేడియో జాకీ - నైపుణ్యాలు

ఆకాశవాణిలో కార్యక్రమాలను ఆధునిక మరియు ప్రభావవంతమైన శైలిలో నివేదన చేయు వ్యక్తిని 'రేడియో-జాకీ' అని అంటారు.

- రేడియోజాకీ సాధారణంగా దాదాపు రెండు మూడు గంటలపాటు శ్రోతలకు ఆహ్లాదాన్ని కలిగించాలి.
- సందర్భోచితంగా సమయస్ఫూర్తితో ధారాళంగా మాట్లాడాలి.
- రెండు మూడు భాషలను సమ్మిళితము చేసి కార్యక్రమ నివేదన చేయాలి.
- మూసపద్ధతిలో గాక ఫోనులో శ్రోతలతో సంభాషణ (ఫోన్ ఇన్ ప్రోగ్రాం), చర్చలు, వారి పుట్టినరోజు సంగతులు లేదా ప్రత్యేక రోజుల గురించి చర్చించుట మొదలైన అంశాలపై కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- అతిథులతో ముఖాముఖితోపాటు వాతావరణం, ఆటలు, రహదారులకు సంబంధించిన తాజా సమాచారం-వార్తలను అనుసంధానిస్తూ కార్యక్రమాన్ని నడిపించాలి.
- రేడియోజాకీ తన భాషా పరిజ్ఞానం, వాక్చాతుర్యంతో హాస్యాన్ని పండించి శ్రోతలకు శ్రవణానందమే కాకుండా మనోల్లాసాన్ని అందిస్తూ ఆకట్టుకోవాలి.
- భాష, సాహిత్యం, సాంస్కృతిక విషయాలు బాగా తెలిసి ఉండాలి.
- చక్కని అధ్యయన నైపుణ్యం ఉండాలి.
- సినిమా, సంగీత మరియు నాట్య క్షేత్రానికి సంబంధించిన ఉత్తమ పరిజ్ఞానం ఉండాలి.
- సామాజిక, రాజకీయ, ఐతిహాసిక మరియు భౌగోళికాది విషయ పరిజ్ఞానం ఉండాలి.
- రేడియో జాకీ సాంఘిక మాధ్యమాల కొత్త ప్రవాహం అందులోని ఆధునికత గురించి జాగృతి కలిగి ఉండాలి.

- కార్యక్రమానికి అనుగుణంగా ఉత్తమ కార్యక్రమ సంరచన చేయడం రావాలి.
- కంఠధ్వని స్పష్టంగా మరియు ఉత్తమంగా ఉండాలి.
- భాష అనేది శ్రోతల మనస్సు ప్రసన్నం చేయువిధంగా, ఒత్తిడిని దూరం చేయు విధంగా ఉండాలి.
- ఆలోచనలు, భావనలు, మరియు సంవేదనలు ప్రకటించే రీతిలో ధ్వనిలోని హెచ్చుతగ్గులు ప్రతిబింబించడంలో కుశలత ఉండాలి.

ఈ నైపుణ్యాలను అలవర్చుకుంటే చక్కని రేడియోజాకీగా రాణించవచ్చు.

**రేడియో జాకీ-ఉపాధి అవకాశాలు :**

రేడియో జాకీగా స్థిరపడాలని అనుకునేవారికి అందులో ఎలాంటి ఉద్యోగ అవకాశాలు ఉంటాయో, కింది అల్లికను చూడండి.

- వివిధ మనోరంజక సంస్థలు
- ఎ.ఎమ్.ఎఫ్.ఎమ్. చానల్స్
- రేడియో జాకి ఉద్యోగ అవకాశాలు
- ప్రకటన సంస్థలు
- ప్రత్యేక కార్యక్రమాలు
- ఆల్ ఇండియా రేడియో
- చర్చా వేదికలు

ఈ రేడియో జాకీతో పాటు సూత్ర సంచాలనములో ప్రవేశం ఉన్నట్లయితే శ్రవ్య, దృక్-శ్రావ్య మాధ్యమములతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించే అవకాశాలు లభిస్తాయి.

**అభ్యాసం :**

1) రేడియో జాకీకి కావలసిన అర్హతలను రాయండి.
2) ఆకాశవాణిలో ప్రసారం అయ్యే కార్యక్రమాలను రాయండి.
3) రేడియో జాకీ ఉపాధి అవకాశాలను గురించి రాయండి.
4) ఏదైనా ఒక కార్యక్రమాన్ని తీసుకొని రేడియో జాకీ ఎలా నిర్వహించాలో రాయండి.
5) ఒక సంగీత కార్యక్రమాన్ని రేడియో జాకీ ఎలా నిర్వహించాలో రాయండి.

# 2. ప్రశ్నలు తయారుచేయుట.

ప్రశ్నించడం ఒక కళ. ప్రశ్న అనేది సంభాషణకు ఆయువు పట్టు లాంటిది. ఒక విషయంపై సమగ్ర అవగాహన కొరకు లేదా సమాచార సేకరణకు ప్రశ్న అనేది ఆయుధం లాంటిది. ప్రశ్న అనేది మనలోని సందిగ్ధత, అనిశ్చిత భావాలను అనుమానాలను పటాపంచలు చేస్తుంది. ప్రశ్న లేనిదే సంభాషణ కొనసాగదు. జ్ఞాన సముపార్జన జరగదు. పిల్లలు ఉత్సుకతతో ప్రశ్నించడం ద్వారా అనేక విషయాలు నేర్చుకుంటారు. కాబట్టి ప్రశ్నించడం అనేది భాషలో అతి ముఖ్యమైన అంశం.

**ప్రశ్నకు ఉండవలసిన లక్షణాలు.**

- ప్రశ్న సంక్షిప్తంగా సూటిగా కావలసిన సమాచారాన్ని రాబట్టేదిగా ఉండాలి.
- ప్రశ్నలో సందిగ్ధత ఉండకూడదు.
- ప్రశ్న అనేది సమాచారాన్ని సేకరించేదిగా అభిప్రాయాన్ని తెలుసుకొనేదిగా, అనుమానాలను నివృత్తి చేసేవిధంగా వాక్య నియమాలకనుగుణంగా ఉండాలి.

**అభ్యాసం : ఉదాహరణ**

**కింది గద్యాన్ని చదివి ప్రశ్నలను తయారు చేయండి.**

మనదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. నీటిపారుదల ఎక్కువగల ప్రాంతాలలో వరి పంటను ఎక్కువగా పండిస్తారు. వరి పంటనుండి బియ్యం లభిస్తుంది. ఈ బియ్యం మనకు ఎంతో ఉపయోగకరమైన ఆహార ధాన్యమని మీ అందరికీ తెలుసు. అటువంటి ఆహారధాన్యాన్ని పండించుటకు రైతులు, మనుషులు ఇంకా ఎంతో మంది శ్రమించాలి.

వరిపంటను పండించుటకు మొదట భూమికి నీళ్ళు పెట్టి, బాగా దున్నాలి. పిదప పొలానికి అధికంగా సేంద్రీయ ఎరువులు వేయాలి. అందులో వరిధాన్యం వేసి మొలకెత్తిన తర్వాత నారును పీకి, పొలంలో నాటాలి. వరిపైరుకు నీళ్ళు ఎప్పటికీ ఉంటే పంట అధికంగా వస్తుంది. ఈ నీళ్ళు బావుల నుండి ఏతము ద్వారా తోడాలి. పిదప పైరు ఎదిగే కొద్ది కలుపు మొక్కలను తొలగించడానికి ఉదయం నుండి చీకటి పడేంత వరకు నడుము వంచి పనిచేయాలి. పంట వెన్నుపట్టాక పక్షుల, ఎలుకల బారినుండి కాపాడాలి. పిదప పంటను కోయడానికి, గింజలను నూర్చడానికి ఎంతోమంది మనుషులు అవసరం. వారెంతో శ్రమించి వరి వెన్ను నుండి గింజలను రాలుస్తారు. వాటినే వడ్లు అంటారు.

ఆ వడ్లను బాగా ఆరబెట్టి, దంచితే వచ్చేది బియ్యం. ఇంత కష్టపడి తయారుచేసిన వరి బియ్యాన్ని మనము ఏమాత్రము వృధా చేయరాదు. కావలసినంతే వడ్డించుకోవాలి. వడ్డించుకున్నదంతా భుజించాలి.

ప్రశ్నలు :

1) వరి పంటను ఏ ప్రాంతాలలో పండిస్తారు?

2) వరిపంట పండించుటకు భూమిని ఎలా సిద్ధం చేసుకోవాలి?

3) వరిపంటకు ఏ ఎరువులు వేయాలి?

4) వరిపంటను వేటి నుండి కాపాడాలి?

5) బియ్యం ఎలా లభిస్తాయి?

కింది గద్యభాగమును చదివి ప్రశ్నలను తయారు చేయండి.

స్త్రీ జనోద్ధారిణి అయిన దుర్గాబాయి 1909వ సంవత్సరం జులై 15న ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జన్మించారు. ఆమె తల్లి కృష్ణవేణి, తండ్రి రామారావు. ధైర్యం, పట్టుదల, నీతి నిజాయితీ మొదలైన లక్షణాలు ఆమెకు వీడని ఆభరణాలు. ఆమెకు చిన్నతనం నుంచి సంగీతం, వీణ, ముగ్గులువేయడం, పూలజడలు అల్లడం మొదలైన కళాత్మక పనుల పట్ల ఎక్కువ మక్కువ.

దుర్గాబాయ్ విద్యాభ్యాసం రాజమండ్రిలో జరిగింది. ఆమె ఒక పాఠశాలను స్థాపించి వయోజనులైన తల్లులకు విద్యనేర్పారు. హిందీభాషను కూడా బోధించి వారిని ప్రవీణులుగా తీర్చిదిద్దారు. దుర్గాబాయ్ స్త్రీ జనోద్ధరణ కోసం ప్రత్యేకంగా ఒక సభ ఏర్పాటు చేసి గాంధీగారిని పిలిపించి ఉపన్యాసం పెట్టించారు. 1930లో దుర్గాబాయ్ మద్రాసు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1946లో నెహ్రూ ఆహ్వానంపై ఆమె ఢిల్లీ వెళ్ళి 1950 వరకు రాజ్యాంగ నిర్మాణసభాసభ్యురాలిగా పనిచేశారు.

'ఆంధ్ర మహిళ' పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించి సారస్వత సేవ చేశారు. స్త్రీ శిశు సంక్షేమాలకు అహోరాత్రులు కష్టపడి పనిచేసి దుర్గాబాయ్ మహనీయులచే ప్రశంసలందుకున్నారు. డాక్టర్ చింతామణి దేశ్‌ముఖ్ ఆమెలోని సుగుణాలను ఇష్టపడి ఆమెను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆమె దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గా పిలవబడ్డారు. దుర్గాబాయ్‌కి సాహిత్యం పట్ల ఎంతో అభిరుచి ఉండేది. ఆంధ్రవిశ్వవిద్యాలయం వారిచే గౌరవ డాక్టరేట్ కేంద్ర ప్రభుత్వంచే 'పద్మభూషణ్', బిరుదును 'నెహ్రూ లిటరసీ' అవార్డును ఆమె అందుకున్నారు.

ప్రశ్నలు :

1) ______________________________

2) ______________________________

3) ______________________________

4) ______________________________

5) ______________________________

# 3. వ్రాతప్రతి ముద్రిత శోధన (Proof Reading)

ఏ రకమైన సాహిత్య రచన అయినను భాషాదోషాలు లేకుండా చూచుట చాలా అవసరం. అనగా అక్షర దోషాలతో పాటు వ్యాకరణ, విరామ చిహ్నలను, పునరుక్తులను కూడా సరిచూచుట మిక్కిలి ఆవశ్యకం. మనం స్వయంగా వ్రాసిన లేదా ఇతరులు వ్రాసిన దానిని వ్యాకరణ, వాక్యనిర్మాణ, లేఖన నియమాల దృష్ట్యా సూక్ష్మ పరిశీలనాత్మకంగా తనిఖీ చేయడాన్ని 'వ్రాతప్రతి ముద్రిత శోధన' అంటారు. దీనిని ఆంగ్లంలో 'Proof Reading' అంటారు.

ముద్రణ సరిగా లేకపోతే తప్పులు దొర్లుతాయి. కొన్నిసార్లు పదాలలోని తప్పుల వలన అర్థాలు మారుతుంటాయి. లేదా విపరీత అర్థాలు ఏర్పడతాయి. అందువలన ముద్రణ ప్రక్రియలో వ్రాతప్రతి ముద్రిత శోధనకు అధిక ప్రాధాన్యత కలదు. ఎలాగైతే మనోసౌందర్యం లేకపోతే శరీర సౌందర్యానికి అర్థం లేదో అలాగే పుస్తకము యొక్క బాహ్యరూపం ఎంత ఆకర్షణీయంగా ఉన్నాగాని ముద్రిత దోషాల వలన పుస్తకం యొక్క ప్రభావం తగ్గిపోతుంది. ఈ వ్రాతప్రతి ముద్రిత శోధన అనేది అత్యంత బాధ్యతాయుతమైన పని.

**వ్రాతప్రతి ముద్రిత శోధనలోని ముఖ్యమైన అంశాలు:**

- వ్రాతప్రతి ముద్రిత శోధన చేయు వారికి సంబంధిత భాష మరియు వ్యాకరణముపై సరైన పటుత్వం ఉండాలి.
- ముద్రణ లేఖనం (టైపింగ్)లోని నియమాలు, మెళకువలు, సంకేత చిహ్నలు మరియు అక్షర విన్యాసం (ఫాంట్స్) గురించి పూర్తిగా తెలిసి ఉండాలి.
- ఒక్కోసారి తనకు తప్పులుగా గోచరించిన ప్రయోగాలు/వాక్యాలను రచయిత దృష్టికి తీసుకురావాలి కాని స్వతంత్రంగా ఎలాంటి మార్పులు చేయరాదు.


## వ్రాతప్రతి ముద్రిత శోధన సంకేతాల పట్టిక

| చిహ్నం/గుర్తు | చిహ్నం యొక్క అర్థం | ఉదాహరణ | చిహ్నం యొక్క ఉపయోగం |
|---|---|---|---|
| d | తొలగించండి | ఇతర కథలు | d/ |
| ~ | పదాలస్థానంను మార్చండి | కుమార భారతి | ~/ |
| ‸ | కొత్త పదాన్ని చేర్చండి (హంసపాదు) | పక్షి వరి‸పాలము | ‸ |
| # | పదాల/అక్షరాల మధ్య దూరాన్ని పెంచండి. | పుస్తకంలోఉంటుంది | #/ |
| (,) | స్వల్ప విరామాన్ని చేర్చండి | ఉత్సాహం/ఉత్సుకత | ,/ |
| (.) | పూర్ణవిరామం చేర్చండి | చేయండి‸ | ./ |
| ? | ప్రశ్నార్థకాన్ని చేర్చండి. | ఏమిటి‸ | ?/ |
| ! | ఆశ్చర్యార్థకమును చేర్చండి. | ఆహా‸ | !/ |

| చిహ్నం/గుర్తు | చిహ్నం యొక్క అర్థం | ఉదాహరణ | చిహ్నం యొక్క ఉపయోగం |
|---|---|---|---|
| ⌐ | కొత్త పరిచ్ఛేదముగా మార్చండి | తగ్గిపోతుంది వ్రాతప్రతి | ⌐ |
| ∧ | అక్షరాన్ని చేర్చండి | తీ∧కోండి | సు |
| ా | దీర్ఘమును చేర్చండి | /కకి | ా / |
| ీ | గుడిదీర్ఘమును చేర్చండి | /కీచురాయి | ీ / |
| ్థ | 'థ' ఒత్తును చేర్చండి. | అ/రాలు | ్థ / |

# 4. స్వీయ పరిచయ పత్రం

## (Bio-data / C.V. / Resume)




పూర్తి పేరు : ____________________ ____________________ ____________________

పేరు     తండ్రిపేరు     ఇంటిపేరు

తల్లిపేరు :

లింగము :

జాతీయత :

పుట్టిన తేది :

విద్యార్హతలు :

అభిరుచులు :

చిరునామా :

చరవాణి :

ఈ-మెయిల్ :

పూర్వ అనుభవం :

తెలిసిన / వచ్చిన భాషలు :

| మాట్లాడగలిగేది | చదవగలిగేది | రాయగలిగేది |
|---|---|---|

స్థలం :     సంతకం :

తేది :     పేరు :

# 5. ఈ-మెయిల్ (E-mail)

## ఈ-మెయిల్ :

ప్రపంచం ఎలక్ట్రానిక్‌మయం అయిపోయింది. ఉత్తర ప్రత్యుత్తరాలు (జాబు-జవాబు) కూడా ఎలక్ట్రానిక్ ఉత్తరాలు అయ్యాయి. వీటినే 'ఈ-మెయిల్స్' అంటారు. ఈ-మెయిల్ అనగా ఎలక్ట్రానిక్ మెయిల్. దీనిని 1972లో రాయ్‌టాయ్‌లిన్సన్ కనుగొనెను. ఈ 'ఈ-మెయిల్స్' చరవాణి (స్మార్ట్ ఫోన్), ట్యాబ్, కంప్యూటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించి 'అంతర్జాలం' ద్వారా పంపవచ్చు.

ఈ పద్ధతి ద్వారా సాంప్రదాయ పోస్టల్ పద్ధతిలో జరిగే జాప్యం, వ్యయప్రయాసలను దూరం చేస్తూ క్షణాలలో మన ఉత్తరం చేరవలసిన చోటుకు చేరిపోతుంది. అతి తక్కువ ఖర్చుతో దేశాంతరాలే కాకుండా ఖండాంతరాలకు కూడా అత్యంత వేగంగా ఒక జాబును ఒకేసారి చాలా మందికి క్షణాలమీద అంతర్జాలం సహాయంతో పంపించే సౌకర్యం ఉంటుంది.

కంప్యూటర్ పరిజ్ఞానంతో 'ఈ-మెయిల్స్‌ను' అవలీలగా పంపించవచ్చు. మనచేతిలోని చరవాణిలో కూడా 'ఈ-మెయిల్' పంపించే సౌకర్యం కలదు.

## ఈ-మెయిల్ ఖాతాఏర్పాటు:

'ఈ-మెయిల్'ను పంపడానికి మొట్టమొదట మనం 'ఈ-మెయిల్' ఖాతాను ఏర్పరుచుకోవలసిన అవసరం ఉంటుంది. 'ఈ-మెయిల్' సౌకర్యం అందించడానికి చాలా సంస్థలు ఉన్నాయి. మొదట వాటిలో దేనిలోనైనా ఒక దానిలో మన ఖాతాను ఏర్పరచుకోవాలి. ఖాతా తెరవడానికి వారు అడిగిన సమాచారాన్ని ఆన్‌లైన్లో పూర్తిచేసి మనకు నచ్చిన 'ఈ-మెయిల్' అడ్రస్‌ను, పాస్‌వర్డ్‌ను పొందాలి. ఆ తర్వాత మన 'ఈ-మెయిల్ ID' ద్వారా మెయిల్స్‌ను మనం పంపగలము.

## ఈ-మెయిల్ పంపే విధానం :

ఇపుడు ఈ-మెయిల్‌లో ఉండే అంశాలను చూద్దాం. మొట్టమొదట మీ మెయిల్స్ సంస్థ వెబ్‌సైట్‌లో 'ఈ-మెయిల్' ఐడి (ID) మరియు పాస్‌వర్డ్‌లతో సైన్ ఇన్ చేయాలి.

**తెలుగుభాషను ఎంచుకొని ఈ-మెయిల్ ఉత్తరాన్ని తెలుగులో కూడా పంపవచ్చు.**

• పంపవలసిన వారి చిరునామా :

**To :** వరుసలో ఉత్తరం చేరవలసిన వారి ఈ-మెయిల్ ఐడిని టైప్ చేయాలి.

**విషయం (Subject) :** ఈ వరుసలో ఉత్తరం ఏ విషయం గురించి రాస్తున్నామో క్లుప్తంగా టైప్ చేయాలి.


**సంబోధన :** బంధుత్వాన్ని బట్టి లేదా అధికారిని బట్టి సగౌరవంగా సంబోధించాలి.

**ముఖ్య సమాచారం :** దీనిలో ఆయా లేఖలను బట్టి రాయదలచుకొన్న సమాచారాన్ని సరియైన క్రమంలో వివిధ పరిచ్ఛేదాలలో టైప్ చేయాలి.

**పంపేవారి చిరునామా :** ముఖ్య విషయం పూర్తి చేసిన తరువాత కృతజ్ఞత తెలిపి మీ పేరు, చిరునామా, చరవాణి నంబరు Type చేయాలి. ఇది ఐచ్ఛికం.

మనం పంపదలచిన దస్త్రాలను @ సంకేతం సహాయంతో జోడించి పంపవచ్చు.

• కింది ఈ-మెయిల్ నమూనా చూడండి.




**అభ్యాసం :**

1) మీ బాల్యమిత్రునికి ఈ-మెయిల్ ద్వారా లేఖను రాయండి.

2) ఈ-మెయిల్ ID ని ఎలా తయారు చేస్తారో రాయండి.

3) ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసిన వస్తువు సరిగా లేదని ఆ కంపనీ కస్టమర్ కేర్ వారికి ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయండి.

4) ఈ-మెయిల్ పంపే విధానాన్ని విశదీకరించండి.

# 6. అంతరార్థ వివరణ (సామెతలు)

పెద్దల అనుభవంతో అలంకారికంగా చెప్పిన మాటలలో చాలా అంతరార్థం దాగివుంటుంది. తెలియజేయదలచుకొన్న విషయాన్ని చమత్కారంగా మనసుకు సూటిగా తాకేలా, చక్కని ప్రాసతో చిరస్మరణీయంగా ఉండేలా చెబుతారు. ఇట్టివే సామెతలు.

ఇప్పుడు ఇచ్చిన సామెత యొక్క అంతరార్థ వివరణ సూచనల ఆధారంగా, సోదాహరణంగా ఎలా వివరించి రాయాలో చూద్దాం.

**సూచనలు :**

- ఇచ్చిన సామెత ఏ విషయాన్ని తెలియజేస్తుంది.
- సామెతలో దాగిన విశేషార్థం.
- సందర్భం - సామెతను ఏయే సందర్భాలలో ఉపయోగిస్తారు.
- ముగింపు.

ఉదాహరణకు కొన్ని సామెతలను చూద్దాం.

## మెరిసేదంతా బంగారం కాదు.

సమాజంలో చూసే విషయాలన్నీ సరియైనవి, నిజమైనవి కాకపోవచ్చు అనేది ఈ సామెత తెలియజేస్తుంది.

బంగారం మంచివన్నెతో కంటికి ఇంపుగావుండి మనల్ని ఆకర్షిస్తుంది.

అలాంటి వన్నె కలిగి ఆకర్షించే వస్తువులన్నీ బంగారంతో చేసినవి కాకపోవచ్చు అని సామెత యొక్క సామాన్య అర్థం. దీనినే వాచ్యార్థం అంటారు. కాని సమాజంలో మనలను ఆకర్షించే విషయాలన్నింటిలో నిజాలు ఉండకపోవచ్చు.

ఉదా: ఆకర్షణీయంగా కనిపించే ప్రకటనలోని వస్తువులు నాణ్యమైనవి కాకపోవచ్చు.

సమాజంలో మంచిగుణాలు ఉన్నవారుగా, గొప్పవారుగా కనిపించే వ్యక్తులలో ఆ గుణాలు అస్సలు ఉండక పోవచ్చు. అలాంటి వారిని చూసి మోసపోరాదు. పై పై మెరుగులకు ఆకర్షితులు కావద్దని ఈ సామెత హెచ్చరిస్తుంది. ఇది సామెత యొక్క విశేషార్థం.

## నిదానమే ప్రధానం

ఏపనైనా అనవసరపు కంగారూ, అయోమయం లేకుండా నిదానంగా చక్క దిద్దుకోవాలి. అలాకాకపోతే సమస్యలు ఎదురవుతాయి. శక్తికి మించినట్లుగా పరుగులు తీసి పాలుతాగితే ఆ పాలు ఒంటికి పట్టవు సరికదా వికటించడం జరగవచ్చు. పోటీకోసం పరుగులు తీసి పాలుతాగి ఇబ్బందిపడే వ్యక్తికన్నా నిదానంగా నడిచివెళ్ళి నీళ్ళుతాగి సుఖంగా ఉన్నమనిషే ఆనందంగా జీవించగలడు అని ఈ సామెత తెలియజేస్తుంది.

తాబేలు-కుందేలు పరుగుపందెం వేసుకుంటాయి. కుందేలు ముందుగా పరుగుపరుగున వెళ్ళి దారి మధ్యలో ఒక చెట్టు కింద విశ్రమిస్తుంది. తాబేలు నిదానంగా వెళ్ళి గమ్యస్థానానికి ముందుగా చేరుకొని పందెంగెలుస్తుంది. దీనిని బట్టి నిదానమే ప్రధానం అన్న విషయాన్ని మనం గ్రహించవచ్చు.

## దురాశ దుఃఖానికి చేటు

ఆశపడటం మానవ సహజం. ఆశలేని మానవుడు అభివృద్ధిని సాధించలేడు.

కాని దురాశ అన్నది మానవుని దుఃఖ సాగరంలో ముంచి వేస్తుంది. 'అతిసర్వత్ర వర్జయేత్' అన్నారు పెద్దలు. మితిమీరిన ఆశ కష్టాలకు మూలం. దీనికి ఒక కథను ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ఒకరైతు వద్ద ఒక బాతుఉండేది. ఆ బాతు రోజుకొక బంగారు గుడ్డును పెట్టేది. వాటిని అమ్మి రైతు ఎంతో ధనవంతుడయ్యాడు. అయితే అతను మితి మీరిన దురాశతో 'ఈ బాతు రోజుకి ఒక బంగారు గుడ్డు మాత్రమే పెడుతుంది. దీనిని చంపితే దీని పొట్టలోని బంగారు గుడ్లన్నింటిని ఒకేసారి తీసుకోవచ్చు' అని భావించాడు. మర్నాడు అతను బాతును చంపివేసి దానిపొట్ట చీల్చి చూసాడు. అందులో రక్తమాంసములు తప్పమరేమి లేకపోవడంతో ఆ రైతు ఎంతో విలపించాడు. కాబట్టి దురాశ దుఃఖాన్ని కలుగచేస్తుందని గ్రహించవలెను.

## ఐకమత్యమే మహాబలం

మానవులంతా సుఖసంతోషాలతో జీవితం గడపాలంటే కలిసిమెలిసి వుండటం అవసరం.

ఒక అడవిలో కొన్ని ఆవులు కలిసి మేతకు వెళుతూ వుండేవి. ఒకనాడు పులి ఆవులను చూచి మంచి ఆహారము లభించిందన్న ఉత్సాహంతో వాటిపై దుముకుతుంది. కానీ ఆవులన్నీ కలసికట్టుగా తమ వాడి కొమ్ములతో దాన్ని ఎదిరించి ప్రాణాలు కాపాడుకుంటాయి. కొంతకాలానికి ఆవుల మధ్య తగవు ఏర్పడుతుంది. అవి వేరువేరుగా మేతకు అడవిలోకి వెళతాయి. ఈ విషయాన్ని గ్రహించిన పులి ఆవులన్నింటిని వరసగా చంపివేస్తుంది.

ఐకమత్యంతో వుంటే ఎంతటి బలవంతుడైనా ఎదిరించలేడు. తమలో తామే కలహించుకొనుట ప్రాణహానిని కలుగ జేయునని గ్రహింపవచ్చు.

## ఆరోగ్యమే మహాభాగ్యము

ఇహలోక సౌఖ్యానికి పాడి పంటలు, ధనధాన్యాలు ఎంత అవసరమో ఆరోగ్య పరిరక్షణ అంతకన్నా అవసరం.

అనారోగ్యము అన్నది రోగిని మాత్రమేకాక ఆ కుటుంబ సభ్యుల నందరను కృంగ దీస్తుంది. ధనము ఎంత వ్యయము అయినా సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చాలని కోరుకుంటాము. ఒక్కొక్కసారి అనార్యోగం అంటువ్యాధి రూపం దాల్చి ఇంటి వారినేకాక చుట్టు పక్కల వారికి కూడా ప్రమాదం తెచ్చి పెట్టే అవకాశం ఉంది. ఇది కేవలం మనుషులకే కాక పశు, పక్ష్యాదులకూ వర్తిస్తుంది. అనారోగ్యంతో ఉన్నదానిని ఇతర పశువులను ఒకచోట వుంచినచో ఇతర పశువులు కూడా అనారోగ్యానికి గురి అవుతాయి. ధనం ఎంత వ్యయం చేసినా వాటిని కాపాడు కోవటం కష్టతరమే అవుతుంది. కనుక పెద్దలు ఆరోగ్యం కలిగి ఉండటమన్నది భాగ్యత్వాన్ని కలిగి వుండటంతో సమానమన్నారు. తృప్తి, ఆనందం, ఉత్సాహం అన్నవి ఆరోగ్యం వల్లనే సాధ్యమన్న విషయం గ్రహించవచ్చు.

## దేహబలముకన్నా బుద్ధిబలమున్న

ఆపద వచ్చినపుడు అధైర్య పడరాదు. బుద్ధిబలం ఉపయోగించి ప్రమాదాలనుండి మనల్ని మనం రక్షించుకోవచ్చు అన్న సామెతను కింది కథ తెలియ చేస్తుంది.

అనగనగా ఒక అడవి. ఆ అడవికి రాజు సింహం. ప్రతిరోజు తన ఇష్టాను సారంగా జంతవుల్నిచంపి తింటూవుండేది. ఇలా కొన్ని రోజులకి అడవిలో జంతువులు తగ్గిపోవడం జరిగింది. అందుకని జంతువులన్ని సింహం వద్దకు వెళ్ళాయి. రేపటి నుండి సింహానికి ఆహారంగా ఒక్కొక్క జంతువు వస్తామని విన్నవించుకున్నాయి. ఒక రోజు కుందేలువంతువచ్చింది. కుందేలు ఎలాగైనా ఈ ఆపద నుండి తప్పించు కోవాలనుకుంది. ఒక ఉపాయం ఆలోచించి ఆప్రకారం సింహం వద్దకు ఆలస్యంగా వెళ్ళింది. అప్పటికే సింహం ఎంతో కోపంగా గుహలో తిరుగుతుంది. సింహాన్నిచూసి కుందేలు తనను దారిలో వేరొక సింహం అడ్డగించడంవలన తాను రావడం ఆలస్యమైందని తెల్పింది. అందుకు సింహం, ఆసింహాన్ని వెంటనే తనకు చూపించమంది. కుందేలు సింహాన్ని తిన్నగా ఒక బావి వద్దకు తీసుకెళ్ళింది. సింహం బావిలోనికి తొంగి చూసింది. తన నీడని చూసి వేరే సింహం అని తలచి గర్జించింది. బావి నుండి ఆగర్జన ప్రతి ధ్వనించింది. అదివిని బావిలో వేరొక సింహం ఉందని తలచి బావిలోకి దూకేసింది. ప్రాణాలు పోగొట్టుకుంది. ఈ విధముగా బుద్ధిబలముచే కుందేలు తననుతాను రక్షించుకుంది. కనుక 'దేహబలము కన్నా బుద్ధిబలము మిన్న' అని ఈ కథ ద్వారా మనము తెలుసుకోవచ్చు.

## తొందరపడి ఏపని చేయరాదు.

ఎంతో లోకానుభవం రంగరించి మన పూర్వీకులు చెప్పినవే సామెతలు. కంటికి కనిపించేవన్నీ నిజాలుకావు. తొందరపాటుతో ఏపని చేయకూడదు అనేది పెద్దలమాట.

పూర్వం ఒక గ్రామంలో దేవశర్మ దంపతులు నివసించేవారు. ఒక రోజు దేవశర్మ బిడ్డను ఉయ్యాలలో పడుకోబెట్టి నీళ్ళకు వెళ్ళింది. ఆ సమయంలో ఒకపాము ఉయ్యాల దగ్గరకు వచ్చి పడగెత్తింది. అది చూచిన దేవశర్మ పెంపుడు ముంగిస బిడ్డను కాపాడటానికై పాముతో పోరాడింది. దేవశర్మ భార్య నీటి బిందెతో గుమ్మంలోకి రాగానే ముంగిస ఎదురైంది. ముంగిస మూతికి అంటిన రక్తంచూచి ముంగిస, బిడ్డకుహాని చేసిందని తలంచింది. భయంతో, కోపంతో బరువైన నీటి బిందెను ముంగిసపైకి విసిరింది. తరువాత లోపలికి వెళ్ళిచూచి నిజాన్ని తెలుసుకొని బాధపడింది.

తొందరపడి ఏపని చేయరాదు.

## కృషితో నాస్తి దుర్భిక్షం (కష్టేఫలి)

కష్టపడి పనిచేసినట్లైన ఫలితాన్ని తప్పకుండా సాధించగలము. ఒకరైతుకు నలుగురు కుమారులు కలరు. వారు పొలంపనులు చేయక సోమరులుగా వుంటూ ధనాన్ని వ్యర్థం చేస్తూ వుండడం రైతు గమనించాడు. ఒకనాడు నలుగురు కుమారులను పిలిచి మన పొలంలో పూర్వులు లంకెబిందెలను దాచి వుంచారు. అయితే ఎక్కడ దాచారో తెలియదు అని చెప్పాడు. కుమారు లందరూ కలసి పొలము దున్నారు. కానీ ఏమి దొరక లేదు. వారితో ఈ పొలమందు విత్తనముల చల్లి సాగుచేయమని పలికాడు. పొలమును అలాగే వదిలివేయడం ఎందుకని వారు పొలమును సాగుచేసారు. దానితో అత్యధిక దిగుబడి వచ్చింది. కుమారులను చూచి తండ్రి మన పొలమందు బంగారము పండినదని పలికాడు. దీనిని బట్టి కష్టపడినచో శ్రమకు తగ్గ ఫలితము లభిస్తుందని గ్రహించవచ్చు.

## నవ్వు నాలుగు విధాల చేటు

మనిషి తన జీవన యాత్రలో ఎప్పుడు ఎలా ప్రవర్తించాలి, ఎక్కడ, ఎవరితో ఎలా మసలుకోవాలి అనే విషయాలను సూటిగా వివరించి చెప్పే శక్తి సామెతలకు వుంది.

నవ్వు మనిషికి ఆనందాన్ని, ఆరోగ్యాన్ని ఇవ్వవచ్చు కానీ అంతమాత్రంతో పెద్దల ముందు, శత్రు సమానుల ఎదుట, సభా కార్యక్రమాలలోను, అపరిచితుల ముందు నవ్వినపుడు ఆ నవ్వుకు అర్థాలు మారుతూవుంటాయి. సరైన రీతిలో ఎదుటి వారిని అర్థం చేసుకోలేక పోతే భరించ లేనన్ని ప్రమాదాలు వస్తాయి. మయసభలో దుర్యోధనుని చూచి ద్రౌపది నవ్విన నవ్వు భారత యుద్ధానికి దారి తీసిందికదా. అందువల్ల సమయ సందర్భాలను బట్టి మాత్రమే నవ్వాలని అట్లుకానిచో ఆ నవ్వు ఎన్నో విధాలుగా ప్రమాదం కలిగిస్తుందని మనం గ్రహించవచ్చు.

## కూర్చుని తింటే కొండలయినా కరుగుతాయి.

మనిషికి సోమరి తనం పనికిరాదని ఏదో ఒక గౌరవప్రదమైన పనిచేసి సంపాదించాలని చెప్పటమే ఈ సామెత అంతరార్థం. సోమరితనంతో పనీ పాటా లేకుండా గాలికి తిరిగే వారివల్ల సమాజానికి ఎటువంటి ప్రయోజనం ఉండదు. అటువంటి వారికి సుతిమెత్తగా ఈ సామెత చురక వేస్తుంది. పెద్దలు సంపాదించిన ఆస్తి ఎన్ని కోట్లు ఉన్నా దాన్ని తింటూ కూర్చుంటే చివరకు పైసా లేని దారిద్ర్యాన్ని అనుభవించ వలసి వస్తుంది. అటువంటి దుస్థితిని ఎవరూ తెచ్చు కోకూడదని కొండలైనా ప్రతిరోజు పగల కొట్టి రాళ్ళను తీసుకు వెళితే కొన్నాళ్ళకు అక్కడ కొండకు సంబంధించిన ఆనవాళ్ళుకూడా ఏమీ వుండవని ఒకచక్కటి ఉదాహరణ చెపుతూ సోమరి పోతులకు పనిదొంగలకు మార్గదర్శ సూత్రంగా ఈ సామెత ఆవిర్భవించినట్లు అవగతమవుతుంది.

## ఇంటర్నెట్లో బాల కథలు:

మనిషిని సంస్కరించి మంచివైపు మరల్చగల మహత్తరమైన శక్తి.... సాహిత్యానికి ఉంది. అందులోను కథ అనే ప్రక్రియ చాలా శక్తి వంతమైనది. అది ఒక జీవితాన్ని మార్చగలదు.

ఒకప్పుడు అమ్మమ్మ, నానమ్మ తాతయ్యలు వెన్నెల రాత్రులలో డాబా పైనో, ఆరుబయటనో మంచాలు వేయగానే ఒడిలో కూర్చో పెట్టుకొని, అనగా... అనగా అంటూ మొదలు పెట్టి ఎన్నో కథలు చెప్పేవాళ్ళు. ఆ అందమైన అలౌకిక కథలు వింటూ ఊహాలోకంలో విహరిస్తూ నిదురించేవారు.

అట్టి కథలు సంస్కృతీ, సంప్రదాయాన్ని కళ్ళముందు నిలిపే ఎన్నో విషయాలు, నిఘంటువులు, సామెతలు, శతకాలు ఎన్నో ఎన్నో అంతర్జాలం (ఇంటర్నెట్) ద్వారా చిటికెలో మీ కళ్ళ ముందు ప్రత్యక్షమవుతాయి. ఇంకెందుకు ఆలస్యం. పదండి ముందుకు... కథల విందుకు.

https://chandamama.in/telugu/
http://www.sukatha.com
http://www.kathalu.wordpress.com/
http://www.andhrabharati.com
https://www.kahaniya.com
http://www.kadachepta.com/
http://www.bharatadesam.com/
https://www.sanchika.com/category/balasanchika/

# వ్యాకరణము

**భాషాభాగాలు** : (1) నామ వాచకము (2) సర్వనామము (3) విశేషణము (4) క్రియ (5) అవ్యయము.

ఈ ఐదింటిని భాషాభాగములు అంటారు.

**నామవాచకము :** పేర్లను తెలియజేయునది. ఉదా., కమల

**సర్వనామము :** నామవాచకమునకు బదులుగా వాడబడునది. ఉదా., అతడు, ఆమె, వాడు.

**విశేషణము:** నామవాచకములోని విశేష విషయమును (రంగు, స్వభావము, గుణము) తెలియజేయునది. ఉదా., తెల్లని గుఱ్ఱము.

**క్రియ :** పనిని తెలియజేయునది. ఉదా., చదువుచున్నాడు.

**అవ్యయము :** లింగ, వచన, విభక్తులు లేని పదములు. ఉదా., ఆహా! ఔరా! అక్కటా!

**వాక్యరకములు :** వాక్యములు మూడు విధములు.

**సామాన్యవాక్యము :** ఒకే సమాపక క్రియ కలిగినవాక్యము. ఉదా., రఘు బడికి వెళ్ళెను.

**సంశ్లిష్ట వాక్యము :** అసమాపక క్రియతో కూడి యుండు వాక్యము. ఉదా., రఘు బడికి వెళ్లి, పరీక్ష రాసెను.

**సంయుక్త వాక్యము :** రెండు లేక అంతకంటే ఎక్కువ వాక్యములు కలిసి ఏక వాక్యముగా ఏర్పడుట. ఉదా., శాంతి బాగా చదివింది అందువలన మంచి మార్కులు పొందినది.

**వాక్య భేదాలు:**

అర్థమును ప్రతిపాదించు విధమును బట్టి వాక్యము ప్రధానముగా నాలుగు విధములు.

1. **నిశ్చయార్థక వాక్యము:**
   ఒక నిశ్చయమును గాని, సత్యమును గాని తెలుపు వాక్యము.

**ఉదా:** ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉండును.

2. **వ్యతిరేకార్థక వాక్యము :**
   వ్యతిరేకతను తెలియజేయువాక్యము.

**ఉదా:** తగవులాడుకొనుచోట చేరరాదు.

3. **ప్రశ్నార్థక వాక్యము :**
   ప్రశ్నలను తెలియజేయు వాక్యము.

**ఉదా:** మీ తరగతి ఉపాధ్యాయుని పేరేమి?

4. **ఆశ్చర్యార్థక వాక్యము :**
   ఆశ్చర్యమును తెలియజేయు వాక్యము.

**ఉదా:**ఆహా! ఎంత చక్కని కట్టడం!

**విభక్తి-ప్రత్యయాలు :**

1. **ప్రథమా విభక్తి** – డు, ము, వు, లు
2. **ద్వితీయా విభక్తి** – నిన్, నున్, లన్, కూర్చి, గురించి.
3. **తృతీయావిభక్తి** – చేతన్, చేన్, తోడన్, తోన్
4. **చతుర్థీ విభక్తి** – కొఱకున్, కై.
5. **పంచమీ విభక్తి** – వలనన్, కంటెన్, పట్టి.
6. **షష్ఠీ విభక్తి** – కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్.
7. **సప్తమీ విభక్తి** – అందున్, నన్.
8. **సంబోధన ప్రథమా విభక్తి** – ఓ, ఓయి, ఓరి, ఓసి.

**వాక్యాంగములు :** కర్త, కర్మ, క్రియ అనునవి వాక్యాంగములు.

**కర్త** – పనిచేయువాడు. నేను పూలను కోశాను.

**కర్మ** – ఫలితము పొందువాడు – ఎవరిని, దేనిని అని ప్రశ్నించగా వచ్చు సమాధానము కర్మ. ఉదా., వాడు పాట పాడెను.

**క్రియ** – పనిని తెలుపునది. ఉదా., అతడు వ్రాయుచున్నాడు.

**వచనము :** వచనములు రెండు

**1. ఏకవచనము, 2. బహువచనము.**

**ఏకవచనము :** ఒకే వస్తువును తెలియజేయు పదములు.

**ఉదా:** కుర్చీ, పక్షి, స్త్రీ

**బహువచనము :** ఒకటి కంటే ఎక్కువ వస్తువులను తెలియజేయు పదములు.

**ఉదా:** కుర్చీలు, పక్షులు, స్త్రీలు

**కాలములు :** కాలములు నాలుగు

**1. భూతకాలము, 2. వర్తమాన కాలము, 3. భవిష్యత్కాలము, 4. తద్ధర్మకాలము.**

**భూతకాలము :** జరిగిపోయిన విషయములను తెలియజేయునది.

**ఉదా:** శాంత పాఠశాలకు వచ్చెను.

**వర్తమానకాలము :** జరుగుచున్న విషయములను తెలియజేయునది.

**ఉదా:** జమున పాఠము చదువుచున్నది.

**భవిష్యత్కాలము :** జరుగబోవు విషయములను తెలియజేయునది.

**ఉదా:** కరుణ పాట పాడబోవుచున్నది.

**తద్ధర్మకాలము:** ఎప్పుడూ జరిగే పనులను గురించి తెలియజేయునది.

**ఉదా:** సూర్యుడు తూర్పున ఉదయించును.

**వాచకము (లింగము):** వాచకములు మూడు.

**1. మహద్వాచకము, 2. మహతీవాచకము, 3. అమహద్వాచకము**

**మహద్వాచకము :** పురుషులను తెలియజేయు పదాలు.

**ఉదా:** వాడు, అతడు, రాముడు.

**మహతీవాచకము :** స్త్రీలను తెలియజేయు పదాలు.

**ఉదా:** సీత, పాప, ఆమె

**అమహద్వాచకము:** జడ వాచకములను తెలియజేయు పదాలు.

ఉదా: పుస్తకము, నల్లబల్ల.

**పురుషలు : పురుషలు మూడు.**

(1) ఉత్తమ పురుష (2) మధ్యమ పురుష (3) ప్రథమ పురుష.

**1. ఉత్తమ పురుష :** తనను గురించి తెలియ జేయునది.

ఉదా. నేను, మేము.

నేను బజారుకు వెళ్ళితిని. (ఏక.వ.)

మేము బజారుకు వెళ్ళితిమి. (బహు.వ.)

**2. మధ్యమ పురుష :** ఎదుటి వారిని గురించి తెలియజేయునది.

ఉదా. నీవు, మీరు,

నీవు ఎచటికి వెళ్ళుచున్నావు? (ఏక.వ.)

మీరు ఎచటికి వెళ్ళుచున్నారు? (బహు.వ.)

**3. ప్రథమ పురుష :** ఇతరులను గురించి తెలియజేయునది.

ఉదా. అతడు, వారు, ఆమె.

ఆమె పూలను కొనెను. (ఏక.వ.)

వారు పూలను కొనిరి. (బహు.వ.)

## తెలుగు సంధులు

**ఉకారసంధి:** ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి నిత్యము. ఉదా., నీవు + ఎక్కడ = నీవెక్కడ

**యడాగమ సంధి:** సంధిలేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

మీ + ఇల్లు = పూర్వ పర స్వరముల మధ్య సంధి జరిగిన 'మీల్లు' అను రూపమువచ్చును. కాని అది సరియగు రూపము కాదు కనుక రెండు అచ్చుల మధ్య సంధి జరుగుట లేదని తెలిసి కొనవచ్చు. ఈ విధముగా పూర్వ పర స్వరముల మధ్య ఎప్పుడైతే సంధి జరుగదో అప్పుడు 'య్' అనునది ఆగమముగా వచ్చును.

అప్పుడు మీ + య్ + ఇల్లు = మీ యిల్లు అను రూపము వచ్చును.

**ఇకారసంధి:** ఇత్తునకు అచ్చు పరమగునపుడు సంధి వైకల్పికము. వైకల్పికము అనగా సంధి జరుగవచ్చు, జరుగకపోవచ్చు. రెండు అచ్చుల మధ్య సంధి జరుగనపుడు 'య్' ఆగమముగా వచ్చును. ఉదా., ఏమి + అంటివి = ఏమంటివి, ఏమియంటివి.

**అకారసంధి :** అత్తునకు సంధి బహుళము. బహుళము అనగా నిత్య, నిషేధ, వైకల్పిక, అన్యకార్యము. ఉదా., రామ + అయ్య = రామయ్య; అమ్మ + ఇచ్చెను = అమ్మయిచ్చెను; మేన + అత్త = మేనత్త, మేనయత్త; ఒక + ఒక = ఒకానొక.

## సంస్కృతసంధులు

**సవర్ణదీర్ఘసంధి :** అ, ఇ, ఉ, ఋ లకు అవియే అచ్చులు పరమైన దీర్ఘము ఏకాదేశ మగును. ఉదా., రామ + ఆలయము = రామాలయము.

**గుణసంధి :** అకారమునకు ఇ, ఉ, ఋ లు పరమైన క్రమముగా ఏ, ఓ, అర్ లు ఆదేశమగును. ఉదా., దేవ + ఇంద్రుడు = దేవేంద్రుడు.

## సమాసములు

సమర్థ వంతమైన పదములు కలసి ఏకపదమగుట సమాసము.

**తత్పురుషసమాసము -** ఇది ఉత్తరపద ప్రాధాన్యత కలది.

ప్రథమాతత్పురుష - కడ కన్ను - కంటి యొక్క కడ.

ద్వితీయాతత్పురుష - కృష్ణాశ్రితుడు - కృష్ణుని ఆశ్రయించినవాడు.

తృతీయాతత్పురుష - రాజపూజితుడు - రాజు చేత పూజితుడు.

చతుర్థీతత్పురుష - గ్రంథాలయము - గ్రంథముల కొఱకు ఆలయము.

పంచమీతత్పురుష - చోరభయము - చోరుని వలన భయము.

షష్ఠీతత్పురుష - తండ్రిమాట - తండ్రి యొక్క మాట.

సప్తమీతత్పురుష - శాస్త్రనిపుణుడు - శాస్త్రము నందునిపుణుడు.

నఞ్ తత్పురుష - అసత్యము - సత్యము కానిది.

**కర్మధారయసమాసము :** విశేషణ, విశేష్యముతోడి సమాసము. వృద్ధకపోతము-వృద్ధమైన కపోతము. విశేషణము ఇందు మొదటి పదముగా ఉన్నది కనుక **విశేషణ పూర్వపద కర్మధారయం.**

కపోత వృద్ధము - వృద్ధమైన కపోతము - ఇందు విశేషణము రెండవ పదముగా వున్నది కనుక **విశేషణ ఉత్తరపద కర్మధారయము.**

మృదుమధురము - మృదువైనది, మధురమైనది.

ఈ సమాసమందు రెండు పదాలు విశేషణములు కనుక **విశేషణ ఉభయపద కర్మధారయము.**

**ద్వంద్వసమాసము:** ఉభయపద ప్రాధాన్యత కలది ద్వంద్వసమాసము.

తల్లిదండ్రులు - తల్లియును, తండ్రియును.

**ద్విగుసమాసము :** సంఖ్యాపూర్వకమైన కర్మధారయమే ద్విగువు.

ఉదా: త్రిలోకములు - మూడులోకములు

చతుర్వేదములు - నాలుగు వేదములు

## అలంకారములు

### శబ్దాలంకారములు

**వృత్త్యనుప్రాసము :** ఒకటి లేదా రెండక్షరములు పలుమార్లు ఆ వృత్తి అగుట అనగా మరల మరల వచ్చుట. ఉదా., ఆనంద, బిందు బృందస్యందన సుందరము. బిందు పూర్వక'ద'కారము పలుమార్లు ఆవృతమైనది.

**ఛేకానుప్రాసము :** రెండు హల్లులు అవ్యవధానముగా అనగా వెంట వెంటనే వచ్చుట - అర్థములో మార్పు వుండుట.

ఉదా., నీ సుందర దరహాసము - దర, దర అను పదములు వెంట వెంటనే వచ్చినవి కాని సుందర - అనునపుడు అందమైన అని, దరహాసము అనగా చిరునవ్వు అని అర్థము నందు భేదమును చెప్పుకొందుము.

**లాటానుప్రాసము** : తాత్పర్య భేదముతో శబ్దార్థములు పునరుక్తములగుట.

ఉదా: కమలాక్షు నర్చించు కరములు కరములు

ఇందు కరములు అన్న పదమును రెండుసార్లు కవి ప్రయోగించారు. కరములు అనగా చేతులు. విష్ణువును పూజించునట్టి చేతులే సార్థకత కలిగిన చేతులు అని తాత్పర్యమునందు భేదమును తెలుపు చున్నాము.

**అంత్యానుప్రాసము** : పదాంతములందు కాని, పాదాంతములందు కాని, వాక్యాంతములందు కాని వర్ణములు పునరుక్తములగుట.

ఉదా., విశ్వదాభిరామ వినురవేమ.

ఇందు పదాంతములందు రామ, వేమ అను ప్రాస పదములు ఉపయోగింపబడినవి.

**యమకము** : ఉపయోగించిన పదాలనే అర్థ భేదము కలుగునట్లు మరల మరల ప్రయోగించుట.

ఉదా : మన సుభద్ర సుకృతి మహిమ ఏమనవచ్చు
మనసు భద్రమయ్యె మనకు నెల్ల

ఈ పద్యపాదంలో "మన సుభద్ర" అనునపుడు మన యొక్క సుభద్ర అని అర్థము చెప్పుకొందుము.

రెండవ పాదమందు "మనసు భద్రమయ్యె" అనగా మనందరి మనసు కుదుటపడెను అని అర్థ భేదమును చెప్పుకొందుము.

"మనసుభద్ర", "మనసుభద్ర" అని రెండు మార్లు అవే పదాలను ఉపయోగించినను ఆ పద విభజనలో మార్పువల్ల అర్థ భేదం కలుగుతున్నది. (మన సుభద్ర, మనసు భద్ర)

**ముక్త పదగ్రస్తం :**

విడిచిన పదాన్నే అవ్యవధానంగా ప్రయోగించుట.

ఉదా : సుదతీ నూతన మదనా
మదనాగ తురంగ పూర్ణ మణిమయ సదనా
సదనా మయ గజ రదనా
రదనాగేంద్ర నిభకీర్తి రస నరసింహా!

ఈ పద్యము నందు మొదటిపాదము "మదనా" అను పదముతో ముగియుచుండగా రెండవ పాదములో మొదటి పదం 'మదనా'తో ప్రారంభింపబడింది. అట్లే రెండవ పాదం చివరి పదం 'సదనా' తో ముగియగా, మూడవ పాదము మొదటిపదం 'సదనా' తో ప్రారంభించబడింది. ఈ విధంగా విడిచిన పదాన్ని తిరిగి స్వీకరించుటనే 'ముక్త పదగ్రస్తము' అందురు.

**అర్థాలంకారములు :**

**ఉపమాలంకారం** : ఉపమాన, ఉపమేయాలకు పోలికను చెప్పుటను ఉపమాలంకారము అందురు. ఇందు నాలుగు భాగాలుండును.

**ఉపమానం:** పోలికకై స్వీకరించిన వస్తువు.

**ఉపమేయం** : పోల్చదగిన వస్తువు.

**ఉపమావాచకం** : వలె

**సమానధర్మం** : ఉపమాన, ఉపమేయాల మధ్యనుండు పోలిక

ఉదా: భూమి బంతివలెనున్నది.

ఇందు వర్ణించ దలచిన వస్తువు "భూమి" కనుక ఇది ఉపమేయం. పోలికకై స్వీకరించిన వస్తువు 'బంతి' కనుక బంతి' ఉపమానం. ఈరెండింటి మధ్య ఉన్న సమానమైన ధర్మము 'గుండ్రంగా వుండుట. తిరుగుట' కావున భూమిని బంతితో పోల్చుట జరిగినది. దీనినే ఉపమాలంకారం అందురు.

ఇటువంటివే –

"అక్షరములు ముత్యముల వలెనున్నవి"

'కన్నులు కలువల వలె నున్నవి' మొదలగునవి.

**స్వభావోక్తి అలంకారం :**

ఒక జీవియొక్క జాతి, గుణ, ధర్మ క్రియాదులచే స్వభావమును ఉన్నది ఉన్నట్లుగా వర్ణించి చెబితే దానిని 'స్వభావోక్తి' అలంకారం అందురు.

ఉదా: ఆ వనము నందలి లేళ్ళు రిక్కించిన చెవులతో బెదురు చూపులతో చెంగు చెంగున అటునిటు గెంతులు వేయుచున్నవి.

**అర్థాంతరన్యాసాలంకారం:**

సామాన్యాన్ని విశేషం చేతగాని, విశేషాన్ని సామాన్యం చేతగాని సమర్థించి చెబితే అర్థాంతరన్యాసాలంకారం అందురు.


ఉదా: 1. ఆంజనేయుడు సముద్రమును లంఘించెను
మహాత్ములకు సాధ్యం కాని కార్యం ఉంటుందా?


2. గొప్ప వస్తువుతో కూడి యుండుట వలన స్వల్పవస్తువు కూడ గౌరవము పొందును.


పూలతో కూడిన దారముగూడ తలపై దాల్చ బడునుగదా!


**అలంకారాలు గుర్తించండి:**

1. కళాకారుల కంఠాలు కంచులాగా మ్రోగుతాయి.
2. ఎచ్చటి కంటిరో విజయు నిక్కువ నిక్కువ మౌనె.
3. కోరిక యారిక లీరిక లెత్త వల్కగా
4. ఒచ్చెములేని బీర మెద నూరగ నూఱగసాగె.
5. పచ్చని వింటి వాడపుడు పైదలిపై దవిరాకు కయిదువుల్.
6. వెతుకుతున్న తీగ కాలికి తగినట్లు నువ్వే నన్ను పలుకరించావు.
7. రాశి పనిభారం మోస్తున్న చిరుమొగ్గవంటిది.
8. దూరాన్ని చెరిపి వేస్తుందిలే బారుచీమల పరుగు, పాపాన్ని కడిగి వేస్తుందిలే పాల నవ్వుల నురుగు.
9. విజ్ఞానం వికసించదు విదేశాలు తిరిగొస్తేనే. పరిణతమతి ప్రసరించదు పురాణాలు తిరగేస్తేనే.
10. ఆడపిల్ల నదువంట పెపంచానికే ఎలుగంట.





























- पाठ्यपुस्तक मंडळाची वैशिष्ट्यपूर्ण पाठ्येत्तर प्रकाशने.
- नामवंत लेखक, कवी, विचारवंत यांच्या साहित्याचा समावेश.
- शालेय स्तरावर पूरक वाचनासाठी उपयुक्त.

पुस्तक मागणीसाठी www.ebalbharati.in, www.balbharati.in संकेत स्थळावर भेट द्या.

**साहित्य पाठ्यपुस्तक मंडळाच्या विभागीय भांडारांमध्ये विक्रीसाठी उपलब्ध आहे.**

ebalbharati

विभागीय भांडारे संपर्क क्रमांक : पुणे - ☎ २५६५९४६५, कोल्हापूर- ☎ २४६८५७६, मुंबई (गोरेगाव) - ☎ २८७७१८४२, पनवेल - ☎ २७४६२६४६५, नाशिक - ☎ २३९१५११, औरंगाबाद - ☎ २३३२१७१, नागपूर - ☎ २५४७७१६/२५२३०७८, लातूर - ☎ २२०९३०, अमरावती - ☎ २५३०९६५




మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె – 411 004.

तेलुगु युवकभारती इयत्ता बारावी (तेलुगु भाषा)

₹ 104.00